# భారతి

సంపుటము 23 | ఫిబ్రవరి, 1946 పార్థివ మాఘము | సంచిక 2


## భూపాలునితో గోపాలుడు

— శ్రీ సున్నం వీరరాజకవి —

౧

"బల మత్యల్పము పాండుపుత్రులకు, నెబ్బంగిన్ మమున్ గెల్వగా
గల"రంచున్ మది ధైర్య మూని, దురహంకారంబునన్ వారి కో
ర్కెలు రవ్వంతయు దీర్పనైతివి, యయారే! నీబలం బెల్ల వా
రల ధర్మంబును గెల్వగాగలిగెనా? రారాజ! సుంతేనియున్.

౨

మడుగున దాగియున్నను బ్రమాదము తప్పదు రాజరాజ! నిన్
విడువరు పాండురాసుతులు, వేడిన వేయిదినంబు లుండినన్,
వడివడి పైకి రాగదవె, బాహుబలాఢ్యుడవైన రాచబి
డ్డడ వీటువంటి నీచత కొడంబడ నల్వురు నవ్వివోవరే?

3

శాంతిని గోరి నేను బలుసార్లు వచించినగాని, నీవు నో
క్కింతయు నాహితోక్తుల గణింపకపోతివి, నీసమస్త మి
ట్లింతమునొందగా మడుగునందున దాగొని, యించుకంత వి
శ్రాంతిని బొందుచుంటె? కురురాజ! మరేమియు దారి గానమిన్.

౪

చచ్చిరి నీసహోదరులు, చచ్చిరి మేటి రణప్రవీణులున్
జచ్చిరి కర్ణుడున్ శకుని, చచ్చిరి బంధులు, ఎల్లవారలుం
జచ్చిరి, వచ్చి స్వేచ్ఛగ స్మశానము నేలుకొనంగదయ్య! నీ
మచ్చరమేసుమీ తుదకు మంటను గల్పె సమస్తభూస్థలిన్.

౫

నీవలనన్ సమస్తధరణీవలయమ్మున గల్గు నెన్నియో
జీవులు నంతరించినవి, చెట్టొక పిట్టయి, తిండిలేక వా
పోవుచు నున్నవార లసువుల్ గలవారకటా! "వినాశకా
లే విపరీతబుద్ధి"యను లీల చరించితి వోసుయోధనా!

౬

ఏటికి ఇంత పాపమున కీవొడిగట్టితో? చిత్రమయ్యె, మా
బోటుల మాటలెల్ల వృథబుచ్చి మహా మొనగానివోలె పో
రాట మొనర్చి పూర్తిగ హతాశుడవైతివి, వెఱ్ఱిరాజ! ఏ
నాటికి ఏమి మూడునో మనంబున సుంత యెరుంగ శక్యమే?

౭

ధారుణిపై మహారుధిరధారలు ఏరులుగాగ నిత్యముం
బారినగాని నీమనసు మారినదా? కురురాజచంద్ర! ప్రే
మారగ నైదుగ్రామములనైన నొసంగిన జాలునంచు, వే
మారులు వేడునాడె మది మారిన నింతటి కీడు మూడునే?

౮

సామమువీడి సంధియె పొసంగిన నింద రమాయికప్రజల్
భూమి నశించిపోవుదురె? లోకములో రుధిరాన్నమేను సు
మ్మా మిగిలెన్ మరెవ్వరికినైన సుయోధన! సర్వమానవ
క్షేమము గోరి యంతగ వచించిన వింటివె కొంటెబుద్ధితో?

౯

ఇప్పటికైన గన్నుల నొకించుక విప్పి, మడుంగునుండి కం
జప్పున వచ్చి, యుద్ధమును సాంత మొనర్చి, యజాతశాత్రవుం
దప్పు క్షమింపు మంచు గరుణం గన పాదము లంటి వేడినం
దప్పక నిన్ను గాచెడు, వృథాశ్రమ లేటికి? కౌరవేశ్వరా!

# రాజరాజు శాసనములోని రగడ

## — శ్రీ కోరాడ రామకృష్ణయ్య —

రాజరాజనరేంద్రుని ప్రోత్సాహమున నన్నపార్యుడు భారతరచనమును చేపట్టువరకు నట్టి సంస్కృతవృత్తబహుళములైన రచన లీ భాషలో బయలుదేరిన ట్లగపడదు. కాని దేశిరచనల కింతకు పూర్వమే కొంత ప్రోత్సాహము కలిగినట్లు నన్నిచోడుని కుమారసంభవపద్యములవలననే కాక, నన్నయకు పూర్వమున వెలసిన తెలుగుశాసనములలోని కొన్ని రచనలనుబట్టియు మనకు దెలియవచ్చుచున్నది. వీనియందలి విశేషమేమనగా, నన్నయకుపూర్వమున్న గల శాసనములలోని పద్యములన్నియు దేశీయచ్ఛందమున రచింపబడినవే కాని, సంస్కృతవృత్తములలో రచింపబడినవి యింతవరకు లభించినవానిలో లేకుండుటయే. ఒక తరువోజ, కొన్ని అక్కరలు, కొన్ని సీసములు-ఇవియే యింతవరకు దొరికిన శాసనములలోని తెలుగుపద్యములు. దేశీయచ్ఛందోబద్ధములగు నీరచనల నిప్పుడు మనము పద్యములనియే వ్యవహరింపవలసియున్నను, వీనిపూర్వరూపమునుబట్టి వాస్తవముగా వీనిని పదము లనియే వ్యవహరింప వలసియుండునేమో. ఏల యనగా, పైరచనలలోనిపద్యములు నాలుగేసి పాదములు గలవై యుండుట సంస్కృతకావ్యములలోని వృత్తముల పరిపాటినిబట్టి లాక్షణికు లేర్పరచిన నియమముచే సంభవించి యుండునేగాని, వాస్తవముగా నెంచట దేశీయచ్ఛందములకు చతుష్పాదనియమ మున్న ట్లగపడదు. ద్విపద కట్టి నియమము లేదుగదా. "అనియతగణైః" అన్నట్లు వృత్తములలోని అక్షరగణములవలె నిందలి గణములు కూడ నియతగణములు కావు. నల, నగ, సల, భ, ర, త, లలో నేదైనా నొక మూడును, వానిపై నగణ, హగణములలో నేదొకటియైనా చేర్చి చెప్పినచో నొక పదమగుచున్నది. ఇట్టివి రెంటెని ప్రాసతో బంధించిన ద్విపద యగుచున్నదిగదా. ద్విపద రెండు పాదములను ఒక్కపాదముగా జేసి, యట్టి నాలుగుపాదములను ప్రాసతో బంధించిన తరువోజ వృత్తమువంటి దగుచున్నది. అనగా ద్విపదలు నాలుగింటిని నాలుగు పాదములుగా వృత్తమువలె కూర్చినచో తరువోజ అయినదన్నమాట. అట్లే రెండింద్రగణములు, ఒక్క సూర్యగణము కలిసి, మూడు మాత్రాగణములతో గూడిన పదమును .రెట్టించి ఒక పాదముగా జేసి, అట్టి వానిని నాలుగింటిని ప్రాసముతో బంధించినచో నొక మధ్యాక్కరపద్యమగుచున్నది. ద్విపదలో పదమునకు మూడింద్రగణములు, ఒక సూర్యగణము నున్నవిగదా. రెండుపదములలోని యింద్రగణముల నొకచో జేర్చి, రెండు సూర్యగణములను వాని తరువాత జేర్చి, యీ యెనిమిదిగణములను నాల్గేసి గణముల రెండుదళములుగా జేసినచో సీసపద్యమునందలి యొక పాదమగును. ఇట్టివి నాల్గు పాదములను జేర్చినచో నొక సీసపద్యమగుచున్నది. ఈరీతిని జూడగా నీ దేశీయచ్ఛందోరచనలనదగు నీ ద్విపద, మధ్యాక్కర, సీసము అనునవి అని యతిగణములగు మాత్రాగణములు మూడింటితోను, నాలుగింటితోను గూడిన పదములను రెట్టించి యొక్కపాదముగా జేసి, అట్టివానిని వృత్తములందువలె నాలుగింటి నొక్కచో కూర్చుటచే నేర్పడినట్లు వ్యక్తమగుచున్నదిగదా. ఈ పద్ధతి సంస్కృతసాహిత్యరీతుల యందు విశేషాభిమానము కలిగి దేశభాషలో కవిత చెప్పనభిలషించిన పండితకవులచే తొలుత నవలంబింపబడియుండును. అనగా నీ రదివరకు దేశమున వ్యాప్తిగాంచియున్న దేశీయచ్ఛందోరీతులను సంస్కృతసాహిత్యచ్ఛందోరీతులతో సమన్వయించి తచ్ఛందోమార్గమున వీనిని నడిపింప యత్నించిరన్నమాట. ఈ ద్విపదాదిదేశీయచ్ఛందోరచనలన్నియు తొలుత తాళబద్ధములగు గేయములు, పాటలే యగుటచేత మాలిక లందువలెనే వీని కిన్ని పాదములే యుండవలయు నను నియమము లేకుండెడిది. కాని పాదనియమ మనునది సంస్కృతవృత్తములకు విశిష్టలక్షణముగా కనబడుచున్నది. కావుననే తరువాతి లాక్షణికులు దేశీయరచనలకును ఈ నియమమును వర్తింపజేసియుందురు. ఈ మార్గము ననుసరించి పండితులచే రచింపబడిన తరువోజ, అక్కర, సీసములే నన్నయకు పూర్వమునందలి చాళుక్యప్రభువుల శాసనములలో మనకింతవరకును గానవచ్చినవి. ఈమార్పెప్పటినుండి ప్రారంభమైనది యను విషయ మింకను పరిశోధింపవలసియే యున్నది. భరతుని నాట్యశాస్త్రముననే శీర్షకలక్షణము తెలుపబడియున్నదని మరియొకచో నేను సూచించియున్నాను. ఇంకను నాట్యశాస్త్ర సంగీతశాస్త్ర గ్రంథములలోని ప్రబంధాధ్యాయములలో తాళప్రధానములు, గేయ

ములు, దేశీయచ్ఛందోబద్ధములు నగు ఏలలు, ఏకతాళి, గద్యము, భిన్నరీతులగు ధ్రువలు, తేక దరువులు మొదలగువాని లక్షణము చెప్పబడియున్నది. నన్నయకు పూర్వుడగు నాగవర్మ రచించిన ఛందోంబుధిలో ఏల, భిన్నరీతులగు షట్పదులు, రఘటాబంధము మొదలగునవి కర్ణాటదేశీయచ్ఛందములని వానికి లక్షణము చెప్పబడియుండుటచే నివి కేవల మాంధ్రదేశీయములేగాక దక్షిణదేశ సామాన్యములే యని తెలంపదగియున్నది. నన్నయ తరువోజ, అక్కర, సీసములను మాత్రమే గ్రహించి ప్రయోగించెనుగాని ఏల, షట్పది, ద్విపద, రగడ మొదలగువానిని గ్రహింపలేదు. అతని సంప్రదాయము ననుసరించిన తరువాతి కవులును రాగతాళ ప్రధానములగు నీదేశీయచ్ఛందములను తాకలేదు. ఈ ద్విపద, రగడ ఉదాహరణాది దేశీయరచనలను చేపట్టి నన్నయతరువాత వట్టిరచనలను సాగించినవాడు పాల్కురికి సోమనాథుడొక్కడే. కాని నన్నయకు పూర్వమే సంస్కృతభాషలో శాసనకవితారచనను సలుపుచున్న పండిత కవిలోకమునకుగూడ నీదేశీయరచన లాదరపాత్రములు కాకపోలేదనుటకు రాజనరేంద్రుని యాస్థానమున నుండి యాతని యాజ్ఞానుసారముగా కోరుమిల్లి శాసనమును రచించిన భీమనభట్టు ఆ శాసనరచనలో నొక రగడను* పొందుపరచుటయే ప్రబల సాక్ష్యమగుచున్నది. అందలి ఆ రగడ సంస్కృతవృత్తములవలె నాలుగు పాదములతో గూడినదిగాక, పెక్కుపాదములతో గూడినదై యున్నది. ఈ కారణముచేతనే యది వచనముగనే తలపబడియుండునుగాని దేశీయఛందోలక్షణ యుక్తమగు రగడయని గుర్తింపబడుట కవకాశము లేకపోయినది. సంస్కృత కావ్యమున వృత్తములమధ్య సంస్కృతభాషలో దేశీయచ్ఛందోబద్ధమగు రగడ రచింపబడియుండు ననుట కేవల మసంభావ్యమనుటకు సందేహములేదు. కాని నన్నపార్యుడే యేకారణముచేతనో దీని నొప్పరికించినను, అతనికి బూర్వమునుండియు నీదేశీయరచన పండిత కవిలోకము దృష్టినిగూడ నాకర్షింపకపోలేదను విషయముమాత్రము దీనివలన స్పష్టమగుచున్నది.

వెనుక సూచించిన దేశీయపదమువలెనే ఆ రగడయు రెండేసి పదములతో గూడిన దేశీయచ్ఛందోభేదమే. ఇందలి విశేషమేమనగా-ఆద్యంతప్రాస సంయోజనమునది. అప్పకవి నవవిధరగడలను, వాని లక్షణమును తెలిపియున్నాడు. అందు ద్విరదగతిరగడకు లక్షణము-

"కరమొప్ప పంచలఘు-గణచతుష్టయముచే
విరమంబు రెంటిపై-ద్విరదగతిపేరిచే."

అని చెప్పబడియుండుటచే, ప్రస్తుతము మన శాసనమందలి రగడయు నాద్యంతప్రాసలతో గూడినదై-యైదుమాత్రల నాలుగేసి గణములతో గూడియుండుటచే ద్విరదగతిరగడ యగుచున్నది. ఈరగడ రెండు పాదములను నినుమడించినచో (వృత్తానుకరణమున) నాలుగుపాదములతో గూడిన విజయభద్ర మను రగడ యగునని అప్పకవియే చెప్పినాడు. సంస్కృతవృత్తానుకరణముతప్ప దీనివలని ప్రయోజన మేమియో తెలియదు. ఇట్లే హయప్రచారరగడ నినుమడించిన తురగవల్గన మగునట. సహజముగ రెండుపాదములతోనే గూడిన దేశీయచ్ఛందముల యినుమడింపునకు, వేరుగా నామకరణమునకు కేవలము సంస్కృతవృత్తానుకరణమే కారణ మనుటకు సందేహము లేదు. పదము సంస్కృతమున, ప్రాకృతమున, దేశభాషనైనను బలుకవచ్చుననియు

"కర్ణాటద్రవిళాంధ్రలాటవిలసద్గౌడాదిభాషాస్థితిం
గర్ణాపూర్ణసుధాసమానరుచులంగల్గించు 'దేశ్యైశ' "

అని తాళ్లపాక అన్నయాచార్యుడు తన సంకీర్తన లక్షణమున దెలుపుచు, నట్టి పదముల భిన్నవిధములలో "బంధురవృత్తపదంబు, నిబంధపదము" అనువానిని జేర్కొన్నాడు. ఈ వృత్తపదము "నాలుగుపాదంబులు నొకచాలున వర్తించునది యసమవృత్తం బా లీలన్ సమపదమును దాళాలంకృతసామ్యపాదమై చెన్నొందున్" అని వృత్తమును బోలి నాలుగుపాదములు గల యదియే వృత్తపదమైనట్లు వ్యక్తముచేసినాడు. ఈ రీతిగా "యతులుం బ్రాసములుం బదంబులును మాత్రానీకముల్ తాళసంగతులుం గల్గిన" దేశీయచ్ఛందములు నన్నయకుపూర్వమే 'వృత్తపదములు'గా మార్పబడుట తటస్థించినను, ఇందలి రగడమాత్ర మప్పటికట్లు మార్పబడక 'పదమాలిక'గానే రచింపబడుచున్నట్లు శాసనమందలి రగడవలన దెలియుచున్నది. అన్నయాచార్యులు చెప్పినరీతిగా 'ఏల' కర్ణాటద్రవిడాంధ్రలాటవిలసద్గౌడాదిభాషలలో రచింపబడుచున్నట్లే 'రగడ' కూడ కన్నడాదిభాషలలో రచింపబడుచుండినట్లు నన్నయకుపూర్వపు కన్నడశాసనములనుబట్టి, లక్షణగ్రంథములనుబట్టి తెల్లియగుచున్నది. ఇట్లే యితరములగు దేశీయపదముల చిహ్నములుకూడ నేమైన లభించునేమో ప్రాచీనశాసనముల నింకను పరిశీలింపవలసియున్నది.

* చూ : కలగూరగంప.

# ౧౬-వ శతాబ్దినాటి ఆంధ్రవాఙ్మయ విశేషాలు*

= శ్రీ నేలటూరి వెంకటరమణయ్య =

కదిరీపతి క్రీ. శ. ౧౬-వ శతాబ్దమువాఁడని నిశ్చయించితిని. కవిత్వమున నితఁడు వాస్తవికుఁడు. జీవితమున స్వానుభవమున కెక్కిన విషయములను కవిత్వమున గూర్చి కావ్యరూపమునఁ బ్రచురించుట ఇతనికి నచ్చిన పద్ధతి. ఇతఁడు సహస్రాత్ముఁడు. సమకాలిక జానపదజీవనమున నితనికంటఁబడని విషయము లరుదు. గోచరమైన విషయమును హృదయకవిలియ నెక్కించి సందర్భానుసారము గ్రంథస్థముసేయక విడిచిపెట్టుట యితని మార్గము గాదు. మఱియు కవితాప్రపంచమున నూతనవీథుల నడచుట యితనికిఁ గరము ప్రియము. కావున కావ్యరచనయందు సమకాలికసాహిత్యపద్ధతుల ననుసరించెను. ౧౬-వ శతాబ్దమున జనాదరమునందిన సారస్వతోద్యమచ్ఛాయ లనేకములు శుకసప్తతియందు పొడకట్టుచున్నవి. కాన కదిరీపతి కళాకౌశల్యమును బరామర్శింపఁగడఁగుటకు ముందు ౧౬-వ శతాబ్ది వాఙ్మయస్థితి నించుక తెలిసికొనుట యుక్తము.

ఆంధ్రవాఙ్మయచరిత్రమున ౧౬-వ శతాబ్ద మొక మహాయుగము; కల్పనావైభవమున ౧౫-వ శతాబ్దమున్న కీడుకాకపోవచ్చు; కవితావిశేషమునను గావ్యరచనా బాహుళ్యమునను, వర్ణనాకౌశల్యమునను, కథాసంవిధానచాతుర్యమునను దానినధఃకరించినది. ఆముక్త,కళాపూర్ణులవంటి కావ్యములు కానరాకపోవచ్చు; మను, వసువులకుఁ దుల్యమైనవి లేకపోలేదు. పదునాఱవ శతాబ్దమునం దాంధ్రవాఙ్మయ మేకముఖముగఁ జెరిగినది; పదునేడున బహుముఖములఁ బెఱిగినది. పదాఱున నాంధ్రవాణి జన్మభూమియందే వర్ధిల్లినది; పదునేడున ద్రావిడకర్ణాటకముల నెలకొని తోడిభాషల పొత్తున సంస్కారమును బొంది నూతనగుణముల నలవఱచుకొనినది.

సారస్వతపీఠములు:—రక్కసతంగడిమహాసంగ్రామ మాంధ్రదేశచరిత్రయందేకాక వాఙ్మయచరిత్రయందుకూడ నొక విషమఘట్టము. తత్పూర్వ మాంధ్రవాణి కచటనచట నునికిపట్లుండినను విద్యానగరము కేంద్రస్థానమై యుండెను. కవి యెచటివాఁడైనను, ఎవ్వరి యాశ్రయమున నభివృద్ధికి వచ్చినను రాయల మన్నన బడయఁజాలకపోయిన నతనికి సరివారిలో గణ్యత తక్కువగఁ దోఁచెడిది; కావున నాంధ్రదేశము నాలుగు చెఱఁగులనుండియుఁ గవిత్వము చెప్ప నేర్చినవా రందరును విద్యానగరమార్గమును బట్టెడువారు. విద్యానగరము వినాశమైనపిమ్మట రాయల యాధిక్యము దగ్గెను; రాయపీఠ మొకతావున నిలుకడగనుండక కాలానుగుణముగ నొకచోటినుండి మఱియొకచోటికి మారవలసివచ్చెను; మొదట పెనుగొండ, తరువాత చంద్రగిరి, కడపట రాయవేలూరు రాయల కునికిపట్టులాయెను; తురకల యుపద్రవముల వల్ల యుద్ధము సామాన్యమాయెను; స్వార్థపరులైన నాయకుల యడావడి యధికమగుటచే రాయల యధికారము నిర్వక్రముగ సాగక దేశమున శాంతి సంపూర్ణముగ చెడెను; దీనికిఁ దోడు రాయకుటుంబములోని యంతఃకలహముల మూలమున ప్రభుత్వస్థితి దీనావస్థకు వచ్చినది. ఇఁక రాయసంస్థానమున సారస్వతాదరణమును, గళాపోషణమును నవకాశ మెక్కడిది?

దేశకాలపరిస్థితు లిట్లు విషమదశకు వచ్చినను వాఙ్మయము క్షీణించలేదు; మునుపటికంటె నధికతరముగ నభివృద్ధినందినది. దీనికిఁ బ్రధానకారణము సర్వత్ర వెల్లివిరిసిన భాషానురక్తియే. దేశాధిపతులు, పాళెగాండ్రు, ధనికులు, వర్తకులు, విద్యాధికులు మొదలగువా రందఱును భాషాపోషణముఁ దలకొనిరి. వాఙ్మయాభిమానము గల విద్యాధికులు ప్రతిఫలాపేక్ష

---

*కదిరీపతిని గురించిన వ్యాసావళిలో ఇది రెండవది.

లేక యే గ్రంథరచనకును, కవిపండితపోషణకును బూనుకొనిరి. వీరి సంఖ్య యల్పము. కీర్తిలాలసత యనేకులఁ బురికొల్పెను. విద్యారణ్యస్వామిచే హంపీవిరూపాక్షమున రాయపీఠము నెలకొల్పఁబడినప్పటినుండియు భాషాపోషణయుఁ, గళాభిరక్షణయు రాయల సహజధర్మములుగఁ బరిగణింపఁబడుచు వచ్చినకారణమునఁ గాలక్రమమునఁ గవిగాయకపాఠకచిత్రకారనటనటీ జనసంరక్షణ రాజుల నిర్ణీతకృత్యములయం దొకటి యను నభిప్రాయము గలిగెను. విద్యాపోషణము సేయని ప్రభువు రాజపదమునకు సంపూర్ణముగ నర్హుఁడు గాఁడనియు, కవిగాయకనర్తకాదికళాభిజ్ఞులకుఁ దావులేనిసంస్థానము సంస్థానము గాదనియు, నోలగ మోలగము గాదనియు నప్పటివారి తలఁపు. రాయరాజ్యము క్షీణమైపోవుకాలమున ప్రభుత్వాపేక్షఁ గలిగి రాజపదమును బొందఁ గోరిన ప్రతిపాళెగాఁడును రాయలవలె యథాశక్తి కవుల నాదరించి కావ్యరచనకుఁ బురికొల్పి వారిమూలమునఁ దన కార్యమును, వదాన్యతను లోకమునఁ బ్రకటింపించుకొనెడివాఁడు. కావున పేరుగల పాళెగాండ్రెల్ల భాషాపోషకులైరి. వారి కోటలు సారస్వతనిలయము లాయెను.

విషయాసక్తి కొందఱిని భాషాపోషణకుఁ బ్రేరేపించినది. అది శృంగారయుగము; భోగ మప్పటి యాంధ్రులకుఁ బరమావధియైనది; స్త్రీలోల్యము సర్వసామాన్యము; బహుకళత్రగ్రహణమును, వేశ్యాంగనాగమనమును సిరిగలవారి లక్షణములు; కేవలాంగభోగములతోఁ దృప్తినందియుండక ధనవంతులగు రసికవతంసులు స్త్రీల సర్వాంగములనేకాక స్త్రీపురుషుల పరస్పరసంబంధవర్తనలకుఁ జెందిన బయలుపెట్టరాని మర్మాంశములనుగూడ నాయికానాయకుల వ్యాజమున పలువిధముల వర్ణింపించి యానందించెడివారు. పదునేడవ శతాబ్దాంధ్రవాఙ్మయమునఁ బెనుకళంకనఁదగు నీతిబాహ్యములైన పచ్చిశృంగారకావ్యముల యుత్పత్తికిఁ గారకులు వీరే. మతాభినివేశమును, భక్తియు మఱికొందఱి వాఙ్మయపోషణకును, గావ్యరచనకును గారణభూతములు. ఏకారణముచేనైన నేమి? విద్యాభిమానము రాజకీయస్వాతంత్ర్యముతోపాటు నశింపక తామరతంపరలై యభివృద్ధి జెందెను. విద్యానగరము నామమాత్రావశిష్టమైపోయినను నూతనవిద్యాస్థానములు బలుతావుల నెలకొనెను. ముఖ్యమైనవానిని మూఁడునాల్గింటి నిటఁ బేర్కొనుట యుక్తము.

మొదట నెన్నఁదగినది రాయలసీమలోని మట్లివారి సంస్థానము. వీరు తెలుఁగుచోడకుటుంబమునకుఁ జెందిన సూర్యవంశక్షత్రియులు. వీరి యునికిపట్టు ఇప్పటి కడపమండలములోని సిద్ధవటము. తెనుఁగుచోడు లాంధ్రసరస్వతికిఁ బట్టుగొమ్మలు. పెక్కుకవు లీవంశమున జనించి యుత్తమగ్రంథములను రచించిరి. కవుల నాదరించి పోషించి భాషను పెంపొందించుట ఈ వంశమువారికి సహజధర్మము. మట్లివారింట నీయుగమున నలుగురు పేర్కొనఁదగినవారు గలరు. మొదటివాఁడు మట్లి అనంతరాజు. ఇతఁడు గ్రంథకర్త. రెండవవాఁ డితని తమ్ముఁడు కోనమరాజు; ఇతఁడు కవియేకాని గ్రంథకర్త గాఁడు. మూఁడవవాఁడు అనంతరాజుమనుమఁడగు కుమారానంతరాజు; ఇతఁడు కావ్యకర్త. నాలవవాఁడు వీరివంశజుఁడు వెంకట్రామరాజు; ఇతఁడు కృతిపతియు, భాషాపోషకుఁడును. మట్లివారి సంస్థానమునందు కవులనేకులు వర్ధిల్లిరి. వీరియందు వడిమంటి వెంకటాచలపతి సుప్రసిద్ధుఁడు.

అన్నిటికిని మించినది ప్రాచీనచోళసామ్రాజ్యమునకు రాజధానియైన తంజావూరు. ఇట నాంధ్రనాయకరాజ్యము క్రీ. శ. ౧౬ వ శతాబ్దపూర్వార్ధమునం దచ్యుతదేవరాయల కాలమున స్థాపింపఁబడినది. కాని ౧౭ వ శతాబ్దారంభమునకును దీని కంతటి ప్రసిద్ధి కలుగలేదు. తంజాపురవైభవము రఘునాథనాయకుని రాజ్యాభిషేకముతోఁ బ్రారంభమైనదని చెప్పవచ్చును. ఇతఁడు విద్వాంసుఁడు; ఆంధ్రగీర్వాణములందు రసవంతమైన కవన మల్లఁగల నేర్పరి; గానవిద్యావిశారదుఁడు; కవిపండితకళాభిజ్ఞపోషణయందు కృష్ణరాయలకుఁ దుల్యుఁడు. ఇతని సభాభవనము శారదాదేవిసదస్సు. గోవిందదీక్షిత యజ్ఞనారాయణదీక్షితాది సుప్రసిద్ధపండితవర్గమును, చేమకూర వెంకటకవివంటి కవిశ్రేష్ఠులును నీతని యాస్థానమున మనిరి. రఘునాథునివంటి యశస్సును బొందఁజాలకపోయినను నతని

కుమారుఁడు విజయరాఘవనాయఁడు తండ్రివలె విద్యాభిమానము జూపి కళల నాదరించి తంజాపురమును దాక్షిణాత్యహిందూనాగరకతకు రాజధాని గావించెను. ద్రావిడదేశమున నాంధ్రుల ప్రభుత్వము సమసిపోయిన పిమ్మట నటుతరువాత నా దేశమును పాలించిన మహారాష్ట్రప్రభువులుగూడ నాంధ్రభాషను పోషించి యా భాషయందు స్వయము గ్రంథములను రచించుట జూడ నీయాంధ్రనాయకరాజుల మాతృభాషాసేవా విశేషము కొంతవఱకు బోధకాఁగలదు.

తంజాపురమున వెల్లివిరిసిన యాంధ్రభాషాభిమానము దక్షిణమున పుదుకోటవఱకు వ్యాపించినది. పుదుకోట తొండమాను ప్రభువుల కాటపట్టు. వీరు జాతిచే నాంధ్రులు గాకపోయినను భ్రమరకీట న్యాయమునఁ దంజాపురాంధ్ర నాయకులతోడి సంపర్కము వలన నాంధ్రసంస్కృతిని స్వీకరించి యాంధ్రత్వము నలవఱచుకొనిరి. తంజనగరమువలె తమ రాజధానియు శారదానిలయము గావలయునని వారి యుద్దేశము. ఆంధ్రవాఙ్మయమున దొండమాన్ రఘునాథ నాయకుని స్థానము సుస్థిరమైనది. ఇతఁడును తంజాపుర రఘునాథ విజయరాఘవ నాయకులవలె తెనుఁగునఁ గవనము చెప్ప నేర్చినవాఁడు. మఱియుఁ దన యాస్థానమునకు గీర్వాణాంధ్ర పండితులను, గాంధర్వవిద్వాంసులను, గాయక నర్తకాది కళా కుశలురను రప్పించి వారి గ్రాసవాసాదులకుఁ దగు నేర్పాటులను గావించి రక్షించెను. ఇతని యాస్థానమున వెలసినట్టి యాంధ్రకవులలో ముఖ్యుఁడు కోటి వెంకనార్యుఁడు. ఈ రఘునాథ నాయకుని కృషికిఁ దార్కాణగ పుదుకోట నేఁటివరకును విద్వాంసులకుఁ బట్టుగొమ్మయై నిలచి యున్నది.

తరువాత దక్షిణాంధ్రనాయక రాజ్యములయం దన్నిటియందును మధుర బహుబలిష్ఠమైనది. తంజాపుర పుదుకోటల రాజులవలె నిజకవిత్వాతిశయముచేఁ బేరువడసిన ప్రభువెవ్వఁడును మధురయందుఁ గానరాక పోయినను మాతృభాషాభిమానమునందును, కవిజన పోషణమునందును మధుర నాయకులు దీసి పోయినవారు కారు; కాని వీరికి విద్యాభిమానము తంజాపుర సంపర్కమువలనఁ గలిగినది; సహజముగఁ గలిగినట్లు తోఁచదు. క్రీ. శ. ౧౬౫౯ మొదలు ౧౬౮౨ వఱకును రాజ్యమేలినట్టి చొక్కనాథ నాయకుని కాలముననే మధురయందు ఆంధ్రవిద్యాభిమానము మొదట నంకురించినది. తత్పూర్వము భాషావిషయమున శ్రద్ధచూపిన నాయకప్రభు వెవ్వఁడు మధురయందు లేఁడు. చొక్కనాథ నాయకుని కాలమున మధుర, తంజాపురములకు విరోధము ప్రబలి క్రీ. శ. ౧౬౭౩ వ సంవత్సరమున యుద్ధము పొసఁగెను. ఈ యుద్ధమునఁ దంజాపుర నాయక రాజ్యము నాశనమై మధురలోఁ గలసిపోయెను. చొక్కనాథుఁడు దన సవతి తమ్ముని ముద్దళగిరిని తంజాపురమునకుఁ బాలకునిగ నియమించెను. మధుర నాయకులలోఁ గవుల నాదరించి యాంధ్రభాషను పోషించిన ప్రభువులలో నీముద్దళగిరియే మొదటివాఁడు. ఇతనికి తంజాపురమువలనే యాంధ్రసరస్వతి ప్రసన్నురాలాయెను. తంజాపుర విజయమువలన మధుర నాయకులకు లభించిన లాభములలో స్థిరముగ వారికి దక్కిన దీయాంధ్రవాణీ ప్రసాదమే. ౧౭ వ శతాబ్దాంధ్రభాషా చరిత్రయం దెన్నఁదగిన మధురప్రభువులలో రాణిమంగమ్మ యొక్కతె. ఈమె కవుల నాదరించి పోషించలేదు. తుపాకులయింటివారి ఆడబడుచైనను వారికి సహజమైన భాషాభిమాన మీమెయందు లేశమేనియుఁ గానరాదు; కాని చినవెంగన కవి కపకారమొనర్చి యాతని తిట్టుకవిత్వమునకు గురియాయెను. 'మంగమ్మ దండకము', 'మధురమంగా పుంశ్చలీ విలాపము' అను రెండు గ్రంథముల నితఁడామెదుశ్చరిత్రమును వర్ణించెను. ఇందు రెండవది వచన కావ్యము; అచటనచట ద్విపదలు గలవు. ఇంతటి పచ్చిబూతుల పుస్తకము మఱియొకటి కావరాదు; కాని యాకాలపు టాచారములను జూపుట కిది యద్దము వంటిది. వ్యవహార భాషయందు విరచితమైనను పుష్టి గల శైలి.

ఇంతవఱకును రాజపోషణవలన నభివృద్ధి జెందిన సారస్వతపీఠములలో ముఖ్యమైనవానిని వివరించితిని. కేవల భాషాభిమానమువలనను, కవిత్వముమీఁది యాదరమువలనను తెంపొందిన సారస్వతపీఠ మొకటి కలదు.

ఇది నెల్లూరు మండలములోనిది. పొడదేసుంట యను గ్రామము దీని కునికిపట్టు. పుష్పగిరి తిమ్మన దీని కర్తృకుఁడు. ఇతఁడు సామాన్య బ్రాహ్మణ కుటుంబమునఁ బుట్టెను. రాజు గాఁడు, భూస్వామి గాఁడు; ధనికుఁడును గాఁడు; అసామాన్య కవిత్వధార గలవాఁడు; ఉదారహృదయుఁడు; చక్కనికవిత్వము జెప్పి సమకాలికులయందు గణన కెక్కెను; భర్తృహరి శతకత్రయము నాంధ్రీకరించెను; సమీరకుమార విజయ మను కావ్యమును నిర్మించెను. తిమ్మన తాను కవిత్వము చెప్పుటయే కాక కావ్యరచనాకుతూహలురైన కవులకుఁ దోడ్పడి వారిచే గ్రంథములను రచింపించెను. కంకంటి కవుల కీతఁడు పట్టుగొమ్మ; పాపరాజవిరచితోత్తర రామాయణ విష్ణుమాయావిలాస నాటకములయందే కాక నృసింహకవికృత విష్ణుమాయావిలాసనాటకమునందును తిమ్మకవిశేఖరుని పాల్గొనినది. శేకుమళ్ల రంగశాయి తిమ్మనసహాయమును బొందియే భాగవతము పంద్రెండు స్కంధములను ద్విపదగ రచియించెను. మఱియు భరణిదేవుల రామమంత్రియు నితని తోడ్పాటును బడసియే దశావతారచరిత్రను రచియించె నను నైతిహ్యమును గలదు. కావున తిమ్మనగారి జన్మస్థానము పదునేడవ శతాబ్దమునం దాంధ్రదేశమున ముఖ్యసారస్వతపీఠములలో నొక్కటియై ప్రసిద్ధి వహించెను.

కవులకును, విద్వాంసులకును స్థిరనిలయములై సారస్వతపీఠములనిపించుకొనఁజాలకపోయినను, పెక్కు సంస్థానములు కవుల కాశ్రయములై, భాషాభివృద్ధికిఁ గారణభూతములాయెను. చిక్కదేవరాయల నాఁడు మైసూరును, ఇమ్మడిజగదేవరాయలకాలమునఁ జెన్నపట్టణమును, తిమ్మనాయని యేలుఁబడిక్రింద గండికోటయు, పెదవెంకటపతిరాయల పాలనయందు వేలూరును, దామెరవెంకటపతి యంకభూపతుల ప్రభుత్వమునఁ బూనమల్లెయు నాంధ్రకవిపుంగవుల కావ్యనిర్మాణమునకుఁ గర్మాగారము లాయెను.

ఇట్లు దక్షిణదేశమున మూఁడుశతాబ్దములుగ నభివృద్ధిఁ జెందుచుండిన రాయసామ్రాజ్యము భిన్నమై, యంతర్గతరాష్ట్రములు వేరుపడి స్వతంత్రసంస్థానములై మారిపోయినను, గోదావరి మొదలు కన్యకుమారిపర్యంతమాంధ్రభాషాసామ్రాజ్య మేర్పడి యాంధ్రకవులకు సంచారభూమి యాయెను. ఈసందర్భమున నాంధ్ర 'పదకవి' క్షేత్రజ్ఞుఁడు స్మరింపఁదగినవాఁడు. ఇతని జన్మస్థానము ఇప్పటి గుంటూరుమండలములోని మొవ్వ యను గ్రామము; కాని యితని నాదరించి సత్కరించిన ప్రభువులు దక్షిణదేశమున నన్నియెడలను గలరు. ఉత్తరమున గోలకొండపాదుశాహా మొదలు దక్షిణమున నెట్టియాపురసంస్థానాధీశునివఱకును నీతని పదకవితకు మెచ్చి సత్కరించని దొర లేఁడు. మధురతిరుమలనాయకుఁడు, తంజాపురరఘునాథనాయకుఁడు విజయరాఘవనాయకుఁడు, తుపాకికృష్ణప్ప మున్నగువారితని పదకవితామృతమును గ్రోలి యమరులైరి. దక్షిణదేశమంతటను దిరిగి నానారాజసంస్థానములయందుఁ దన కవితామహత్త్వమును బ్రకటించి సత్కారములను బొందిన యాంధ్రకవి యితఁ డొక్కఁడే కాఁడు. ఇట్టివా రనేకులు గలరు. కవులనిగాని, విద్వాంసులనిగాని పేరు గాంచినవారందఱికిని దక్షిణదేశసంచారమును, నానారాజసందర్శనమును సామాన్యమే.

పదునేడవ శతాబ్దాంధ్రవాఙ్మయచరిత్రమునందు ముఖ్యముగ పరిగణింపఁదగిన యంశములలో బ్రాహ్మణేతరరచయితల ప్రాబల్య మొకటి. వీరియందు పురుషులును, స్త్రీలును గలరు. బ్రాహ్మణేతరుల గ్రంథరచన కిది ప్రథమ ప్రయత్నము గాదు. ఆంధ్రవాఙ్మయచరిత్రయొక్క ప్రారంభయుగమునుండియు బ్రాహ్మణేతరకవులు కాదాచిత్కముగఁ గానవచ్చుచున్నను నూటికి తొంబదితొమ్మండ్రు బ్రాహ్మణులే; కాని క్రీ. శ. ౧౬-వ శతాబ్దమున నీస్థితి మాఱఁజొచ్చినది. రాయరాజ్యము స్థిరమై దేశమున శాంతి నెలకొనుటచే, జనుల యార్థికస్థితి బాగుపడి, జనసామాన్యమున నుత్తమజాతులవారికి విద్యాభ్యాసము సేయుట కవకాశము కుదిరెను. మఱియు దేశమునందు వైష్ణవమతము వ్యాపింపఁజేయుటకు వైష్ణవాచార్యులు వర్ణభేదములను పరిగణింపక శిష్యకోటిచే మతగ్రంథములఁ జదివించుటకు విద్య నేర్పుటచే నుత్తమజాతులవారియందు విద్యాధికుల సంఖ్య యధికమాయెను. కావున బ్రాహ్మణులనుబోలి బ్రాహ్మణేతరులును విద్యావిశారదులై సరస్వతీప్రసాదమును

బొంది గంటము చేఁబూని కవిత్వము చెప్పుటకును, గావ్యనిర్మాణమునకును గడఁగిరి. కాని పదునారవ శతాబ్దమున వీరి సంఖ్య బహుళముగాదు. ఏవురు మాత్రము గానవచ్చుచున్నారు. కాని వీరేవురియందును నలువురు ప్రఖ్యాతులే. బ్రాహ్మణేతర రచయితలయందే కాక నా యుగమున వెలసిన కవిరాజులలో నగ్రస్థానమును వహించినవాఁడు, సాహితీసమరాంగణసార్వభౌముఁడు శ్రీ కృష్ణదేవరాయఁడు. ఆంధ్రభాష మన్నంతకాలమును ఆముక్తమాల్యదకీర్తి మాయదుగదా! తరువాత చెన్నఁదగినవాఁ డళియరామరాజు మన్ననకుఁ బాత్రుఁడై రామరాజభూషణ బిరుదాంకితుఁడైన బట్టుమూర్తి. వసుచరిత్రము జదివి తన్మాధుర్యమును గ్రోలి చొక్కి యానందసాగరమున మగ్నుఁడుగాని యాంధ్రవిద్యాధికుఁడుండఁడు గదా! పిమ్మటఁ బేర్కొనవలసినవాఁడు కందుకూరి రుద్రకవి. కావ్యరచనయం దెట్లో యక్షగాన నిర్మాణమునం దట్లే దంట. ఇతని యనర్గళకవిత్వధారకును, పలుకునుడికారమునకును, శిల్పసౌందర్యమునకును మెచ్చనివారెవ్వరు? అవ్వలఁ జెప్పఁదగినవాఁడు వెంకటనాథుఁడు; పంచతంత్రరచయిత. ఆంధ్రపద్యకథావాఙ్మయమున నితని స్థానము కడునున్నతమైనది. చమత్కారప్రియుఁడు; అల్పవిషయము నాధారపఱచుకొని యంగముల నుపాంగములను గల్పించి పసందుగ గథను పెంచి వ్రాయుటయం దితని దందె వేసినచేయి. కడపటి యతఁడు రామరాజు రంగప్పరాజు. ఇతఁడు విద్వాంసుఁడు; చక్కఁగ కవిత్వము జెప్ప నేర్చినవాఁడే; కానిఇతనికి పాండిత్యమున కంటెఁ బ్రతిభతక్కువ; శిల్పమున నించుక మోటుతనమును, భావమున నన్యానుకరణమును గానవచ్చుచున్నవి. వసుచరిత్రయు, నాముక్తమాల్యదయు నితనికి మేలుబంతులు; కాని రామరాజభూషణుని వాగ్ధాటియు శిల్పవైచిత్రియుఁ, గృష్ణరాయల భావగాంభీర్యమును కల్పనానవీనతయు నితని కవిత్వమునందరుదు. పదునాఱవశతాబ్దపు బ్రాహ్మణేతర రచయితలలోఁ గవయిత్రి యొక్కతె కలదు. ఈమె కుమ్మరిమొల్ల. ఈమె తియ్యని కవిత్వమును రుచిజూచి తలయూఁచనివారలెవ్వరు? నాతికఠినపదముల కూర్పుతో నిర్ఝరాంభః ప్రవాహమువలె నడచు నీమె పద్యముల గమనవైఖరి యెవ్వరి హృదయము నాకర్షింపదు?

పదునేడవశతాబ్దియందు బ్రాహ్మణేతరరచయితల సంఖ్య యతిశయించెను. కృష్ణరాయ రామరాజభూషణులతో సమానులెవ్వరును బయలుపడకపోయినను వీరి కవితాశక్తి యల్పమైనదికాదు. వీరియందు ముఖ్యమైన వారిచరిత్రను, వాఙ్మయసేవను నిచట సంగ్రహముగ చెప్పుట యుక్తము. మొదటఁ బేర్కొనవలసినవాఁడు మట్లి యనంతరాజు. ఎల్లమరాజు కుమారుఁడు; క్రీ. శ. ౧౫౮౬ మొదలు ౧౬౧౪ పర్యంతము విద్యానగర సామ్రాజ్యమును బాలించిన రెండవ వెంకటపతి రాయల సమకాలికుఁడు. ఇతఁడు కవిజనపోషణవల్లనే కాక కావ్యరచనము వలనను వన్నెకెక్కెను. ఇతనిచే విరచితమైనది కకుత్స్థవిజయమను కావ్య మొకటి ప్రకటితమైయున్నది. ఇతని కవిత్వము నిర్దుష్టముగను, హృదయంగమముగను నుండు నని వీరేశలింగంపంతులుగా రభిప్రాయపడియున్నారు; కాని పదునేడవశతాబ్దమున విరచితములైన దాక్షిణాత్యాంధ్రకావ్యములవలె రసవంతమైనదని చెప్పుటకు వీలులేదు. మట్లి యనంతరాజుకంటె కావ్యనిర్మాణమున నెక్కువ చాతుర్యము గలవాఁ డతని సమకాలికుఁడు తంజావూరి రఘునాథనాయకుఁడు. గీర్వాణాంధ్రభాషలయందు రెంటియందును నితఁడు రసవంతమైన కవిత్వము జెప్ప శక్తిగలవాఁడు. రఘునాథనాయకుఁడు రచించిన యాంధ్రకావ్యములు రెండు లభ్యమై యున్నవి. ఇందొకటి వాల్మీకిచరిత్ర; ఇది సాంతమైనకావ్యము. ఆదికవి వాల్మీకిచరిత్ర మిందు మనోహరముగ వర్ణింపఁబడియున్నది. రెండవది రామాయణము; ఇది యసమగ్రము; బాలకాండమున మొదటి నాలుగాశ్వాసములు మాత్రమే దొరకినవి. కవిత్వము సలక్షణమైనది; భాష నాతికఠినము. అనర్గళమైనధార, లలితమగు శయ్య, మనోహరమైన యలంకారములు రఘునాథనాయకుని కావ్యములయందుఁ గానవచ్చెడి సామాన్యగుణములు. దక్షిణదేశమునం దాంధ్రవాఙ్మయముపై నభిరుచి గలుగుటకు రఘునాథనాయకుఁడే ముఖ్యకారణము. ఆంధ్రభాష కితఁ డొనర్చిన సేవ యమూల్యమైనది. రఘునాథునియనంతర మతని పుత్రుఁడు విజయరాఘవుఁ డాంధ్రకవులకును, బండితులకును బట్టుఁగొమ్మయాయెను; కవిత్వమునఁ

దండ్రియంతటివాఁడు కాకపోయినను భాషాపోషణమునను, కవిపండితాదరణమునను తండ్రికిఁ దీసిపోవువాఁడు గాఁడు. విజయరాఘవకృతములగు ద్విపదకావ్యములును పెక్కు గానవచ్చుచున్నవి; కవిత్వమంతటి ప్రశస్తమైనది కాదు; ఇతనికంటె రసవత్తరముగ ద్విపదలు రచింపఁగల్గిన కవు లితని సమకాలికులు గలరు; వారి కవిత్వముతోఁ బోల్చి చూచిన నితని రచన పేలవమనితోఁచును; కాని యాంధ్రయక్షగాన విస్తారమున కితఁ డొనర్చిన కృషి సంస్మరణీయము. స్వయముగ యక్షగానములను వ్రాసియుఁ, దన యాశ్రితులచే వ్రాయించియు నాటకవాఙ్మయము నభివృద్ధిపఱచెను. గీతప్రాధాన్యమై నాట్యార్థము విరచితమైన యక్షగానము నూతనావయవములను బొంది ప్రదర్శనయోగ్యమై నాటకముగఁ బరిణామ మందుట కారంభించినది ఇతని కాలముననే. విజయరాఘవుని సమకాలికులైన ప్రభువులు పలువురు కావ్యరచనకుఁ గడఁగిరి. వీరియందు ప్రముఖులు దామెరల సోదరులు వెంకటపతియు,నంకభూపాలుఁడును. ఈ యన్నదమ్ము లిరువురును వైదుష్యమున సమానులైనను, కవిత్వమునం దంకభూపాలునికంటె వెంకటపతి యధికుఁడని చెప్పవలసియున్నది. వెంకటపతి రచియించిన కావ్యములలో బహుళాశ్వచరిత్ర దొరకినది. ఇది పదునేడవ శతాబ్దమున విరచింపఁబడిన యుత్తమ ప్రబంధములయం దొక్కటి; కృష్ణకథయను మఱియొక కావ్యమును రచించి రామభద్రుని కంకితమొసఁగినట్లు బహుళాశ్వచరిత్ర పీఠికయం దితఁడు చెప్పికొనియున్నాఁడు; కాని యది ఇంకను బయలుపడలేదు. వెంకటపతి కవిత్వము "రసవంతమయి సలక్షణముగానున్న"దని వీరేశలింగం పంతులుగారు చెప్పియున్నారు.[1] ఇదిసత్యమే; కాని కథాసంవిధానమునఁగాని,సూక్తి వైచిత్రియందుఁ గాని ప్రశంసించఁదగిన విశేషమెద్దియుఁ గానరాదు. అంకభూపాలుఁడును జక్కని కవిత్వము చెప్పఁగల్గినవాఁడే. ఇతఁడు రచించిన యుషాపరిణయకావ్యమునందు కవితాప్రతిభకంటె పాండిత్యప్రకర్షయే విపులముగఁ గానవచ్చుచున్నది. శబ్దాలంకార పూరితమై ఏకాక్షర ద్వ్యక్షర త్ర్యక్షర పద్యయుక్తమై ఇతని యుషాకల్యాణ మాధునిక పాఠకులకు విసుగుపుట్టించుచున్నది. మట్లి రాజకుటుంబమున నీ కాలముననే మఱియొక కవి బయలువెడలెను. అనంతరాజు పౌత్రుఁడు కుమార అనంతరాజు తాతవలెనే కవి. ఇతని తండ్రియైన తిరువెంగళనాథరాజు స్వయము కవిత్వము చెప్పకున్నను కవిత్వమునం దాదరము గలిగి కవులకుఁ దనయాస్థానము నందాశ్రయమిచ్చెను. చక్కని కవిత్వ మల్లఁగలిగిన భట్టు లితని శౌర్యౌదార్యములను సీసమాలికలయందును, ద్విపదలయందును సంగ్రహించియున్నారు. కవితాప్రియుఁడైన తండ్రికడుపునఁ బుట్టి కవుల గోష్ఠియందు పెరిగినవాఁడగుటచే ,మట్లి కుమారానంతరాజు కవియగుట సహజమే. ఇతఁడు కుముద్వతీ కల్యాణమను ప్రబంధమును రచించెను; దీని యసమగ్రప్రతియొకటి యడయారు దివ్యజ్ఞాన సమాజపుస్తకభాండాగారమునన్నది. ప్రౌఢమైన కవిత్వము; పదునేడవ శతాబ్దమున బయలువెడలిన ప్రబంధములకుఁ గల సామాన్యగుణము లిందును గానవచ్చుచున్నవి. ఇతనికిఁ దరువాత చెప్పదగిన రాజకవి యాంధ్ర భోజక్షత్రియుఁడు కట్టా హరిదాస రాజపుత్రుఁడు వరదరాజు.[2] ఇతఁడు పెక్కు కృతులను రచియించిన కవిసత్తముఁడు. పరమభాగవత చరిత్ర, పుండరీక చరిత్ర,శ్రీరంగమాహాత్మ్యము రామాయణము నను నాలుగు గ్రంథము లితని విప్పుడు లభించియున్నవి. మొదటి మూఁడును పద్యకావ్యములు; కడపటిది ద్విపద. ఇందు శ్రీరంగ మాహాత్మ్య మొక్కటియే ముద్రితమైనది. ఇతనిది మనోహరమైన కవిత్వము. వాఙ్మాధుర్యమున నితనితోఁ దులదూఁగగలవా రీ శతాబ్దమునం దనేకులు లేరు. సులభమైనశైలి, మెత్తనిమాటలు, నిరాఘాటమైన వాగ్ధాటిని గలిగి ఇతని కవనము జరువజరువఁ జవులూరుచుండును. కట్టావరదరాజు కాలముననే మఱియొక దొడ్డ బ్రాహ్మణేతర కవి వెలసెను. ఇతఁడుకువలయాశ్వచరిత్ర రచయితయగు సవరము చిననారాయణకవి.[3] ఇతఁడు కువలయాశ్వచరిత్రయను రసవత్తమమైన కావ్యమును రచియించి తన పెంపుడు తండ్రియైన నారాయణభూపాలున

---

౧. ఆం. క. చరిత్రము. ద్వి. భా. పుట ౪౯౨.

౨. చూ. అనుబంధము. ౧.

3. చూ. అనుబంధము, ౨.

అంకిత మొనర్చెను. ఇతఁడు మహాకవి. పదునేడవ శతాబ్దపువాఁడే పింగళి సూరన; కొన్ని యంశములయం దితఁడు ఆసూరనను మించినవాఁడని చెప్పవలసియున్నది. ప్రతిభావిశేషమునను, కల్పనాసామర్థ్యమునను వీరిరువురును సమానులే యైనను చిననారాయణ నాయకుని కవిత్వములోని శిల్పపరిపాకమును, ప్రసన్నత్వమును, నిగ్గును సూరనార్యునియందు గానరావు. ఇతఁడు సంస్కృత పాండిత్యముగలవాఁడైనను సంస్కృత పదములను, సమాసములను గుప్పించక దాక్షిణాత్యాంధ్ర కవులకు సామాన్యమైన తియ్యని తేటతెనుఁగు మాటలను గూర్చి హృద్యమైన పద్యములతో నెల్లవారికిని సులభగ్రాహ్యముగ గ్రంథమును రచించినాఁడు. చేమకూరవాని భావగాంభీర్యమును, చమత్కారమును నితని కతీతములైనను, పదగుంఫనయందును, వర్ణనాకౌశల్యమునను నతనికి సమానుఁడని చెప్పవలసియున్నది. ఇతని కవిత్వ విశేషములను గూర్చి వ్రాయవలసిన దెంతయేనియు గలదు; కాని యిది యదనుగాదు. ఇతనికి తరువాత పేర్కొనవలసినవాఁడు రత్నాకరము గోపాలకవి. సౌగంధిక ప్రసవాపహరణ మను మనోహర ద్విపదకావ్యమును రచించి రావిళ్ల లింగభూపాలుని కంకితము గావించెను. గోపాలకవికి సమకాలికుఁడు పాలవేకరి కదిరీపతి. పద్యకథావాఙ్మయమున నితని మించినవారు లేరు. పైఁ బేర్కొనిన కవులుగాక వచనకావ్యరచయితలు కొందఱు కలరు. వీరియందు ముఖ్యుఁడు మైసూరిరాజ్యమున క్రీ.శ. ౧౭-వ శతాబ్దపుటుత్తరార్ధమున నాఢ్యుఁడై వెలసిన కళివె క్షత్రియవంశజుఁడు వీరరాజు. ఇతఁడు గొప్ప గ్రంథకర్త; కర్ణాటకమునను, దెనుఁగునను మహాభారతమును సులభశైలిని వచనమున రచియించెను; భక్తచరిత్ర యను నామముతో నఱువదిమువ్వురు శైవభక్తుల చరిత్ర నాంధ్రమున వ్రాసెను. ఇతనిభాష మృదుమధురము; విననింపుగ నుండును. కళివె వీరరాజున కాంధ్రభారత రచనమునందుఁ దోడ్పడిన బ్రాహ్మణేతర రచయిత మఱియొకఁడు గలఁడు. ఇతఁడు తుపాకుల అనంతభూపాలుఁడు; చంద్రగిరి కృష్ణతనూభవుఁడు. తుపాకుల కృష్ణప్ప గోల్కొండసుల్తానగు అబ్దుల్లా కుతుబుశాహ మంత్రియు, సైన్యాధ్యక్షుఁడును నగు మిర్ జుమ్లాక్రింద దళవాయియై యతనికి క్రీ.శ. ౧౬౫౦ ప్రాంతమునఁ గర్ణాటకసామ్రాజ్యమును స్వాధీనపఱచు కొనుటయందు సహాయపడెను. కావున అనంతభూపాలుఁడు ౧౭-వశతాబ్దపుటుత్తరార్ధమున నభ్యుదయమందె ననుటకు సంశయములేదు. మహాభారత వచనరచనయందు కళివె వీరరాజునకుఁ దోడ్పడుటయేకాక యనంతభూపాలుఁడు విష్ణుపురాణమును వచనమున వ్రాసెను. ఇతని రచనయు వీరరాజురచనవలెనే సులభగ్రాహ్యమై పండితపామరజనుల కెల్లరకును పఠనీయమై యున్నది. ఇతని విష్ణుపురాణము ముద్రితమైనది. ఆంధ్ర వచన వాఙ్మయ చరిత్రమున నితని స్థానము ముఖ్యమైనది. ౧౭-వ శతాబ్దమున బ్రాహ్మణేతర పురుషులవలె స్త్రీలును విద్యావతులై గ్రంథరచనకుఁ గడఁగిరి. వీరియం దిరువు రిచట పేర్కొనఁదగినవారు కలరు. వీ రిద్దఱును తంజావూరి నాయక సంస్థానమున వెలసినవారే. వీరు తమకు సమకాలికులగు నాయకులకుఁ దాము భార్యలమని చెప్పుకొనియున్నను వెలయాండ్రని తోఁచుచున్నది. వీరిలో మొదట చెప్పఁదగినది మధురవాణి. ఈమె రఘునాథనాయకునికి ప్రియురాలు; సంగీతమునను, సాహిత్యమునను నసాధారణ ప్రజ్ఞగలిగి గణనకెక్కిన స్త్రీరత్నము. గీర్వాణమునం దీమె కభిమానము మెండు. తన గ్రంథముల నన్నిటిని గీర్వాణభాషయందే వ్రాసియుండుటచే నీసందర్భమున నీమెనుగూర్చి వ్రాయుట యుచితముగాదు. ఇచట ముఖ్యముగఁ బేర్కొనఁదగినది రంగాజమ్మ; తాను విజయరాఘవుని ఇల్లాలనని చెప్పుకొనినది; పెక్కు గ్రంథములను రచియించి విజయరాఘవుని మెప్పించి యతనిచే కనకాభిషేకము సేయించుకొనెనఁట. సంగ్రహ రామాయణ భారత భాగవతములను, నుషాపరిణయ కావ్యమును, మన్నారుదాసవిలాస యక్షగానమును విరచించెను. కవిత్వమంత ప్రశస్తము గాకపోయినను యక్షగాన విస్తారమున నీమెచే రచింపఁబడిన మన్నారుదాస విలాసము గణుతింపఁదగియున్నది.

## అనుబంధము. ౧.


వరదరాజ [కవికాలమునుగూర్చి కొంత యభిప్రాయభేదము గానవచ్చుచున్నది. ఇతనిచే

రాంధ్రపండిత లోకమునకు మొదటఁ దెలియఁబఱచిన బ్ర. శ్రీ మానవల్లి రామకృష్ణకవిగారు తమచే విరచింపఁబడిన శైవకృత శ్రీరంగమాహాత్మ్య సంపాదకీయ పీఠికయం దీ వరదరాజు అళియరామరాజు పెదతల్లి కుమారుఁడని వ్రాసియున్నారు; కాని కీ. శే. చెలికాని లచ్చారావుగారు చెప్పినట్లు వారు దాని కాధారములు చూపరైరి. అయినను కవిగారివాక్యముల నంగీకరించి వరదరాజు క్రీ. శ. ౧౬ వ శతాబ్దము కడపటివాఁడనియే నిశ్చయించిరి. "వరదరాజు శ్రీకవిగారు చెప్పినట్లు రామరాజు బంధువుఁడైనచోఁ దప్పక ౧౬ వ శతాబ్దము కడపటివాఁడగును....పైఁగా నాముక్తమాల్యదపోలిక లంటచే నీతఁడు ౧౬ వ శతాబ్దము కడపటి భాగమునసే యుండియుండవచ్చును." (అముద్రితాంధ్ర గ్రంథ సర్వస్వము. ౬. పీఠిక పుటలు, ii-iii) కాని ఈ కాలనిర్ణయ మంగీకరించఁదగినది కాదు. వరదరాజు క్రీ. శ. ౧౭ వ శతాబ్ద పూర్వార్ధమున నుండెనని యతని గ్రంథములయందే ప్రబలమైన సాక్ష్యము గానవచ్చుచున్నది. తన ద్విపదరామాయణ కృత్యాద్యవతారికయందు దన వంశమును వర్ణించుచు నిట్లు చెప్పియున్నాఁడు:

"పరవధూద్రవ్య చాపల్యదూరుండు
హరిదాస రాజైన హరిదాసరాజు
అంగనాభూషణం బగుపోచిరాజు
శింగరిరాజన్య శేఖరు కుతను
బాళిమై కృష్ణమాంబను వరియించె
నా లేమతోఁబుట్టువగు నోబమాంబ
నర్థి శ్రీరంగరాయలు నాల్గుపూరు
షార్థముల్ గలుగ గల్యాణమై మించె
ఆయశోనిధిసుతుఁడై రామదేవ
రాయలు మారట రాముఁడై వెలసె
హరిదాసరాజు కృష్ణాంబయందులను
హరిసుదర్శనమూర్తియగు రామరాజు
రాజభగీరథురవితేజువరద
రాజును నినుదాశరాయనిఁగాంచె
రచియింపుమీవు శ్రీరామాయణంబు"

(Des. Cat. Tel. Mss. in the Maharaja Sarfoji's Sarasvati Mahal Library p. 20.)

ఈ ద్విపదలయందు వర్ణింపఁబడిన కులబాంధవ్యము నిట్లు ప్రస్తరించవచ్చును:




ఈబాంధవ్యము రామరాజీయమందును సూచింపఁబడియున్నది.

"రాజకులభూషణుఁడు చిక్కరాయభూప
శారివరియించె జిల్లేళ్ల నారసింహ
రాజదేవేంద్రపుత్రియంభోజనేత్రి
యైన యోబమ్మదేవి నా యతివవలన.
అవనుమతీశునకు రామదేవరాయ
లుదయమైనను రిపురాజులోదిగి శైల
గుహలజేరిరి..."

Sources of Vij. Hist. P. 244-5

దీనిఁ జూడఁగా జిల్లేళ్లవారికే పోచిరాజువారను నామాంతరముగూడ నుండినట్లు తోఁచుచున్నది.

ఇందువల్ల క్రీ. శ. ౧౬౧౭ మొదలు ౧౬౩౦ వఱకును విజయనగరసామ్రాజ్యమును పాలించినరామదేవరాయల కీ కట్టా వరదరాజు పెదతల్లి కుమారుఁడనియు, సమకాలికుఁ డనియు స్పష్టమగుచున్నది. మఱియు విజయరాఘవ నాయకకృతమైన రఘునాథాభ్యుదయ ద్విపద కావ్యమున, క్రీ. శ. ౧౬౧౭ లో నడచిన తోపూరు రణక్షేత్రమున్నను రామదేవరాయలకు బాసటలైచనిన నాయకులలో వరదరాజు పితామహుఁడైన కట్టా రంగపరాజొక్కఁడైనట్లు చెప్పియున్నది.

"ఆరామ దేవరాయలు చనుదేర
తరతరమ్ములకును దగులైనకతన
నెఱనమ్మఁదగిన కోనేటి కొండ్రాజు-
కట్టరంగపరాజు కస్తూరిరాజు."

(Sources of Vijayanagar History P. 262.)

క్రీ. శ. ౧౬౧౭ లో కట్టరంగపరాజు యుద్ధము సేయఁగలదేహపటుత్వము గలిగియుండుటచే మనుమఁడైన వరదరాజు సమకాలికుఁడును, పినతల్లి కుమారుఁడైన రామదేవరాయలవలె బాలుఁడై యుండవలయును. మఱియు నీ వరదరాజు తండ్రి క్రీ. శ. ౧౬౩౦ మొదలు ౧౬౪౨ వఱకును విజయనగర సామ్రాజ్యమును పాలించిన ముమ్మడి వెంకటదేవరాయలకు సమకాలికుఁడని కడపమండలము జమ్మలమడుగు తాలూకాలో మాధవాపురగ్రామములోని హనుమంతరాయని యాలయము గోడదగ్గర పడియుండిన శాసనశేషమువల్ల తెలియవచ్చుచున్నది.

"యీశ్వర సంవత్సరానను చలమర్తిగండ పట్నాన జియ్యంగారివారి సన్నిధి వెంకటయ్యగారికి కట్ట హరిదాసరాజు ధారపోసిన చేనివడిమి కత్తువను భీముని గుండంచేను..."— ఇందుదహరింపబడిన ఈశ్వర సంవత్సరము ముమ్మడి వెంకటదేవరాయల రాజ్యమధ్యకాలమున క్రీ. శ. ౧౬౩౬-౩౭ కు సరిపోవుచున్నది. దీనివలన కట్ట వరదరాజు రాయలసీమవాఁడనియుఁ, క్రీ. శ. ౧౭ వ శతాబ్దమధ్యమున నుండెననియు నిశ్చయమగుచున్నది.

అనుబంధము ౨.

సవరము చిననారాయణనాయకుఁడు క్రీ. శ. ౧౫౭౦-వ సంవత్సరప్రాంతమున నుండెనని కీ. శే. కందుకూరు వీరేశలింగంపంతులుగా రభిప్రాయపడియున్నారు. ఈయభిప్రాయమునకుఁ బ్రోదిగ రెండంశములను చేర్కొనిరి. కువలయాశ్వచరిత్ర కృత్యాద్యవతారికయందు "కృతిపతియైన నారాయణభూపాలుఁడు శ్రీరంగరాజ వెంకటపతిరాయలకు సహోదరుఁడయి యుండినట్లు చెప్పఁబడి"యున్నది. మఱియు నీనారాయణ భూపాలుని యాధిక్యతను బ్రశంసించు సందర్భమున— "తనకీర్తి మట్లనంతనృపాలముఖ్యగోత్రామరేంద్రులు కొనియాడికొనఁగ"అని చెప్పబడియున్నది. శ్రీరంగరాయ వెంకటపతిరాయలు క్రీ. శ. ౧౫౮౦-౧౬౧౪ వఱకు రాజ్యము సల్పియుండుటచేతను, మట్లి యనంతభూపాలుఁడును నప్పటివాఁడే యగుటచేతను సవరము చిననారాయణరాజు క్రీ. శ. "పదునాఱవ శతాబ్దాంతమున నుండినట్లు నిర్ధారణచేయవచ్చును "అని తమయభిప్రాయమును చరిత్రాంశముల మూలమున బలపఱచిరి. కాని వీరేశలింగంపంతులుగారొనర్చిన కాలనిర్ణయ మంగీకరింపఁదగినది కాదు. కృత్యాద్యవతారికయందు "శ్రీరంగరాజ కుమార వీర వేంకట(టేశ)రాయ భుజాబలసహాయబహువిధోపాయ ధురీణుండును"అని కృతిపతియైన నారాయణ నాయకునిగూర్చి చెప్పియున్నది (కువ.చ. ౧-౧౬). కావున ఇతఁడు సాయమొనర్చినది శ్రీ రంగరాజుయొక్క కుమారుఁడైన వీర వేంకటరాయలనుట తెల్లము. మఱియుఁ "గర్ణాటకాధీశ్వర దయాసాంద్రుండగు నారాయణవసుంధరా దేవేంద్రుఁ"డనియు (౧: ౪౫), "వీరవేంకటరాయ భూవిభుని కరుణ నెలమిఁబాలించె నిలనారణేశ్వరుండు" అనియు(౧:౫౨) నుండుటచేత పైఁ జేర్కొనఁబడిన వీరవెంకటరాయలు విజయనగర సామ్రాజ్యాధీశ్వరుఁడని విదితమగుచున్నది. విజయనగర సామ్రాజ్యమును పాలించిన రాజులలో వెంకటనామధారులు మువ్వురు కలరు. అచ్యుతదేవరాయల కుమారుఁడైన వెంకటరాయలు మొదటివాఁడు; ఇతఁడు క్రీ. శ. ౧౫౪౨ వ సంవత్సరమునం దాఱు నెలలు రాజ్యమొనర్చెను. అరవీటి శ్రీ రంగరాజు తిరుమలరాజు కుమారుఁడైన వెంకటరాయలు రెండవవాఁడు; ఇతఁడు క్రీ. శ. ౧౫౮౬ మొదలు ౧౬౧౪ వఱకును ప్రజాపాలన గావించెను. అళియరామరాజు కడగొట్టుకుమారుఁడైన శ్రీ రంగరాజు పుత్రుఁడు పెద్ద వెంకట మూఁడవవాఁడు; ఇతఁడు క్రీ. శ. ౧౬౩౦ లో గద్దెనెక్కి ౧౬౪౨ పర్యంతము పృథ్వీపాలన మొనర్చెను. వీరియందు కడపటివాఁడైన పెద్ద వెంకటయొక్కని తండ్రిపేరే శ్రీ రంగరాజు. కావున సవరము నారాయణరాజు సాయమొనర్చిన శ్రీ రంగరాజకుమార వెంకట(టేశ)రాయ లీ పెద్ద వెంకటయే కావలయును.

చరిత్రకారు లితనిని ముమ్మడి వెంకటదేవరాయలని పేర్కొనియెదరు. ఈ యభిప్రాయమును బలపఱచఁగల సాక్ష్యము తంజావూరి విజయరాఘవకృత రఘునాథాభ్యుదయమునఁ గొంత కానవచ్చుచున్నది. విజయరాఘవనాయకుఁడు రాజ్యాభిషిక్తుఁడైన పిమ్మట సవరము వెంకటపతి నోడించి తరుమఁగొట్టి తంజావూరు జిల్లా కుంభకోణము తాలూకాలోని పందనల్లూరును స్వాధీనము జేసికొనియెనఁట (Sources of Vijayanagara History P. 258):

"వీరుఁడౌ సవరము వెంకటపతిని
పారదోలించి నీ పంపులచేత
పట్టైనసీమతో పందనల్లూరు
గట్టించితివి ఘటికామాత్రమునను."

ఈ సవరము వెంకటపతి యెవ్వఁడో కనుగొనుటకుఁ దగిన సాధనము రఘునాథాభ్యుదయమున లేదు; అతని యునికిపట్టు పందనల్లూరో, లేక తత్ప్రాంత మందలి మఱియొక స్థలమో కావచ్చునని యూహించుటకుమాత్ర మవకాశము గలదు; కాని ఇతఁడు సవరము చిననారాయణనాయకుని యన్నయని తలఁచుటకుఁ గొంత యాధారమున్నది. కువలయాశ్వచరిత్ర యవతారికయం దొక పద్యమున (౧ : ౫౬)—

"అతఁ డా తిమ్మమయందు
వేంకటనృపాభ్యత్కుక్ రిపుక్షేపణో
ద్ధతు రంగాధిపు జిర్మలాంబ
వలనన్ ధర్మాత్ముఁగోపాలు స
న్నుత కీర్తిం జిన నారనాఖ్యుఁ
డగు నన్నాగ్ కస్తూరీంద్రు న్నమం
చితకీర్తి న్రఘునాథుఁ దిమ్మ
విభుగాం చెన్నజ్జనాధారులన్."

అని చెప్పఁబడియున్నది. ఇందువల్ల సవరము చిననారాయణనాయకునకు సవతియన్న వేంకటనృపాలుఁ డుండెనని తెల్లమగుచున్నది. ఇతఁడే తంజావూరి విజయరాఘవనాయకుని పంపులచే పందనల్లూరు రణక్షేత్రమున నిర్జితుఁడై పారిపోయిన సవరము వెంకటపతియని తలఁచెదను. అగుచేని, విజయరాఘవనాయకుఁడు క్రీ. శ. ౧౬౩౩ లో రాజ్యాభిషిక్తుఁడై యుండుటచేత నతనిచే నోడింపఁబడిన సవరము వెంకటపతియు, నతని సవతి తమ్ముఁడైన చిననారాయణనాయకుఁడును నప్పటివారే కావలయును. కాని కృతిపతి సవరము నారాయణభూపాలుని కీర్తిని మట్లనంతభూపాలుఁడు పొగడినట్లు కువలయాశ్వ చరిత్ర (౧ : ౬౦) పీఠికయందు చెప్పియున్నదే; మఱి సవర నారాయణభూపాలుఁడు ముమ్మడి వెంకటరాయలకాలమున నుండినట్లయిన నిది యెట్లు పొసఁగును? అను ప్రశ్న యొకటి బయలువెడలవచ్చును. దీనికి సమాధానము సులభము. కువలయాశ్వచరిత్రపీఠికయందు పేర్కొనఁబడినది యెల్లమరాజపుత్రుఁడగు మట్లనంతరాజు కాదు. ఇతఁ డాయనంతరాజు మనుమఁడును, తిరువెంగళనాథుని పుత్రుఁడును నైన మట్లి కుమారానంతరాజు. ఇతఁడు సుప్రసిద్ధుఁడైన కూఁకఁడు; కవి యని యింతకుముందే తెల్పి యున్నాను.



తీరమున నున్న రేవులో దిగెనట. ఆ కాలమున మహానదికిని, గోదావరికిని మధ్యనున్న దేశము 'కళింగ'మన బడుచుండెడిది. ఇచ్చటి ప్రజలు సముద్రయానమునం దారితేరినవారు. దాక్షిణాత్యులతోడనో, లేక వారికి ముందుగనో నౌకాయాన ప్రవీణులై పరదేశములతో, అందునను ముఖ్యముగా యవద్వీపముతో కళింగులు క్రీస్తుశకమునకు సుమారు ౫ శతాబ్దములకు ముందుగనే వర్తకము చేయుచుండినట్లు కనబడుచున్నది. నాటి కళింగరాజుల విద్యాభ్యాసమున నౌకాయానము కూడ నొక ముఖ్యాంగమై యుండెడిది. బౌద్ధయుగమున నౌకాయానమున కెట్టియాటంకమును లేనందుటచే కళింగవాణిజ్య మధికమయ్యెను. చీనాదేశపునివాసి 'హోనిత్సాంగు' చీనాకు పోవునపుడు యవద్వీపమునుండి కళింగనావలో నెక్కిపోయినట్లును, నావికులు బ్రాహ్మణ మతస్థులైనట్లును వ్రాసినాడు. కళింగులు దూరదేశములకు పోవుటనుగూర్చి అనేకకథలు గలవు. ఈ కళింగు లందరును ఆంధ్రులేగాని యితరులు గారు. వీరు దంతపురము, కుంభవతి మొదలగు రేవులనుండి బయలుదేరి నౌకాప్రయాణముచేసి, తూర్పు దీవులు లంక మొదలగు ప్రదేశములకు వలసపోయిరని తెలియుచున్నది. విజయుడు కళింగదేశమునుండియే లంకకు వలసపోయెను. విజయుని ఓడయందును, ఆతని భార్యల ఓడలందును ౭౦౦ మంది జను లుండిరని తెలియుటచేత బౌద్ధయుగమునాటి కీయోడలు మిక్కిలి పెద్దవిగ కట్టబడి తెరచాపలచేత నడపబడిన ట్లూహింపవచ్చును. కళింగులు వర్తకవ్యాపారములు చేయుటలోను, సముద్రముమీద ఓడప్రయాణములు చేయుటయందును మిక్కిలి సమర్థులై యుండిరి. తూర్పు తీరమందేగాక పడిసముద్రములమీద జపాను, తూర్పు దీవులు, లంక, పారశీకసింధుశాఖ మొదలగు ప్రదేశములకును పోయివచ్చిరి.

క్రీ. శ. ప్రారంభమున ఆంధ్రరాజులగు శాతవాహనులు నౌకాయానమున మిక్కిలి ప్రసిద్ధిజెందిరి. వీరు విదేశములతో మిక్కుటముగా వర్తకవ్యాపారములు చేయుచుండిరి. ఈ రాజులకు 'త్రిసముద్రాధిపతు'లని బిరుదమున్నట్లు బాణుడు 'హర్షచరిత్ర'లో వ్రాసినాడు. ౨, ౩ శతాబ్దములలోని శాతవాహనులకు చెందిన 'పడవచిహ్నము'లు గల నాణెము లనేకములు తెనుగుతీరమున దొరికినవి. శాతవాహనుల శిల్పరచనను బట్టికూడ వారికి నౌకాయానమునందు గల ఆదరణయు, ప్రాముఖ్యమును ఊహింపవచ్చును. బొంబాయి వద్దనున్న 'సాల్సెటీ'ద్వీపములోని 'కన్హెరీ' గుహలలోని శాతవాహనుల శిల్పము దీనికి తార్కాణము. ఇద్దరు నావికులు సముద్రమధ్యమున నావ బ్రద్దలై, నిస్సహాయులై రక్షణకై పద్మపాణిని ప్రార్థించుచున్నట్లు ఒక శిల్పచిత్ర మున్నది. అజంతాగుహలలో కూడ నౌకాయానచిత్రములు కొన్ని గలవు. క్రీస్తుశకము ౧-౬ శతాబ్దముల మధ్య ఆంధ్రులు గ్రీసు, రోము, పర్షియా, అరేబియా, చైనా దేశములతో వర్తకము చేసినట్లు మరికొన్ని నిదర్శనములుకూడ గలవు. రోమనుసామ్రాజ్యముతో ఆంధ్రులు చేసిన వ్యాపారమునకు నిదర్శనముగా, ఆంధ్రరేవుస్థలములలో రోమనునాణెములు చాల దొరికినవి.

'టాలెమీ'అను గ్రీకురచయిత తన భూగోళశాస్త్రగ్రంథమున సింధునదిముఖద్వారమునుండి గంగానదిముఖద్వారమువరకు నున్న హిందూదేశతీరమును వర్ణించియున్నాడు. అందు ముఖ్యమైన వాణిజ్యస్థలములను, రేవుపట్టణములను పేర్కొనినాడు. అందు 'మైసోలియా' (Maisolia=మచిలీపట్నము), ఉత్తర పినాకినీ ముఖద్వారము, మనర్ఫా (Manarpha = నెల్లూరుజిల్లాలోని మన్నేరుముఖద్వారమువద్ద), కోటిస్ (Kottis = బహుశః గుంటూరుజిల్లాలోని అల్లూరు కొత్తపట్నము), కృష్ణానది ముఖద్వారము, కంటకాస్సిలా (Konta Kossyla = బందరువద్ద ఘంటసాల), కొడ్డురా (Koddura= బందరువద్ద కుదురు), అల్లోసిగ్నే (Allosygne = గోదావరినదివద్ద) మొదలగునవి ముఖ్యమైన ఆంధ్రరేవుపట్టణములు. మచిలీపట్నము, సోఫాట్మా (Sophatma = somewhere near the mouth of Swernarekha or where Pedda ganjam stands now) అనునవి ముఖ్యమైన ఆంధ్రుల రేవులని 'పెరిప్లస్'లో నున్నది. తూర్పుదేశములకు సరకులను ఈజిప్టు మొదలగు పడమటిదేశములనుండి తెచ్చి, సో

ఘాట్మ్రేవులో దింపెడివారు. వినుకొండయందును, నెల్లూరు కడపజిల్లాలందును దొరికిన రోమనునాణెములనుబట్టియు, ఈమధ్య నాగార్జునకొండవద్ద దొరికిన క్రీ. శ. ౩ వ శతాబ్దపు కొన్ని శాసనములనుబట్టియు చూడగా క్రీ. శ. ప్రారంభమునుండి కొన్ని శతాబ్దముల వరకు ఆంధ్రుల కీర్తి తూర్పున చైనామొదలు పడమట రోమువరకును వ్యాపించియుండెడిదనియు, మహోంధ్రమున వారి వ్యాపారవిశేషతయు, విజ్ఞానవికాసమును అసమానముగా ప్రజ్వరిల్లెడివనియు నూహింపవచ్చును.

వంశధార, గోదావరి, కృష్ణ, ఉత్తరపినాకినీ నదుల ముఖద్వారములు నావలు నిలుచుట కనువైన తావులుగా నుండెడివి. నదులలోకూడ కొంతదూరము వరకు నావలు సురక్షితముగా పోగల్గుచుండెడివి. పెద్ద నదులగు కృష్ణాగోదావరులు ఆంధ్రసామ్రాజ్యమున ముఖ్యమగు వ్యాపారమార్గములుగా నుండెడివి. 'పెరిప్లస్' రచయితకాలమునను (౭౦ A. D.) టాలోమీ కాలమునను (౧౪౦ A. D.), కృష్ణాగోదావరుల ముఖద్వారములనుండి నావలు బయలుదేరి తూర్పుదేశములకు పోవుచుండెడివి. గోదావరీముఖద్వారమున నావలన్నియు చేరి, అచ్చటినుండి గుంపులుగుంపులుగా గంగానదివరకు ప్రయాణముచేయుచుండెడివని 'ప్లినీ' (౭౦ A. D.) వ్రాసియున్నాడు. తూర్పుసముద్రమున నున్న తూర్పుదీవులకు కళింగాంధ్రులు వలసపోయి, అచ్చట తమ మతమును, భాషను, నాగరికతను స్థాపించిరి. దీనికి అందు కనబడుచున్న శైవ, బౌద్ధాలయములును, దేవుళ్లును, వేగీ, లేక తెనుగు-కన్నడ శిలాశాసనములును నిదర్శనములు. ప్రాచీనహిందూగ్రంథములనుబట్టి చూడగా హిందువులు తూర్పుదేశములకు ౪ ముఖ్యమైన రేవులనుండి వెళ్లినట్లు తెలియుచున్నది. అవి (౧)బంగాళములోని తామ్రలిప్తి (౨) గోపాలపురము, ప్రాచీన కళింగము (౩) మచిలీపట్టణమువద్దనున్న ౩ రేవు పట్టణములు (?)(౪) బ్రోచి. మచిలీపట్టణమువద్ద నున్న ౩ రేవులనుండియు బంగాళాఖాతముద్వారా తూర్పు దేశములకు ౩ నౌకామార్గము లున్నట్లు పెరిప్లస్‌లో నున్నది. బర్మాయందలి 'పెగు' లోని ప్రజలలో వాడుకగానున్న కథలనుబట్టి చూడగా కృష్ణాగోదావరులమధ్య నున్న కోస్తాదేశమునందలి జనులు చాల కాలముక్రిందట బంగాళాఖాతమును దాటి బర్మాకు వచ్చి ఐరావతినది డెల్టావద్దను దానికి సమీపమున నున్న తీరప్రాంతములందును నివాసమేర్పరచుకొన్నట్లు తెలియుచున్నది. మౌర్యుల కాలమున (క్రీ. పూ. ౩౨౦-౧౮౫) ఉత్తర బ్రహ్మదేశమున గల తాగాంగుకును, ఇప్పుడు 'ప్రోము' అనబడుచున్న శ్రీక్షేత్రమునకును, విష్ణునగరము (పిహాసుమ్యో) అనుస్థలమునకును బందరు ప్రాంతములనుండి పడవలమీద ఆంధ్రులు పోయి, కాపురమేర్పరచుకొనిరి. 'పెగు' అను దక్షిణ బర్మాను వలసపోయిన ఆంధ్రులు జయించి దానిని తమ నివాసస్థలముగా చేర్పరచుకొనిరి. అందుచేతనే అచ్చటి జనులను విదేశీయులు 'తెలంగులు' అని పిలతురు. తూర్పుదేశములలోని కొన్ని పట్టణముల పేర్లను బట్టి చూడగా దేశభక్తి గల ఆంధ్రులు తమ మాతృదేశమందలి నగరముల పేర్లే వలసరాజ్యములలోని స్థలములకు కూడ పెట్టినట్లు కనబడుచున్నది. ఉదాహరణగా ఆరకాను ముఖ్యపట్టణమగు 'త్రిలింగ'ను, సయాము సింధుశాఖలోని 'కాకులకు' టాలోమీ పేర్కొనినాడు. పాత ప్రోమునగరములోని ఒక బౌద్ధస్తూపముపై ౬-వ శతాబ్దపునాటి కన్నడ-తెలుగు లిపి గల శాసనము లున్నవి. అది నిస్సంశయముగా వేంగీరాజ్యపు లిపియేగాని మరొకటి గాదు. ఇండో-చైనా, సుమత్రా, జావా మొదలగు తూర్పుదేశములకు నాగరికతాప్రవాహము ఆంధ్రరేవులనుండియే ప్రవహించెననుట సత్యము. తూర్పుదేశములన్నిటియందును కూడ కృష్ణాగోదావరుల మధ్య నున్న ఆంధ్రుల నాగరికతాచిహ్నములే కనబడుచున్నవి. జావాభాషలో హిందూదేశమునకు 'క్లింగు' (కళింగశబ్దమునుండి వచ్చినది) అని పేరు. ఈ దేశములలోని దేవాలయములు ఆంధ్రనైజామునందలి దేవాలయములను బోలియున్నవి. వీటిలోని శిల్పచిత్రములు దక్షిణమున పెరిగిన చాళుక్యుల రచనావిధానము ననుకరించియున్నవి. జావాద్వీపమునందలి 'బోరాబదరు'నందలి శిల్పశైలి అమరావతి శిల్పనైపుణ్యమును బోలియున్నది.

శాతవాహనుల అనంతరము నౌకాయానమునందాంధ్రులు కొంచెము వెనుకబడిరనియే తలంపవల

యును. కాని తరువాత వచ్చిన ఆంధ్రమహీపతులు ఆంధ్రుల నౌకాబలమును పెంపొందింపజేసిరి. ఇక్ష్వాకులు, శాతవాహనుల మరపించు కీర్తిని నౌకాయానమున ఆర్జించిరి. ఆంధ్రసంతతివారే యైన పల్లవులు సముద్రములపై వీరవిహారము సల్పిరి. ౧౧-వ శతాబ్దము వరకుకూడ ఆంధ్రులు విదేశములతో విరివిగా వర్తకము చేయుచుండెడివారు. తూర్పుచాళుక్యుల సంతతివారైన శక్తివర్మ, రాజరాజుల బంగారునాణెములు ఆరకాను, సయాములలో దొరికినవి. ప్రాచీనకాలమునుండియు 'దిమిల' కళింగదేశమున ఒక ముఖ్యరేవుపట్టణముగా నున్నట్లు తోచుచున్నది. ఇది యలమంచిలికి ౩ మైళ్ల దూరములో నున్నది. ఇప్పుడిదొక కుగ్రామమే యైనను, పూర్వము చాల ప్రసిద్ధమైనది. ఇచ్చట గొప్ప దీపస్తంభము లుండెడివి. దివలు(లేక దీపములు)ఉండు చోటుగనుకనే 'దిమిల'అను పేరు కలిగినదని జనప్రతీతి గలదు. ఇది తూర్పుతీరమున ప్రయాణము చేయు నావలకు మార్గదర్శియై యుండెడిది. దశకుమారచరిత్రములో దండిమహాకవి ఆంధ్రుల ప్రచండ నౌకాబలమును, నౌకాసమరకౌశలమును గూర్చి చక్కగా వర్ణించినాడు. అందీవిషయముగూడ వర్ణింపబడియున్నది. "కళింగరాజగు కర్దనుడు వసంతకాలమున రాణివాసములతోను, పౌరులతోను సముద్రతీరమందలి యుద్యానవనమున ౧౩ దినములు క్రీడలు సల్పుచుండగా, ఓడలమీద పెక్కు రాణువలను దోడ్కొని వచ్చి యాంధ్రనాథుడగు జయసింహుడు వారినందరిని పట్టుకొని ఆంధ్రనగరికి గొనిపోయెను." ఈ నౌకలు 'దిమిల'నుండియే బయలుదేరినట్లు తెలియుచున్నది. దీనినిబట్టి చాళుక్యులకు గొప్ప నౌకాదళ ముండెడిదనియు, 'దిమిల' గొప్ప రేవుస్థలముగా నుండెడిదనియు తెలియుచున్నది.

క్రీ. శ. ౧౦౦౦-౧౫౦౦ కు మధ్య ఆంధ్రదేశమున రెండు ముఖ్యరేవుస్థలము లుండెడివి. అవి మచిలీపట్నము, మోటుపల్లి. ఇచ్చటినుండి వజ్రములును, మిక్కిలి మృదువై విలువగల వస్త్రములును విదేశములకు నెగుమతియగుచుండెడివి. ఇచ్చటి రాజులు విదేశవర్తకులను గౌరవముగాచూచి, వారికి తగిన సదుపాయములను చేయుచుండెడివారు. విదేశములలో తెనుగువర్తకులకుకూడ అట్టి ఆదరణాభిమానములే లభించుచుండెడివి. కాని దక్షిణహిందూదేశములోని రేవులలో ఆ కాలమున నొక దురభ్యాస ముండెడిది. విదేశీయులు ఏ రేవునకు పోదలచి ప్రయాణమైరో, ఆ రేవునకు పోయినయెడలనే వారికి గౌరవము జరుగుచుండెడిది. కాని ఒక రేవునకు పోవలసిన నావ వేరొక రేవునకు తుపానుగాలిచే తరిమి వేయబడినచో ఆ రేవులోనివారు నావలోని సరకుల నన్నిటిని దోచుకొనెడివారు. ఈ అలవాటు 'కాలికట్టు'లోతప్ప మిగత అన్ని రేవులలో నుండినట్లు తెలియుచున్నది. కాని ౧౨౪౪ లో గణపతిదేవమహారాయలు ఈ అలవాటును మోటుపల్లి రేవులో నిషేధించుచు, వర్తకుల కొక 'అభయశాసన' మిచ్చెను. విదేశములనుండి తమ దేశమునకును, తమ దేశమునుండి విదేశములకును పోవు వర్తకులందరకు మోటుపల్లి రేవులో దిగుట కవకాశమిచ్చి రక్షణయొసగెను. ఆ సంవత్సరమునుండియు రేవువద్దకు వర్తకమునకై వచ్చిన పన్నీరు, మంచిగంధము, కర్పూరతైలము, రాగి, తగరము, సీసము, సిల్కుదారములు, సువాసనద్రవ్యములు మొదలగు సరకులపై సుంకములు వసూలు చేయదొడగెను.

మధ్యయుగమున ఆంధ్రుల కీర్తిని నలుదిశలకు వ్యాపింపజేసినది విజయనగరసామ్రాజ్యము. స్వదేశవిదేశములయం దింతయెక్కువగా వర్తకవ్యాపారములు సల్పిన మరొక సామ్రాజ్యము దక్షిణహిందూదేశచరిత్రయందే కాన్పించదు. విజయనగరసామ్రాజ్యము తూర్పున చైనామొదలు పడమట పోర్చుగలువరకు నున్న దేశములతో రమారమి ౩౦౦ సంవత్సరములు నిరంతరాయముగా వర్తకవ్యాపారములు చేసినది. సామ్రాజ్యములో పడమటితీరమున కాలికట్టు ముఖ్యమైన రేవు. కాని దానితోసమానమగు మరి ౩౦౦ రేవులు విజయనగరసామ్రాజ్యములో నున్నట్లు అబ్దుల్ రజాక్ వ్రాసినాడు. వజ్రములు, మంచిముత్యములు, ఆభరణములు, గుఱ్ఱములు, ఏనుగులు, సిల్కుబట్టలు, పలురకముల నూలుబట్టలు, సువాసనద్రవ్యములు, మందులు, ఇనుము, వెండి మొదలగు అనేకరకముల సరకులతో నీ రేవులద్వారా వ్యాపారము జరుగుచుండెడిది. కృష్ణ

రాయలు మొదలగు కొందరు తుళువ వంశరాజులు సామ్రాజ్యములోని రేవుల నెక్కువగా నభివృద్ధిచేసిరి. విదేశములనుండి సరకులను రేవులోదింపుట కనుగుణముగా రేవులను బాగుచేయించిరి. హోనవరు (Honowar), బాటకల్లు (Batakal), బాకనూరు (Bacanore), మంగళూరు, కంబోలా (Cumbola), క్విలన్ (Quilon), కాయల్ (Kayal), నాగపట్నము మొదలగునవి విజయనగర సామ్రాజ్యమునందలి ఆంధ్రేతర భాగములోని ముఖ్యమైన రేవులు. ఆంధ్రదేశములో 'పులికోట' ముఖ్యమైన రేవు. ఇచ్చట మూరులు (Moors), హీదెనులు (Heathens) మొదలగు గొప్ప గొప్ప వర్తకు లుండెడివారు. పులికోట విజయనగరమునకు ముఖ్యమైన తూర్పుతీర రేవుపట్టణముగా నుండెనని దనిన అతిశయోక్తి కాదు. ఈ రేవునందు మూరుల నావ లెక్కువగా నుండెడివి. ఇచ్చటి సముద్రవ్యాపార మంతయు ౩ జాతుల వర్తకుల చేతులలో నుండెడిది. వారు (౧) పోర్చుగీసువారు, (౨) అరబ్బులు, (౩) స్వదేశీయులు. పడమటి దేశములతోటి వ్యాపారము రమారమి అంతయు పోర్చుగీసు, అరబ్బీ దేశస్థుల చేతులలో నుండెడిది. కాని తూర్పు దేశములతో వ్యాపారము ముఖ్యముగా స్వదేశీయుల వలననే సాగుచుండెడిది. పెగు, టెనాస్సరీము, మలయా ద్వీపకల్పము, ఆర్చిపెలగో, చైనా మొదలగు దేశములకు తెనుగువర్తకులు తరుచు పోవుచుండెడివారు. ఈవర్తకులలో రెండు రకము లుండెడివారు. వారు (౧) లబ్బిసాయిబులు, (౨) శెట్టిలు. తీర వ్యాపారమంతయు స్వదేశీయుల చేతులలోనే యుండెడిది. తూర్పుతీరమున మైలాపూరు కూడ నొక అభివృద్ధి జెందుచున్న రేవు. ఇచ్చటికి విదేశములనుండి సరకులు దిగుమతియగుచుండెడివి. ఈ రేవు ఎక్కువగా యాత్రికులకే ఉపయోగపడినట్లు కనబడు చున్నది. హరిహరరాయ, బుక్కరాయల కాలమున విజయనగర సామ్రాజ్యమున సముద్రవ్యాపార మెట్లుండినదియు శ్రీనాథుడు హరవిలాసములో విపులముగా వర్ణించియున్నాడు. ఆకాలమునాటి ప్రబంధముల లోని వర్ణనలనుబట్టికూడ విజయనగరమున నౌకాయాన మేస్థితిలో నుండెడిదో మనము గ్రహింపవచ్చును. ప్రబంధములలోని ఇట్టి వర్ణనలు చారిత్రిక ప్రమాణములు కాకపోయినను కవుల కాలమునాటి పరిస్థితులను తెలియజేయకపోవు.

విజయనగర రాజులు గొప్ప నౌకాదళములను కలిగి నౌకా సమరములనుకూడ చేసినట్లు కన్పడు చున్నది. పడమటితీరమున నున్న 'హోనవరు' రేవులో విజయనగర రాజుల కొక నౌకాదళ ముండెడిది. అది తిమ్మోజీ ఆధిపత్యమున నుండెడిది. అతని సోదరుడు రావుజీ సహాయముగా నుండెడివాడు. గోవా రేవులో నుండిన శత్రువులతో నిరంతరయుద్ధము చేయుటకు రాయలు వీరిని నియమించెను. (కృష్ణరాయల కాలమునాటివరకు గోవా మహమ్మదీయుల ఆధిపత్యమున నుండెడిది. తరువాత పోర్చుగీసువారి వశమయ్యెను) తిమ్మోజీ, రావుజీ సోదరు లిద్దరును హోనవరు రేవులో పెక్కు సాయుధరాణువులతో ౫, ౬ నావల నెల్లప్పుడు సిద్ధముగా నుంచెడివారు. మలబారు నావలు తప్ప మరెవరి నావలు సముద్రములో కనిపించినను వాటిని దోచుకొని వాటియందలి జనులను మాత్రము ప్రాణములతో విడిచిపెట్టెడివారు.

నవీనయుగమునందుకూడ ఆంధ్రులు నౌకానిర్మాణమునందును, నౌకాయానమునందును మిక్కిలి యుత్సాహమును, నేర్పును చూపి విదేశీయుల మెప్పును పొందిరి. మచిలీపట్టణమునుండి బంగాళాఖాతముద్వారా తూర్పన బెంగాలు, అరకాను, పెగు, సయాము, సుమత్రా, కొచ్చిన్ చైనా దేశములకును, పడమట మక్కా, మడగాస్కర్ మొదలగు స్థలములకును నావలు పోవుచుండెడివని 'ట్రావర్నియర్' (Travernier) ౧౬౭౬ న రచించెను. థామస్ బౌరే (Thomas Bowrey) అను ఆంగ్లేయుడు ౧౬౬౯-౧౬౭౯ లో హిందూదేశములో సంచారము చేసి బంగాళాఖాతముచుట్టు నున్న దేశములను గురించి కొన్ని ముఖ్యమైన విషయములను వ్రాసెను. అందతడు మచిలీపట్టణము చాల ప్రాముఖ్యముగల రేవు స్థలమనియు, అచ్చట విశేషముగ వర్తకము జరుగుచుండెడిదనియు, అచ్చటి స్వదేశీయులు నౌకాయానమునందు ప్రవీణులనియు, వారు తమ స్వంత

నావలపైనను, ఆంగ్లేయుల నావలపైనను కూడ సరకులను విదేశములకు రవానా చేయుచుండెడివారనియు వ్రాసెను. స్ట్రెన్నిషామ్ మాస్టర్ (Strennysham Master) డైరీలో చివరభాగమున మచిలీపట్టణము ననుసరించి వ్రాయబడియున్నది. అందు మచిలీపట్టణము చాల ప్రాముఖ్యముగు రేవుస్థలమనియు, అచ్చటినుండి ౨౦ తెరచాపలు గల పెద్దపెద్ద స్వదేశనావలు అరకాను, పెగు, టెనాస్సరీ, మలాక్కా, మోకా, పర్షియా, మాల్దీవులకు తిరుచు పోవుచుండెడివనియు వ్రాయబడియున్నది. డాక్టర్ ఫ్రయర్ (Dr. Fryer) అను ఆంగ్లేయుడు స్వదేశీయుల నావ నెక్కి మచిలీపట్నము వచ్చెను. అతడా నావ నీక్రింది విధముగా వర్ణించెను:

"It is as long as one of our ware-barges and almost of that mould sailing with one sail like them but paddling with paddles instead of spreads and carry a great burden with little trouble, out-living either ship or English skiff over the bar."

ఇచ్చటి స్వదేశీయులు నావలను చాల నేర్పుతో నిర్మించెడివారు. ఈ విషయమునుగూర్చి మేజర్ హెచ్. బీవెన్ (Major H. Beven) అనునతడు "Thirty years in India, ౧౮౦౮-౧౮౩౮" అను తన గ్రంథములో నిట్లు రచించెను:

"The Masula boat is admirably contrived to resist the impetus of the surf in the road sted of Madras. It is built of planks of wood and sewed together with 'sum' a species of twice and caulked with coarse grass-not a piece of iron being used in the entire construction. Both ends are sharp, narrow and tappering to a point so as easily to penetrate the surf."

౧౪ వ శతాబ్దము వరకు మిక్కిలి ప్రసిద్ధికెందిన ఆంధ్రరేవు పట్టణములలో ముఖ్యమైనది నరసాపురము. ఇది గోదావరినది దక్షిణపాయయైన వాశిష్టనదియొక్క పడమటిగట్టున నున్నది. ఇది మచిలీపట్టణమునకు ౪౦, ౫౦ మైళ్ల దూరములోను, సముద్రమునకు ౬ మైళ్ల దూరములోను నున్నది. వాశిష్టనది మిక్కిలి వెడల్పుగాను, లోతుగాను నుండుటచే పెద్దపెద్ద నావలు రేవును దాటికూడ నదిలో చాలదూరము పోగల్గుచుండెడివి. ఇచ్చట మంచిరకపు కలప యెక్కువగా దొరికెడిది. అందుచేత నావలను నిర్మించుటకును, మరమ్మతు చేయుటకును ఈ స్థలము తగియుండెను. బంగాళాఖాతము చుట్టు నున్న రేవులన్నిటిలో నిదే మిక్కిలి విశాలమైన దగుటచేతను, ఇచ్చట కలప, ఇనుపసామానులు మొదలగు నౌకానిర్మాణమునకు కావలసిన వస్తువులన్నియు విరివిగాను, చవుకగాను దొరకుటచేతను, నేర్పరులగు పనివారుండుటచేతను ఆంగ్లేయులును, ఇతరవిదేశీయులును గూడ ప్రతిసంవత్సరమును తమ నావల నిచ్చటనే మరమ్మతుచేయించుకొని, క్రొత్తనావలు కట్టించుకొనుచుండెడివారు. ౧౬౨౪ వ సం.న తూర్పు ఇండియా కంపెనీవారు తమ ఫేక్టరీని ఇచ్చటనుండి తీసివేసినవాటినుండియు ఈ రేవుయొక్క ప్రాముఖ్యము తగ్గిపోయెను. రాను రాను నదిలో నిశ్వరదలవలనను, ఇతర కారణములవలనను నరసాపురమునందలి పూర్వప్రకట్టనములును, రేవును నాశనమైపోయినవి. నది సముద్రములో సంగమించు స్థలమున ఇసుకమేటపడకుండ తగు జాగ్రత్త తీసికొనినచో నరసాపురము పెద్దపెద్ద నావలు నిలుచుటకు ముఖ్యమైనరేవుగా నుండగలిగెడిది.

౧౯ వ శతాబ్దమున తూర్పుతీరమున ప్రఖ్యాతిగాంచిన రేవులలో ముఖ్యమైనవి కాకినాడ, కోరంగి. కోరంగి(కొరింగ) కాకినాడకు ౬ మైళ్లదూరములో నున్నది. నేడు అనామకమైపోయినప్పటికిని పూర్వము మిక్కిలి ప్రాముఖ్యము కలిగియుండెడిది. కలకత్తాకును, ట్రింకొమలీకిని మధ్య పెద్దనావలు నిలచుటకిదియే ఉపయోగపడెడిది. కాని యిప్పు డచ్చటి నదిలో ఇసుకమేటపడి లోతు తగ్గిపోయినది. అందుచేత చిన్నచిన్న నావలుతప్ప పెద్దనావ లిచ్చటి కిప్పుడు పోలేవు. ౧౮౦౨ వ సం.న ఎబెనిజర్ రాక్ జర్

(Ebenezer Rocbuck) అను కోరంగినివాసి తన స్వంతధనము వెచ్చించి కోరంగివద్ద ఒక పెద్ద డాకు (Dock) కట్టించెను. ఈ డాకులోనికి ౧౪ అడుగుల కన్న ఎక్కువ లోతు మునగని రాయల్ నేవీలోని నావలన్నియు పోగల్గెడివి. ఈ డాకు జాతీయప్రాముఖ్యము వహించి ప్రజోపయోగముగా నుండుటను నూర్దికముతో రాక్‌బక్ దీని అభివృద్ధికై చాలధనము వెచ్చించెను. ఈ డాకుపొడవు ౧౫౧ అడుగులు. ఇందులోనికి ఎంతపొడుగైన నావలైనను పోగల్గెడివి. దీని అడుగుభాగము వెడల్పు ౫౧ అడుగులు. పైభాగము వెడల్పు ౭౬ అడుగులు. నీటి అడుగున కట్టెను పెద్ద రాళ్లతోను, ఇటుకలతోను కట్టబడి ౫ అడుగుల దళమున్నది. ఈ డాకునకు ౪౭ అడుగుల వెడల్పుగల ఫ్లోటింగుగేటు (Floating gate) ఉండెడిది. గేటువద్ద నేపవిలో ౧౬త్తు, లేక ౧౪ అడుగుల నీరుండెడిది. మిగిలిన సంవత్సరమునందంతను ౧౪, ౧౫ అడుగుల నీరుండెడిది. ఈ డాకు నౌకానిర్మాణమునకు చాల ప్రసిద్ధిచెందియుండెడిది. 'H. M. S. Albatross'కును, మరికొన్ని పెద్దనావలకును ఈ డాకులోనే మరమ్మతులు చేయబడెను. కాని కోరంగివద్ద నది వంపుతిరిగి సముద్రములో కలియుటచేత ప్రతిసంవత్సరము రేవు వద్ద ఒండ్రుమట్టిమేటపడి, లోతు తగ్గిపోయెడిది. ఆ కారణముచేత రానురాను ఈ రేవు ప్రాముఖ్యము తగ్గి, నేడు పెద్ద నావల కిది నిరుపయోగమయ్యెను. కోరంగివద్ద నదిని తిన్నగా సముద్రములో పడునట్లు చేసినచో, రేవులో ఒండ్రుమట్టి మేటపడదనియు, అప్పుడు రేవుకు చాల ప్రాముఖ్యము వచ్చుననియు, ఇది ప్రభుత్వము చేయతగ్గ పనియనియు సర్ చార్లెస్ ట్రెవిలియన్ ౧౮౦౨ లో కాకినాడవచ్చి, ప్రభుత్వమునకు సిఫారసుచేసినాడు. కాని మద్రాసు ప్రభుత్వము కోరంగి రేవు నభివృద్ధిచేయుటకంగీకరించలేదు. అదే సంవత్సరమున సర్ ఆర్థర్ కాటన్ కోరంగిరేవుయొక్క ప్రాముఖ్యమును తెలియజేయుచు, దానిని తప్పక అభివృద్ధిచేయవలయునని ఒక మెమోరాండము మద్రాసు ప్రభుత్వమునకు పంపెను. కల్నల్ రెండల్ అనునతడు ఆ రేవు నెట్లు అభివృద్ధిచేయవలయునో కూడ విపులముగా తెలియబరచెను. కాని ప్రభుత్వమేమియు చర్యతీసికొనలేదు.

ఇట్టి అద్భుతమగు ప్రాచీనచరిత్ర గలిగిన ఆంధ్రులు నేడు నామమాత్రావశిష్టులై యుండుట విషాదకరమగు విషయము. భావికాలమున ఆంధ్రులు తిరిగి ప్రాచీనాన్నత్యము పొందగలుగుదురని ధైర్యముకలుగుచున్నది. మేఘావిష్కృతుడైన ఆంధ్రభాను దర్శించెనని చెప్పగూడదుగదా!



# గొల్ల హంపన్న

[ కథ ]

•

= 'జమదగ్ని' =

రైలు వచ్చే వేళ అయిందని అప్పుడే హంపన్న ఇవతలి గేటు వేశాడు. రెండో గేటు వెయ్యబోతుండగా 'ఉండన్నా ఉండు' అంటూ ఆడగొంతు వినిపించింది.

ఎవరా అని హంపన్న తలెత్తిచూచాడు. ఎవరో ఇద్దరు స్త్రీలు గేటువైపుకు, దేనికో భయపడిపోయినట్లు, పరుగెత్తుకువస్తున్నారు. హంపన్న నీరై నిలబడిపోయాడు. అయిదునిమిషాలు కాలేదు. ఆ ఇద్దరూ గేటుదగ్గరకు రానేవచ్చారు. ఎంత భయపడిపోయారో ఏమో, నోటివెంబడి మాటలేక ఒకమాటు హంపన్న వంకకూ, మరొకమాటు రోడ్డువైపుకూ చూస్తూ గజగజలాడిపోతున్నారు. హంపన్న ఇటు వీళ్ల వంక చూచాడు. గుండె ద్రవించిపోయింది. అటు రోడ్డువంక చూచాడు. వచ్చిన కోపంతో, పట్టుదలతో గుండె రాయి అయిపోయింది. దభీమని గేటు నొక్కి తాళం వేశాడు. ఆ స్త్రీల కిద్దరికీ తన షెడ్డు చూపించాడు. వాళ్లను లోపలికి వెళ్లి తలుపు వేసుకోమన్నాడు. తాను బయట తాళం వేశాడు. ఏమీ ఎరగనట్లు జెండాలు పుచ్చుకుని షెడ్డు కిరవైగజాల దూరంలో రైలుకోసం ఎదురుచూస్తూ నిల్చున్నాడు.

పది నిమిషాలు కాలేదు. నేల అదిరేటట్లు నడుస్తూ, ఒళ్లు తెలియని కేకలు వేస్తూ అరడజనుమంది తెల్లసోల్జర్లు గేటుదగ్గరకు వచ్చారు.

అప్పుడే సూర్యాస్తమయం అవుతోంది. పోతూ పోతూ సూర్యుడు చూపుకందినంతవరకూ జగత్తంతా రక్తవర్ణమయం చేస్తున్నాడు. హంపన్న అటువైపే చూస్తున్నాడు.

గేటు తాళంవేసిఉండడం చూసి ఒకరి తరువాత ఒకరుగా గేటు దూకేశారు సోల్జర్లు. వాళ్లల్లో ముందుదూకిన సోల్జరొకడు తెల్లగా, పొట్టిగా, ఎఱ్ఱని కళ్లతో, ముడిచిన బొమలతో మహాక్రూరంగా ఉన్నాడు. ఎప్పుడన్నా గట్టి చెంపదెబ్బ తిన్నాడో ఏమో ముఖం కొంచెం వంకరతిరిగింది. అతగాడు అమాంతం ఒక్క అంగలో షెడ్డుదగ్గరకు వెళ్లాడు. తాళం వేసిఉంది. పళ్లు పటపట కొరుకుతూ హంపన్నవైపు చూచాడు. హంపన్న అస్తమయ సూర్యునివంకే చూస్తున్నాడు. పక్షుల అరుపులు వింటున్నాడు. ఇతని నిర్లక్ష్యాన్ని సహించలేకపోయాడు సోల్జరు. బూటుకాలు నేలకేసి గట్టిగా కొట్టి ఒక్కదూకున వెళ్లి పదిగజాల్లో పడిఉన్న పెద్ద రాయి చేత్తో పుచ్చుకున్నాడు. కాలు కదపకుండా కళ్లు అటూ ఇటూ తిప్పిచూస్తున్న హంపన్న హడిలిపోయాడు. గాలితాకిన లేతవెదురు మొక్కలా గజగజలాడిపోయాడు.

ఒక్కనిమిషం కాలేదు. షెడ్డుతాళం తప్పుమని పగిలిపోయింది. హంపన్న గుండె పగిలినంత పని అయింది. మరునిమిషంలో ఆరురెళ్లు పన్నెండు కాళ్లూ తలుపును తన్నడం మొదలుపెట్టాయి. హంపన్నకు తన ఱొమ్మెక్కి తొక్కుతున్నట్లనిపించింది. ఇంతవరకూ చూచింది చాలు. ఇక ఆగలేకపోయాడు. చేతిలో జెండాలు రెండూ దూరంగా పారేశాడు.

పక్కనున్న చిక్కడుపాదు స్తంభం లావుపాటి వెదురు బొంగు ఒక్క ఊపున లాగేశాడు. తాను ఎదుర్కోబో తున్నది సాయుధులైన ఆరుగురు తెల్లపోల్జర్లను, తానేమో వంకీమాత్రసాయుధుడైన ఏభైఏళ్ల ముసలి తొక్క. ఈ తారతమ్యజ్ఞానం ఆ క్షణంలో అతనిలో పూర్తిగా నశించింది. వీరాంజనేయం ఆవేశించినట్లు వెళ్లిపడ్డాడు పోల్జర్లమీదికి. హంపన్న వచ్చిన దూకుడుకు నిశ్చేష్టులై, ఆరుగురు పోల్జర్లూ తమ నాయకుడు వచ్చి ఆగండన్నట్లు ఆగిపోయారు.

ఆ నిశ్శబ్దంలో తీవ్రాతితీవ్రమైన అబలల రోదన ధ్వని వినిపించింది. అది వినపడడం హంపన్న ఆవేశాగ్నికి ఆజ్యం పోసింది.

ఒకనిమిషం- కాదు అరనిమిషం వ్యవధిఉన్నా ముందున్న వక్రముఖంమీద వెదురుబొంగు పడిపోయేదే! కాని హంపన్నఅడుగు అణుమాత్రం కదిలిందో లేదో - ముందున్న పోల్జరుచెయ్యి పక్కజేబులోంచి పైకి వచ్చింది.

అంత ఆవేశంతో వచ్చిన హంపన్నా 'రామా' అంటూ కూలబడిపోయాడు.

గుండు పేలడం, హంపన్న ఏడ్పుగొంతు వినిపించడం తడవుగా లోపల ఉన్న స్త్రీలిద్దఱూ తలుపులు తెరుచుకు బైటికివచ్చారు.

వెనకనుంచి సమీపిస్తున్న రైలుచప్పుడు విని ఆరుగురు పోల్జరూ ఆ ఆడవాళ్ల వంక అతికరుకుగా ఒక్కమాటు చూచి ఒక్క అంగన రైలుకట్ట దాటి జొన్నచేలల్లో బడి మాయమైపోయారు.

తమ మానం రక్షించడానికి తన ప్రాణానికి తెగించిన హంపన్నమీద పడి ఆ స్త్రీలు ఇద్దఱూ గొల్లున గోలపెట్టారు.

చిక్కడుపాదుమీద పడి వేలాడుతున్న ఎఱ్ఱ జెండా చూచి రైలు గేటుదగ్గఱ ఆగిపోయింది.

తొడలోనుండి నెత్తురు కారుతూ గిలగిల కొట్టుకుంటున్న హంపన్నను చూచి రైలు దిగి గార్డు ప్రథమ చికిత్స చేశాడు.

అంతకుముందు హంపన్న కేతోదూ లేదు. ఇప్పుడో? వేలకొలది రైల్లో జనమందఱూ అతని చుట్టూ మూగిఉన్నారు.

రైలుగార్డు హంపన్ననూ, ఆ స్త్రీలనూ రైల్లో ఎక్కించుకుని గుంటకల్ చేర్చాడు.

౨

హంపన్న గుత్తికాపురస్థుడు. అతడప్పటికి భార్యాబిడ్డల్ని పోల్పోయి ఏకాకి అయిపోయాడు. కొద్దో గొప్పో తనకు చేతనైనంతలో లోకోపకారం చేసి మంచివాడనిపించుకుంటున్నాడు. అనవసరంగా ఏ విషయంలోనూ జోక్యం కలిగించుకోకుండా కాలక్షేపం చేసేవాడు.

అట్లాంటి హంపన్నను మిలిటరీపోల్జర్లు కాల్చారన్న వార్త వాయువేగమనోవేగాలతో ఇటు గుత్తిలోనూ, అటు గుంటకల్లులోనూ అరగంటలో అల్లుకుపోయింది.

ఆనాడు గుంటకల్లుస్టేషనులో ఎక్కడలేని జనమూ పోగయారు. ప్రతివారూ హంపన్నదుస్థితిని చూచి అయ్యోపాపం అని జాలిపడుతున్నారు. జరిగిన సంగతి తెలిసిన కొందఱు హంపన్నధైర్యాన్ని ప్రశంసిస్తున్నారు. మఱికొందఱు అంత మంచివాణ్ణి హింసించిన ఆ పోల్జర్ని నిందిస్తున్నారు. హంపన్నమాత్రం అతినీరసస్థితిలో ఉన్నాడు.

హంపన్నకేసు విచారించవలసిన బాధ్యత రైల్వే పోలీసువారిమీద పడింది. హంపన్న నడిగితే ఎవ్వరో పోల్జరు కాల్చాడని చెప్పాడు.

గుంటకల్లుస్టేషనుకు దగ్గఱలో ఇప్పుడున్న ట్రావెలర్స్‌బంగళా పూర్వం మిలిటరీభవనంగాఉండేది. దానికి సమీపంలో ఆరోజుల్లో బెంగుళూరునుంచి సికింద్రాబాదు వెళ్తున్న సైనికపటాలం ఒకటి విడిసి ఉంది. ఆపటాలం పటాలం ఆరాత్రే సికింద్రాబాదు వెళ్లిపోతుంది. అందుచేత రైల్వేపోలీసువారు మఱీ తొందఱపడవలసివచ్చింది.

హంపన్నను ప్లాటుఫారముమీదే ఒక కుర్చీలో కూర్చోబెట్టారు. ఆ పోల్జర్లనందఱినీ స్టేషనుకు రప్పిం

చారు. ఒకరితరువాత ఒకరుగా మెల్లగా హంపన్నకు ముఖం చూపిస్తూ అతని ముందుగా నడవమన్నారు. హంపన్న అంత నీరసస్థితిలోనూ వాళ్లవంక జాగ్రత్తగానే చూచాడు. మొత్తం పోల్జర్లు అయిదువందల మంది. అందఱూ ఒకేవిధమైన మిలిటరీ వేషాల్లో ఉన్నారు. హంపన్నకు తన్ను కొట్టిన పోల్జరుముఖం బాగా జ్ఞాపకంగానే ఉన్నది. వక్రముఖం, పొట్టి శరీరం, చెవిమీద పచ్చపొడిచిన పిలువగుర్తూ, ఎఱ్ఱని కళ్లూ అన్నీ గుర్తున్నాయి. కాని అప్పటి ఆ నీరసస్థితిలో ప్రాణనిర్వాణసమయం ఆసన్నమవడంచేతనో ఏమో అతని కళ్లకు అందఱూ ఒకలాగే కనిపించారు. ఫలానివా డని చూపలేకపోయాడు హంపన్న.

ఇదంతా అయ్యేటప్పటికి హంపన్న నీరసస్థితి మఱింత విషమించింది. ఇక లాభం లేదని పోలీసు అధికారులు అతన్ని ఆస్పత్రికి తీసుకుపోయారు.

ఆరాత్రే రైలెక్కి మిలిటరీపోల్జర్లందఱూ సికింద్రాబాదు వెళ్లిపోయారు.

ఆమఱునాడే తన జీవితం పరోపకారంతో ఫలవంతం చేసుకున్న హంపన్న అంతిమనిశ్వాసం విడిచాడు.

డాక్టరు అతని తొడలోనుండి పిస్తోలుగుండు బైటికి తీశాడు. ప్రజలు యావన్మందీ హంపన్న కొఱకు దుఃఖించి సగౌరవంగా అతని మృతశరీరానికి ఖననసంస్కారం చేశారు.

అన్యాయంగా హంపన్నను చంపిన ఆపోల్జరు సికింద్రాబాదులో స్నేహితులతో హుషార్ అనుభవిస్తున్నాడు.

3

తప్పో ఒప్పో ఏపని చేసినా ఫలితంమాత్రం తప్పదు. నిప్పులో చెయ్యి పెడతాం, చెయ్యి కాలి తీరుతుంది. "అయితే రోజూకు లక్ష అబద్ధా లాడతాం, ఏమీ జరగదేం!" అని అనుకోగూడదు. దానికీ ఫలితం ఉంటుంది. కాని అది వెంటనే కనబడకపోవచ్చు.

హంపన్న తన్ను ఆశ్రయించిన అనాథస్త్రీల మానసంరక్షణకోసం తన ప్రాణా లొడ్డి సాహసించాడు. తత్ఫలితంగా గుండుదెబ్బ తిని యమయాతన పడ్డాడు. తుచ్ఛమైన తన కామాగ్నికి ఇంధనం కావలసిన స్త్రీలను రక్షించడానికి పూనుకున్న హంపన్నను ఆ తెల్లపోల్జరు పిస్తోలుతో కొట్టాడు. తత్ఫలితంగా అతని కసి తీరింది. అతని ఆచోకీ ఎవరికీ తెలియలేదు. పనుల్నీ, ఫలితాల్నీ లోకం ఇంతమాత్రంగానే సమన్వయించుకుంటుంది. ఈ స్థూలసమన్వయంలోనే అధర్మారంభం ఉన్నది.

రైలుగేటుహంపన్న మృతివార్త పత్రికల్లో కూడా పడింది. ఇంత మహాప్రపంచంలో ఎంతమందో అనేకకారణాలవల్ల చస్తూఉంటారు. ప్రతివానిచావూ అందర్నీ ఆకర్షించదు. కాని హంపన్నమరణం ఆబాలగోపాలం లోకాన్నంతటినీ ఆకర్షించింది. ఆ ఆకర్షణ హంపన్న చేసిన త్యాగాన్ని హర్షించి కాకపోవచ్చు. నిరాయుధుడైన ఒక సామాన్యపౌరుణ్ణి సాయుధుడైన యుద్ధభటుడు కాల్చిపారెయ్యడం సహించలేక కావచ్చు. ఏమైతేనేం, హంపన్నచావు ప్రభుత్వాధికారుల దగ్గఱనుండి గేటుకీపర్లవఱకూ ప్రతివార్నీ కదిలించివేసింది.

అప్పట్లో మదరాసుప్రభుత్వానికి ముఖ్యకార్యదర్శిగా (Chief Secretary) సర్ హెన్రీ స్టోన్సు దొరగారు పనిచేస్తున్నారు. ఆయన ఈవార్త చదివి ద్రవించిపోయాడు. ఇటువంటి అన్యాయాలు ఏమాత్రమూ ఉపేక్షింపబడగూడ దనుకున్నాడు. సక్రమమైన విచారణ జరపాలని వెంటనే పోలీసధికారుల నాజ్ఞాపించాడు.

రాజు తలుచుకుంటే దెబ్బలకు కొదవా? ఇదివఱకు ఏదో లాంఛనప్రాయంగా నడిపించి తోసిపారేసిన హంపన్నకేసును అధికారుల ఆజ్ఞతో పోలీసువారు తిరిగి తీసుకుని విచారణ సాగించవలసివచ్చింది. దెబ్బతిన్న హంపన్న చచ్చిపోయాడు. ఏ పోల్జరు కాల్చాడో గుర్తుపట్టలేకపోయాడు. వేఱే సాక్ష్యమేమైనా ఉందా అంటే లేదు. తాడూ లేదు, బొంగరమూ లేదు. ఇంకేమిటి తిప్పడం?

అయితే ఏం? అధికారుల ఆజ్ఞ! పోలీసువారు ఊరుకోవడానికి వీల్లేదు. గుత్తి పోలీసు డిప్యూటీ ఇన్స్పెక్టరుజనరలు సపరివారంగా గుంటకల్లు పరుగెత్తుకువెళ్లాడు. ఆ పోల్జరు తన రివాల్వరు ఆ గేటు సమీపంలో ఎక్కడైనా పారేశాడేమో నని చుట్టుపక్కల పొదలూ, దుబ్బులూ సమూలంగా నాశనంచేసి వెదికారు. జొన్నచేలల్లో కాలిదార్లవెంబడి పోయి అటూ ఇటూ బహుశ్రద్ధగా పరిశోధించారు. సమీపంలో ఉన్న గుంటల్లో నీళ్లు తోడించి బురద కెలికించి గాలించారు. ఎక్కడా దాని పొడ కనిపించలేదు. కనిపించలేదని ఊరుకోడానికీ వీల్లేదు. ఏమిటి చెయ్యడం?

అపరిస్థితుల్లో గుత్తిఇన్స్పెక్టరుకు ఒకేఒక ఆధారం కనిపించింది. అది హంపన్న తొడలోనుంచి బైటికి తీసిన గుండు. దాన్ని తీసుకుని ఆయన పోలీసు సూపరింటెండెంటుతో కలిసి బెంగుళూరు వెళ్లాడు. మామూలుగా గుండునంబర్నిబట్టి దాని పిస్తోలు ఏషాపులో ఎవరు కొన్నదీ పట్టుకోవచ్చు. కాని ఆ మహాపట్టణంలో ఏషాపని వెతకడం? అయినా ఆజ్ఞాతీవ్రతనుబట్టి వెతికివెతికి వేసారిపోయారు. చిట్టచివరకు స్టోప్పుదొరవారి మనోనైర్మల్యం స్పష్టం చెయ్యడానికో అన్నట్లు ఇన్స్పెక్టరుఅన్వేషణ ఫలించింది. ఆనంబరుపిస్తోలును వెల్లింగ్టనులో ఒక షాపువారు అమ్మినట్లు ఆచోకీ దొరికింది. అక్కడి పాతక్రయపత్రాలు తిరగదోడారు. ఆపిస్తోలును కొన్నది ఒక పోల్జరు. పేరు మిస్టర్ అప్. ఇంకేముంది? హంతకుడు పట్టుబడిపోయినట్లే అనుకున్నాడు పోలీసు ఇన్స్పెక్టరు.

ఏమాత్రం ఆలస్యం చెయ్యకుండా సరాసరి సికింద్రాబాదు వెళ్లిపోయారు పోలీసువారు. మిలిటరీ కేంద్రంలోనుంచి మిస్టర్ అప్‌ను పిలిపించారు. వెంటనే అరెస్టుచేసి అడిగారు. గుంటకల్ దగ్గర రైలుగేటు కాపలావాణ్ణి కాల్చింది నిజమేనని ఒప్పుకున్నాడు మిస్టర్ అప్. కాని తన ప్రాణం రక్షించుకోవడం కోసం కాల్చా నన్నాడు.

అయితే ఏం!? ఆమాత్రం చాలు.

పోలీసువారు మిస్టర్ అప్‌ను రెండవతరగతి పెట్టెలో ఎక్కించి తీసుకుపోయి మదరాసుజిల్లా మేజిస్ట్రేటుసమ్ముఖంలో నిలబెట్టారు.

## ౪

కాల్చిన పోల్జరు చిక్కడం, ఈకేసు హైకోర్టులో విచారింపబడుతూ ఉండడం చనిపోయిన హంపన్నకు లౌకికంగా ప్రజల దృష్టిలో అత్యధిక ప్రముఖస్థానాన్ని కల్పించాయి. అటు మదరాసులో నేమి, ఇటు గుత్తిగుంటకల్లుల్లో నేమి ప్రతివారూ హంపన్నకేసు ఫలితాలకోసం అతిఆతురతతో ఎదురు చూస్తున్నారు.

అక్కడ హైకోర్టులో ప్రాసిక్యూషనువారు తమకు కావలసిన సాక్ష్యమంతటినీ సేకరించి దాఖలు చేశారు. ఏ స్త్రీల మానాన్ని రక్షించడంకోసం హంపన్న ప్రాణత్యాగం చేశాడో ఆస్త్రీల నిద్దరినీ కూడా హాజరుపెట్టారు. వారిదగ్గర వాఙ్మూలాలు పుచ్చుకున్నారు. అవి దాఖలుచేశారు. హంపన్న సాధారణంగా ఎవరిజోలికీ పోడనీ, కాని అధర్మం ఏమాత్రం సహించనివాడనీ, చాలా అణకువగలవాడనీ అతని సత్ప్రవర్తనను తెలియజేసే ఉల్లాపులు అతన్ని ఎరుగున్న పెద్దపెద్ద ఉద్యోగులదగ్గర సంపాదించి వాటిని కూడా దాఖలుచేశారు. మిస్టర్ అప్ కాల్చానని ఒప్పుకుంటూనే ఉన్నాడు. కేసుఫలితం కళ్లకెదురుగుండా కనపడుతోంది. ఇంకే మక్కఱలేదని నిశ్చింతగా ఉన్నారు.

ప్రాసిక్యూషనువారు ఇంత చేస్తుంటే డిఫెన్సు వారుమాత్రం ఊరుకున్నారా? వారూ ఊరుకోలేదు. హంపన్న మిస్టర్ అప్‌ను కొట్టవచ్చాడని ఋజువు చేసేందుకు కావలసిన ప్రయత్నాలన్నీ వారూ చేశారు. సాక్ష్యానికి ఆ నాడు మిస్టర్ అప్‌తో ఉన్న పోల్జర్లను కూడా రప్పించారు.

ఇక విచారణ ప్రారంభం అవుతుంది; ఫలితం బయటపడుతుంది.

అంతలో గుత్తిలో పెద్దలకు ఒక ఆలోచన తట్టింది. ఇరువురు దిక్కులేని స్త్రీల మానాన్ని రక్షించ

దానికి ప్రాణత్యాగం చేసిన హంపన్న స్మృతిచిహ్నం ఒకటి ఎందుకు స్థాపించకూడదూ అని. తట్టిందే తడవుగా ఆ ఆలోచనను ఆ పెద్దలు నలుగురికీ తెలియ చేశారు. ప్రజలందఱూ దాన్ని విని హర్షించారు. యూరోపియనులూ, భారతీయులూ వారూ వీరూ అని విచక్షణలేకుండా ప్రతివారూ హంపన్న ధర్మవీరాన్ని ప్రశంసించి అతని స్మృతిచిహ్నస్థాపనకు వారికి వారికి తోచినట్లు సహాయం చేశారు. తలపెట్టిన వేళావిశేషం వల్ల అతడు దెబ్బతిన్న చోటుకు సమీపంలోనే స్థలం దొరికింది. కొనడం, రిజిస్టరు చెయ్యడం అన్నీ అయిపోయాయి. ఇక సమాధికట్టడమే తరవాయి.

అక్కడ హైకోర్టులో విచారణ ప్రారంభమయింది.

డిఫెన్సువారు అప్పటికప్పుడు అల్లి ప్రచురించిన కథతో ప్రాసిక్యూషనువారి బందోబస్తు పటాపంచలయిపోయింది.

హంపన్న కిందపడ్డప్పుడు అతని పక్కన వెదురుబొంగు పడిఉన్నది. దానికి రైలుగార్డు సాక్ష్యం. ఆ వెదురుబొంగుతో హంపన్న ఇద్దఱుముగ్గుఱు సోల్జర్లను కొట్టాడుకూడాను. దీనికి ఈ సోల్జర్లు ఇద్దఱి వీపులమీదా ఉన్న దెబ్బలు సాక్ష్యం. హంపన్న అంతలావు వెదురుబొంగు తీసుకుని కొట్టరావడంవల్ల మిస్టర్ ఆష్ తన్నూ, తన మిత్రులనూ రక్షించుకోవడానికి ఇంకేదిక్కూ తోచక పిస్తోలు ఉపయోగించవలసివచ్చింది. అసలు హంపన్నకూ, సోల్జర్లకూ సంబంధం ఏమిటి ? ఈ సోల్జర్లు గేటుదగ్గఱకు ఎందుకు వెళ్లారు ? హంపన్న వీళ్ల నెందుకు కొట్టడానికి వచ్చాడు ? వీటన్నిటికీ సమాధానంగా వెనక చాలా కథ ఉన్నది. ఈ సోల్జర్లు గుంటకల్లు స్టేషనుకు దగ్గఱున్న మిలిటరీక్యాంపుకు వచ్చిన రోజునుంచీ హంపన్న అక్కడకు వచ్చివెళ్లుతుండేవాడు. ఈ సంఘటన జరిగిన రోజు క్రితంరోజుకూడా వచ్చివెళ్లాడు. అతడు చెప్పినదాన్ని నమ్మి ఈ సోల్జర్లు ఆ గేటుదగ్గఱకు ఆ రోజున వెళ్లవలసివచ్చింది. తీరా వెళ్లితే అతను మాటతీ భావకుమనిషి అయినాడు. పావలాచొప్పున ఇద్దఱుగాని రండి అని పిలిచినవాడు రూపాయిచొప్పున ఇస్తేగాని వల్లగాదన్నాడు. ఇంతలో మాటతప్పి ఇతనితో లెక్కేమిటని సోల్జర్లు తమంతట తామే షెడ్డు తలుపులు తెరవబోయారు. దాంతో కోపం వచ్చి హంపన్న కఱ్ఱ తీసుకుని వీళ్లమీద పడ్డాడు. ఒకరిద్దఱిని కొట్టనూ కొట్టాడు. హంపన్న అప్పుడు బాగా తాగి ఉన్నాడు. అతని రౌద్రం చూస్తే ఎంతమందినైనా చంపేసేటట్టున్నాడు. అందుచేత తప్పనిసరి అయి మిస్టర్ ఆష్ కాల్చవలసివచ్చింది. ఇందులో మిస్టర్ ఆష్ తప్పేమీ లేదు.

ప్రాసిక్యూషనువారు వాదించారు. ఆ స్త్రీలలో ఒక ఆవిడ అరవైఏళ్ల ముదుసలి ముత్తైదువ. ఆమె గుగ్గిళ్లు అమ్ముకుని గౌరవంగా బతికే మర్యాదస్థురాలు. రెండవ ఆమె ఇరవైఅయిదేళ్ల జంగాలపడుచు. వివాహిత. ఇద్దఱు పిల్లల తల్లి. భర్త వ్యవసాయదారుడు. ఇంట్లో ముదుసలి అత్తకు పిల్లల నప్పగించి వేఱే తోడు లేనికారణాన జొన్నచేనులో పిట్టలు తోలటానికి పొలానికి వస్తూ ఉంటుంది. హంపన్నను వీళ్లిద్దఱూ ఎరుగుదురు. రోజూమాదిరే ఆ రోజునకూడా రోడ్డువెంబడి ఊళ్లోకి వెళ్లుతుంటే ఈ సోల్జర్లు వెంబడి పడ్డారు. వీళ్లిద్దఱూ భయపడి పాఱిపోయి హంపన్న శరణు చొచ్చారు. హంపన్న వీళ్లను తన షెడ్డులో దాచాడు. హంపన్న ఇటువంటి దుష్ప్రవర్తన కలవాడని ఎక్కడా సాక్ష్యంలేదు. అతడు తాగుతాడన్న మాటకూడా శుద్ధ అబద్ధం. కూటికిలేనికారణాన గుణానికి తక్కువని గౌరవంకల స్త్రీలను అవమానించడం అసమంజసం. అందులో ఒకతె అరవైఏళ్ల ముసలిది. వీళ్లు లోపల తలుపువేసుకునిఉండగా తలుపు పగలగొట్టడానికి ఈ సోల్జర్లు ప్రయత్నంచేశారు. బయట వేసిన తాళంగూడా పగలగొట్టారు. ఇదుగో తాళం ఇక్కడనే ఉన్నది. హంపన్న కఱ్ఱ పుచ్చుకుని బెదిరించినమాట వాస్తవం. అతడు కొట్టాడన్నమాటే నిజమైతే రెండునెలలక్రితం కొట్టిన దెబ్బలు ఇప్పటివఱకూ ఉండడం అసంభవం. ఇవి ఇటీవల మఱెక్కడో తిన్న వాపులై ఉండాలి. ఇటు హంపన్న ప్రవర్తనను చూచినా, అటు ఆ స్త్రీల గౌరవాన్ని గమనించినా డిఫెన్సువారి వాదం అంతా అభూతకల్పనగా కనిపించక

తప్పదు. అందుచేత మిస్టర్ ఆవ్ తన తుచ్ఛమైన కామ తృప్తికి అడ్డువచ్చిన హంపన్నను అన్యాయంగా కాల్చాడు అని మా దృఢమైన విశ్వాసం.

ప్రధాన న్యాయమూర్తులు కాలిన్సదొరవారు ఉభయవాదాలూ విన్నారు. తరువాత నిర్ణాయక సంఘానికి డిఫెన్సువాదంపైవు మొగ్గచూపుతూ కేసువివరాలన్నీ క్రోడీకరించి చెప్పారు.

నిర్ణాయకసంఘంవారు న్యాయస్థానముఖాన మిస్టర్ ఆవ్‌ను పూర్తిగా నిర్దోషునిగా ప్రకటించారు.

ఈతీర్పు విని మదరాసుప్రజలు 'అన్యాయం అన్యాయం.' అని పేనోళ్ల గోడిగారు. మరికొందరు దైర్యవంతులు "ఇది కేవలం జాతిపక్షపాతం" అని పత్రికల్లో విమర్శించారు.

ఈతీర్పు నత్తిప్రజలకు తేరకముందే అక్కడ హంపన్నస్మృతిచిహ్ననిర్మాణం పూర్తిఅయిపోయింది. "ఈసమాధిలో ఇరువురు దిక్కులేని స్త్రీల మానాన్ని రక్షించే ప్రయత్నంలో ౧౭౫౩-వ సంవత్సరము అక్టోబరునెల నాల్గవతేదీన ఒక యూరోపియనుఫోల్జరుచే పిస్తోలుతో కాల్చబడ్డ గొల్లహంపన్న శిస్టాస్థికలు ఉన్నాయి. యూరోపియనులచేతా, భారతీయులచేతా ప్రశంసింపబడిన ఆ పుణ్యాత్ముడు అమరుడూ నాడే దివంగతుడైనాడు" ఈ అర్థాన్ని తెలియజేసే ఆంగ్ల వాక్యాలు చెక్కిన శిలాఫలకం దానిమీద స్థాపించారు.

౫

మూడేళ్లు గిఱ్ఱున తిరిగాయి.

సమాధి మొదట స్థాపించిన చోటనే ఉన్నా హంపన్నమాత్రం ఎవరికీ జ్ఞాపకంలేదు. కాని ప్రజలందరూ ఆసమాధిదగ్గఱ ఎవడో భయంకరాకారుడు కనిపిస్తూఉంటా డంటారు.

ఆరోజు ఆకాశమంతా భయంకరంగా మబ్బులు కమ్మిఉంది. మార్తాండోదయం కాకుండానే అయిందన్న భ్రమతో పక్షులుగూడా గూళ్లు చేరుకోడానికి తొందఱపడి వెళ్లిపోయాయి. ఆ నిర్మానుష్యమైన ప్రదేశంలో హంపన్నసమాధి ఒక్కటే స్వచ్ఛాకృతి స్వచ్ఛమై అప్పుడప్పుడు వెలువడుతున్న సౌదామినీ నీరాజనాలతో ప్రకాశిస్తున్నది. భయపడేవారికి ఆశ్రయంలేదని బెదరించే ఆ ఆకాశంకింద అది ఒక్కటే ఆశ్రయమన్నట్లు దూరానికి కనిపిస్తున్నది.

కుండపోతగా వర్షం కురవడం మొదలుపెట్టింది. అయిదునిమిషాలలో అయిదు దుక్కుల వాన కురిసినట్లు కురిసింది. ఆ వానకు ఆ కొండనేలమీద మహాప్రవాహాలు వెల్లివిరిశాయి. గైరికధాతువులు కలవడంవల్లనో ఏమో అసిరు కదనభూమిని కడిగివస్తున్నట్లు తోచింది.

అతడెవరో సాయంవేళ వాహ్యాళికి బయలు దేరాడుకాబోలు, ఈవానలో చిక్కుబడిపోయాడు. తడిసి ముద్దఅయిన గుడ్డలతో, చంకకింది కఱ్ఱలతో నడవలేక నడవలేక నడుస్తున్నాడు. అతని అదృష్టవశాన ఈవానకు తోడు గాలే లేదుకాని లేకుంటే అంతకుముందెప్పుడో నేలమీదికి ఈడ్చికొట్టబడేవాడు. ఈ వానకైనా అతడు మంచి బలిష్ఠుడు కాబట్టి తట్టుకుని ఆ ఒంటికాలితోనే నడుస్తున్నాడు. గుండెల్లో ఏం బాధో పాపం, అప్పుడప్పుడు చంకకింది కఱ్ఱలతో చటుక్కున ఆగి చేతులతో గుండె నొక్కిపట్టుకుని దగ్గుతున్నాడు. పావుగంటనుండీ వానలో తడుస్తూ ఉండడంవల్ల కాబోలు దగ్గు మఱీ ఎక్కువయింది.

హంపన్నసమాధి రోడ్డుకు పక్కగా నాలుగు గజాల్లో ఉన్నది. అంతదాకా వచ్చి ఆవ్యక్తి ఇక అడుగు వెయ్యలేకపోయాడు. ఇంకా వాన కురుస్తూనే ఉన్నది. తల ఆడించి క్రాపింగుజుట్టులో నీళ్లు దులుపుకుంటూ అటూ ఇటూ చూచాడు- ఏమైనా ఆశ్రయముండేమోనని- దీనమైన దృక్కులతో. తల దాచుకోడానికి కాకపోయినా చతికిలబడడానికైనా యోగ్యమైన స్థలం అది ఒక్కటే కనిపించింది అక్కడ. నెమ్మదిగా కాళ్లీడ్చుకుంటూ పోయి దాని చుట్టు అరుగుమీద కూలబడ్డాడు.

ఆ సమాధిస్పర్శ అతని శరీరంలో అణువణువుకూ కదిలించివేసింది. వెఱ్ఱెత్తినట్లయి అటూ ఇటూ


నిజంగా అతను
లైఫ్ బాయ్
అభ్యాసము నేర్చుకున్నాడు
అతను స్కూలుకు వెళ్లినాడు. అక్కడనుంచి ఏమి తెస్తాడో? విజ్ఞానము, క్రొత్త పద్ధతులు—బహుశా ఏ అంటు వ్యాధులు వ్యాపింపచేసే క్రిములనో తెస్తాడు. తానునేర్పిన పద్ధతుల వలన తన కుమార్డు సురక్షితముగా వుండునట్లుచేసి వాని తల్లి వానిని స్కూలుకు పంపుతుంది — అన్నిటిలోకి ముఖ్యమైనదేమంటే, ఎంతబలవంతుడైన పిల్లవాడైనప్పటికి క్రిములవలని వ్యాధిగ్రస్తుడగుటకు కారణమైనటువంటి "మురికివలని అపాయము" నుండి రక్షించే లైఫ్ బాయి సబ్బును ప్రతిదినమూవాడటమే.
LIFEBUOY
SOAP
LIFEBUOY SOAP
లైఫ్ బాయ్ మంచి సబ్బుల్లోకి ఉత్తమమైనది
ఇది మంచి అలవాటు
L 78-23 TL
LEVER BROTHERS (INDIA) LIMITED

చూచాడు. అంతలో గుండెనొప్పి వచ్చి ఎడంచేత్తో గుండె నదుముకుంటూ సమాధివంక చూస్తున్నాడు. కనులు మిరుమిట్లుగొలిపే ఒక పెద్ద మెఱుపు మెఱిసింది. ఆ వెలుగులో దానిమీది 'గొల్లహంపన్న' అన్న పేరు కన్పించింది. అతని కుడిచెయ్యి అప్రయత్నంగా లేచి అతని నదురు పట్టుకుంది. ఎంతబాధ పడ్డాడో ఏమో అయిదునిమిషాలు అట్లాగే రాతిబొమ్మ అయిపోయాడు.

అంతలో మఱొక మెఱుపు మెఱిసింది. ఆ మెఱుపుతో అతనిలోకి కొంత చైతన్యం వచ్చింది.

ఆ చీకట్లో కుడిచేత్తో దేనికో తడిమిచూచాడు. ఏదో రాయిలా తగిలింది. కాని అది బొగ్గుముక్క. దాన్నే మహానందంతో తీసుకున్నా డావ్యక్తి. దాన్ని అట్లాగే చేత్తో పుచ్చుకుని ఎందుకో తీరని వ్యథతో ఎదురుచూచాడు.

మళ్లీ మెఱుపు మెఱిసింది. ఆ మెఱుపువెలుగులో అమాంతం కుడిచెయ్యి ఎత్తి, స్పష్టంగా కనిపించిన 'యూరోపియన్ సోల్జరు' అని వ్రాసి ఉన్నచోట పెట్టాడు. వెలుగుపోయింది. ఆ చీకట్లోనే దాన్ని కొట్టేసి, దానిమీదే ఏదో వ్రాయబోయాడు. A, S అని రెండక్షరాలు వ్రాశాడు. H అని కాబోలు మూడో అక్షరం సగం వ్రాసేటప్పటికే వెన్ను వాలిపోయి చెయ్యిజారిపోయింది.

మఱునాడు గుంటకల్లు మిలిటరీక్యాంపువారు అతని శవాన్ని తీసుకుపోయి మఱొకచోట పాతి పెట్టారు. ఆ నాటినుంచీ హంపన్నసమాధిదగ్గఱ ఎవరికీ ఏ భయంకరాకారుడూ కనబడడం లేదంటారు ప్రజలు.

[ఈ కథ ఇంచుమించు అంతా జరిగిందే. ఒక్క అయిదవభాగంలోది మాత్రమే నేను కల్పించింది. తక్కినదాన్ని హిందూరజతోత్సవసంచికలోని కేశవపిళ్ల గారి Last fifty years అన్న వ్యాసంనుండి సేకరించాను. హంపన్నసమాధి ఇప్పటికీ గుత్తిలో రోడ్డుకు పక్కగా మత్రోసత్రం సమీపంలో ఉన్నది.]



# పశ్చాత్తాపము

❀

— శ్రీ బెళ్లూరి శ్రీనివాసమూర్తి —

పక్షిగా, ప్రసవంబుగా, భావవీచి
గా, మనోహరనిర్ఝరిగాఁగ నాకు
దరిసెన మొసంగిపోవు నీ సరణులెల్ల
హృదయమునఁ దోఁచి, పిదపఁ దపింతు నాథ!

కలశకుంతరవంబులఁ బలుకరించి
లలితసుమసౌరభములతోఁ గలయఁదిరిగి
గాలిలోఁ దూఁగి, సెలయేటి గతుల నడచి
ఐక్యమైపోవనిమ్ము నీయందు నాథ!

జీవితములోని సుఖదుఃఖభావములకు
నీవె కారణమైయుంటి వింతవరకు
ఘోరతపమునఁ గ్రుంగె శరీరలతిక
హృదయ మొక్కఁడె మిగిలిపోయినది నాథ!

మెఱపుగా, గర్జితంబుగా, మేఘమాల
గా, సురేంద్రచాపప్రభగాఁగ నాకు
దరిసెన మొసంగిపోవు నీసరణు లెల్ల
హృదయమునఁదోఁచి, పిదపఁ దపింతు నాథ!



# మన పండుగలు - వ్రతములు

= శ్రీ మండ నరసింహం =

వేదశాస్త్రపురాణాదులందు విశ్వాసముగల పురాతనార్య సంతతివారు హిందువులుగ పరిగణింపబడుచున్నారు. ఈ రాసేతుహిమాచల భూభాగమున నివసించుచు, నాచారవ్యవహారములందేమి, వ్యవహరించు భాషయందేమి, వస్త్రధారణాది శరీరాలంకరణమునందేమి భిన్నముగనున్నను, వేదశాస్త్ర పురాణములను ప్రమాణముగ నెన్నుటచేత నేమి, నవ్వానియందు విధింపబడిన వ్రతములను శక్త్యానుసార మాచరించుటచేత నేమి వీరేకమతావలంబకులగుచున్నారు. ఈవ్రతాచరణమున ద్విజులు, అందు ముఖ్యముగ బ్రాహ్మణులు, స్త్రీలు పట్టుదల జూపుచుందురు. హైందవ స్త్రీలు మతమునందును, పురాతనాచారానుసరణమునను మిక్కిలి పట్టుదలజూపుటచేతనే, భిన్నమతసాంప్రదాయము లీభారతభూమి నలముకొనియున్నను, హిందూమతము చెక్కుచెదరకుండుటకు కారణమగుచున్నది. హిందువులచే నాచరితమగు పండుగలును, వ్రతములును ఎట్టి దేశపరిస్థితుల బుట్టినవో, వానిని నెరవేర్చవలసిన యవసరమేమియో, అట్టి యవసరము లీకాలమున గొన్నింటికి లేకున్నను అవి యెందుకనుసరింపబడుచున్నవో ఈవ్యాసమున క్లుప్తముగ నొక్కొక్కటియే విమర్శ జేయబడుచున్నది.

మనుపరాశరాది ధర్మశాస్త్ర కర్తలచే విధింపబడిన షోడశకర్మలు-ఉపనయన వివాహాది కర్మలు-భారతదేశమందలి సమస్త ద్విజులచేత నాచరితము లగుచున్నవి. ఈ కర్మలన్నియు లోకసంగ్రహము, నీతివర్తనము, ప్రజాక్షేమము, భగవద్భక్తి, మోక్షసంపాదనము- వీనికొఱకే నెలకొల్పబడినవి. ఈ కారణమున నీ షోడశకర్మలు ద్విజులెల్లరు విధిగా నాచరించవలయునను నియమముగలదు. ఈ కర్మ లాచరించువిధములు స్మృతులందు విపులముగ జెప్పబడినవి. నేటివరకు గూడ నివ్వాని హిందూ ద్విజులచే యథావిధిగా నాచరింపబడుచున్నవి. వీనిని రాజశాసనములలె నుల్లంఘింపరాదు.

పండుగలును, వ్రతములు నట్టివి గావు. ఇవి యైచ్ఛికములు. ఆచరించిన ఫలము చేకూరుననియు, విసర్జించిన నష్టము లేదనియు ప్రజల భావను. ఎందుకీ వ్రతములు బుట్టినవను విషయమే యిచట ప్రధానము.

**ఉగాది ఉత్సవాలు :**

చైత్రమాసముతో ప్రతి నూతన సంవత్సర మారంభమగును. చైత్రమునందే సంవత్సర మేల యారంభము కావలెను ? దీనికి జ్యోతిశ్శాస్త్రము ప్రమాణముగ బ్రత్యుత్తరమీయవచ్చును. ఇది ఉత్తరాయణ దక్షిణాయనములకు నడిమికాలము. అందుచే నీ ప్రదేశమందైన రాత్రింబవళ్లును, శీతాతపములును సమానముగనుండును. ఇది సాధారణముగ మార్చి ౨౧ తేదిని వచ్చును. ఇట్టి సమశీతోష్ణకాలమునకు చైత్రమారంభమనియు, మిక్కిలి యానందము నొసగు కాలమగుటచేత చైత్రవైశాఖములకు వసంతకాలమనియు, నిట్టి యానందదాయకమగు కాలమును భగవంతుడు సమకూర్చుటచేత చైత్రమాసమందలి మొదటి తొమ్మిది దినములు వసంతనవరాత్రవ్రత మను పేర దానధర్మాదులను జేయుచు భగవద్ధ్యానమున నుండవలయుననియు గ్రహింపవలయును. శరీరమునకు బాధాకరమగు నతిశీతకాలము పోయి సౌఖ్యాపాదియగు సమశీతోష్ణకాలము రాగనే ప్రజలీ సంతోషకాలమున కృతజ్ఞతాసూచకముగా నీ వ్రతము నాచరించుటెంతయు సమంజసమే! మన యాంధ్రదేశమున నేమి, యావద్భారతభూమియందేమి చైత్రశుద్ధనవమి శ్రీరాముని జన్మతిథిగా నంగీకరింపబడి నవమినుండి తొమ్మిది

దినములు రామలీలోత్సవములు ప్రజలుజరుపుచుందురు. మహానుభావులు జన్మించిన తిథులందు భక్తు లుపవాస ముండుట యాచారము. ఇటులనే కృష్ణజయంతి, నృసింహజయంతి, వామనజయంతి మొదలగునవి పాలింపబడుచున్నవి.

## వైశాఖ విధినిషేధాలు :

వైశాఖమాసమున కృత్తికకార్తె వచ్చును. అప్పుడు తాప మత్యధికముగ నుండును. గృహనిర్మాణాదికార్యము లీ కాలమున చేయుట మిగుల కష్టముగ నుండును. ప్రజ లెండలో నీకార్యములకు బూనుకొనిన, వారి యారోగ్యము చెడును గావున నీకార్తెయం దిట్టి పనులు దోషములుగ నిషేధింపబడినవి.

ఈ మాసమున గ్రీష్మ మత్యధికమగుటవలన తాపోపశాంతికై ప్రజలు తహతహ లాడుచుందురు. వైశాఖపౌర్ణమిదినమున ఛత్రపాదుకాది దానమును, వడపప్పు, పంచదార పానకము, కదళి పనస మొదలుగాగల ఫలప్రదానములును ఈవ్రత విధులగుచున్నవి. జ్యేష్ఠ మాసమునగూడ తాప ముగ్రముగ నుండును గాన భక్తులగువారందరును భగవదాలయములలో పదునేను దినములు అభిషేకాదులను జరుపవలయు నను విధిగలదు.

## చాతుర్మాస్య వ్రతము :

ఆషాఢము వచ్చుసరికి వర్షము లారంభించి నదులన్నియు జలపూర్ణములగును. జనసంచారమునకు వలయు సౌకర్యములు-అనగా వంతెనలు, బాటలు మొదలగునవి - లేకుండుటచే ప్రయాణములను సాగించుట మిక్కిలి ప్రమాదకరము. ఇక సముద్రముకూడ గాలివానలవలన శాంతమునువీడి యల్లకల్లోలముగ నుండును. ఈపరిస్థితి నాలుగుమాసములవర కుండును కావున నీ మాసములలో సన్యాసులు సంచారమునునిల్పి వేయవలయు ననియు, చాతుర్మాస్యదీక్ష వలుపవలయుననియు నొక విధి కలదు. ఇదిగాక నీకాలమున జను లెవ్వరును సముద్రమును స్పృశింపరాదనిగూడ విధికలదు. క్షీరసాగరమున విష్ణుమూర్తి లక్ష్మీసహితుడై యోగనిద్ర నుండుననియు, నాకారణమున సాగరస్నానముగాని, నావికాయాత్రగాని జనులు చేయరాదనియు విధికలదు. స్టీమర్లు లేనియాకాలమున సాధారణమగు నావలలో సముద్రయానము ప్రమాదకరమని వేరుగ జెప్పనక్కరలేదు కదా! చాతుర్మాస్యవ్రతము మోక్షమునొసగినను నొసగకున్నను, వ్రతదీక్ష నవలంబించువారల కెట్టి ప్రమాదములు ఈ వ్రతవిధుల ననుసరించిన రావుకదా! అదే వ్రత ముఖ్యోద్దేశము.

ఈ మాసముననే సూర్యుడు కర్కాటకరాశియందు ప్రవేశించి క్రమక్రమముగ దక్షిణాభిముఖుడగుచుండును. ఏ నాడు కర్కాటరాశి జెందునో ఆ నాడే దక్షిణాయన మారంభమగును. ఉత్తర ధ్రువమున నాటి నుండియు నారునెలల కాలము రాత్రిభాగమగును. సమస్తకర్మలును, దేవపితృపూజలును పగలేగాని రాత్రి జరుపరాదు. చనిపోయినవా రందరును కొంతకాలము పితృదేవతాస్వరూపమున పితృలోకమున నుందురనియు, వారికై చేయు శ్రాద్ధాదికములు పగటికాలమని భావింపబడు నుత్తరాయణకాలమున జేసినచో వారి కందుననియు విశ్వాసము. మన కారునెలలకాలము నుత్తరాయణము ధ్రువప్రాంతమున నొక్క పగటిపూటగను, దక్షిణాయన మనబడు నారునెలలకాలము వచ్చుట నొక్క రాత్రి పూటగను నెంచబడునని మనము మరువరాదు. దీనినే దేవమానమందురు. ఈమానమున మానవుల కొక యేడాది దేవతలకొకదినము. ఇట్టిభావనయే మనపురాణములలో వర్ణింపబడిన దేవలోకము ధ్రువమండలప్రాంతమనియు, నచ్చటి 33 కోట్ల దేవతలే హిందూదేశమునకు వెడలివచ్చిన మనపూర్వులగు నార్యులనియు పలువురు పండితుల విశ్వాసమునకు కారణమగుచున్నది. దక్షిణాయనము ప్రవేశింపకమునుపే పితృదేవతలకు శ్రాద్ధ తర్పణాదిక్రియలు జరుపవలయునను విధికలదు. "అయనే వింశతిః పూర్వే మకరే వింశతిః పరే" అను ప్రమాణమునుబట్టి పెద్దపండుగగ భావింపబడు మకర సంక్రాంతి పండుగగూడ పితృపూజయే ప్రధానమైనదిగా నెన్నబడుచున్నది. ఆషాఢ శుద్ధయేకాదశినుండి నాలుగుమాసముల కాలము చాతుర్మాస్య వ్రతముగ నెంచబడుచున్నదని వేరుగ చెప్పనక్కరలేదు.

## శ్రావణ మంగళవారాలు :

శ్రావణమాసమున వ్రతములన్నియు స్త్రీలచేత మిక్కిలి పట్టుదలతో నాచరింపబడుచున్నవి. మంగళ

గౌరీవ్రతము ఈమాసమందలి ప్రతిమంగళవారమున జరుప బడుచున్నది. పూజ చేసిన తరువాత మొలకలెత్తిన పెసలుగాని, శనగలుగాని విరివిగ వాయినముగ పంచిపెట్ట బడును. జనులచేత గౌరి యెల్లప్పుడును పంటలనొసగు దేవతగ గణింపబడుచున్నదగుటచేతను, ఆదినములలో మొలకలెత్తిన పెసలుగాని, శనగలుగాని స్త్రీలచే పంచి పెట్టబడు నాచారముండుటచేతను ఈవ్రతాచరణావశ్యకత వెల్లడియగుచునే యున్నది. ఈమాసముననే పూర్ణిమకు ముందుగావచ్చు శుక్రవారముగూడ స్త్రీలచే వ్రతదినముగ నెన్నబడుచున్నది. ఆనాడు వరలక్ష్మి అను దేవతను బియ్యముతో నింపిన కలశమం దావాహనముచేసి పూజింతురు. నాడు నూతన స్వర్ణాభరణాంబరాదులనుగూడ నాదేవతకు నైవేద్యముతోపాటొసగుదురు. కావున నీవ్రతము ధనధాన్యసంపదకొఱకైనదని భావింపవలయును.

ఈమాసమందువచ్చు పూర్ణిమయందు ఉపాకర్మ వ్రతము పురుషులలో నుపనయనమైనవారందరు చేయవలయునను విధికలదు. ఇది కేవల కర్మలతో గూడినదై, మోక్షమార్గమును సూచించునదియై యున్నది.

వినాయకచవితి :

భాద్రపదమాసమున శుక్లపక్ష చతుర్థినాడు గణపతివ్రత మాబాలగోపాలము జరుపుచున్నారు. ఇతడీశ్వరపుత్రుడు. దేవగణమునకు పతి. మూషకవాహనుడు. కరివదనుడు. ఇట్టి నామము లితని కనేకములు కలవు. మూషకవాహనుడనగా ఎలుకపై సవారిచేయువాడని భావింపరాదు. ఎలుక పతాకముగాగల మూషక రాజ్యమును జయించినవాడు గావున నీతనికి మూషకవాహనుడను నామము వచ్చినది. ఆయుద్ధమున దేవగణమున కితడు సేనాధిపత్యము వహించుటచేత నీతడు గణపతి యయ్యెను. రథ గజ తురగ కాల్బలములలో కరిబలము నీతడు ముందుగా నడపి జయమును సంపాదించుటచేత నీతడు కరివదనుడయ్యెను. పార్వతికి ప్రియపుత్రుడనిగూడ నీతనికి ఖ్యాతికలదు. అనగా నాటవిక జనులను, పర్వతములందలి జనులను స్వాధీనము చేసికొనినవాడని యూహింపవలయును. వీని వివిధనామములను బట్టి వీని ప్రత్యేకగుణములు వెల్లడి యగుచున్నవి. ఈతడు వైదిక దైవతముగా నెన్న బడుటలేదు. పురాణకాలమున ప్రసిద్ధికి వచ్చినవాడు.

మహాలయపక్షము :

ఈమాసమందలి కృష్ణపక్షమంతయు పితృదేవతారాధనమునకై వినియోగింపబడుటచేత దీనికి పితృపక్షమనియు, మహాలయపక్షమనియు పేరువచ్చినది. లయము జెందినవారికొఱకు చేయబడిన శ్రాద్ధాదికము లీపక్షమున విధింపబడినవని గ్రహింపవలెను. ఏతిథియందు చనిపోయినవా రాతిథియందే పితృపూజ జరుపవలయును. ఈ పక్షమున భరణీనక్షత్రమును, అమావాస్యయు ప్రధానములుగ జూడబడును.

దేవీనవరాత్రాలు :

ఆశ్వయుజ మాసారంభమునుండి శారద నవరాత్రోత్సవ మారంభమగును. దీనినే దేవీ నవరాత్రము లందురు. ఇది శరత్కాలముతో నారంభమగుటచేత శారద నవరాత్రములనియు, దేవీపూజ (లక్ష్మి, సరస్వతి, పార్వతి) జరుపవలెనను విధియుండుటచేత దేవీనవరాత్రములనియు పేరువచ్చెను. ఈ వ్రత మీ దేశమంతట నాచరింపబడుచున్నది. వీరు లాయుధ పూజ నొనర్చెదరు. విద్యార్థులు పుస్తకములను బూజింతురు. వివిధవృత్తులవారు వృత్తిసంబంధమగు పరికరముల నారాధింతురు. కర్షకులు పొలములందున్న పంటలందు కోడి, గొఱ్ఱె, మేకల రక్తమును దేవికి నైవేద్య మిత్తురు. పచ్చికొమ్మలపై నీ రక్తమునుజిమ్మి ఆకొమ్మలను వారివారి పొలముల పంటనడుమ పాతుదురు. ఇట్లు చేసినచో దేవి పంటలనధికముగ ఇచ్చునని వారి భావన. ఈయుత్సవమునే దసరాయని జనులు వ్యవహరింతురు. ఈ పండుగ మకర సంక్రాంతి తరువాత గొప్పదిగా భావింపబడుచున్నది.

దీపావళి :

ఈ మాసాంతమున దీపావళిపండుగ భారతదేశమంతటను జరుపబడుచున్నది. పూర్వకాలమున దేవకంటకుడగు నరకాసురుని శ్రీకృష్ణుడు సంహరించుటచేత కలిగిన యానందమును జను లీ యుత్సవమున వెల్లడి

చేయుదురు. ఉదయమునకే అభ్యంజనస్నానమును, రాత్రి శక్త్యానుసారము దీపారాధనయు నిందు ప్రధాన కార్యక్రమము. కాని బాలబాలికలు మతాబాలు, తారాజువ్వలు, టపాకాయలు మొదలగువానిని చేసికొనియో, కొనియో కాల్చి ఆనందించెదరు. గుజరాతీ దేశమున నీపండుగతో ప్రాత సంవత్సరముపోయి క్రొత్త సంవత్సర మారంభమగును.

### ఆకాశ దీపాలు :

కార్తీకమాసమున జరుపవలసిన వ్రతము లనేకము లున్నవి. ఆకాశదీపములు, కార్తీక సోమవారవ్రతములు, ఈశ్వరాభిషేకములు, నక్షత్రదర్శనానంతర భోజనములు, వనసంతర్పణములు మొదలగునవి మతాభిమానులచే నేటికిని జరుపబడుచున్నవి. ఈ వ్రతముల యావశ్యకతను తెలిసికొనుటకు ముందుగా మన పూర్వులు ఉత్తర ధ్రువప్రాంతముల తొలుదొల్తనుండెడివారని మాత్రము జ్ఞాపకముంచుకొనవలెను. ఉత్తర దిక్కునకు పోవుకొలదిని దక్షిణాయనమున పగళ్లు క్రమక్రమముగ కురుచలగుటయు, రాత్రులు దీర్ఘములగుటయు సంభవించుచుండును. కొన్ని ప్రదేశములలో పగళ్లు రెండు గంటలకాలమును, రాత్రు లిరువదిరెండు గంటలకాలమును, మరికొన్ని ప్రదేశములలో మూడు నాలుగు మాసముల వరకును, ధ్రువమునొద్ద ఆరుమాసముల వరకును రాత్రియేగాని సూర్యరశ్మి గానబడదు. ధర్మశాస్త్రానుసారము దేవతా నైవేద్యమును, ప్రసాదస్వీకారమును (భోజనము) పగలేగాని రాత్రి జరుపరాదు. రాత్రులు దీర్ఘమగుచోటుల రాత్రికిని, పగళ్లకును అంతరమధికము. అందుచేత ఆకలితో రాత్రియంతయు గడుపవలసి యుండును. ఇందుచేతనే సూర్యాస్తమయకాలమున నీ మాసమున భోజనాదికములు విధింపబడినవి. దీర్ఘరాత్రులందు ప్రజలు నిద్రలో కాలము వెళ్లబుచ్చురని తలపరాదు. నిత్యకృత్యవహారములు జరుగుచుండినగాని సమస్తజీవనము స్తంభించిపోవును. రాత్రులందుగూడ పనిపాటలు జరుగకతీరదు. అందుకొరకై ఆకాశదీపము లేర్పరుపబడినవి. ఇప్పుడు పెద్దపట్టణములలో రాత్రులందు వ్యాపార సౌకర్యమునకుగాను వీధులందు పురపాలకసంఘమువారు ఆకాశదీపములను (Street lighting) నెలకొల్పియున్నారు. ఆకాలమున ధర్మపరులగు ప్రజలే యీ పనిని నెరవేర్చుచుండిరి. ఈ విధికి మతప్రాధాన్య మిచ్చిన సర్వజనులును తమ ధర్మములను నిర్వర్తించెదరు. ఆకాశదీపములు నదులు తటాకములందలి రేవుస్థలములలోను, నూతులదరిని ఉంచుట మతధర్మముగా శాసింపబడినది. ఇవియేగాక రెండు బాటలు కలియుచోటులు, పసువులసాలలు, వ్యవసాయ కార్యస్థానములుగూడ దీపారాధనకు విధింపబడిన తావులు. ఉత్తర ధ్రువమునకు సమీపమున అరోరా బోరియాలిస్ అను చక్రకాంతి రాత్రులందుండును గాని దూరప్రాంతముల దీర్ఘరాత్రు లందుండదు. కాబట్టియే దీపారాధనము శాసింపబడినది. ఇయ్యది అచ్చటి జనుల కుపయోగమేకాని హిందూదేశజనుల కవసరములేదు. కాని జనులు మతమునకు ప్రాముఖ్య మిచ్చుటచేతను, పూర్వాచారమగుటచేతను హిందూదేశమునకు వెడలివచ్చినను గూడ నేటివరకు నాయాచారమునే నడపుచున్నారు.

### ధనుర్మాస భోజనం :

ఇటులనే ధనుర్మాసమున ప్రాతఃకాల భోజనము విధింపబడినది. దీర్ఘరాత్రులందు భోజనము లేకపోవుటచేత తెల్లవారు సరికి ఆకలి యధికముగ నుండుటచేత నట్టి విధి నిర్ణయింపబడినదని యూహింపవలయును.

### గవిరమ్మపండుగ :

కార్తీక పౌర్ణమివా డుపవాసదినముగ స్త్రీలు భావింతురు. ఆ దినమున చంద్రపూజ సలుపుదురు. పంటలుపండు సమయ మది. చంద్రు డోషధీశుడుగాన వాని కృపవలన పండిన పంటకుగాను కృతజ్ఞతాపూ దినముగ భావింపబడుచున్నది. ఆశ్వయుజ పౌర్ణమికి పంటలు కొంతదూరమగుటచేత గౌరీ దేవిని ఆరాధించెదరు. ఆమెకటాక్షముకొరకు వ్రతము లానాడు చేయుదురు. ఈపండుగను ముఖ్యముగా కర్షకులు 'గవిరమ్మపండుగ' అను పేరుతో వైభవముగా జరుపుచుందురు.

### పెద్దపండుగ :

ధనుర్మాసానంతరము "పెద్దపండుగ"—సంక్రాంతి పండుగ వచ్చును. కర్కాటక సంక్రాంతివలెనే మకర

సంక్రాంతినాడుగూడ పితృదేవతాపూజయే ముఖ్యము. కాని ఆంధ్రదేశజనులును, అరవలును ఈపండుగను అన్నింటికన్న నెక్కువగ పరిగణించెదరు. చలి మిక్కుటమగుటచేత బాలబాలికలు భోగిదినమున మంటలను వేయుదురు. దొంగతనమునకైన కఱ్ఱలు మొదలగు కొయ్యసామగ్రిని మంటలలో పడవైచి ఇతరులు తిట్టుచున్నను ఆనందించుచుందురు. ఆదినములు బలిచక్రవర్తియేలుబడియందుండు ఆనందదినములని ప్రజల నమ్మకము.

## రథసప్తమి :

దీనితరువాత మాఘమాస శుద్ధసప్తమినాడు రథసప్తమీవ్రతము వచ్చును. ఆనాడు సూర్యునిరథ ముత్తర దిక్కునకు నడువనారంభించునట ! నిజముగ సూర్యుడు డిసెంబరు ౨౧-వ తేదీనే ఉత్తరదిక్కునకు తిరుగుటకు ప్రారంభించును. కాని సూర్యచలనము స్పష్టముగ నాటినుండియే కనబడుటచేత నీవ్రత మాచరింపబడుచున్నది.

## కామదహనము :

ఫాల్గుణపౌర్ణమినాడు కామదహనము, డోలాయాత్రయు జరుపుదురు. ఎండ లధికమగుకొలదిని జనుల కామోద్రేకము హెచ్చుచుండును. కాని దాని నరికట్టవలెననియు, నది దుఃఖహేతువనియు బోధించుటకుగాను ఈపండుగ కల్పింపబడినదని యూహింపవలయును.

ఈపండుగలేకాక వైదిక వ్రతములుగూడ కొన్ని యున్నవి. వానిలో అతిరాత్రవ్రతములు, పంచరాత్రవ్రతములు, ఉపాకర్మ మొదలగునవి కొన్ని కలవు.

మనపూర్వులగు నార్యమహర్షుల తొల్లింటి స్థిరనివాసభూమి ధ్రువప్రాంతమని యింతకుముందే చెప్పినాను. వారాప్రదేశముల నున్నకాలమున రాత్రులతిదీర్ఘములుగ నుండెననియు, దేవకార్యములన్నియు పగలే చేయవలయునను నియమముండుటచేత, సూర్యభగవానుని శీఘ్రదర్శనముకొఱకే యతిరాత్రవ్రతము లాచరించెడివారనియు మనము గ్రహింపవలెను. గ్రంథవిస్తరభీతిచే మిగిలిన వ్రతముల విమర్శ విరమింపబడినది.



# శాస్త్రజ్ఞునకు హెచ్చరిక

❀

— శ్రీ శ్రీపాద లక్ష్మీనారాయణమూర్తి —

[అమెరికావారు "యాటమ్‌బాంబు" రహస్యమును బయటపెట్టకుండుటకు ప్రయత్నించుచుండగా నంత కంటె భయంకరమైన యింకొక బాంబును కనిపెట్టగలిగితిమని రష్యనుశాస్త్రజ్ఞులు ప్రకటించుట చూచి—]

తరుగుం జెందని బుద్ధికౌశలజలాంతర్గామి నీ కబ్బె సృ
ష్టిరహస్యాంబుధి జొచ్చినాడ వమృతశ్రీ దెత్తువో మౌక్తికో
త్కరముం దెత్తువొ యంచు నెల్లజను లుత్సాహంబుతో జూడ భీ
కరమౌ బాడబవహ్ని గాల్చితివి లోకంబెల్ల శాస్త్రజ్ఞుడా!

పలుదేశంబుల శంక లేక కబళింపం బూను సామ్రాజ్యవా
దుల యత్యాశకు గీలుబొమ్మవయి యెందున్ లేని యీభీకర
ప్రలయాగ్నిచ్ఛట లీను బాంబులను నిర్మాణంబుగావించి యి
ట్లలరం జొచ్చెద వెట్టి సంస్కృతియొ సభ్యత్వమ్మొ శాస్త్రజ్ఞుడా!

ధరణిన్ సస్యసమృద్ధి గూర్చెడి జలాధారంబులున్ విత్తనా
లెరువుల్ యంత్రములున్ సృజింతు వని నిన్నే నమ్ముచుం గూటికిం
గరువై కుందెడు లక్షలాదిగ జనుల్ గావించు హాహారవో
త్కరముల్ నీచెవి సోకనీయ విది శాస్త్రజ్ఞత్వసౌభాగ్యమా?

భయమన్నదియె తలంపక తల్లియొడిలోన పాలుద్రావెడు పసిపాపలైన
వైద్యశాలల రోగబాధకు దాళ కాక్రోశించుచుం గుందు రోగులైన
భావిప్రపంచసౌభాగ్యవర్ధిష్ణులౌ బడులలో పఠియించు బాలురైన
పగలెల్ల కడు కష్టపడి తృప్తి నిదురింప వచ్చిన యల కూలివారలైన
శాంతిగా, నిర్భయమ్ముగా క్షణముకూడ-గడుపనేరరు సామ్రాజ్యకాంక్ష కీవు
బలివగుచు సృష్టిచేసిన ప్రబలమార-ణాస్త్రతతి గూర్చు నీప్రళయమున కడలి.

---

# బిళ్లల మొలత్రాడు

[కథ]

•

## — శ్రీ 'కరుణకుమార' —

[గతసంచిక తరువాయి]

యుద్ధానికి కూలీలు సప్లయిచేసే సందర్భంలో, ఇంకా ఇతరపనులమీదా అర్జంటుగా మాట్లాడవలసిన పనిమీద తహశీల్‌దారూ, కలెక్టరూ చెప్పిపంపితే రెడ్డి వెళ్లి వారంరోజు లయింది. ఎన్నడూ ఇన్నాళ్లుండేవాడు కాదు. ఎందువల్లనో ఇంకా తిరిగి రాలేదు. అధికార్ల ప్రాపకం గట్టిపరచుకోవడంలో రెడ్డి అందెవేసిన చెయ్యి. అందులో యుద్ధంవచ్చిన తర్వాత అదేమి తాపత్రయమో ఆతనికి రెండోపని కనిపించడం లేదు. యుద్ధనిధికి గవర్నరుగారివద్ద ఇతడు స్వయంగా రెండువేలు చదివించాడట. చెన్నపట్నంలో దిగిన తెల్లమిలిటరీసిపాయీలకు పనిలేక బజార్లలో పడుచులవెంట తిరుగుతుంటే, వాండ్ల బాధా నివారణార్థం ఏర్పరచిన నిధికి అడగకుండానే వెయ్యి రూపాయిలు కట్నం చదివించాడట. డిప్టీకలెక్టరు గారు మకాంచేసినప్పుడు-యుద్ధంలో సిపాయీలబుర్ర గొరగడానికీ, గుడ్డలుతకడానికీ పాతికమంది మంగళ్లనీ, పాతికమంది చాకళ్లనీ తన పలుకుబడిమీద సప్లయిచేశాడట! ఇక ఈరెడ్డిగారంటే అధికార్లు చెవి తెగ్గోసుకొంటారు. తత్సంబంధమైన త్యాగఫలితంగానే ఈసంవత్సరం ఉగాదికానుకల్లో రామిరెడ్డి రావుసాహేబు కూడా అయిపోయినాడు.

వారంరోజులుగా ఇంటికాడ లేకున్నమాటే గాని - రామిరెడ్డికి రమణిమీదనే నిలిచిపోయినవి మరులన్నీ. బొందె అక్కడా, మనసు ఇక్కడా తిరుగుతున్నవి. ఏమయినా సరే, ఆపిల్లని తన హస్తగతం చేసుకొని తీరవలసిందేనని - జ్ఞాపకానికి వచ్చినప్పుడల్లా తీర్మానించుకొంటూనేవున్నాడు. దానింటికి తాను స్వయంగావెళ్లి చెయ్యిచేయనేచేసుకొన్నాడు. ఇంక నడుంగా విడిచిపెట్టితే ఎంతఅప్రతిష్ఠ! అవసరమైతే సుబ్బులినయినా ఏదో మిషమీద బయటికి వెళ్లి తరిమి, ఆపిల్లని చీలదీసి తనింటికాడ నిలుపుకోవలసి వదే. సుబ్బు లట్లా లేచిపోయినవెంటనే దానిపేర అయిదెకరాల కయ్యా, కొబ్బరితోటలో సగం వ్రాసియిచ్చి, పూరికొంప తీసేసి పెంకుటిల్లొకటి వేసిపెట్టవలసిందే! సుబ్బులుసంసారం కొబ్బరితోటలో చేర్చి తల్లి తన కెంత మహోపకారం చేసింది? రమణి తన పిడికిట్లో చిక్కిపోయిందని దృఢపరచుకొన్నాడు. ఉరకలు వేసుకొంటూ, వెళ్లిన వారంరోజులకు ఇంటికి తిరిగివచ్చాడు రెడ్డి.

భోజనం చేసి రవంత విశ్రాంతి తీసుకొన్నాడు. సాయంకాలం నాలుగు గంటలకు కాఫీ పుచ్చుకొని, రమణి వ్యవహారం ఏదో తొందరగా తేల్చుకోవాలని అనుకొంటుండగా, పడకే తీగ కాళ్లకి చుట్టుకొన్నట్లు, సుబ్బులే వచ్చి, అరుగువారగా నిలబడి—

"వచ్చే తొలేకాదశిపండగకి నేను నిలిచిపోతానండి. వేరేమనిషి నేర్పాటుచేసుకోం"డని నేల బొటనవ్రేల రాస్తూనిలబడ్డాది.

ఇది స్వప్నమా, నిజమా! రెడ్డి కర్థంగాలేదు. తనంతట సుబ్బులే వచ్చి ఈ మాట అంటాదని రెడ్డి అనుకోలేదు. నిలిచిపోవడం అంటే? తా నొక్కడే

నిలిచిపోతాడా? నిలిచిపోయి ఎక్కడకు పోతాడు? పోతే, కూడా రమణిని తీసుకొనిపోతాడా, దాని నెక్కడ విడిపించిపోతాడా???

అయితే వాడంతట వాడే నిలిచిపోతానని చెప్పడానికి కారణం? ఆ రాత్రి ఆమెచెయ్యి పట్టుకోవడమేనా తను చేసిన మహాపరాధం?? రెడ్డికి రవంత కంగారు కలిగింది.

"నౌకరీ మానుకొంటా నంటావు, కారణ మేమిటి?" అని అడిగాడు రెడ్డి.

"నా భార్యకు ఇక్కడ ఉండడం ఇష్టం లేదు." అన్నాడు సుబ్బులు.

"ఎందువల్ల? చేదు మేసిందా?"

"దాని కీగడ్డన ఉండడం చేదనిపించి రోతగా ఉన్నది."

"దానికి రోతనిపిస్తే నీకో?"

"నాకూను."

"అయితే ఆడది ఎట్లా ఆడమంటే అట్లా ఆడతావా?"

"మేము యానాదులం."

"నీకు పౌరుషం లేదూ?"

"ఉండబట్టే లేచిపోతున్నాను."

"లేచిపోయేవాడివి మిలిటరీలోకి లేచిపోరాదూ? దున్నపోతులా ఉన్నావు! కడుపు నిండా కూడూ, వంటినిండా గుడ్డా యిస్తారు. జీతం యిస్తారు."

సుబ్బులు పలకలేదు.

"అక్కడ నీ మనవర్తికి పరిపోగా నెల నెలా ఇక్కడ పెళ్లానికి పదిరూపాయల డబ్బులు పంపినా బ్రతికిపోతుందే? నౌకరీ మానుకొని ఏమి తింటావు?"

సుబ్బులు నిలదొక్కుకొంటున్నాడు.

"నామాట విని, మిలిటరీకి పో. నేను తహశీల్దారుతో చెప్పివచ్చాను. నీభార్య నిక్కడనే ఉంచు. ఇంట్లో పనీ పాటా చేసుకొని బ్రతుకుతుంది. దాని కేమీ దిగులులేకుండా చూచే భారం నాది."

సుబ్బులుకు రోషం, దుఃఖం కలిసి పొంగిపోతున్నవి.

"ఇంటికాడ ఉన్నది కాబోలు - రెడ్డిగారు నిన్ను సాకుతా నంటున్నారు, నన్ను మిలిటరీకి పొమ్మంటున్నారు అని చెప్పి ఒప్పించి రా." అన్నాడు రెడ్డి.

"ఆమనిషి కమ్మవారిపాలెం వెళ్లిపోయింది." అన్నాడు సుబ్బులు.

"ఆ! ఎప్పుడూ? ఇప్పు డింటికాడ లేదూ?"

"లేదండీ"

"చూశావా! నీవంటే దానికి గడ్డిపరక ప్రమాణం రా. జుట్టుపట్టుకొని కూర్చోబెట్టకపోయావూ? వొట్టి చవటదద్దమ్మవురా." అన్నాడు రెడ్డి.

సుబ్బు లక్కడ నిలవలేకపోయాడు. గిర్రున తిరిగి వెళ్లిపోతుండగా—

"ఇదిగో: ఈ రాత్రికే ఆలోచించుకొని, ఉదయాన్న ఏసంగతీ నిరుకుగా చెప్పాలి. నిన్ను నమ్ముకొని తెల్లవారేసరికి మిలిటరీకి ఒక మనిషిని సప్లయి చేస్తానని తహశీల్దారుకు మాటయిచ్చివచ్చాను." అని అంటూ, పోయే సుబ్బుల్ని హెచ్చరిస్తూ ఇంట్లోకి లేచిపోయాడు రెడ్డి.

మిలిటరీ అనేసరికి సుబ్బులుకు భోరున దుఃఖం వచ్చింది. కలకలలాడే యింట్లో రమణి లేక బావురు మంటోంది. తలుపు తీసి లోపల నులకమంచంమీద బోర్లగిలా పడి డొక్కలెగరవేసి ఏడిచాడు. రమణి ఉంటే అతగాడి కింత ధైర్యం చెప్పి ఊరడించేది. రెడ్డిగారి వ్యవహారం క్రుతిమించిపోయింది. ఆ ప్రదేశంలో క్షణం నిలవడానికి వాడి కిష్టం కలగడంలేదు. పైన గుడ్డ వేసుకొని తలుపు తాళంవేసి లక్ష్మమ్మతోనయినా చెప్పకుండా ఆరాత్రికే ఏకాఏకిని కమ్మవారిపాలెం వెళ్లిపోయాడు.

## ౧౩

తెల్లవారి లేచేసరికి సుబ్బులు కమ్మవారిపాలెం వెళ్లాడని తెలిసింది రెడ్డికి. రమణితో సంప్రదించి రావ

దానికి వెళ్లిఉంటాడని అనుకొన్నాడు రెడ్డి. చిలకలేరు దాటితే రెండుమైళ్లు కమ్మవారిపాలెం. ఎంత వెళ్లడం, ఎంత రావడం? చద్దన్నంవేళకే రావలసిన సుబ్బులు మధ్యాహ్నం పొద్దుతిరిగినా రాలేదెందువల్లనా అని రెడ్డి కదే ఆలాపనగా ఉన్నది. సాయంత్రానికయినా రాకపోతాడా?

సుబ్బుల్ని మిలిటరీకి పంపడం ఉన్నదే సర్వోత్కృష్టమైన కార్యం. వాడు మిలిటరీలోకే వెళ్లినట్టయితే తాను వేసుకొన్న ప్రణాళిక దిగ్విజయమే.

కాని, సాయంత్రం చీకటిపడ్డా సుబ్బు లింటికి రాలేదు. ఆ రాత్రికి ఓపికపట్టి ఊరుకున్నాడు. మర్నాడుకూడా వాడు రాకుంటే వాడికోసరం ముతరాచువాణ్ణి పంపాడుకాని—సుబ్బులు రానన్నాడని వెళ్లిన మనిషి వక్కొచ్చి చెప్పాడు.

"ఆ!" అని రెడ్డి గ్రుడ్లురిమాడు. అయితే సుబ్బులు తన కమతం విడిచి నిలిచిపోయినట్టేనా?

"వాడి తప్పులేదు. వాడి ప్రాణానికి దాపరించింది పెళ్లాం, కాదు — రాక్షసి. అది వాడి కేదో మందుపెట్టి మనసు తిప్పేసింది. అదిగాక, కమ్మవారిపాలెం కాంగ్రెసుజెండాగ్రామం. యానాదివాళ్లకు రాఘవయ్యగారి ప్రాపకం. సుబ్బులుగాని, రమణిగాని తన కంత సుళువుగా లభ్యపడే ఆశ లేదని నిర్ధారణ చేసుకొన్నాడు రెడ్డి.

సుబ్బుల్ని మిలిటరీలోకి పోవలసినదని రెడ్డి అడిగిన విషయంగాని, రెడ్డి రమణిచెయ్యి పట్టుకొని లాగిన విషయంగాని లక్ష్మమ్మకు తెలియనే తెలియదు. స్వచ్ఛమైన స్ఫటికంలా వెన్నముద్దవంటి ఆమెహృదయం సుబ్బులుకోసరం, రమణికోసరం అలవటించి, కాగి, మరిగిపోతూ—

"అబ్బాయీ! కమ్మవారిపాలెం వెళ్లి నాసుబ్బులెన్నడూ ఇన్నాళ్లు ఉండిఎరగడు. ముసలివాడు— వాడి మేనమామ కెట్లా ఉన్నదో. వాడి కెట్లా ఉన్నదోరా" అని కొడుకు నడిగింది లక్ష్మమ్మ.

"ముసలివాడి కేంరోగం? ఆ యానాదిదానికి కళ్లు నెత్తికెక్కి సుబ్బడికి విషంపెట్టి పుట్టింటికి లాక్కొని పోయింది. వాడు మన కమతంలో ఉండడం లేదని చెప్పి వెళ్లిపోయాడు." అన్నాడు కొడుకు.

"ఆ! మానుకోవడమే?" అని నరికిన చెట్టులా పడిపోయింది లక్ష్మమ్మ.

"మానుకొని బెదిరిస్తాడా ఏమిటి? ఈఖళ్ళన్న కాకుంటే మరో విస్సన్న. అసలు వాడి వ్యవహారం నాకీమధ్య బొత్తిగా బాగుండక, నేనే వాణ్ణి నిలిపి వేయాలని అనుకొన్నాను." అన్నాడు రెడ్డి.

"అయ్యో! వా డేంపాపం చేశాడురా." అని ఏడిచింది లక్ష్మమ్మ.

"ఏం చేయడమేమిటి? పచ్చిదొంగ అయిపోయాడు వాడు. ఆపెళ్లాం దాపరించింది లగాయతు వాడు అసలు ఒళ్లు వొంచుతున్నాడా? ఎంతసేపూ ఆముండతో తెయితక్కలూ, భోగమాటాను బాడవచేలో. అంతలావుకుప్ప వాణ్ణి నమ్మి అప్పగిస్తే నా డొత్తట్టు మెదలక, ఎక్కడి ధాన్యం అక్కడ పలాయములయిపోయినవి. ఆ ముండ చెప్పడం, వీడు కట్టలుకట్టలు కమ్మవారిపాలెం అత్తగారింటికి వడ్లు దాటవెయ్యడమూనట. నీ కేం తెలుసు వాడి సంగతి?" అన్నాడు రామిరెడ్డి.

"రామరామ! నే వినలేకపోతున్నానురా" అని కళ్లు తుడుచుకొన్నది లక్ష్మమ్మ.

"వాడికి వినాశకాలం దాపరించిందిలే. లేకుంటే వాడు నాతో చెప్పనయినా చెప్పకుండా ఆ కుక్కమూతిపిందెను పెళ్లిచేసుకొనివస్తాడా?" అన్నాడు రామిరెడ్డి.

"నారాయణమూర్తీ! నా కెందుకు పోతావోయి ఆయువూ?" అన్నది లక్ష్మమ్మ.

"నా శికమీద తిరిగినస్త్రీమట్టుకు నేను సున్నం తొక్కనిస్తానా? నాకంటికి వాడు కనిపించాలి— నిలువునా చీల్చి కారతని వేయకపోతే నేను కృష్ణారెడ్డికొడుకును కాదు." అన్నాడు రెడ్డి.

లక్ష్మమ్మకు కాళ్లల్లో దడ పుట్టింది. తనకి తెలియకుండానే వ్యవహారం చాలాదూరం ముదిరిపోయిందని గ్రహించింది. తన కొడుకుది ఖల్లాకపు

పట్టు. తగిలేదీ ఎరగడు, తప్పేదీ ఎరగడు. ఆయనా వాడి బిడ్డ లిద్దరూ అర్భకులు. తన కొడుకుదెబ్బకు వాళ్లు ఈగలూ, దోమలూ అయ్యే రోజు వచ్చిందని నిశ్చయించుకొన్నది. ఆకొడుకుదగ్గర నిలవలేక, పశువుల సాలలోకి పోయి, కొబ్బరితోట తిరిగి సుబ్బులు ఇల్లు చూచి గుండెలు బాదుకొన్నది. "సుబ్బులూ! నా నాయనా! నాతో చెప్పకుండా పారిపోయావురా! ఇక నాకు కనిపించవటరా" అని గోల పెట్టింది. ఒక్కసారి వెళ్లి, ఆచిన్నకొడుకునూ, ఆకోడల్నీ కరువుతీరా కౌగలించుకోవాలని ఆమె ఆరాటం!

ఆతోటలూ దొడ్లూ చూచి భరించలేకపోయింది. కొబ్బరితోటకు ప్రేతకళ పట్టింది. ఆచెట్లమీద అన్నికొంగలుండేవి. ఒక్కపక్షీ కనిపించదు. పశువులపాల పీనుగులసాలలా భయంకరంగా ఉన్నది. బండెద్దులూ, దుక్కిటెద్దులూ డొక్కలు దించుకొనిపోయి మేతమేయక గుంజల కాడనే శవాకారాలతో చెవులు నిక్కబెట్టి అట్లనే నిలబడి పోయినవి. పడమటావు—సుబ్బులు కూర్చుంటే, చిటికెన వ్రేలంతలావు ధార. నిలువునా వాలుగ శేర్లిచ్చే ఆవు-దూడని దగ్గరకు రానీయడం లేదు. రెండు గమిడి గేదెలూ పొదుగు లీచుకొనిపోయి, పెయ్య దూడల్ని తన్ని వాలేస్తున్నవి. ధాన్యపుకొట్లు పందికొక్కుల పాలయి ఒక్కొక్క కొట్టుక్రింద వందబళ్ల మట్టి మేట వేసుకొనిపోయింది. అరటితోటలో చీలిపోయి ఎండిపోయిన ఆకులేగాని - కళ్లుపొడుచుకున్నా గెల కనిపించడంలేదు. కొబ్బరిచెట్లకు మావుళ్లో పురుగు పడిందో ఏమో, తలలువాల్చి పుచ్చెలు రాలిపోతున్నవి. రెండు మండువాల లోగిలి. పెంకు తిరగవేయించే దిక్కులేక, కోతుల దెబ్బకు కప్పుఅంతా బీభత్సమై సూర్యచంద్రులు నట్టింట్లోనే కాపరం చేస్తున్నారు. లక్ష్మమ్మ దొడ్డి అంతా తిరిగి తిరిగి శోషవచ్చి యింట్లో కాలుపెట్టేసరకు శుక్రవారపు పొద్దు, చీకటిపడ్డా ఇంట్లో దీపంలేదు. పసిపిల్లలు అన్నమో అని గోలచేస్తున్నారు. రెడ్డి స్నానం చేయడానికి నీళ్లక్రింద కింత దుడ్డు అయినా దొరకలేదు.

లక్ష్మమ్మ ఆరాత్రి అన్నం తినలేదు. "సుబ్బులూ, సుబ్బులూ" అని విధీ విరామం లేదు ఆమెనోటికి.

ఏమిపనిబడ్డదో- తెల్లవారు జామున గుర్రబ్బండి కట్టుకొని, పెళ్లాంతో కూడా చెప్పకుండా వెళ్లిపోయాడు రామిరెడ్డి.

లక్ష్మమ్మ వాళ్ల ఎడబాటు భరించలేకపోతున్నది. వాళ్లని రావలసినదని చెప్పిపంపితే వస్తారో రారో అని ఆమెసందేహం. తానే వెళ్లి వాళ్ల నొకసారి చూచిరావాలని నిశ్చయించుకొన్నది. చీకటిపడేవేళ రెండుమైళ్లదూరంలో ఉన్న చిలకలేరుకు తాను బండికట్టుకొని వెళ్లి, రమణినీ సుబ్బుల్నీ అక్కడకు పిలిపించుకొన్నది.

"నాయనా! నామీద అలిగి వెళ్లిపోయావా!" అని సుబ్బుల్ని చందిటతీసుకొని వలవల ఏడిచింది.

"రమణీ! నువ్వుకూడా చెప్పకుండానే వెళ్లిపోయావా? ఎంత పాపం చేశానే నేను" అని ఆమెను కౌగలించుకొని పసిపిల్లలా బావురుమన్నది.

సుబ్బు లొకవంకా, రమ ఒకవంకా - చిలకలేరు నిండిపోతోంది వారి ఏడుపులతో.

"అమ్మా! నాకు నీచేతి గంజి రుణం తీరిపోయింది. ఇంక నన్ను మరచిపో తల్లీ." అని బావురుమన్నాడు సుబ్బులు.

"కమ్మవారిపాలెంలో ముసలివాళ్లిద్దరూ వెంకటిల్లి పోతూంటే వచ్చేశాం." అని మాత్రం ఆమెతో చెప్పి, ఆమె నోదార్చి, ఆమెపాదాలు కళ్లకద్దుకొని, ఇంటికి సాగనంపి సుబ్బులూ, రమణీ ఇంటికి వెళ్లిపోయారు.

౧౪

రెడ్డిగారిపల్లెలో రామలింగేశ్వరస్వామికి కమ్మవారిపాలెంలో ఏర్పడ్డ ఏభయ్యెకరాల మాగాణిభూమి ఆస్తి రెండు గ్రామాలకీ పెద్ద గండకత్తెర వ్యవహారమై కూర్చున్నది. ఆవ్యవహారం ఇప్పటిలో పదిపన్నెండేళ్లుగా నానాబీభత్సంగానూ ఉన్నది.

అసలు ఆభూమి సుందరశివరావు అనే ఒక ఆర్వేలనియోగి పంతులదట. ఆయన బి. ఏ. పేసయి పట్నంలో నాటక కంపెనీలూ, సినీమాలూ, అచ్చాఫీసులూ పెట్టి, ఆవ్యాపారాల్లో దెబ్బతిని దివాలా తీశాడట! ఆసందర్భంలో కమ్మవారిపాలెంలోని ఏభయెకరాల భూమీ కమ్మచలమానాయుడుకు ఆరోజుల్లో స్వాధీనపు అడుమానం పెట్టి, పదిహేను వేల రూపాయలు కంపెనుకర్డ్లకి తీసుకొనిపోయి, ఆ బాకీ తీర్చలేక, చలమయ్యకు స్వాధీనమైన ఆస్తికి స్వస్తి చెప్పి ఊరుకున్నాడట. ఆయనగారి అనంతరం, చలమయ్యఅనంతరం ఆయనమైనరుకొడుకు వెంకటశివరావు మేజరయి, తన తండ్రి దుర్వ్యసనాలకు లోనయి, కుటుంబాస్తిని పాడుచేసినాడు కాబట్టి, చలమయ్యకు పెట్టిన అడుమానంగాని, ఆ బాకీలుగాని చెల్లవనీ, అందువల్ల చలమయ్య సదరు భూమిని దేవుడికి ధారాగ్రహీతంగా దానంచేసి ఇవ్వడానికి అధికారాలు లేవనీ, ఆస్తికంతా తనే ఉత్తరవారసుననీ లాపాయింట్లు వెదకి పాపరుదావా పడేశాడట! క్రింది కోర్టులో పాపరు ఖాయమైనదటగాని, ఇప్పుడు హైకోర్టులో అప్పీలులో ఉన్నదని అంటారు.

పాపరుదావా ఇట్లా ఉండగా, చలమానాయుడికి సపిండుడు రంగపనాయుడొకడు బయల్దేరి, చలమానాయుడుకు సంతతిలేదనీ, ఆయనఆస్తికి తను వారసుననీ, ఆయన దేవుడికి దస్తావేజు వ్రాయనే లేదనీ, అది ఫోర్జరీవ్యవహారమనీ, అసలు చలమానాయుడు ఏ సంవత్సరంలో చనిపోయినదీ రికార్డు మూలకంగా దాఖలాలులేవనీ, కాబట్టి ఆస్తి తనకు సంక్రమించాలిగాని అటు దేవుడికీ, ఇటు వెంకటశివరావుకీ చెందడానికి రంతమాత్రమూ వీలులేదనీ తానింకోదావా పడవేశాడట.

దావాఆస్తి పేచీలో పడి చెడిపోకుండా కోర్టువారు రిసీవరు అప్పాయింటుమెంటుచేసి ఇప్పటికి ఏడెనిమి దేళ్లక్రిందట ఆస్తి యావత్తూ ఆయనస్వాధీనం చేశారు.

రెడ్డిగారిపల్లెలో దేవుడుండడమేమిటి, తాను అగ్రామానికి పెద్దగా ఉండడమేమిటి, ఆస్తి కమ్మవారు అనుభవించడమేమిటి—బాగుండలేదని, రామిరెడ్డి తాను దేవుడికి ధర్మకర్తననీ, చలమయ్య వ్రాసిన దస్తావేజు చెల్లవలసినదేననీ, రిసీవరు అప్పాయింటుమెంటు కేవలం అక్రమంకాబట్టి ఆస్తిఅంతా తనకే స్వాధీన పెట్టవలసినదనీ హైకోర్టులో పిటిషన్ పెట్టాడట. అంతా కప్పలతక్కెడగా ఉన్నది వ్యవహారం.

పాపరుకు స్వంతంగా వ్యవహారం జరుపుకోడానికి శక్తిలేదు. అందువల్ల వెంకటశివరావు ఈవ్యవహారంలో రాఘవయ్యగారిని ఆశ్రయించి, ఆయనగనక పనిచేసి తన దావా గెలిపించినట్లయితే పాతికెకరాల భూమి యానాది సంఘానికి ఉచితంగా వ్రాసియిచ్చి, మిగిలిన పాతికెకరాలభూమీ తాను తీసుకొని తృప్తిపడతానని రాఘవయ్యగారిపేర చేజాబు వ్రాసియిచ్చాడట!

రాఘవయ్యగారు ఆజిల్లాలో పేరుబడ్డ సివిల్ క్రిమినల్ వకీలు. కాంగ్రెసులో చేరిపోయి, ముఖ్యంగా యానాదులనూ, హరిజనులనూ పైకితీసుకొని రావాలని ఆయన ఆశయం. కమ్మవారిపాలెంలో స్థాపించిన యానాదిసంఘం ఆయన స్థాపించినదే. అన్నివాదాలలో పాపరువాదం న్యాయమని ఆయనమనస్సుకి తోచి అతని తరఫున నిలబడి ఉచితంగా పని చేస్తున్నాడు రాఘవయ్యగారు.

చలమయ్య చనిపోయినతర్వాత ఆస్తి నా అన్న దిక్కులేక ఏదూ గాదూ అయిపోయింది. భూములు మంచివేగాని ఏమి లాభం, పదేళ్లుగా దానికి బండిఎరువు తోలి సత్తువచేసిన పాపాన్ని పోయినవారెవరూలేరు. నిరుడు సంవత్సరం ఆభూమి రిసీవరు దగ్గరనుండి కౌలుకు తీసుకొన్న కౌలుదారుకూడా చనిపోతే, సాగుచేసే దిక్కు లేక సగంభూమి బీడుగానే నిలిచిపోయింది.

ఈస్థితిలో సుబ్బులు కమ్మవారిపాలెం కాపరం వచ్చేసరికి రాఘవయ్యగారూ, రిసీవరూ, గ్రామస్థులూ కూడబలుక్కొని యానాది సంఘం తరఫున ఈ ఏభయెకరాల్నూ సుబ్బులు సాగుచేసి మత్తాకొలిచేటట్టూ, కౌల్లు అతనిపేర పుట్టించవలసినట్టూ ఏర్పాటు చేసి, భూమి అతగాడి స్వాధీనం చేసేశారు.

సుబ్బులుపేర కవుల్లు పుట్టి భూమి వాడి స్వాధీనం అయిందనేవరకు రామిరెడ్డికి ఒకవిధమైన సంతోషం కలిగి, తాను స్వంతంగా పిలిపించకుండా మధ్యవర్తులచేత, ఆభూమి తనకు లోపాయకారీగా స్వాధీనం పెట్టవలసిందనీ, సుబ్బులుపేర వ్రాయించుకొన్న కౌల్లు తనపేర ట్రాన్స్ఫరు చేయించవలసినదనీ, లేక సుబ్బులే పంటపండించి ఆ కమ్మవారి కంటపడకుండా పండిన పంట ఏరుదాటించి రెడ్డిగారికి చేర్పించవలసినదనీ సుబ్బులుకు చెప్పిపంపించాడు. పట్టుదలకు ఒక్క ఏడు అయినా భూమి తన స్వాధీనానికి తెచ్చుకోవాలని రెడ్డిఆలోచన.

తాను రాఘవయ్యగారి బంటువనీ, ఇందులో తన ప్రమేయమేమీ లేదనీ, తన్నడగవద్దనీ చెప్పిపంపాడు సుబ్బులు.

సుబ్బులు పంపిన సమాధానం రెడ్డికి చుర్రుమనింది. ఆతను తలపెట్టిన కార్యమల్లా విఘ్నమే అవుతోంది. సుబ్బులుని మిలిటరీలోకి పంపాలనుకొన్నాడు: సాగలేదు. రమణితో సరసం తపస్సు చేశాడు: ఫలించలేదు. కమ్మవారిపాలెం ఆస్తివిషయంలో సాయంచేయవలసినదని సుబ్బుల్ని నోరువిడిచి అడిగాడు - వాడు తోసిరాజన్నాడు. రెడ్డి ఔడుకరిచాడు. యీ నాదివాణ్ణి అట్లా విడిచి పెట్టితే ఎట్లా?

"మీకు వెయ్యిరూపాయ లిస్తాను. ఒక తప్పుడు సారాయికేసు ఆసుబ్బడిమీద పెట్టి వాణ్ణి ఒక్కసారి పట్టుకొని, నాచేతి కందియ్యండి. ఈసాయం చేయండి- ఇంక ఇటువంటి కోరిక మిమ్మల్ని కోరను." అని ఆబ్కారీ ఇన్స్పెక్టరుదగ్గరకు వెళ్లి అడిగాడు రెడ్డి. లాభం లేకపోయింది.

౧౫

తెల్లవారింది. ఆరోజు సోమవారం. సుబ్బులూ, రమణీ నిద్రలేవలేదింకా. తలుపులు వేసి నిద్రపోతున్నారు. రమణితల్లి వాకిలి చిమ్ముతోంది. ముసలివాడు లేచి వేపచెట్టుక్రింద పళ్లుతోముకొంటున్నాడు.

చేతిలో లాఠీలూ, నెత్తిన ఎర్రటోపీలూ పెట్టుకొని, ఇద్దరు పోలీసుజవానులూ, సబిన్స్పెక్టరూ వాకిట్లోకి వచ్చి నిలబడి—

"సుబ్బు డెక్కడ" అని అడిగారు.

కమ్మవారిపాలెం మునసబూ, కరణం ఎడంగా నిలబడ్డారు.

"అమ్మా! రమణీ" అని పిలిచింది రమణితల్లి.

కళ్లు నులుముకొంటూ తలుపు తీసి, ఎర్రటోపీలు చూచి బెదురుకొన్నది రమణి. వెళ్లి మామను లేవగొట్టింది. మొలగుడ్డ బిగించుకొంటూ బయటికి వచ్చాడు సుబ్బులు. పోలీసులకు దణ్ణం పెట్టాడు.

"దణ్ణాని కేంగాని - నీమీద చోరీకేసు రిపోర్టు అయింది. నీమొలనున్న వెండిమొలతాడు నువ్వెక్కడ చోరీచేశావు?" అని చెప్పి అతనిరెక్క పట్టుకొన్నారు పోలీసులు.

సుబ్బులు కర్థంగాలేదు. ఇప్పటికి సంవత్సరంగా తాను దానిని పెట్టుకునే ఉంటున్నాడు. అందరికీ తెలిసిన విషయమే.

"ఈమొలతాడు నాదేనండి" అన్నాడు సుబ్బులు.

"నువ్వు సంపాదించావు! స్టేషన్కు పద. పట్టుకోవోయ్." అని ఇన్స్పెక్టరు అనేసరికి, పోలీసు జవానులు అరెస్టుచేసి పట్టుకొన్నారు.

సుబ్బులు లోపలకు పోయి గుడ్డ వేసుకొని వచ్చాడు.

పోలీసు లింట్లోకి పోయి ఏమేమో, సోదాచేసుకొన్నారు. ఇంకేమీ దొరకలేదు.

"మా మామమీద కేసుపెట్టిం దెవరండి?" అని అడిగింది రమణి.

"సొత్తు పోగొట్టుకొన్నవారు."

"ఆయనపేరండి?"

"రావుస్సాహేబు పల్లపోతు రామిరెడ్డీ, ఆయన మేనమామ కొడుకు అయ్యపరెడ్డిని."

"ఏమని వారు పెట్టిన కేసు?"

"అయ్యపరెడ్డీ, రామిరెడ్డీ రెడ్డిగారి పల్లెలో నిద్రపోతుండగా మొన్నటిరాత్రి సుబ్బడు ఇంట్లో ప్రవేశించి, అయ్యపరెడ్డిమొలనున్న వెండిబిళ్ళల మొలతాడు చోరీగాతీసుకొనిపోతుండగా వాళ్ళిద్దరూ చూశామని."

"చిత్తమండి." అన్నది రమణి.

సుబ్బులు నవ్వుకొన్నాడు. ముసలివాడూ, ముసలిదీ గొల్లుమన్నారు. రమణి వాళ్ల నోళ్లు నొక్కింది.

పోలీసులు సుబ్బుల్ని తీసుకొనిపోయినారు. పోలీసుస్టేషన్‌కు పోకుండా రెడ్డిగారి పల్లెలో రామిరెడ్డి కొబ్బరితోటలో, లక్ష్మమ్మ సుబ్బులుకి కట్టించిన యింటికి తీసుకొనిపోయినారు. ఊళ్లో జనం పోగయితే పోలీసులు తరిమివేసినారు. రెడ్డీ, ఇన్‌స్పెక్టరూ లోపలికి వెళ్లారు.

"వచ్చావుటరా సుబ్బా!" అని అడిగాడు రామిరెడ్డి. సుబ్బులు దణ్ణం పెట్టి ఊరుకున్నాడు.

"ఇంతటవయినా చెడిపోక, ఆ దేవుడి మాన్యం రామిరెడ్డికి అప్పచెప్పు." అన్నాడు ఇన్‌స్పెక్టరు.

సుబ్బులు పలకలేదు.

"రామిరెడ్డి నీకు చేసిన మహోపకారానికి ఇప్పుడు ఈమాత్రం సాయం నీవు చేయలేవూ? రెడ్డి పేర దస్తావేజు వ్రాయించి పొలం స్వాధీనంచెయ్యి. ఆతర్వాత కమ్మవారున్నారు. రెడ్డి ఉన్నాడు. కోర్టులున్నవి." అన్నాడు పోలీసు ఇన్‌స్పెక్టరు.

సుబ్బులు పలకలేదు.

"చెరుకా బెల్లం పెట్టమంటే పెట్టుతుందండీ, దాన్ని గానుగలో పెట్టి మరతిప్పితే రసం కారుతుంది." అన్నాడు రామిరెడ్డి.

"అంతపనీ జరగవలసిందేనా" అన్నాడు ఇన్‌స్పెక్టరు.

రామిరెడ్డిచేతిలో పేముబెత్తం. పోలీసుచేతిలో లాఠీ కర్ర! జన్మఎత్తినందుకు సార్థకం అయిపోయింది వాటి జన్మ. సుబ్బులు శరీరం వప్పజెప్పి ఊరుకున్నాడు. అధికార్లిద్దరూ చెరిసగం పంచుకొన్నారు: పందిని బాదినట్లు బాది విడిపించారు.

ఇద్దరూ కాఫీ తీసుకొని, సుబ్బండిమీద వెళ్లిపోతే వెనక పోలీసుజవానులు సుబ్బులుని అరదండాలువేసి తీసుకొనిపోయినారు.

సుబ్బులుకు మంటలెత్తిపోతోంది. శరీరం రక్తపింజర పాములా ఎర్రగా తాటలుతేలిపోయింది.

లక్ష్మమ్మని ఒక్కసారి తలుచుకొని కళ్లనీరు నింపాడు సుబ్బులు. ఆమె కోడల్నీ, మనమల్నీ తీసుకొని, రామిరెడ్డి అత్తగారింటికి వెళ్లినది; ఊళ్ళో లేదని అక్కడ చేరినవారిలో ఒకరు చెప్పారు సుబ్బులుకు.

ఆ తీసుకొనిపోవడం ఏకాఏకీని డిప్టీ కలెక్టరుగారి కోర్టుకు తీసుకొనిపోయి, సుబ్బులుమీద కేసు పెట్టారు. వంటిమీది దెబ్బలు కనిపించకుండా గుడ్డ కప్పుకొన్నాడు సుబ్బులు.

తన పెనిమిటి వట్లా పోలీసులు తీసుకొనిపోయినవెంటనే రమణి, కాంగ్రెసు నాయకులను తీసుకొని, రాఘవయ్యగారి దగ్గరకు పోయింది. రాఘవయ్యగారు సుబ్బులు తరఫున కోర్టులో హాజరయ్యారు.

మొదటి సాక్షీ రామిరెడ్డీ, రెండో సాక్షీ అయ్యపరెడ్డీ బోనెక్కి, దేవుని ఎదుట ప్రమాణం చేసి అంతా నిజం చెప్పుతామని ప్రమాణంచేశారు. ఆరాత్రి వాళ్లిద్దరూ రెడ్డిగారి పల్లెలో నిద్రపోతుండగా, ముద్దాయి ఇల్లు తాళం పగలగొట్టి లోపల ప్రవేశించి అయ్యపరెడ్డి నడుముకు పెట్టుకున్న వెండిబిళ్లల మొలతాడు తీసుకొనిపోతుండగా మేము చూచినామని ఇద్దరూ సాక్ష్యం చెప్పారు. ముద్దాయి తీసుకొనిపోయిన మొలతాడు ఇదేనని రుజువుచేశారు సాక్షులిద్దరూను.

కమ్మపారిపాలెం మునసబు కరణాల సమక్షంలో ముద్దాయివద్ద చోరీసొత్తు పట్టుపరచుకొన్నామనీ, నేరంచేసిన మాట నిజమేనని ముద్దాయి పోలీసు

విచారణలో పెద్దమనుష్యుల ఎదుట ఒప్పుకొన్నా డనీ పోలీసుఆఫీసరు సాక్ష్యం చెప్పారు.

కోర్టువారు సాక్ష్యం అంతా వ్రాసుకొన్నారు. నీవేమి చెప్పతావని ముద్దాయి నడిగారు. నాకేమీ తెలియదన్నాడు ముద్దాయి.

"పోలీసు తెచ్చిన సాక్ష్యం బలంగా ఉన్నం దున నీవు నేరంచేసినట్టు మేము నమ్ముతున్నాం: నీతరఫున ఉత్తరసాక్షు లున్నారా?" అని అడిగారు కోర్టువారు.

"నాకు ఒక్క లక్ష్మమ్మ తప్ప ఇంకెవ్వరూ సాక్షులు లే"రని చెప్పాడు ముద్దాయి.

కోర్టువారు లక్ష్మమ్మని విచారించడానికి కేసు వాయిదా వేశారు.

౧౬

లోకంనోరు మూయడానికి మూకుడున్నదా? లక్ష్మమ్మ కోడల్నీ, మనమల్నీ తీసుకొని యింటికి వచ్చే రావడంతోనే ఊరంతా అట్టుడికినట్టుడికి పోతోంది. రమణిని రెడ్డి చెయ్యిపట్టుకొని లాగిన విషయం, సుబ్బులుని మిలిటరీకి పంపడానికి చేసిన ప్రయత్నాలూ, సుబ్బులుమీద కేసుపెట్టడం, దొడ్లో చావగొట్టడం, జెయిల్లో పెట్టడం - అన్నీ ఆమె చెవిలో పడ్డవి. ఆమె ఏమి చేయగలదు? తన కొడుకు చివరికి రాక్షసు డయిపోయినాడు.

జెయిల్లో ఉన్న సుబ్బు లామెకళ్లల్లో మెదిలే వరకు ఆమెకు దుఃఖం వచ్చి కుంపటిముందు కూర్చుని ముక్కు తుడుచుకొంటోంది. "అమ్మా! ఆకలవు తోంది. నీచేత్తో ఇంతఅన్నం పెట్టమ్మా." అని సుబ్బు లడుగుతోంటే ఆమెగర్భం తరుక్కుని పోతోంది.

"మీరు పెద్దవారు, కంట నీరు పెట్టకం డత్తయ్యా" అని రమణి ఆమెకన్నీరు తుడిచి, పాదాలు ఒత్తుతోంది.

తన కడుపున ఆ రామిరెడ్డికిబదులు సుబ్బులే పుట్టకూడదూ? అరవయ్యేళ్లు వచ్చిన తర్వాత కొడుకు తన ఎదురొమ్ముమీద కుంపటి తీసుకొనివచ్చి పెట్టాడు. ఇంతలో కొడుకువచ్చి—

"అమ్మా, అట్లా కూర్చున్నా వేమి?" అని అడిగాడు. లక్ష్మమ్మ చీదరించుకొన్నది.

"ఆ యానాదివాడు చూశావుగదూ: పెద్దఇంటి వాళ్లం - నిన్ను రచ్చకెక్కించాలని కోర్టులో నిన్ను సాక్ష్యం వేసుకొన్నాడు."

"నన్నా?"

"నిన్నే."

"సాక్ష్యమా?"

"అవును."

"ఏమని?"

"ఏమో?"

లక్ష్మమ్మ పలకలేదు.

"అమ్మా! ఆడదాన్ని నిన్ను వాడు సాక్ష్యం వేసుకొని అవమానపరచవచ్చా?"

లక్ష్మమ్మ తల వంచుకొని కూర్చున్నది.

"వాడి కసలు ఈకేసులో సాక్ష్యం ఎందు కమ్మా, చెప్పూ. నేను పోలీసువారికి సహాయపడి రికార్డు అంతా మనకి అనుకూలంగా సృష్టించిపెట్టాను. ఏదో తెలియకచేశానని కోర్టులో వాడు నేరం ఒప్పు కొంటే తీరిపోదూ? కోర్టువారు పదో, ఇరవయ్యో జుల్మానా వేస్తే ఆపైకం నేనే కట్టి వాణ్ని విడిపించు కొని రాకపోయానా?" అన్నాడు రామిరెడ్డి.

కొడుకుకళ్లల్లో వికారంగా చూచింది లక్ష్మమ్మ.

రామిరెడ్డి కర్థంగాలేదు ఆమెచూపుల్లోని అర్థం.

౧౭

యానాదివాడి కేసులో లక్ష్మమ్మ సాక్ష్యం చెప్పతుందని ఆనాడు జనం తండాలు తండాలుగా వచ్చిపడ్డారు. లక్ష్మమ్మను ముద్దాయి సాక్ష్యం వేసుకోవడం దేనికో ఎవ్వరికీ అర్థంకాలేదు. చోరీ సొత్తు ప్రత్యక్షంగా ముద్దాయిదగ్గర దొరకకనే దొరికింది.

చోరీచేస్తుండగా స్పష్టంగా చూచినట్లు రావుసాహేబూ, అయ్యపరెడ్డీ చెప్పనే చెప్పారు. వాళ్లు అబద్ధ మాడడానికి కారణమేమిటి? లక్ష్మమ్మ ముసలిది - ఏమి చెప్పగలదు కోర్టులో? సుబ్బులుకు రెండేళ్లు శిక్షతప్పదు. అందులో డిస్ట్రిక్టకలెక్టరు చండప్రచండుడు. శిక్షానంతరం వాణ్ణి దొంగయానాదిగా కేడీలలో చేర్చి, రామిరెడ్డి గ్రామమునసబు అయినందున, ఆ కేడీమీద అధికారం యిచ్చి, వాణ్ణి ఆయనగారి స్వాధీనంచేస్తారు. ఇక సుబ్బులూ, రమణీ రామిరెడ్డి చెప్పుక్రింద తేలుఅయిపోతారు.— రామిరెడ్డి పొంగిపోతున్నాడు.

ముందు లక్ష్మమ్మని బోనెక్కించారు. ప్రమాణం చేయించారు. ఆమెఎదురుగా పోలీసుల నడుమ సుబ్బులు. ఒకరి నొకరు చూచుకొని కళ్లనీళ్లు పెట్టుకొన్నారు.

రాఘవయ్యగారు కుర్చీమీద కూర్చుంటే ఆయనవెనకనే నిలబడింది రమణి. ఎదురుగా పోలీసు ఇన్‌స్పెక్టరు. ఆయనప్రక్క రావుసాహేబు రామిరెడ్డి, ఆయనప్రక్క అయ్యపరెడ్డిని.

ముద్దాయి చోరీచేసిన వెండిబిళ్లల మొలతాడు కోర్టువారు తెప్పించి బల్లమీద పెట్టారు.

రాఘవయ్యగారు లేచి—

"అమ్మా!" అని పిలిచారు.

"అయ్యా!" అన్నది లక్ష్మమ్మ.

"రామిరెడ్డి నీకొడుకా అమ్మా?"

"ఆ! నాకడుపునే పడ్డాడండి."

"ముద్దాయి నెరుగుదువా?"

"అయిదోఏడు అప్పటినుండి వాణ్ణి సాకానండి."

"వాని భార్య రమణి నెరుగుదువా?"

"అది నా రెండో కోడలండి."

"ముద్దాయికి నీవు వెండిబిళ్ళల మొలత్రాడు చేయించిపెట్టావా?"

"పెట్టానండి."

"ఎన్నాళ్లయిందీ?"

"సంవత్సరం అయిందండి."

"ఎందుకుగాను చేయించిపెట్టావు?"

"నిరుడు సంవత్సరం నేను, గోదావరి పుష్కరాలకు కోటిలింగాలదగ్గర స్నానంచేస్తుంటే కాలుజారి గోదావరిలో పడి కొట్టుకొనిపోయాను. సుబ్బులు అంత గోదావరిలోనూ దూకి ఈదుకొనివచ్చి నన్ను గట్టునచేర్చాడు. నాకు వొళ్లు స్మారకం తెలియలేదు. సుబ్బులు నన్ను ఇంటికి తీసుకొనివచ్చిన తర్వాత నెల్లాళ్లు ఖాయిలాపడ్డాను. నా కొడుకు రామిరెడ్డి సాలిమనిషిని తీసుకొని బెంగుళూరులో ఉంటే మీఅమ్మకి ప్రాణంమీదికి వచ్చిందని మూడు టెలిగ్రాము లిచ్చినా అతడు ఇంటికి రాలేదు. సుబ్బులు నన్ను బ్రదికించి నాకు చేసిన చాకిరీ నేను మరచిపోలేక సంతోషం కొద్దీ, నూటఏభయి రూపాయలు పెట్టి మొలతాడు చేయించిపెట్టాను. ఎన్ని చేయించిపెట్టినా వాడి రుణం నేను తీర్చుకోగలనాండి?" అన్నది లక్ష్మమ్మ.

"ఆ మొలతాడు ఇదేనా?"

"ఇదేనండి."

లక్ష్మమ్మను బోను దిగుమన్నారు కోర్టువారు.

—

సుబ్బులు నిర్దోషి అని నిరూపిస్తూ, అబద్ధపు కేసు బనాయించినందుకు రామిరెడ్డినీ, అయ్యపరెడ్డినీ అరెస్టు చేసి కోర్టులో పెట్టించారు కోర్టువారు.

కోర్టువా రిచ్చిన మొలత్రాడు కళ్ళకద్దుకొని, కోర్టువారికి నమస్కరించి, లక్ష్మమ్మపాదాలకు సాగిలబడ్డాడు సుబ్బులు.

"అత్తా" అని నమస్కరించింది రమణి.

"నా తండ్రి! నీవే నా కొడుకువు. ఇదే నాకోడలు. ఇంక నేను రెడ్డిగారిపల్లె గడ్డ తొక్కను. నీవద్దనే యానాది సంఘంలో చేరి, పతితులకు సేవ చేస్తాను. పదండి." అన్నది లక్ష్మమ్మ.

గూడువిప్పిన మోటారులో లక్ష్మమ్మని నడుంగా కూర్చోబెట్టి, ఆమె కిరుప్రక్కలా సుబ్బుల్నీ, రమణినీ, రాఘవయ్యగారినీ కూర్చోబెట్టి, మెడలో పూలమాలలు వేసి మేళతాళాలతో "జే! యానాది సంఘాలకు జే! హరిజనులకు జే! కూలీలకు జే!" అని అరుస్తూ కమ్మవారిపాలెం తీసుకొనిపోయారు—అవూరి కమ్మవారూ, యానాదులూ, హరిజనులూనూ.

# త్రిమూర్తి

— శ్రీ సుందరాచారి —

పొడిపొడిమంచుసోనలకు పూచిన పూవులు పంటచేలపై
పడి విడి రాలు ముత్యముల బాటల వెచ్చని పైడితీవియ
ల్వడివడి ప్రాకు సోకు కలవాణుల కంఠము లంటి పల్కులై
విడివడి పిల్వగా కనులపిండుగ దోచె నినుండు ప్రాగ్దిశన్.

తరువుల నీడ నైక పశువితానము లేగగ, గాలి జాలిగా
సరుగ పొదళ్ల పొంచులకు, ఆకులు వాలగ, పూలు సోలగా,
సరసుల ప్రాణికోటి తమ సందడు లాపగ, జీవభావమే
పరువము వీడ, మింటి కెగబ్రాకెను భాను డుదగ్రమూర్తియై.

చిరుగంట ల్రవళింప మంద నడువన్, చేదోడుగా తెమ్మెర
ల్పరువు ల్బూపుచు ముందుముందు కదలన్, పై రేగు గోధూళి పొం
దెరమై లేవగ, చిత్రవర్ణయుతమై దిఙ్మండలంబొప్పగా
మరగ న్పశ్చిమశైల శృంగతటిలో మార్తాండు డుల్లాసియై.



# రాసుల ప్రశంస

= శ్రీ గొబ్బూరు వెంకటానంద రాఘవరావు =

మేషము, వృషభము, మిథునము, కర్కాటకము, సింహము, కన్య, తుల, వృశ్చికము, ధనుస్సు, మకరము, కుంభము, మీనము అను నీ నక్షత్ర రాసులు పండ్రెండును మన పూర్వులకు ఎంతమాత్రమును తెలియవనియు, వాని ప్రశంస వేదములలోగాని, మహాభారతములోగాని ఎక్కడను ఏమాత్రము లేదనియు, చంద్రగుప్తుని కాలములో ఈ దేశమును జయింపవలెనని ఉవ్విళ్లూరుచు వచ్చిన అలెగ్జాండరు మూలముగా పడమటి గ్రీకుల జ్యోతిర్విజ్ఞానము మన భరతఖండమునందు ప్రసరించుటచేత ఆనాటినుండియే మన పూర్వులకు ఈ మేషాదిరాసుల సంగతి తెలిసినదనియు, ఈ విషయమైన విజ్ఞానము మనకు ప్రసాదించినవారు కేవలము గ్రీకులేననియు ఎలుగెత్తి చాటుచున్నవారు పాశ్చాత్యపండితబృందములలోనేగాక హైందవ విమర్శకులలోకూడ పలువురున్నారు.

ఇట్టి వ్రాతలును, విమర్శనములును, అభిప్రాయములును కేవలము నిరాధారములని నేను ఖండించుచున్నాను. సుమారు 16 సంవత్సరములక్రిందట మా కవితాసమితివారి 'వైశాఖి' సంచికకు నేను వ్రాసిన 'నక్షత్రములు' అను వ్యాసములో ఈ రాసుల విషయమై మనము పడమటి గ్రీకులకు ఋణపడియున్నామనుట మిథ్యాపవాదమని వ్రాసియున్నాను. వివరములు వెనుకనుండి వ్రాసెదనంటిని; కాని ఇంతవఱకు వ్రాయనేలేకపోతిని. మిత్రుల ప్రోత్సాహముచేత నేనిపుడీవ్యాసము వ్రాయుచున్నాను.

చాలకాలముక్రిందట కలకత్తా హైకోర్టు న్యాయమూర్తిగా నుండిన సర్ విల్లియం జోన్సు (Sir William Jones) దొరగారు ఈ రాసులు వేదకాలము నాటినుండియు మనవారు ఎఱిగియుండిరని తెలిపియున్నారు. ఇటీవల నలుబది సంవత్సరములక్రిందట Ancient Calenders and Constellations (ప్రాచీనులకు తెలిసిన చుక్కల గుంపులు-పంచాంగ విషయములు) అను చక్కని గ్రంథము రచించిన ఒక (E. M. Plunket) దొరగారు సంస్కృతభాష సరిగా అర్థము చేసికొనుటకు తమకు శక్తి చాలదనియు, ఆ భాష తెలిసినవారు ఈవిషయమై జాగ్రతగా చదివి చెప్పవలెననియు సత్యపరిశోధకదృష్టితో వ్రాసియున్నారు. కాని స్వార్థపరులైన కొందరు పాశ్చాత్యులు ఈరాసులు మనకు గ్రీకులు ప్రసాదించినవేనని వ్రాసినారు. ఆవ్రాతల నాధారముచేసికొని వారికంటెను బిగ్గరగా అట్టహాసములుచేయుచు ఈ జ్యోతిర్విజ్ఞానము మనకు గ్రీకులవలననే లభించినదని మన పండితులు కొందరు ప్రకటనచేయుచున్నారు.

ఏదైన ఒకవిషయము ఒకరివలన మనము తెలిసికొనినపుడు ఆవిషయము వారివలన తెలియవచ్చినదని అంగీకరించుట ఉభయులకు గౌరవప్రదము. కాని నిశ్చయముగా మన పూర్వార్జితమైన విజ్ఞానమును, మన పైతృకధనమైన విజ్ఞానమును, వారసత్వముచేత మనకు హక్కుగా దఖలుపడిన విజ్ఞానమును ఇట్టిదని గుర్తించి నిజస్వభావము వెలుఁగలేకపోవుట మిక్కిలి శోచనీయమైన దుస్థితి. అజ్ఞానమునకు తోడు అది యితరుల ఆస్తియనుకొని, దానిని మనము బదులు తెచ్చుకొన్నామని, మనము వారికి ఋణపడియున్నామని భావించుకొను దుర్దశను ఏమని చెప్పవలెనో తెలియకున్నది. మన పూర్వఋషుల తపోమహిమ, కృషి, విజ్ఞానస్వరూపము లెట్టివో తెలిసికొనుటకు ఏంతమాత్రము ప్రయత్నముచేయక కన్యాశుల్కనాటకములో గురజాడవారి 'గిరీశము' కంటె పెద్దగొంతుకతో "మనవాళ్లు వట్టి వెధవాయ

లోయ్" అని వారి నెంత గర్హించిన నంత గొప్ప యనుకొని యూరేగు మహానుభావులను కొందరిని పుత్రులనుగా బడసిన భరతమాతదురవస్థ దుఃఖముగొల్పు చున్నది. విమర్శకులు వేదముల మూలమంత్రములను స్వయముగా చదివి, సరిగా అర్థము చేసుకోగలిగిన యెడల సత్యదూరములును, నిరాధారములు నైన వ్రాతలకు, విమర్శనములకు అవకాశ ముండక పోవును.

వేదములలోను, పంచమవేదమైన మహాభారతములోను ఈ పండ్రెండురాసులు ఏవిధముగా గుర్తింపబడి వ్యవహరింపబడెనో, అవి కాలక్రమమున నేమేమి మార్పులు పొందెనో నాకు బోధపడినంతవఱకు సంగ్రహముగా వివరింపబూనుకొన్నాను. కాని ముందుగా ఒక ముఖ్యాంశమును గూర్చి రెండు ముక్కలు వ్రాయకతప్పదు.

క్రీస్తుపూర్వము 870 సంవత్సరములో గ్రీసు దేశములో యూడోక్సస్ (Eudoxus) అనే పండితుడు జ్యోతిశ్శాస్త్రమును వచనగ్రంథముగా గ్రీకుభాషలో వ్రాసెను. మరి తొంబది యేండ్లకు, అనగా క్రీ. పూ. 280 సంవత్సరములో ఆదేశములోనే 'సోలి' (Soli) విషయ వాస్తవ్యుడైన Aratus (ఏరటస్) కవి Phainomena అనే పద్యకావ్యమును యూడోక్సస్ వచనగ్రంథము ననుసరించి వ్రాసెను. ఈకావ్యములో చుక్కలగుంపుల రూపములు చక్కగా వర్ణింపబడినవి. అటుపిమ్మట నూటనలుబది యేండ్లకు, క్రీ. పూ. 140 సంవత్సరములో హిప్పార్కస్ (Hipparchus) అను గణకుడు నక్షత్రముల పట్టికలను తయారుచేసెను. వీని నాధారపరుచుకొని మరిరెండువందల యెబ్బది యేడేండ్లకు 'తురుమాయి' (Ptolemy) అనువతడు చుక్కలను గూర్చి గొప్పపట్టీలతో Catalogue of stars తయారుచేసినాడు. ఈచుక్కల పట్టీ క్రీ. శ. 137 సంవత్సరములో Almagest (అల్మజెస్టు) అను పేరుతో రచింపబడెను. గ్రీకునక్షత్రవిజ్ఞానమునకు మూలములైన యూడోక్సస్ వచనగ్రంథముగాని, ఏరటస్ కావ్యముగాని వారు స్వయముగా పరిశీలించి చూచిన నక్షత్రవర్ణనలు గావు. అంతకు పూర్వము 1500 సంవత్సరములక్రిందట, అనగా ఇప్పటికి నాలుగువేలసంవత్సరములక్రిందట చాల్డియా, అస్సీరియా మొదలగు దేశములవారి గ్రంథముల నాధారము చేసికొని వ్రాసినట్లు ఋజువు కనబడుచున్నది.

కాబట్టి ఈ రాసులు స్వతంత్రముగా గ్రీకులు కనిపెట్టినవి కావు. వాటి వర్ణనలు కూడా వారు స్వతంత్రముగా చూచి వ్రాసినవి కావు; వేలకొలది సంవత్సరములకు పూర్వము ఇతర ఖండస్థులును, దేశస్థులును కనిపెట్టి వ్రాసిన వ్రాతల నాధారముచేసికొని వారు గ్రంథములు రచించుకొనినట్లు స్పష్టమగుచున్నది. మరొక విషయమేమనగా:- వృశ్చికరాశిలోని వృశ్చికముయొక్క బలవత్తరములగు ముందుడెక్కలు కన్యారాశి వఱకు వ్యాపించియున్నట్లు భావింపబడుచుండె ననియు, అందువలన వృశ్చికము డెక్కలసహా రెండు రాసుల స్థలమాక్రమించుటచే లెక్కకు పదకొండు రాసులే ఉండెననియు, తునకలు అను నర్థమిచ్చు Libra పదము గ్రీకుల అనంతరము రాజకీయ ప్రాముఖ్యతను పొందిన రోమనులలో గొప్ప కవీశ్వరుడైన Virgil మొదట వాడుకలోనికి తెచ్చెననియు ఒక (Maunder) దొరగారు వ్రాయుచున్నారు. అసలు గ్రీకుల రాసులు పదునొకండా, పండ్రెండా అనికూడ సందేహము కలదు. ఈ యుపోద్ఘాతము ఇంతతో చాలించి, ఇక ఒక్కొక్క రాశినే చర్చించి చూతము.


## మేషము

అశ్విని, భరణి, కృత్తిక $\frac{1}{4}$ — ఇవన్నియు చేరి మేషరాశి యేర్పడుచున్నది. కృష్ణయజుర్వేదమునందలి నక్షత్రేష్టిప్రకారము అశ్వినికి అశ్వినీ దేవతలును, భరణికి యముడును, కృత్తికకు అగ్నియు అధిదేవతలు. కృత్తికలో ఒక పాతికభాగము మాత్రము మేషములో కలదుగాని తక్కిన మూడు వంతులును వృషభరాశిలో కలవు. క్రాంతిచక్రములో మేషము పైని కృత్తిక, అనగా అగ్నిదేవుడు కలడు. కాబట్టి అగ్నికి మేషము వాహన మని శ్రుతి. "మేషారూఢమ్" అని అగ్నిస్తోత్రము. దేవతలకు మానవులు సమర్పించు హవ్యకవ్యాదులు అగ్ని అందుకొని ఆయా దేవతలకు అందిచ్చుచుండు నని మనవారి విశ్వాసము. కాబట్టి దేవతలందరితోను అగ్నికి సంబంధ

మేర్పడినది మేషప్రశంస కల ఋగ్వేదమంత్రములు మచ్చునకు రెండు:—

"అభిత్యం మేషం......" (I 51-1)

"త్యంసు మేషం......" (I 52-2)




ఉత్తరార్ధగోళము

## వృషభము

ఇందు కృత్తిక ¾ + రోహిణి + మృగశిర ½ గలవు. అశ్వినీనక్షత్రములకు అధిదేవతలు అశ్వినులని తెలిసికొన్నాము. వేదఋషులు కవులు; వైజ్ఞానికులు; చుక్కల వేటకాండ్రు. అశ్వినులకు ఎదురుగా ఒక ప్రక్క ఈ వృషభరాశి యున్నది. రెండవప్రక్క శింశుమార మను ఘోరగ్రాహరూప మున్నది. మంత్ర ద్రష్టలైన వేదఋషుల భావనలో అశ్వినులు తమ రథమునకు ఒకప్రక్క వృషభమును, ఒకప్రక్క శింశుమారమును పూన్చికట్టి రథము తోలుకొని వెడలు చున్నట్లు కనబడుట సహజము. కాబట్టి ఋగ్వేదము (I 116-18) లో "ఓ అశ్వినులారా! మీ రథమునకు ఒకప్రక్క వృషభమును, రెండవప్రక్క శింశుమారమును పూన్చబడిన" వని వర్ణింపబడినది. "రథో వాం

"వృషభశ్చ శింశుమారశ్చ యుక్తా." అని కనులకు కట్టినట్లు చక్కగా వృషభరాశిని, ఘోరగ్రాహమును వర్ణించిన వర్ణన ఈ నాటికిని నక్షత్రమండలములో మనము చూచుచున్నాము. నక్షత్రాత్మకమైన వృషభరాశియేగాక ప్రక్కనున్న నక్షత్రశింశుమారము (Cetus the monstrous whale) కూడ మన వేదఋషులకు బాగుగా తెలియునని కర్కోటకునివంటి విమర్శకునికైన ఒప్పించుటకు ఈ శ్రుతిప్రమాణ మొకటి చాలును. వృషభరాశిప్రశంస స్పష్టముగా గల మరి రెండు ఋక్కులను దిగువ వ్రాయుచున్నాము:

"వస్యైశృంగం నోదకమాభరన్త్వర్త్తరో ధరోవహతి ప్రదేదిశన్"... (X 102-10.)

(ఈరోజ్దు గడ్డి తినదు. నీళ్ళు త్రాగదు. అయినప్పటికి ఉత్తరధ్రువ నక్షత్రమున కీరల దిక్కులు తెలుపుచుండును.)

ఈ మంత్రము నక్షత్రమండలమునందలి వృషభరాశివర్ణన మని వ్యాఖ్యాన మనవసరము.

వృషభరాశినిగూర్చి ఇచట వ్రాయుచున్న మూడవ మంత్రము చాల ప్రాముఖ్యము గలది. సకల శ్రౌతస్మార్త కర్మలలో అత్యవసరమైన అగ్ని ప్రతిష్ఠ చేయునపుడు ఈ మంత్రము తప్పక చదువుదురు:

"చత్వారి శృంగా త్రయో అస్య పాదా ద్వే శీర్షే.........వృషభో రోరవీతి.........." (ఋగ్వేదము IV 58-3.)

వృషభరాశియొక్క రూపము మీరు ఏనక్షత్రపటములో చూచినను, ఆకాశముమీద నీనక్షత్రముల కూర్పు గమనించినను నాలుగుకొమ్ములు, మూడే పాదములు, అస్పష్టములై రెండై తోచు బుర్రలలోనే కానరాగలదు. అగ్నిదేవతాత్మకమైన కృత్తికనక్షత్రము నీవృషభరాశిలో నుండుటవలన అగ్ని నావాహనచేయునపు డీరూపముతో నీవృషభమును వర్ణించుచుండుట అవసరమైనది. ఇటీవల వేదార్థము చెప్పు పండితులు ఆకాశమువంక చూచుట మానినారు; ఈ మంత్రము నందు వృషభరాశివర్ణన గలదని గమనించుట లేదు. సరేకదా, కేవలకర్మకాండ పరముగాను, వ్యాకరణ పరముగాను అర్థము చెప్పుచు తృప్తిపడుచున్నారు. అటుపైని వారేమేమి యర్థములు చెప్పి సమన్వయించుకొనినను సంతోషమే; కాని అసలు అగ్నిదేవతాకమైన కృత్తికనక్షత్రము లెందులో నున్నవో ఆ దివ్యవృషభము, జ్యోతిశ్చక్రాంతర్గతమైన తారకామయవృషభము అందు వర్ణింపబడినదను సంగతి గమనింపక, గ్రామఫోను ప్లేట్లవలెను, చిలకపిట్టలవలెను మంత్రములు వల్లించి కర్మకాండ నడుపుచుండుట చూడ మిక్కిలి దుఃఖము కలుగుచున్నది.

## మి థు న ము

ఇందు మృగశిర ½ + ఆర్ద్ర ౧ + పునర్వసు ¾ ఉన్నవి. మిథున మనగా వియోగము లేని దాంపత్యము గల దివ్యమిథునము. "జగతః పితరౌ వందే పార్వతీ పరమేశ్వరౌ" అని మహాకవి కాళిదాసు వర్ణించిన గౌరీపరమేశ్వర మిథునము. వృషభముపై నధిరోహించు మిథునము. మన కనుల కగపడు జ్యోతిశ్చక్ర పరిభ్రమణములో తూర్పున ముందుగా వృషభరాశి ఉదయమగును. అటుపిమ్మట మిథునరాశి ఉదయమగును. అపుడు వృషభము మీదను, మిథునము క్రిందను కనబడును గనుక పార్వతీ పరమేశ్వరులకు వృషభము ధ్వజమని చెప్పదగియుండును. ఈరాసులు పడమట అస్తమించునపుడు వృషభము క్రిందను, మిథునము మీదను కనబడును. అప్పు డీదంపతులకు వృషభము వాహనమని చెప్పవచ్చును. శివాలయములలో లింగమున కెదుట నుండు రాతినందిరూపము రాసులలో వృషభరాశిచిహ్నము.

## గౌరీపూజ - గౌరమ్మ సంబరములు

అర్ధనారీశ్వర దంపతులలో స్త్రీ వ్యక్తి గౌరి. ఈశ్వరు డామెకు అర్ధదేహముతో మనస్సు ఇచ్చియున్నాడు. వారి దాంపత్యము వియోగము లేనిది. భర్త మనశ్శరీరములను ఆమెవలెనే వశముచేసికొని స్త్రీలు విదుషలై మేనువట్లు గౌరియే వరము ప్రసాదించగలదు. వివాహమును, ఐదువతనమును కోరు పెండ్లికూతుండ్రు లగ్నమునకు పూర్వము గంపలో

కూరుచుండి గౌరినే పూజింతురు; ఈ యాదిమ దంపతుల వంటి అనురాగములో ఐదువతనమును వరము కోరుదురు. నక్షత్రరూపులైన గౌరీపరమేశ్వరుల దర్శన భాగ్యము రాత్రి ఏ వేళను లభించని మాసము మిథున మాసము. ఐదువతనము ప్రసాదించు మంగళగౌరి దర్శనము దొరకని దగుటచేత ఈ మిథునమాసము వివాహముల కయోగ్యమని పెద్దల నిర్ణయము. తరువాతి మాసములో సూర్యోదయమునకు పూర్వము ఈ పుణ్యదంపతుల దర్శనము తూర్పున నగును. కావున శ్రావణ మంగళవారములు ముఖ్యముగా మంగళగౌరిని పూజింప దగినవి. శ్రీకృష్ణుని పెండ్లాడగోరిన రుక్మిణికూడ "నమ్మితి నామనంబున సనాతనులైన యుమామహేశులన్ మిమ్ము పురాణదంపతుల మేలు భజింతుగదమ్మ" అని వేడుకొనినది. చాల్డియా, అసీరియా దేశములలో కూడ మిథునమాసమును 'శివమాస' మనియే వ్యవహరించినట్లు ఇటీవలి పరిశోధనలవలన తేలినది. వీరి నాగరకత గ్రీకుల నాగరకత కంటె అధమము 1500 సంవత్సరముల ముందు. అనగా ఇప్పటికి నాలుగు వేల సంవత్సరములకు పూర్వము. శ్రావణ మాసములో సూర్యోదయమునకు పూర్వము ఉదయించు మిథున రాశి మార్గశిర - పుష్యమాసములలో సూర్యాస్తమానమయిన వెనుక తూర్పున నుదయించును. అప్పుడే మన దేశములో వ్యవసాయదారులు మొదలగువారు గౌరమ్మ సంబరములు చేయుదురు.

పైని వివరింపబడిన విశేషము లన్నియు మన పూర్వులకు గ్రీకులు నేర్పినవేనా అని నా సవాలు.

## కర్కాటకము

పునర్వసు ¼ + పుష్యమి + ఆశ్లేష — ఇవి ఇటీవల కర్కాటకరాశిగా పరిగణింపబడుచున్నవి. వీటిలో ఆశ్లేష చుక్కలకు సర్పము అధిదేవత. ఋగ్వేదములో ఇవి 'అహి' యని వర్ణింపబడినది. దీని కెదుట నున్న దివ్యాశ్వము — పేద్వఘాశ్వము — 'అహిహన' మని వేదము వర్ణించుచున్నది. పుష్యమి ఋగ్వేదములో 'తిష్యమి' అని వర్ణింపబడినది. 1 తిష్యమి "నీహారేణ ప్రావృతా" — తెల్లని పొగమంచువలెను, పొట్టపూవువలెను ధవళధవళమై తోచు నొక చుక్కమబ్బు (Nebula). ఈ చుక్కమబ్బునకు ఉత్తరమున నొకటి, దక్షిణమున నొకటి-కనపడియు కనబడని చిన్న చుక్కలు రెండు కలవు. దృశ్యాదృశ్యము లగు నీ రెండుచుక్కలును రెండు గాడిద లనియు, వాటిమధ్య మబ్బువంటి దృశ్యము పెండి తొట్టె యనియు, ఈతొట్టెలోనే ఈగాడిదలు మేత మేసి కడిటి త్రాగుచుండుననియు గ్రీకుకవి అరేటస్ వర్ణించినాడు.

"Like a little mist
Far north in the Cancer's territory it floats
Its confines are two faintly glimmering stars;
These are two Asses that a Manger parts."
(Maunder. Page 42).

వేదములో అశ్వనులు జంటదేవతలు. వీరికి మూడుస్థానములు కలవు. ఒకటి అశ్వినీనక్షత్రస్థానము. ఈస్థానములో వీరి రథమునకు వృషభశింశుమారములు చెరియొక ప్రక్కను పూన్చబడుట పైని వివరింపబడెను. రెండవది పునర్వసుస్థానము. పునర్వసుచుక్కలలో ఉత్తరపుకొన నున్న జంటచుక్కలను పాశ్చాత్యులు Castor and pollux అను సోదరు లని వర్ణించుచున్నారు. ఋగ్వేదకాలములో ఈ జంట చుక్కలను అశ్వనులుగా వర్ణించినట్లు కనబడుచున్నది. ఈస్థానములో అశ్వనులకు గాడిదలే వాహనము. ఈయంశము ఋగ్వేదములో అనేక చోట్ల స్పష్టముగా వర్ణింపబడియున్నది. 2 పుష్యమి చుక్కమబ్బు పెండికంచమనియు, దాని కటునిటు గల చుక్కలు గాడిదలనియు పడమటి దేశస్థులు వ్రాసిన విషయము పయిని చూచియున్నాము.

ఈజిప్టుదేశస్థులు పుష్యమిచుట్టు గల చుక్కల రూపును 'Scarabaeus' అని వర్ణించిరి. ఇది మన పేడపురుగువంటి యొక పురుగురూపము. మరికొన్ని దేశములలో కొందరు జ్యోతిష్కులు ఈరాశిని Lobster

1. V 54-13. "నయోయుచ్ఛతి తిష్యోయథా"
2. I 34-9. "కదాయోగో వాజినో రాసభస్య".

అనియు, crayfish అనియు వర్ణించిరి. ఇందు Lobster అనునది సముద్రపు జలజంతువు; Cray-fish అనునది గాజురొయ్యవంటి చేపరూపము.

ఋగ్వేదములో కొన్నిచోట్ల ఇంద్రుడు శంబరు డను రాక్షసుని సంహరించినట్లు వర్ణింపబడినది. ఈశంబరుడు 'కౌలితరుడు' 1 అనగా కులితరు డనువాని పుత్రుడు. శంబరు డను రాక్షసుని ప్రద్యుమ్నుడు సంహరించినట్లు పురాణకథ లున్నవి. ఈరాశికి ఎదురుగా వృశ్చికముయొక్క కొండె - ధనుస్సు మొదటిభాగము ను ఉన్నవి. మూలకూడ వృశ్చికరాశిలో చేరినపుడు జ్యేష్ఠ కధిదేవతయైన ఇంద్రుడు శంబరదానవుని సంహరించినట్లు భావింపవచ్చును. అట్లుగాక మూల ధనుస్సులో చేర్చినపుడు ధన్వియగు మన్మథుడు, మన్మథాంశజాతుడైన ప్రద్యుమ్నుడు శంబరుని చంపినట్లు చెప్పవచ్చును. 'కులితర' శబ్దములో మూడవది యగు 'త'వర్ణము ఏకారణముచేతనైన లోపించినపుడు రెండవదియగు 'లి'వర్ణము దీర్ఘమగునని వైయాకరణులు తెలుపుచున్నారు. అపుడు 'కులీర'శబ్ద మేర్పడును. కులీర మనగా ఎండ్రి; కర్కాటకము.

వేదములో శ్రవిష్ఠ యని పేర్కొనబడిన నక్షత్రములను మనము 'ధనిష్ఠ' అని చెప్పుచున్నాము. వీటి కధిదేవతలు వసువులు. భీష్ముడు వసువులలో నొకడు. భీష్ముని పడద్రోయుటకు అర్జునుడు శిఖండిచే ముట్టించి దారుణబాణప్రయోగము చేయజొచ్చెను. ఆబాణములు భీష్ముని శరీరము చొచ్చి ప్రాణాంతకమగు వేదన కలుగజేసెను. అపుడు భీష్ము డిట్లనెను:

"అర్జునస్య ఇమే బాణా
నేమే బాణా శ్శిఖండినః,
కృంతంతి మమ గాత్రాణి
మాఘమాసే గవా ఇవ"

(ఈబాణములు శిఖండివి కావు. ఇవి అర్జునుని బాణములే. కాబట్టి నాప్రాణములు తీయుచున్నవి. ఈనుచున్న ఎండ్రిగర్భము భేదించుకొని దాని సంతానము వెలికివచ్చునపుడు ఆతల్లికి ఎటువంటి మరణవేదన కలుగునో నా కట్టి వేదన కలుగుచున్నది సుమా) 2.

## సింహరాశి

ఋగ్వేదములో ఇంద్రుడు ఎన్నెన్నో ఘనకార్యములు చేసినట్లును, ఎన్నో అద్భుతకార్యములు నిర్వర్తించినట్లును పలుతావులలో వర్ణింపబడినది. అందొకటి మేకచేత సింహమును చంపించుట (చూ: ఋగ్వేదము VII-18-17):

"అధ్రేణచిత్తద్వేకం చకార సింహ్యం చిత్పేత్వేనాజఘానా"

(అల్పునిచే ఘనకార్యము నిర్వర్తింప జేసితివి. ఇంద్రా! నీశక్తిని ఏమని కొనియాడవచ్చును? నిరుపమానముకదా! మేకచేత సింహమును చంపించితివి) ఇట్లు వర్ణించుటకు కారణ మేమనగా-సింహరాశి అస్తమించువేళకు అజరాశి ఉదయించును. ఇటీవల మనము దేనిని మకర మనుచున్నామో, దానినే వేదములో అజమని వ్యవహరించుచుండిరి. అజరాశి సగము మేక, సగము చేప. ఈ రాశిని పాశ్చాత్యులు Capricorn అందురు. ఆ పదమునకు 'సముద్రపుమేక' (Sea goat) అని అర్థము. ఈ రాశిముఖము, ముందటికాళ్లు, సగము శిరిరము మేకరూపము; మిగిలిన సగముశరీరము, తోకయును చేపరూపము. మకరరాశి ప్రశంససందర్భమున ఈ రాశివర్ణనము వివరముగా వ్రాసెదము. స్పష్టముగా సింహరాశిప్రశంస గల మరియొక వేదమంత్రము నీ దిగువ వ్రాయుచున్నాను (చూ: ఋ. V. 83-3):

"దూరాత్ సింహస్య స్తనథా ఉదీరతే
యత్పర్జన్య కృణుతే వర్ష్యం నభః"

---

1. IV 30-14. "ఉతదాసం కౌలితరం బృహతః".

2. డా॥ వి. రాఘవన్ మొదలగు పండితు లీయర్థము చెప్పుచున్నారు. మాఘమాసము గోవులకు వలె ఈబాణములు భీష్మునికి ప్రాణాంతకరమైన వేదనను కలిగించుచున్న వను అర్థము నే నిదివఱకు భారతిలో వ్రాసియుంటిని. మాఘమాసములో ధనిష్ఠ అస్తమించువేళకు కర్కాటకము ఉదయమగును. ఆరాశిని చూచి భీష్ము డీయుపమానము చెప్పినను చెప్పవచ్చునని కూడ తోచుచున్నది.

(వర్ష మేఘములకు అధిపతియైన పర్జన్యుడు నభోరంగమును తన మేఘములతో నింపినపుడు సింహగర్జనము దూరమునుండి వినవచ్చుచున్నది) ఇక్కడ గమనింపవలసిన విశేష మేమనగా—వర్షాకాల ప్రారంభదినములలో సింహరాశి సూర్యాస్తమాన మగునప్పటికి పడమటిదిశకు బాగుగా వ్రాలి అస్తమింపబోవుచుండును. కనుక దూరమునుండియే ఈ రాశి గర్జించుచున్నట్లు భావనకు కారణమగుచున్నది.

## కన్యారాశి

ఋగ్వేదములో కన్యారాశి పలుతావులలో బహువిధనామములతో వర్ణింపబడినది. ఈ రాశికి అరమతి యని యొక పేరు కనబడుచున్నది (చూ: ఋ. V. 43-6):

"అనో మహీ మరమతిం సజోషా గ్నాం దేవీ నమసా రాతహవ్యాం, మధో ర్మదాయ బృహతీమృతజ్ఞా మాగ్నే వహ పథిభి ర్దేవయానైః"

(మాకు అనుకూలుడవగు ఓ అగ్నీ! దేవయానమార్గమున అరమతి యను దేవిని మా కొఱకు తీసికొనిరమ్ము. ఆ దేవికి మేము వినతులమై కానుకలిచ్చి పూజించి ధన్యులమయ్యెదము.) ఈ కన్యకు రోదసి యనికూడ మరొక పేరు కలదు.

"మిమ్యక్ష యేషు రోదసీను దేవీ..." (VI 50-5.)

"అధ స్మైషు రోదసీ స్వశోచిరామవత్సు తస్థౌ న రోకః" (X 66-6.)

"పరావీరా స ఏతనమర్యాసో భద్రజానయః అగ్నితపో యథాసథ" ( ,, 61-4.)

ఇక్కడ మనము గమనించవలసిన విషయము స్వాతినక్షత్రము వాయుదైవత్యమనుట. ఉత్తర రెండవ పాదము మొదలు హస్తమీదుగా చిత్రసగమువఱకు కన్యారాశి. సప్తమరుత్తులు స్వాతిపరిసరముల గలరు. మరుత్తు లేడ్వురకును ఈ రోదసి ఏకభార్య. విడువక ఆమె వారి నంటియేయున్నది. తేజస్సునకు తేజము ప్రసాదింపగల ఉజ్జ్వలరూపముతో ఆమె భయంకరులగు మరుత్తులమధ్య తేజరిల్లుచున్నది. ఓ వీరవరులారా! చక్కని భార్యతో కూడుకొనిన పెండ్లికొడుకులారా! మీరు ఈమెను కూడి దూరముగా వెడలి, వెచ్చగా కాచుకొని హాయిగా నుండుడు!

మహాభారతకాలమునాటి ఈ రోదసి ద్రౌపది యైనది. కన్యదిగువ ఇంద్రాగ్నిదైవత్యమైన విశాఖ యున్నది కనుక ద్రౌపది అగ్నికుండసముద్భవ, అయోనిజ అయినట్లు వర్ణింపబడినది. ఆకాశమున పరిభ్రమించు మీనరాశిని—మత్స్యయంత్రమును నూటిగా బడజేసిన అర్జునుని వరింపదలచియు, తుదకు ఈ రాశి చుట్టును గల పంచపాండవులకు ధర్మపత్ని యైనది. పితరు లధిదేవతలైన మఘనక్షత్రము ధర్మరాజు; ఉత్తరఫల్గునీనక్షత్ర మర్జునుడు; స్వాతీనక్షత్రము భీముడు; అశ్వతరమండలములోని జంటచుక్కలు నకులసహదేవులు. ఈ యైదుగురు భర్తలమధ్య నీ కన్య 'పంచపర్వతములనడుమ నదియుంబోలె' మెలిగినది. ఇంద్రియములు విషయరతిం బరిగ్రహించునట్లు పంచపాండవు లీమెను పరిగ్రహించిరి. పాపాత్ముడగు దుశ్శాసనుడు పట్టి విప్పి యీడ్చిన శిరోజములతో కూడ ఈ కన్యారూపమును మనము స్పష్టముగా ఆకాశమున చూడగలము. అర్జునీనక్షత్రము, అనగా ఉత్తరఫల్గునీనక్షత్ర ముదయించి మీనరాశిని పడగొట్టినవెంటనే, ఫాల్గునమాసమున సప్తమీరోహిణీదివసమున ద్రౌపదీవివాహము ఆకాశరంగమున నద్భుతముగా ప్రదర్శింపబడుచున్నది.

## తులారాశి

"భరతామపయద్రపో ద్యౌః పృథివి క్షమా
రపో మోషు తే కించనామమత్." (X. 59-10)

(భూమ్యాకాశము లేకమై లజ్జాకరమైన అన్యాయవర్తనములు తలయెత్తకుండ దుంపనాశనము చేసి, మునుముట్ట పశుపాతకోషముల నిర్మూలించి తుడిచి వేయుగాక! ఏ పాపములును, ఎట్టి దుఃఖములును మిమ్మునంటక బాధింపక యుండునుగాక.)

తులారాశి చిత్రార్ధము, స్వాతి, విశాఖ ¾ ల మధ్య నున్నది. విశాఖవఱకు, అనగా అశ్వినిమొదలు విశాఖవఱకు గల నక్షత్రములు ఉత్తరార్ధగోళములో

మన్నవి. కాని విశాఖమొదలుకొని క్రాంతివృత్తము నందలి తారలు దక్షిణార్ధమునకు మరలుచున్నవి. ఇచ్చట శాఖాంతరము ప్రాప్తించుటచేత నీ చుక్కలకు 'వి-శాఖ'యని పేరు వచ్చెనని చెప్పుచున్నారు. గతి నందును; దివారాత్రములుకూడ సమానత్వము నొందును. అసలు క్రాంతివృత్తము ఇచట రెండు సమానభాగము లగుచున్నది. పక్షపాతము లేని న్యాయమున కీరాశి యునికిపట్టు అనదగియున్నది. విశాఖ




దక్షిణార్ధగోళము

తుల యనగా సరిగా తూచి పంచుటకు కొలుచు తక్కెడ-త్రాసు. మన కవసరమైన పెక్కు విషయము లీరాశిలో సమానత్వము నొంది పరిపడుచున్నవి. సూర్యు డీరాశి చేరినపుడు శీతోష్ణము లెక్కువ తక్కువలు లేక సమ

ఇంద్రాగ్ని దైవత్యము. వేదకాలము నాటి అగ్ని వేదిక యిది. గుండ్రముగా నుండు నగ్నిగుండ మిది. పక్షపాతములేని న్యాయమూర్తి, మత్స్యదేశాధీశుడగు శిబి చక్రవర్తి అగ్ని పరీక్ష కాగి నిలిచిన పవిత్రస్థాన మిది.

డేగయై ఇంద్రుడును, పావురమై అగ్నియు పక్షిరూపములతో శిబిని పరీక్షింపవచ్చిరి. డేగ పావురమును తఱుముకొనివచ్చెను. పావురము శిబిని శరణుజొచ్చెను. శిబిచక్రవర్తి కపోతమునకు అభయమిచ్చెను. "నానోటి ముందటి తిండి పడగొట్టి పాపము కట్టుకోకు. పావురము నాకు వేదవిహితమైన ఆహారము. వదిలిపెట్టు"మని వాదించినది డేగ. "నీకు కావలసిన మాంసము నేనిచ్చెదను. నీవు ఆకట నకనక పడవలదు" అని చెప్పినాడు శిబి. "మంచిది. నాకు నీమాంసమేకాని ఇతర మక్కరలేదు" అనినది డేగ. "సరి. ఈ పావురమంత బరువుగల మాంసము నా శరీరమును కోసి యిచ్చెద"నని శిబి తుల కాలు తెప్పించి, పావురము నొక ప్రక్కనుంచి, రెండవప్రక్క మాంసము తన శరీరము కోసివేయుచు తూచెను. ఎంత కోసి మాంసమిచ్చినను పావురము ఎత్తుకు సరిపోలేదు. తుదకు తన శరీరమంతయు ఇచ్చివేసినపుడు ఆతని ధర్మనిరతికి మెచ్చి ఇంద్రాగ్నులు నిజస్వరూపములతో ప్రత్యక్షమైరి. ఇంద్రాగ్ని దైవత్యమైన విశాఖానక్షత్రమునకును, వారిద్దరి సమక్షమున తన శరీరము ఇచ్చివేసిన శిబిచక్రవర్తియొక్క తులకును అవినాభావసంబంధ మేర్పడినది. నక్షత్రమండలములో నది తులారాశియై శాశ్వతముగా నిలిచినది. విశాఖాగ్నికుండమునుండియే ద్రౌపది జనించినది. ఇంకొక విశేష మేమనగా—చాల్డియా, అసీరియా, అక్కేడియా దేశములవారి మాసనామములలో ఏడవ మాసము పేరు "తుల్కు." సంస్కృత "తుల" శబ్దమునకును, ఈ "తుల్కు" శబ్దమునకును గల సంబంధము ప్రత్యక్షము. మాండర్ దొరగారి వ్రాతలను పట్టి చూడగా, తేలుయొక్క ముందరికొక్కులుకూడ దీయగా వచ్చిన వృశ్చికరూపమేగాని ప్రత్యేకముగా తులారాశి గ్రీకులకు తెలిసినట్లే కనబడదు. అనాదిగా నున్న వేదకాలపు టగ్నివేదికను, ఇంద్రాగ్నులను, శిబిచక్రవర్తిని, అగ్నికుండసముద్భవ ద్రౌపదిని, ఎవరియంశ మందు ద్రౌపది జనించెనో ఆభవాని - తులజాతను పూర్తిగా మఱచి, తులారాశి మాకు గ్రీకుల ప్రసాదమని చిందులు ద్రొక్కుదు మేని, ఈ ద్రోహమునకు నిష్కృతి కనబడదు. విశాఖయే రాధ. దీనితరువాత వచ్చునది అనూరాధ.

## వృశ్చికము

వృశ్చికరాశి వేదఋషులకు బాగుగా తెలిసినదే. ఋగ్వేదము ఏడవ మండలమునందలి ఏబదియవ సూక్తమంతయు ఈవిషపుపురుగునుగూర్చి రచింపబడెను. జ్యేష్ఠనక్షత్ర మీరాశిలోనిదే. ఇది ఇంద్రదైవత్యము. "వృశ్చిక, కర్కట, వేణు, రంభ" అనగా తేలు, ఎండ్రి, వెదురు, అరటిచెట్టు - వీటికి సంతాన ప్రాప్తి వినాశమునకేనని చెప్పుదురు. వృశ్చికరాశిలోనివాడైన ఇంద్రుడు జననమొందుచు, దేహము చాలించుచున్న తన తల్లివైపు జాలిగా చూచుచున్నట్లు చమత్కారముగా ఋగ్వేదమున వర్ణింపబడినది. పునర్వసు నక్షత్రము అదితిదైవత్యము. అదితి దేవతల కందరకును, ముఖ్యముగా ఇంద్రునికి తల్లి. జ్యేష్ఠ ఉదయించినపుడు అదితి—పునర్వసు—అస్తమించును. ఇంద్రుడు జన్మించినపుడు అతని తల్లి అస్తమించును. సంతానము కనుచు తల్లి మరణించుట వృశ్చికలక్షణము. ఇంద్రుడున్న వృశ్చికరాశికి భంగములేకున్నను వృశ్చికసంతతికి మాతృమరణకారణమగుట లక్షణముకనుక పునర్వసు అస్తమించుట మిషగా ఇంద్రునికి ఈకీటకధర్మ మారోపించుచు ఈఋక్కు చమత్కారముగా రచింపబడినది. ఈరాశిలోని నక్షత్రముల ఉదయక్రమమును, అదేవేళకు పునర్వసుప్రాంతనక్షత్రములు అస్తమించుటయును బాగుగా గమనించువారికే ఈదిగువమంత్రములు అర్థముకాగలవు:

(IV., 18-1.) "అయం పంథా అనువిత్తః పురాణో యతో దేవా ఉదజాయంత విశ్వే, అతశ్చిదా జనిషీష్ట ప్రవృద్ధో మా మాతర మముయాపత్తవేకః" (2) "నాహమతో నిరయా దుర్గహైత త్తిరశ్చతా పార్శ్వాన్నిర్గమాణి, బహూనిమే అకృతా కర్త్వాని యుధ్యైత్వేన సంత్వేనపృచ్ఛై" (3) "పరాయతీమాతర మన్వచష్టన నానుగా న్యనుగమాని."

ఇందు మొదటిమంత్రము క్రాంతివృత్తము (Ecliptic)నకు అన్వయించుకోవలెను.

"పురాతనకాలమునుండి దేవతలందరును ఏ మార్గము ననుసరించి వచ్చుచుపోవుచున్నారో ఆమార్గ

మిదిరే. ఈమార్గము ననుసరించిరే జననము నొంది గొప్పవారు కావచ్చును. ఇతరత్రా మర్త్యదేవతల వినాశము సమకూర్పరాదు.

(2) ఈమార్గము చాలా ఇఱుకుగా ఉన్నది. దీనివెంబడి పోరాదు. ప్రక్కబడి జాయగా నేను వెడలెదను.

(3) చనిపోవుచున్న తల్లివైపు ఇంద్రుడు జాలి గొల్పునట్లు దీనముగా చూచెను."

## ధనుస్సు

వృశ్చికము తరువాతి రాశి ధనుస్సు. ధన్విని గూర్చిన ఋగ్వేదమంత్రములు మూడుమాత్రము ఈ దిగువ వ్రాయుచున్నాను:

"యామర్త్యాయ ప్రతిధీయమాన మిత్కృశానో రస్తు రసనాముదష్యథ". (I. 155-2.)

"సృజద్యదస్మా ఉ అవహాక్ష పజ్జ్యాం కృశాను రస్తా మనసా భురణ్యన్". (IV. 27-3.)

"స ఇదస్తేవ ప్రతి దదిష్యచ్ఛిశీత తేజోయసోన ధారం". (VI. 3-5.)

ఇందు మొదటిదానిలో కృశాను డను దేవత తనచేతనున్న వింటికి బాణము సంధించి గురిచూచి మనుష్యునిపై ప్రయోగింపబూనుట వర్ణింపబడినది. రెండవదానిలో ధన్వి చలించిన చిత్తముతో వింట బాణము సంధించి నారి లాగి వానిపై బాణప్రయోగము చేసినట్లున్నది. వాడియైన లోహపుటంచువలెనే తన తేజస్సు నతిశయింపజేసికొనుచు ధనుర్ధారి వింటి కలుగు సంధించుట వర్ణింపబడెను. కృశానుడే పిమ్మట మన్మథుడు, ప్రద్యుమ్నుడు నని పురాణములు వర్ణించుచున్నవి. ఆర్ద్రానక్షత్రము రుద్రదైవత్యము. ధన్వి, మన్మథుడు ఆరుద్రకు ఎదురు. ఆర్ద్ర ఉదయమైనపుడు మన్మథుడు అస్తమించును. ఈయంశము నాధారముచేసికొనియే ఈశ్వరుని కంటిమంటలో పడి మన్మథుడు భస్మమాయెనని మనవారు వర్ణించుచుందురు. ఇటీవల వైజ్ఞానికుల పరిశోధనలవలన తేలిన ఆర్ద్రానక్షత్రవిషయములు కొన్ని తెలిసికొనినగాని కామదహనమునకు అర్థము సరిగా మనకు బోధపడదు. కాబట్టి కొన్ని వాక్యము లందునుగురించి ఈ దిగువ వ్రాసెదను.

ఇరువదియైదు వేల మైళ్ల చుట్టుకొలత గల మన భూగోళములు పదకొండులక్షలైనగాని మన సూర్యగోళపరిమాణమునకు చాలదు. సూర్యగోళములు రెండు కోట్ల ఏబదిలక్షలైనగాని ఒక ఆర్ద్రానక్షత్రపరిమాణమునకు చాలవు. అమెరికాలో విల్సన్ పర్వతముపై ప్రతిష్ఠింపబడిన టెలిస్కోపులో ఈ ఆర్ద్రను చూచిన ఒక వ్యక్తి ఇట్లు వర్ణించినాడు: "మన సూర్యగోళము లెన్నికోట్లు కూడిన నీ నక్షత్రాగ్నికి సరిపోవునో ఎవరు లెక్కించగలరు ? విజృంభించి ఎగయు నా జ్వాలల గర్జితములుకూడ చెవులబడి భీతింపజొచ్చినవి. ఆ జ్వాలలను చూడగలమా ? చూచినది మరువగలమా ? నమ్మగలమా ?" ఇండ్లు కాలునపుడు రేగు మంటలను చూచితిమి. మన గ్రంథములలో నున్న కార్చిచ్చుల వర్ణనలు చదివితిమి. వాల్మీకి వర్ణించిన లంకాదహనము, వ్యాసుడు వ్రాసిన ఖాండవవనదహనము, వెనుక లండన్ నగరములో చెలరేగిన మహాగ్ని వర్ణనలను చదివితిమి. 1812 లో మాస్కో నగరదహనము ప్రత్యక్షముగా చూచిన నెపోలియన్ "ఇంత ఘోరము, భయంకరము, మహనీయము నైన దృశ్యము ఈ లోకములో నెవ్వరును ఎన్నడును చూడలే"దని వక్కాణించినాడు. ఇంత చూచినది వంద, రెండువందల మైళ్లకు మించిన పరిమాణము గల చిచ్చుకాదు. ఆర్ద్రనక్షత్రపుచిచ్చులో నీ చిల్లరచిచ్చులన్నియు సముద్రములో కాకిరెట్టలు. రుద్రుడు బ్రహ్మాండపరిమాణము, మహాగ్నిమయము నైన నక్షత్రరాజముని తెలిసికొనియే మనవారు ఈశ్వరుడు భయంకరాగ్నిమూర్తి, ఫాలాక్షుడు నని వర్ణించినారు.

ధన్వికి మీదనున్నది సగముచేపరూపము గల అజము. కావుననే మన్మథుడు మీనకేతనుడు, ఝషకేతనుడు నని వర్ణింపబడినాడు. అజము పోయి మకరము వాడుకలోనికి వచ్చినతరువాత మన్మథుడు మకరధ్వజుడైనాడు.

## అజ రాశి

మేకను పెట్టి ఇంద్రుడు సింహమును చంపిన సంగతి సింహరాశివర్ణనలో తెలిపికొంటిమి. వేదములో పలుతావులందు ఈ మేక పూషుడను దేవతరథమునకు కట్టబడినట్లు వర్ణింపబడినది. పూషుడు రేవతినక్షత్రమునకు అధిదేవత. మీనరాశిలోని రేవతి ఉదయమగుసరికి మేక ఉదయించి చాల మీదకు పోవును. ఋగ్వేదతలో కవితాచమత్కృతిని మేళవించిన వేదఋషుల భావనలో అజము పూషుని రథముముందుండి దానిని లాగుచున్నట్లు తోచెను.

తరువాత అజము మకరముగా మారినది. అప్పుడు మన్మథుడు మకరధ్వజుడైనాడు. మకరము వరుణునకు వాహనమైనది. ఈమకరమే గజేంద్రుని పట్టి పల్లార్చి గజేంద్రమోక్షణకథకు కారణమైనది.

## కుంభ రాశి

వరాహమిహిరాచార్యులు వ్రాసిన బృహజ్జాతకమునందును, వ్యాఖ్యానములందును కూడ కుంభమనగా రిక్తకుంభమనియు, అది యొకని భుజములపై నున్నదనియు వర్ణన లున్నవి. "స్కంధేషు రిక్తః పురుషస్య కుంభః" (భుజమునందు ఉత్తకడవను దాల్చిన పురుషుడు) అని యందు తెలుపబడినది. యూరపుఖండమునుండి మనకు వచ్చు ఏజ్యోతిశ్శాస్త్ర గ్రంథమునందును, ఏనక్షత్రపటమునందును, రాసుల చిత్రములలోను రిక్తకుంభము కనబడదు; ఒక పురుషుని భుజముపై అసలే కానరాదు. ఒకానొక దివ్య పురుషుడు పూర్ణకుంభమును దిగువభూమిపై నీరు పడునట్లు వంచి పట్టుకొనిన చిత్రములే కానవచ్చుచున్నవి. శతభిషనక్షత్రమునకు అధిదేవతయైన వరుణుడు ఒక పెద్ద కుంభముతో నీరు భూమిపై దిమ్మరించుచున్నట్టే చక్కగా ఋగ్వేదములో వర్ణింపబడియున్నది. (V 85-3) "నీచీనబారం వరుణః కవంధం ప్రససర్జ రోదసీ అంతరిక్షం తేన విశ్వస్య భువనస్య రాజా యవం నవృష్టి ర్వ్యునత్తి భూమ" (జలపూర్ణమైన పెద్దకుంభమును వరుణుడు వంచిపట్టుకొని రోదసీఅంతరిక్షముల దిగువ భూమిపై నీరు కుమ్మరించుచు జలప్రదానము చేయుచున్నాడు. వాడిన యవచేనికి వానచినుకులవలె ఈ కుంభవృష్టి లోకమున కత్యంతోపకారి.) ఎడతెగక పెద్దవర్షములు కురిసినప్పుడు మనవారు "కడవలు కుమ్మరించుచున్నట్లు వాన కురియుచున్న"దని చెప్పుదురు. అట్టి వర్షమునకే సంస్కృతములో కుంభవృష్టి యని పేరు. ఈ నాడు కూడ వర్షముల కెదురుచూచునపుడు చంద్రుడు ధనిష్ఠాపంచకములో నుండు దినములను ప్రతీక్షింతురు. ధనిష్ఠ తరువాతి నక్షత్రము శతభిషము. అది కుంభరాశిలోనిది; వరుణు డధిదేవతగా గలది. చంద్రు డానక్షత్రములలో నున్నప్పుడు వర్షయోగ మందురు.

పైని వివరించినట్లు వేదములో వరుణుడు జలప్రపూర్ణకుంభధారియనియు, నిండుకడవ కుమ్మరించుచు భూమికి జలము ప్రసాదించుచున్నాడనియు స్పష్టముగా వర్ణింపబడియున్నను, అనాదికాలమునుండి మన దేశస్థులు వర్షయోగమునకు ధనిష్ఠలతో చంద్రసమాగమము కోరుచున్నను, పెద్దవానలు కడవలు కుమ్మరించినట్లు కురియుచున్న వను వానుడి ఈ దేశములో ఏనాటినుండియో వినబడుచున్నను, బృహజ్జాతకకారుడును, అతని గ్రంథము ననుసరించు జోస్యులును ఈ పరునొకండవ రాశిని భుజములపై వట్టికుండ పెట్టుకొనిన మానవునిగా వర్ణించుటకు కారణమేమో నే నూహింపజాలకున్నాను. ఇది ఆకాశముమీద కనబడు చుక్కల రూపము కాదు. గ్రీకులు వర్ణించిన కుంభరాశి కాదు.

మరి ఇది మన కెందుకు అబ్బినది? ఈ వట్టి కుండను మనకు ఎవ రంటగట్టినారు? ఎప్పు డంటగట్టినారు?

ఇటీవలికాలమునందు భారతీయులు స్వాతంత్ర్యము గోలుపోయి ఉగ్రరోగములతో తీసికొనుచు, ఘోరకాటకములబడి చచ్చుచు ప్రొద్దుట ప్రొయ్యిలో నిప్పు మొదలు సమస్తజీవితావసరములకు పరదేశములపై నాధారపడుచు, వ్యక్తిత్వముతో వివేకముకూడ గోల్పోయి దురవస్థల కుందుచుందురని సూచించుటకా, తొంటి పూర్ణకుంభము హరించి దరిద్ర శూన్య కుంభమును మన కంటగట్టినారు?

## పేద్వఘాశ్వము

కుంభరాశి తరువాత మీనరాశిచర్చకు దిగక ముందు, మన వేదగాథలను తీసికొని గ్రీకులు తమ వాఙ్మయమున నెట్లు చేర్చుకొనిరో చూపుట కొక ఉదాహరణము నిచ్చుచున్నాను. పేదు అనువా డొక రాజఋషి. అశ్వినీదేవతలకు వానియం దభిమానము కలిగి వారు వాని కొక పెంకెగుఱ్ఱమును బహుమాన మిచ్చిరి. పేదు + అఘ + అశ్వము = పేద్వఘాశ్వము అయినది. ఇది అహిహానము. ఏలయనగా ఈయశ్వము ఉదయించినపుడు ఆశ్రేషాదిగానున్న మహాహిరూపము అస్తమించును. దీనికి డేగవంటి రెక్కలు, లేడికాళ్ల వంటి కాళ్లు కలవు: "శ్యేనస్య పక్షా హారిణస్య బాహూ" అని వేదము. దీని మెడజూలు స్వర్ణమయము. ఈ వివరములతోనే గ్రీకుపురాణగాథలలో పెగసస్ (Pegasus) అను గుఱ్ఱము వర్ణితము. పేద్వఘాశ్వము గ్రీకుల నోళ్లలో బడి నలిగి పెగసస్ అయిపోయినది.

## మీ న రా శి

పంౘెండు రాసులలో నిది కడపటిది. ఇందు రెండు చేప లున్నవి. నక్షత్రరూపము గల యీచేపల తోకలొకదాని కొకటి వింతపాశముతో కట్టబడినవి. ఆకాశమున నీపాశమును పరిశీలించినను, లేక నక్షత్రపటమును జాగ్రతగా పరికించిచూచినను ఈపాశములో కొన్నివిశేషములు కనిపెట్టదగును. ఇది నిడుపుగా పరిగాచున్న త్రాడు కాదు. చుట్లును,ముడతలును కలిగి ఈపాశము వంకరటింకరగా తోచును. జాగ్రతగా చూచినపక్షమున నిందు పెద్దచుట్లు మూడును, చిన్న ముడతలు నాలుగును మొత్తము ఏడువంక లున్నవి. ఈ పాశము విశ్వము యొక్క నైతికపరిపాలకుడును, ప్రభువు నైన వరుణుని పాశము. వరుణుడు "The Moral Lord and Sovran of the universe" అని వేదఋషుల భావము. అతడు అసత్యము నెంతమాత్రము సహించడు. అబద్ధికుల నీపాశముతో బంధించి శిక్షించును. కాని పరమక్షమాశీలుడు. కరుణామయుడు. వరుణపాశము ఋగ్వేదములో పెక్కుచోట్ల వర్ణింపబడినది. (I. 24-15; 25-21; VI-74-4; X. 85-24) అథర్వవేదములో వరుణునిగూర్చియు, వరుణపాశమును గూర్చియు వివరములతో కూడిన చక్కని వర్ణనము కలదు. (అథ 4. 16-6)

వరుణుడు జలస్థానాధిపతి. సముద్రపు మేక, శింశుమార మను గ్రాహము, మీనరాశిచేపలు లోనగు జలచరములు అతని వశవర్తులు. జలప్రపూర్ణకుంభమును తలక్రిందుగా పట్టుకొని ఎడతెగని జలప్రదానముచే నతడు భూలోకమును తనుపుచున్నాడు.

వరుణబలగమునకు అర్జునుడు ప్రతిస్పర్థి. ఉత్తరఫల్గుని(అనగా అర్జునుడు) ఉదయించగానే, అవలకు ఆకాశముమీద స్వేచ్ఛగా తిరుగుచుండిన మీనరాశి చేపలు రెండును అస్తమించి అదృశ్యములగును. వీటికి సూటిగా ఎదురుగా నున్న అర్జును డీయంత్రమత్స్యములను తెగనేసెనని భారతమునందు వర్ణితము. మీనరాశి అస్తమించినతరువాతనే కన్య ఉదయించుటయు, ద్రౌపదివివాహమును ఖగోళమున ప్రదర్శితములగును. అటువిమ్మటి కథకూడ వేదములో చక్కగా వివరింపబడినది. ఘోరారావముతో దుశ్శాసనుని రాక, ఒక స్త్రీయొక్క దుర్భరదుస్థితి, మానభంగభయము, కురుశ్రవణప్రశంస, జూదపుపాచికల అద్భుతశక్తులు, జూదరి దురవస్థ మొదలగునవి ఋగ్వేదమునందు దశమమండలములోనున్న 33, 34, 35 సూక్తములలో నద్భుతముగా వర్ణింపబడినవి. ఈసూక్తములలోని మూలకథను పెంచి వివరములతో వ్రాసిన నది పంచమవేద మనబడు మహాభారత సంహిత యైనదని చెప్పవచ్చును.

## మ ం గ ళ ము

ఆదిత్యాదినవగ్రహాః శుభకరా
మేషాదయో రాశయః
నక్షత్రాణి సయోగకాంశ్చతిథివత్
తద్దేవతా స్తద్గణాః
మాసాబ్దా ఋతవ స్తథైవదివసా
సాంధ్యా స్తథా రాత్రయః
సర్వే స్థావరజంగమాః ప్రతిదినం
కుర్వంతు మే మంగళమ్.

# మనోవిశ్లేషణ: స్వరూపస్వభావాలు

★

— 'ఒకరు' —

ఒక విషయాన్ని అవగాహనచేసుకోటం, దేన్నైనా కోరటం, భావోద్వేగాన్ని పొందటం అనే మూడున్నూ మనస్సుకు సంబంధించిన అంశాలు. ఈ అంశాల్ని నిరూపించే శాస్త్రమే మనస్తత్వశాస్త్రం (Psychology). ఈశాస్త్రానికి నిత్యవ్యవహారంతో అట్టే సంబంధం లేదు. క్రిమిశాస్త్రం అంటే సాధారణమైన మనిషికి ఎంత కుతూహలం ఉంటుందో, మనస్తత్వశాస్త్రమన్నా అంతే కుతూహలం ఉంటుంది.

అయితే, ఈశాస్త్రం ఇటీవల మన మనస్సుకు సంబంధించిన క్లిష్టసమస్యల్ని అనుశీలిస్తూ, ఎదుటివారి మనోభావాల్ని, చర్యల్ని అర్థంచేసుకొనేరీతి తెల్పటానికి ప్రయత్నించే మనో-విశ్లేషణశాస్త్రం (Psyco - Analysis)గా మారింది. కనుక సాంఘిక జీవితంలో ఇది అత్యంతముఖ్యమైన స్థానాన్ని చేకూర్చుకొంది. మనుష్యులు ఒకళ్లనొకళ్లు సరిగా అర్థంచేసుకొని, స్నేహభావంతో ప్రవర్తిల్లటానికిగాను ఈ శాస్త్రం అమితంగా ఉపకరిస్తుంది.

ఈశాస్త్రంకూడా మొదట్లో ఫ్రాయిడ్, జంగ్, ఎడ్లర్ అనే ముగ్గురు జర్మనువైద్యుల పరిశీలనలోనే తన స్వరూపాన్ని గుప్తంగా దాచిఉంచుకొంది. ప్రథమప్రపంచయుద్ధం ముగియటంతోనే యూరపులో ఉన్న వైద్యశాలలన్నిటికీ కావలసినంత పని తగిలింది. రుగ్ణశరీరాల్ని బాగుచెయ్యగలిగినా, మనోవ్యాధుల్ని ఎట్లా పసిపట్టి నయం చెయ్యాలో మామూలు వైద్యులకు అర్థంకాలేదు. "మనోవ్యాధికి మందు లేదు" అనేగా జనవాక్యం! అప్పటికే ఒకవిధమైన నిదానాన్ని అవలంబించి, కుదరవనుకున్న మనోవ్యాధుల్ని కుదురుస్తున్న పైముగ్గురి పేర్లూ, వారు నిర్మించిన మనోవిశ్లేషణశాస్త్రమున్నూ ఈసమయంలో అమితమైన ప్రఖ్యాతిని ఆర్జించుకొన్నాయి. అంతేకాకుండా, వారెంతో ప్రయోజనకరమని నమ్మిన విషయాలు నలుగురినోళ్లలో పడి అపాయకరంగా పరిణమించాయికూడాను. పాండిత్యసంబంధం లేనివారు కూడా ఈ శాస్త్రం అంటే చెవికోసుకోటం ప్రారంభించారు. దీనికి కారణం, ఈశాస్త్రం నిత్యవ్యవహారంతో సంబంధించింది అవటమే.

ప్రతిరోజూ నలుగుర్తో కలిసిమెలిసి వ్యవహరించే ప్రతివాళ్లకూ, లేక సంఘజీవియైన ప్రతిమనిషికీ, మనస్సుకు సంబంధించిన సమస్యలనేకంగా ప్రతిదినమూ వస్తూంటాయి. ఫలానా పుల్లయ్య ఎంత చక్కగానో ఆఫీసుపని చేస్తాడని మెప్పుపొందాడు. కాని అతగాడికెప్పుడూ అదోవిధమైన భయమున్నూ, ఇబ్బందులున్నూ ప్రత్యక్షమవుతూంటాయి మనోనేత్రంలో. ఫలితంగా తోటివాళ్లతో అతను కలిసి రాలేడు. దీనికి కారణం ఏమిటి? ఇంకో ఎల్లయ్య బయట నలుగురితోనూ చక్కగా కలిసిమెలిసి తిరుగుతూ ఎంతో మంచివాడని పేరు సంపాదించుకున్నాడు. కాని ఆఫీసులో తన క్రిందివాళ్లకు నృసింహావతారమే! ఇట్లా వ్యవహరించటానికి ఏమంటాం? లేకపోతే నేను ఇంకో రామయ్యమీద ఎప్పుడూ దోషారోపణచేస్తూ, అతణ్ణి ఉడికిస్తూ ఉంటాను—ఇందులోవి అంతర్యమేమిటి? ఆరోగ్యంగానూ, బలంగానూ ఉండవలసిన ఫలానా ఆవిడ ఎప్పుడూ ఆపసోపాలు పడుతూ, అలసిపోయినట్టు కనిపిస్తూ, ఏం పనీ చేసే శక్తి లేక తలనొప్పితోనో, లేక నడినెప్పుభారంతోనో సతమతం అవుతూంటానికి కారణం ఏమిటి? మంచి

---

* జెరాల్డిన్ కాష్టరు ననుసరించి.

సంరక్షణలో ఉన్న ఒక శిశువుకు అప్పుడప్పుడు మూర్ఛమాదిరిగా—బయటకు ఏమీ కారణం కనిపించకపోయినా—వస్తూంటుంది. ఇది ఎందువల్ల ?

ఇల్లాంటి విషమసమస్యలనేకంగా మనకు అహరహమూ తారసిల్లుతూ ఉంటాయి. ఇవి మనకు సంబంధించో, లేక మన కుటుంబంలో ఉన్నవాళ్లకు సంబంధించో, లేక మనం ఎరిగున్నవాళ్లకు సంబంధించో ఉంటాయి. వీటిని చాతుర్యంతో పరిష్కరింపగలిగే బుద్ధిశక్తి తరుగుపడినచోట సౌఖ్యం ఉండదు. ప్రతిద్వంద్వులుగా వ్యవహరించే వ్యక్తులు ఏ రీతిగా వ్యవహరిస్తే బాగుంటుందో అనే విషయానికి కీలకాన్ని తెలియజెప్పే ప్రయత్నంలో ఈ మనోవిశ్లేషణశాస్త్రం మనకు ముఖ్యంగా సాహాయ్యకారి అవటంవల్ల ఇది అనుసంధానయోగ్యమే.

అదిన్నీ కాకుండా, మనముండే ప్రస్తుత కాలంలో చాల మందికి మందుబుడ్లు అంటే నమ్మకం పోయింది. మందుబొట్లకు స్వయంగా వ్యాధిని కుదిర్చే శక్తి లేకపోయినా, ఏదో పుచ్చుకున్నామన్న విశ్వాసబలిమిచేతనే రోగం చాలామటుకు నయమవుతున్నదన్న విషయం పామరజనానికికూడా అవగతమయింది. ఇల్లాంటి పరిస్థితుల్లో మందుకు బదులుగా ఏది సేవ్యం అనే ప్రశ్నకూడా వస్తోంది.

మందుకు బదులుగా మనశ్శక్తిని (Spiritual healing) ఉపయోగించి, వ్యాధుల్ని పారదోలే అద్భుతాల్ని మనం గమనిస్తూనే ఉన్నాం. ఇది భావనాబలాన్ని ఇతరులమీదికి ప్రయోగించి వార్ని నిరామయులుగా చెయ్యటం అనే రూపంతోనూ, భావనాబలాన్ని తనమీదనే ప్రయోగించుకొని (Auto-suggestion) స్వాస్థ్యాన్ని తనకుతానే పొందటమూ అనే ద్వివిధరూపాల్తో ప్రపంచమంతటా ప్రత్యక్షమవుతోంది. ఇటీవల పాశ్చాత్యదేశాల్లో హిక్సన్ (Hickson) అనే ఆయన మొదటిపద్ధతినిన్నీ, కో (Monsuier Cowe) అనే ఆయన రెండోపద్ధతినిన్నీ ప్రచారంచేసి ఖ్యాతిని సంపాదించారు. అదే మాదిరిగా ఈ మనోవిశ్లేషణశాస్త్రంకూడా స్వపరిజ్ఞానమూ స్వస్వభావసంవేదనమూ వ్యాధినివారణకు తోడ్పడతాయని నిరూపిస్తోంది.

స్వపరిజ్ఞానము అనే మాట మనుష్యజాతి పుట్టుకతోటే పుట్టింది. దీనివల్ల ఉండే లాభాన్ని మనుష్యుడు ఆదిలోనే గ్రహించాడు. ప్రపంచంలో ఉన్న మతాలు అన్నిటిలోనూ మనకు లభించే ముఖ్యవిషయాల్లో ఇదొకటి. మనస్సులోపలికి చొచ్చుకోపోయి అది పనిచేసే విధానాన్ని గమనించి, ఆ లోగుట్టును బయటకుతీయటంఅనేది అంత చులకన అయిన పనికాదని బాగా తెలిసిన విషయమే. ఎన్నో ఉపాయాలు పూర్వం ప్రచారం చెయ్యబడ్డాయి. ఇప్పుడుకూడా ఎన్నో ఉపాయాలు ఉద్ఘోషింపబడుతున్నాయి. కాని ఇక్కడ ముఖ్యంగా గమనింపవలసిన ఒక చమత్కారం ఏమిటంటే : సామాన్యంగా అవలంబింపబడే ధ్యానపద్ధతి ఈస్వపరిజ్ఞానానికి ఆవగింజంతైనా ఉపయోగపడదు. వీళ్లకు తమ ఆంతర్యం బోధపడనేపడదు. ఇంకా వీళ్లకన్న ముక్కుమూసుకోకుండా హుషారుగా నలుగుర్తో కలసి తిరిగేవాళ్లే ఈ విషయంలో నయం. ఎందుకంటే, వారవలంబించే ధ్యానపద్ధతివల్ల మనస్సు భావోద్వేగోద్వేలితంగానే ఉంటుందికాని సక్రమచింతన చేసే స్థితిలో ఉండదు. కాని ఈ నవీనశాస్త్రం ఒక సూత్రాన్ని నిర్మించి, ప్రయోగార్హమైన ఒక ప్రణాళికను అవలంబించి, మనస్సుయొక్క ఆంతర్యాన్ని గుర్తించేటందుకు తోడ్పడుతూ, వ్యాధినివారణకుకూడా తోడ్పడుతోంది. "నీవు సత్యాన్ని తెలిసికొంటే, అది నిన్ను ముక్తుణ్ణి చేస్తుంది."

మనోవిశ్లేషణశాస్త్రానికి సంబంధించిన, వివిధ ప్రస్థానాల్నీ, వాటి మహాత్మ్యాన్నీ, అవి ఉద్భవించిన రీతుల్నీ, వాటి పారిభాషికనియమాల్నీ చర్చించటం ఇక్కడ సాధ్యంకాదు. మనస్సులో దాగిఉండే సుప్తభావాల్నీ, పరిగత్తే తలపుల్నీ, సాధ్యేపోకడల్నీ, పొందే ఉద్వేగాల్నీ గమనించటంవల్ల, వ్యాధిపీడితుడు అంతవరకూ అనుభవిస్తున్న శారీరకవికృతులున్నూ, మనస్సుకు సంబంధించిన లోపాలున్నూ

తొలగిపోవటం ఎట్లా తటస్థిస్తోంది? అనే విషయాన్ని మనం ఇక్కడ విశదంగా ఆలోచిద్దాం.

“ఇటా, అటా?” అనే సందిగ్ధావస్థ మనకు అపరిచితంకాదు. మనస్సుకో, లేక భావోద్వేగానికో సంబంధించిన ద్వంద్వయుద్ధంలో దిగి, ఒకేసారిగా రెండు వైపులకూ లాగబడుతూన్న విచిత్రపరిస్థితి మనలో అందరికీ తటస్థపడేదే. ఇలాంటి రాద్ధాంత పరిస్థితి ఎదురుపడ్డప్పుడు కలిగే హాయికూడా మనకు తెలిసిందే. “రెండిట్లో ఏది చెయ్యాలో తెలిసివచ్చినప్పుడు, ఇక నేను దాన్ని చెయ్యటానికి వెనకాడను” అని అప్పుడు మనం నిబ్బరంగా అంటాం. ఇలాంటి సందిగ్ధావస్థలో పడ్డాం అని మనకు గోచరిస్తే, మనం దాన్ని ఏదో ఒకవిధంగా పరిష్కరించుకొని, ఆ స్థితిలోంచి బయటకు వస్తున్నాం. ఈ మనోవిశ్లేషణ శాస్త్రం చెప్పే దేమిటంటే: వాళ్లకు తెలీకుండానే మనలో చాలామంది “ఈ రెండువైపులకూ లాగబడటం” అనే విచిత్రపరిస్థితిని అనుభవిస్తున్నారు.

మనుష్యుని అంతరంగం-చేతన—చాలా జటిలమైంది. అంతరంగాన్ని ఒక మహాసముద్రంతో పోలిస్తే, మనం సామాన్యంగా ‘మనస్సు’ అని వ్యవహరించేది పైపైన కనిపించే జలభాగమే. మనకు కనపడకుండా అగాధమైన జలభాగం ఎంతో మిగిలిపోయి ఉంటుంది. అదే సుప్తచేతన (Unconcious mind) సముద్రంలో నిమ్నభాగానికి చెందిన నీరు నిరంతరంగా ఉపరితలభాగానికి చెందిన నీటితో కలుస్తూ ద్రవ్యగుణత్వంలోనూ, తాపంలోనూ వైవిధ్యాన్ని సృష్టిస్తున్నట్లే సుప్తచేతనకూడా అవచేతనయొక్క చింతల్నీ, చర్యల్నీ సరిదిద్దుతూ ఉంది. ఫలితః, మనస్సులో ప్రత్యక్షచేతన, సుప్తచేతన అని రెండు భాగాలున్నాయని గ్రహించాలి.

సామాన్యంగా మనం చేసే ప్రతిపనినీ ఈ సుప్తచేతనలోంచి ఉద్భవించిన ప్రోత్సాహాలయొక్క ఫలితమే అయిఉంటుంది. స్నానాహారనిద్రాదిదైనిక కృత్యాల్ని మనం ధారాళమైన మనస్సుతో చేస్తూ, ఒకప్పుడు వాటిని మనం కష్టంమీదనే నేర్చుకొన్నాం అనే విషయం మరచిపోతాం. వాట్ని గురించి ఆలోచించాల్సిన ప్రమేయం లేకుండానే నిర్వర్తించాలని మనకు తెల్సు. ప్రస్తుతం మనం నిరభ్యంతరంగా వ్రాస్తూ చదువుతూ, వీటిని ఎంత చిక్కుల్లో పడి సాధించవలసివచ్చిందో విస్మరిస్తాం. ఆ విషయాలన్నీ మగ్నచేతనలో విలీనమైపోతాయి. సుప్తచేతనలో అంతర్లీనంగా ఉన్న భావోద్రేకబీజాలు సరాసరిగా ప్రత్యక్షచేతనమీద పనిచేస్తాయి. పిస్గ, లేక మొహమాటం జాస్తిగా ఉన్న వాళ్లే అత్యంత వికటంగానూ, మూర్ఖంగానూ, అతిపరిచయంగానూ ప్రవర్తిస్తూ, పోటి కర్థు లేకుండా, ఇతరులకు వెగటు కలిగించేటట్లు మాట్లాడుతూ ఉంటారు. వాళ్లు తమలో ‘పిస్గ’ అంతర్లీనంగా ఉందనే విషయాన్నే గమనించలేరు.

ఈ సుప్తచేతనయొక్క ఆకారవిస్తృతీ, అగాధ రహస్యరూపాల్నీ గమనించి శాస్త్రజ్ఞులే దాన్ని ఎల్లా నిర్వచించాలో తెలిసికోలేకుండా ఉన్నారు. ఈ శాస్త్రజ్ఞులు అడుగుపెట్టింది సామ్రాజ్యంయొక్క సరిహద్దుల్లోనే. ఈ రాజ్యంలో ఎగుడుదిగుడైన రెండు భాగాలున్నాయి అనినీ, ఒకదాంట్లోంచి మంచి భావాలున్నూ, ఇంకోదాంట్లోంచి పాశవిక భావాలున్నూ ఉద్భవిస్తున్నాయనినీ కొందరి మతం. అయితే, దీన్ని మానసిక తత్త్వశాస్త్రజ్ఞులందరూ ఒప్పుకోకపోయినా, కొన్ని విషయాల్ని గ్రహించటానికి ఇది తోడ్పడుతుంది.

మనం విస్మరించిన పూర్వానుభవాలు ఈ సుప్తచేతనలో ఇమిడిఉంటాయి. అంతే కాకుండా, మనస్సుకూ శరీరానికీ సంబంధించిన మన అలవాట్లన్నిటికీ కూడా బీజం ఇందులోనే నిహితమై ఉంటుంది. మనం మామూలుగా సహజాలు (instinctive) అని అనుకొనే భయాలకీ, అభిరుచులకీ, ఏవగింపులకీ కల కారణాలుకూడా ఇందులోనే దాక్కొని ఉంటాయి. నీకు ఎవరింటికైనా పనిమీద వెళ్లినప్పుడు తలుపుకొట్టి పిలవట మనేది నామోషీయే కాకుండా అసలు కిట్టని విషయమే అయిఉండవచ్చు. కాని, దీన్ని నీ మనస్సు ఒప్పుకోదు—అతిస్వల్పవిషయం అవటంవల్ల. అయినప్పటికీ, తలుపుకొట్టి పిలవకుండా ఉండటానికే నీవు

కతవిధాలా ప్రయత్నిస్తావు. దీనికి కారణం ఏమై ఉంటుందా అని సుప్తచేతనలో ఎడతెగకుండా అనుసంధానిస్తే, నీవు చిన్నపిల్లవాడుగా ఉన్నప్పుడు ఒక ఇంటికి వెళ్లి తలుపుతట్టినప్పుడు నీవు వెనక్కి పడిపోయి దెబ్బతింటమో, లేక ఆ తలుపుతీసినవాళ్లు నిన్ను కేకలు వెయ్యటమో, లేక నీవు కొట్టిపిలిచినది నీ వనుకొన్న ఇల్లు కాకపోవటమో తటస్థించి ఉండాలి. ఇల్లాంటి చిన్నపొరపాట్లుజరిగితే, పెద్దవాళ్లకు ఏమీ అనిపించదుకాని, చిన్నవాళ్లు అమితంగా సిగ్గుపడతారు. హేయమైనదాన్ని మరచిపోవటానికే మనస్సు సామాన్యంగా ప్రయత్నిస్తుంది. అందుచేత, ఈవిషయాన్ని మనస్సు మరచిపోయినా స్మృతిరేఖ సుప్తచేతనలో అణగిమణగి నిలుస్తుంది. లేకపోతే, ఒకానొకరు ఏదైనా పక్షి రెక్కలు రెపరెపలాడిస్తుంటే భయంకాని, లేక విపరీతమైన అసహ్యంగాని కలగవచ్చు. ఈరీతికి చెందిన భయాసహ్యాలు ప్రతివారికీ ఏదోఒకవిషయంలో ఉంటాయి. కాని కారణంమటుకు సంపూర్ణంగా విస్మరింపబడుతుంది. కాని కొందరి విషయంలో కొంచెంగా మనస్సును కదిలిస్తే కారణం బయటపడుతుంది. ఇప్పుడు ఉదాహరించిన విషయంలో పసిపిల్లగా ఉన్నప్పుడు ఏదోఒక పక్షి వచ్చి, మిఠాయి తింటూండగా పొడిచి గాయం చేసి దాన్ని తన్నుకోపోవటం జరిగిఉంటుంది.

ఇల్లా పూర్వానుభవపరంపరే కాకుండా మనకు ఉన్నాయి అని సామాన్యంగా మనం అంగీకరించని లోభగర్వహింసాభయాదిగుణబీజాలుకూడా ఈసుప్తచేతనలో ఉంటాయి. అంతేకాకుండా శిష్టాచారసంపన్నులు ఒప్పుకోటానికి సిగ్గుపడే విషయాలన్నిటికీ గల బీజాలుకూడా ఉంటాయి.

మనుష్యమాత్రులందరికీన్నీ—మనుష్యులకే కాదు, ఉత్తమశ్రేణికి చెందిన పశువులకుకూడా—తమ మనస్సులో పరుగెత్తే భావాలకీ, చేసే చర్యలకూ సిగ్గుపడటమో, లేక అవి న్యాయ్యాలు అని సమర్థించుకోటానికి ప్రయత్నించటమో సహజగుణం అయిఉంది. దీన్ని గమనిస్తే మనస్సు ఒక సమత్వపూర్ణమైన పదార్థంకాదనిన్నీ, దాన్లోనే అవాంతరభాగాలు ఉన్నాయనిన్నీ తోస్తుంది. మనం సామాన్యంగా మనస్సాక్షి, లేక అంతరాత్మ అని వ్యవహరించేది ఒకటి ఉంది. మనస్తత్వశాస్త్రజ్ఞులు దానికి ఎన్నోపేర్లు పెట్టారు. ఇది లోపల ఉండి ఒకవిధమైన ప్రతిబంధకం (Censor)గా పనిచేస్తుంది. ఆత్మగ్లాని అనేది, కొంత ప్రత్యక్షచేతనకున్నూ, కొంత సుప్తచేతనకున్నూ సంబంధించినదిగా తోస్తోంది. మన చింతాప్రవాహం దార్లలో పోతూన్నప్పుడు ఏం జరుగుతోందో ప్రత్యక్షంగా గమనిస్తూనే బాధపడుతూఉంటాం. కొందరు స్వప్నంలోనూ, జాగ్రత్సుషుప్తుల సంధిలోనూకూడా బాధపడుతూ ఉంటారు. వశీకరణశక్తి (Hypnotic Power)కి లొంగిపోయినప్పుడు ఈబాధ మరింత ఎక్కువ అవుతుంది. ఫలానా టైముకు నిద్రలేవాలని అనుకొని పడుకొన్నవాడు హఠాత్తుగా పక్కమీద నించి, తానెక్కడున్నదీ, గడియారం ఎక్కడున్నదీ గమనింపలేని స్థితిలో ఎగిరిపడటం సామాన్యవిషయమే. అత్యంతన్యాయశీలత్వం కల పెద్దమనిషిని వశీకరణస్థితిలో కూడా పాడుపనిచేసేటట్లు చెయ్యటం కష్టతరం అని 'మాక్డొనల్'నిరూపించాడు. తక్కిన విషయాల్లో వశీకారకుణ్ణి అనుగమించటానికి ప్రయత్నించినా, అవినీతికరమైన విషయాన్ని చెయ్యటానికే ఈ ప్రతిబంధకం. సుప్తచేతనలో ఉన్న ఒక అంతర్భాగమైన దివ్యచేతన (Super-concious) నుండే ఇల్లాంటి మహత్తరప్రాబల్యాలు ఉద్భవిస్తూ ఉంటాయని కొందరి అభిప్రాయం. దీనికి మూలమేమైనా, అంతరంగంలో ఇది నిత్యయుద్ధాన్ని ప్రకోపింపచేస్తూ, పాశవికభావాల్ని ఎదుర్కొంటూ ఉంటుందనే విషయం మటుకు నిస్సందిగ్ధం. ప్రత్యక్షంగా తనకు అవగతమవుతున్నంతవరకూ, మనిషి తన్ను తాను సంభాళించుకొంటానికి చేసే ఈ ప్రయత్నం—తాను యథోచితమైందని నమ్మినదాన్ని నిర్వహించే పూనిక—ఒకటి ఉందనే విషయం కొత్తదేమీ కాదు. అయితే, ఈ మనోవిశ్లేషణశాస్త్రం చెప్పేదేమిటంటే, మనకు తెలియకుండానే అహరహమూ ఈ సుప్తచేతనలో జరిగే యుద్ధంతో పోల్చిచూస్తే, ప్రత్యక్షచేతనలో జరిగే యుద్ధానికి ఏమీ మూల్యం

లేదు. అది అకించిత్కరము. ఈ యుద్ధాలే మనుష్యునిలో ఉన్న శక్తిని కుంగదీసి అనారోగ్యానికీ, వ్యాధికీ కారణభూతా లవుతున్నాయి.

పైన చెప్పినట్టు, ప్రత్యక్షంగా గోచరించే ద్వంద్వపరిస్థితులు శ్రమదాయకాలే అయినా, వాట్ని ఏదో ఒకమాదిరిగా చక్కపెట్టుకోవచ్చు. కాని సుప్తచేతనలో జరిగే యుద్ధాలు అంతం లేకుండా నడుస్తున్నాయి. బుద్ధిచేత నిశ్చయింపబడటానికి అవి దాని ముందుకు రావటం లేదు. ఈ సుప్తచేతనను రెచ్చగొట్టి లోపల జరిగే యుద్ధాన్ని బయటపెట్టటమే ఈ శాస్త్రజ్ఞుడి పని. ఈ యుద్ధమే శరీరశక్తుల్ని బలికోరుతోంది. దాన్ని బయటపెట్టినప్పుడు రోగి దాన్ని ఎదుర్కొని పరిహరించగలడు. దీనివల్ల లభించే విశ్రాంతి శరీరానికి కొంగ్రొత్తబలాన్ని చేకూరుస్తుంది. ప్రాణశక్తి బయటకుపోయే ఒక ద్వారాన్ని అన్వేషించి కనుక్కొని, దాన్ని మూసేసిన ట్లవుతుంది.

ఈ అప్రత్యక్షద్వంద్వాలకు కారణాలు లక్షోపలక్షలుగా ఉంటాయి. సర్వసాధారణమైన కారణం భయం. రోగమూ, ఆపాయమూ, జీవితవాతావరణంలో మార్పు, దారిద్ర్యం, వృద్ధాప్యం, మృత్యువు—అనేవి ఈ భయంయొక్క కొన్ని స్వరూపాలు. వీటిలో చాలాభాగం మనం త్రొక్కిఉంచుతాం; అంటే వాటినిగురించి ఏమీ ఆలోచించకూడదని స్థిరనిశ్చయానికి వస్తాం (Suppression). కొన్నిటిని సుప్తచేతనలోకి దిగజారుస్తాం (Repression). కాని భయం అనేది శారీరకంగానూ, మానసికంగానూ ద్వంద్వాన్ని సంఘటింపజేస్తుంది. మనస్సూ, శరీరం కలిసి దాన్ని ప్రతిఘటించటానికి ప్రయత్నిస్తాయి. ఈ ప్రయత్నం వల్ల కలిగే శ్రమే నిద్రాహీనత (Insomnia)కు ముఖ్యకారణ మవుతుంది. మనోవిశ్లేషణ సుప్తచేతనలో ఉన్న ఈ భయకారణాన్ని బయటకు తీసుకొవచ్చి, రోగికి తెలియజెప్తుంది. వెంటనే దాన్ని అతడు పరిష్కరించుకోగలుగుతాడు. వెంటనే నరాలకీ, కండరాలకీ విశ్రాంతి లభిస్తుంది. అందుకనే మందూ మాకూ పనిచెయ్యలేనిచోట మనోవిశ్లేషణే నిద్రావిహీనతా రోగాన్ని కుదురుస్తోంది.

మనోవిశ్లేషణవైద్యాన్ని (Psycho-Therapy)గురించి వ్రాయబడిన గ్రంథాల రీతిని గమనిస్తే ఫ్రాయిడ్, జంగ్, ఎడ్లరులకు పూర్వం సుప్తద్వంద్వాల్ని గురించి ప్రపంచానికి ఏమీ తెలియదనే ధోరణిలోనే అవి వ్రాయబడ్డట్టు గోచరిస్తుంది. మహత్తరమైన విషయాల్ని ప్రబలవిశ్వాసంతో స్వీకరించే వాళ్ల అతిశయోక్తులు ఈమాదిరిగానే ఉంటాయి. నిరోగమైన శరీరం ఆహారపదార్థాల్ని చడీ చప్పుడూ లేకుండా జీర్ణంచేసుకొంటున్నట్టే, సబలమైన మనస్సు కూడా అంతర్-ద్వంద్వాల్ని ఆకళించుకొంటుంది. కొంచెం తక్కువ సుష్ఠుగాఉన్న మనస్సుకూ, లేక మరీ సున్నితమైన మనస్సుకూ జీవితంలో అమరటానికి గాను కొన్ని ఉపాయాలు ఉండనేఉన్నాయి. ధర్మమూ, తత్త్వశాస్త్రమూ, కర్మపరత్వమూ కొందరికి బలాన్నీ, ఆరోగ్యాన్నీ చేకూర్చటానికి తోడ్పడుతున్నాయి. ధర్మపరాయణుడైనవాడు జీవితాన్ని పాపపుణ్యాల అంచనాల్లో గమనిస్తూఉండటంవల్ల, అతనికి పాపం అంటే విపరీతమైన భయం ఉంటుంది. అతనికి వచ్చే ద్వంద్వాలు సామాన్యంగా ప్రాయశ్చిత్తం వల్ల పరిహరింపబడుతూ ఉంటాయి.

మనోబలమూ, శరీరదార్ఢ్యం ఉన్నవాళ్లకు ఈ ద్వంద్వాల్ని పరిష్కరించుకొనేందుకు ఏవో కొన్ని ఉపాయాలు చేకూరుతూనేఉన్నాయి. కాని, ఇల్లాంటి సబలత్వంకూడా నిరుపద్రవమైందికాదు. కొంచెం శ్రమదాయకమయింది ఏదైనాసంఘటిల్లితే, వాళ్లు తలక్రిందులైపోతారు. ఇక వాళ్లు తమ్ము తాము చక్కబరుచుకో లేరు. దీన్నే వైద్యులు నరాలు క్రుంగిపోయాయి (Nerves break down)అంటారు. మానసిక ఆందోళననుంచి విశ్రాంతి తీసుకోమని చెప్తారు. ఇల్లాంటి విశ్రాంతి ఏ ఒకల్లిద్దరో తాము చేసే పనికి కొన్నాళ్లు సెలవుపెట్టి తీసుకోగలిగినా మనస్సు పెట్టే కలవరంలోంచి తప్పించుకోనే దెట్లా? భగ్నస్థితిలో ఉన్న మనిషికి ఈపని సాధ్యంకాదు. ఇల్లాంటి చోట్లకూడా సుప్తచేతనలో ఏం జరుగుతోందీ తెలిస్తే, సాహాయ్యకరంగా ఉండవచ్చు.

# చీనా చాటువులు

= శ్రీ నండూరి రామకృష్ణమాచార్యులు =

చీనాదేశసారస్వతములో గేయకవిత్వము, ఖండకావ్యాలు ప్రాచీనకాలమునుండి విశిష్టాలు. చీనాకవితలోని విరహవేదనలు, విషాదచ్ఛాయలు విశ్వజనీనములు. మచ్చునకు కొన్ని చాటువులకు ఇవి ఆంధ్రీకరణాలు.

## — తోడు నీడ —

కవి హిసిచూంగ్. క్రీ. శ. ౧౧౧౦ సంవత్సరప్రాంతమున చీనాభాషలో గేయములు, చాటువులు అల్లినాడు. ఈ క్రిందిపద్యము ఒక చాటువునకు అనువాదము.

కూడి గవాక్షకాంతులను
    కూర్చొనినారము రాత్రి వేళ నా
నీడయు, దీప మార్పితిని
    నిద్రను వేళ యతిక్రమింప, నా
నీడయె నన్ను వీడె గది
    నింపుచు చీకటి క్రమ్మినంత, ఏ
తోడును నీడగాని దరి
    దోచునె దవ్యతమోనిమగ్నకున్.

## — పుష్పబాణ విలాసము —

కవి ఫూపో. కవికాలము నిర్ధారణగా చెప్పుటకు వీలులేదు.

చెలువ యొకర్తు వాగు దరి
    జేరి విలోలవిలాసయై ఉష
స్సుల వికసించి మించి సొగ
    సుల్ విరజిమ్ము తుషారబిందుకుం
దిలమును కేలులాచి, పసి
    నిగ్గులు చిందెడి బుగ్గ జేర్చి, ఏ
చెలువము నీకు ఎక్కుడని రు
    చించునటం చడిగెన్ హసించుచున్.

కాంత నుడికింప దలపోసి కాంచు డపుడు
మెచ్చుకొనిరయె కులాధియే మేలటంచు
అంత భ్రుకుటీవిభంగయై అతివ కనలి
విభుని రివ్వున పువ్వుతో విసరికొట్టె.

## — ప్రవాసము —

కవి వూటీ చక్రవర్తి. క్రీస్తుపూర్వము ౧౪౨-౮౭ సంవత్సరముల మధ్య చీనాదేశమును పరిపాలించినాడు. హాన్‌వంశములో ఆరవతరమువాడు. పదునారేడుల ప్రాయమున రాజకార్యమున అంతఃపురములో తన ప్రేయసిని వదలి దూరదేశమునకు పోవలసివచ్చినది. ఈ క్రిందిపద్యములు క్రీస్తుపూర్వము విరహార్తుడైన చీనాచక్రవర్తి ఆలపించిన ప్రణయగీతికకు అనువాదము.

శారదశర్వరీగగన
    చంద్రికలో పవమానవీచికా
చారితమై చెలంగె నిక
    సన్నవకైరవకోరకావళీ
సౌరభముల్; నదిన్ కదలి
    చయ్యన సాగెను నావ, వేణువీ
ణారవమంజుగానముల
    నాట్యము సల్పె తరంగపంక్తిపై.

వాలుగాలికి తెరచాప పటము లెత్తి
పడవవారలు పాటలు పాడుచుండ
సాగిపోయెడి నావపై చదరమైన
కదలి చనుదెంచు జిలుగు మేఘాలుగూడ.

కాని! — నా హృదయేశ్వరి కదలిరాదు
ఎంత తపియించుచున్నదో అంతిపురిని
వేడినిట్టూర్పులార నావిరహభరము
ఆమె చెవిలోన చెప్ప దేకాంతముగను.

# మనదేశపరిశ్రమలు అభివృద్ధిపొందవలెనంటే-*

= శ్రీ బి. ఆర్. సోమయాజులు =

ఏ దేశానికైనా ఆర్థికాభ్యుదయానికి ఒక ప్లాన్ ప్రకారం నిర్మించిన పారిశ్రామికాభివృద్ధి ఆయువుపట్టు. మన దేశంలో పరిశ్రమలు చాలా వెనుకబడి వున్నప్పటికీ, వాటికి ప్రధానంగా కావలసిన నీటిసప్లయి, రవాణా సౌకర్యాలు, కార్మికులు, ముడివస్తువులు ఇవి అన్నీ సమృద్ధిగా ఉన్నాయి.

విస్తీర్ణంలో మన దేశం యూరపు, బ్రిటీషు దీవులు రెండింటిమొత్తంకంటె పెద్దది. జనాభాలో మనది మానవజాతిలో ౫-వ వంతు. భాగ్యవంతమయిన భూమి. కావలసినంత వర్షం. ఎన్నో గొప్ప నదులు. చక్కని వాతావరణం, అరణ్య సంపద, ఖనిజసంపద వగైరా సహజసంపదలు సమృద్ధిగా ఉన్నాయి. అయినప్పటికీ, ముడివస్తువులను యెగుమతిచేసి విదేశాలలో తయారయిన సరకులను దిగుమతిచేసుకుంటున్నాం. చూస్తాంటే "అంగట్లో అన్నీ ఉన్నాయి. అల్లుడి నోట శని" అన్నట్లున్నది మన స్థితి.

కాబట్టి భారతదేశ పునర్నిర్మాణానికి పరిశ్రమలను సక్రమమయిన జాతీయ సూత్రాలపై పెంపొందించాలి.

## పరిశ్రమలు-తరగతులు

మొదటిది మూల పరిశ్రమలు. ఇందులో విభాగాలు—౧. హైడ్రో ఎలెక్ట్రిక్, స్టీమ్ మొదలయిన పవరు; ౨. ఇనుము, ఉక్కు, అల్యూమినం, మేంగనీసు వగైరా ఖనిజపరిశ్రమలు; ౩. యంత్రాలు, యంత్ర సామగ్రిని తయారుచేసే ఇంజనీరింగ్ పరిశ్రమ; ౪. రసాయన వస్తువులు, ఎరువులు, రంగులు, మందులు మొదలయిన రసాయన పరిశ్రమలు; ౫. మందుగుండు మొదలయిన యుద్ధ పరిశ్రమలు; ౬. రైల్వేలు, ఓడలు, మోటార్లు, విమానాలు మొదలయిన రవాణా పరిశ్రమలు; ౭. సిమెంటు పరిశ్రమ.

ఇంక రెండవ తరగతి వాడుకవస్తువుల పరిశ్రమలు—౧. దూది, ఉన్ని, పట్టు మొదలయిన నేత పరిశ్రమలు; ౨. తోళ్ల పరిశ్రమ; ౩. కాగితములు; ౪. పొగాకు; ౫. నూనె మొదలయినవి.

మూడవ తరగతి వ్యవసాయ పరిశ్రమ.

అసలు పరిశ్రమాభివృద్ధియొక్క ప్రధానాశయం ప్రజల ఆర్థిక సాంఘిక అభ్యుదయమే. వస్తుసామగ్రిని మాత్రం తయారుచేసి మానవక్షేమాన్ని చులకనచేస్తే సమాజం మట్టికాళ్లతో చేసిన ఉక్కువిగ్రహంలాగుంటుంది.

## ముఖ్యప్రశ్న

అయితే, సర్వతోముఖమయిన దేశాభ్యుదయాన్ని సమకూర్చే ప్లాన్ ఎలా వుండాలి? అనేది చాలా ముఖ్యమయిన ప్రశ్న. ఎందుచేతనంటే ప్రజలక్షేమం ఈ రోజుల్లో సైన్సుపయినా, ప్రజాపరిపాలనా విధానంపయినా ఆధారపడివుంది. అంటే ప్రజాశక్తిని, వారి నేర్పరితనాన్ని సరిగా వినియోగించి సమిష్టిలాభం నిమిత్తం చేసే కృషిపైన ఆధారపడిఉంది.

ఈలాంటి ప్లానును ఏసంస్థ పూనుకోగలదు? టెన్నెసీవాలీఅథారిటీ, అనగా టి. వి. ఎ. అనే సంస్థ అమెరికాలో ఒక ప్రదేశవిషయంలో ఈసమస్యకు జవాబుయిచ్చింది.

## అమెరికా జవాబు

టెన్నెసీనది ప్రవహించే ప్రాంతం దాదాపు ౪౦ వేల చదరపుమైళ్ల విస్తీర్ణం. ౭ రాష్ట్రాల సరిహద్దు

---

* ఆలిండియా రేడియో మద్రాసు కేంద్రము వారి సౌజన్యముతో.

ల్లోంచి యీనది ప్రవహించుతోంది. ఆప్రాంతాల్లో సహజసంపదలు అతిహెచ్చు. కాని ౭ రాష్ట్రాలుగా విభజింపబడుటవల్ల, ఆ వివిధసంపదలన్నిటిని అనుగుణ్యంగా పెంపొందించి, ఆ యావత్తుప్రదేశపు ఆర్థికాభివృద్ధిని ఒకేమూర్తిగా గణించి ఆప్రదేశపు సర్వతోముఖాభ్యుదయానికి కృషిచేయగల యేకసంస్థ యేమీ లేకపోయింది.

అలాంటి సంస్థను ౧౯౩౩ లో అమెరికా సంయుక్తరాష్ట్రాల కేంద్రప్రభుత్వం టి. వి. ఎ. అనే పేరుతో ఏర్పాటుచేసింది. ఈసంస్థఆశయాలు ఏమిటంటే—౧. ధనప్రాణనష్టాలకు కారణమౌతున్న నది వరదలను అరికట్టడం, ౨. వర్తకపుఓడలు పోవు పెద్ద కాల్వలను నిర్మించడం, ౩. వరదలు కోసుకుపోతూ ఉన్నటువంటిన్నీ, నిస్సారమైపోతూన్నటువంటిన్నీ భూమిని పొందుపరచి సారవంతం చెయ్యడం, ౪. కొత్త అరణ్యాలను పెంచి నరుకులూ, రిజర్వాయర్లూ మెరక కేయకుండా చూడటం, ౫. భూసారం తరగకుండా పెంచడానికి తగిన ఎరువులను తయారుచేయటం, ౬. వాటన్నిటికన్న ముఖ్యమయినది ఆప్రాంతాల్లో నివసించే ప్రజల సామాజికస్థితిని బాగుచేయటం.

టి. వి. ఎ. ముగ్గురు డైరెక్టర్లతో కూడిన ఒక పబ్లిక్ కార్పొరేషన్. డైరెక్టరులను సెనేట్ అంగీకారంతో అమెరికాసంయుక్తరాష్ట్రాల అధ్యక్షుడు నియమించును. ఇతర గవర్నమెంటుడిపార్టుమెంటుల వలెగాక దీనికి ఒకప్రదేశపు ప్రత్యేకబాధ్యత, దేశ రాజధానిలోకాక ఆప్రదేశములోనే నివేశము, దేశీయ రాజ్యాంగశాఖలలో ఏదో ఒకటి కాకుండా ఆఒక్క ప్రదేశములోనే సకలపరిస్థితులకు బాధ్యత.

అయితే, సెంట్రల్ ఎలెక్ట్రిసిటీబోర్డు, బ్రిటిష్ బ్రాడ్‌కాస్టింగుకార్పొరేషను, లండనుపాసెంజర్ ట్రాన్స్‌పోర్టుబోర్డు మొదలయిన పబ్లిక్ కార్పొరేషనులు అనేకమున్నాయి. కాని వాటికి యేదో ఒక్కటే వ్యాపారానికి బాధ్యత.

గవర్నమెంటుకున్న అధికారమును, ప్రైవేటు కంపెనీలకున్న స్వేచ్ఛను—ఈరెంటిని పొంది స్వపరిపాలన కలిగిన సంస్థ అని చెప్పవచ్చును టి.వి. ఎ.ను. దాని నిర్మాణకార్యక్రమానికి కావలసిన ధనమును, ఇతరడిపార్టుమెంటులవలె విడివిడి చిన్నమొత్తములు కాక, సంవత్సరముపొడుగునను కావలసిన ఏకమొత్తమును కాంగ్రెసు ఏటేటా గ్రాంట్ చేయును.

అయితే టి. వి. ఎ. పయిన అమెరికాపార్లమెంటుకు అధికారం లేకపోలేదు. చట్టాలు, ఆర్థిక గ్రాంటులు, రిపోర్టులు మొదలయినవానిద్వారా అది టి. వి. ఎ. ను కంట్రోలుచేస్తోంది.

ఈ ప్రజాస్వామిక కంట్రోలుకు లోబడినను, తన సర్వతోముఖకార్యక్రమము సాగించుటకు కావలసిన ఆస్తి, వ్యక్తుల నియామకము మొదలయిన అధికారములు అన్నీ దానికే ఉన్నాయి.

ముగ్గురు డైరెక్టరులలోను ఒకరు చైరుమేను. బోర్డు నిర్ణయాలను అమలు జరపటానికీ, అన్ని శాఖలనూ, వివిధ కార్యకలాపాలనూ సమన్వయపరచటానికీ ఒక జెనరల్ మేనేజరు ఉన్నాడు. కావలసినప్పుడల్లా బోర్డు నిపుణుల సలహాలను తీసుకుంటుంది. టి. వి. ఎ. లోని వివిధ డిపార్టుమెంటులూ తరుచు కలిసే మీటింగులుచేసి, చర్చించి, వారి వారి ప్రత్యేక పనులను సమన్వయింపజేసికొని టి. వి. ఎ. యొక్క సర్వతోముఖాభ్యుదయ కార్యక్రమాన్ని పొందుపరచే వి. టి. వి. ఎ. ఉద్యోగస్థుల ఎన్నికలో నిపుణత, నేర్పరితనమే తప్ప రాజకీయకక్షలకు ఏమీ మతింపులేదు.

## టి. వి. ఏ. నిర్మాణకార్యక్రమం

కార్యక్రమ నిర్వహణలో మొదటి ౧౦ సం॥ల లోనే టి. వి. ఎ. ప్రశంసనీయమయిన జయమును పొందింది. ౬౦ కోట్ల డాలర్లకు పైబడిన నిర్మాణ కార్యక్రమమును పూర్తిచేసింది. అనేక బ్రహ్మాండమయిన ఆనకట్టలు కట్టి, అనేక సరస్సులను నిర్మించింది. గంతులేస్తూ పరుగెత్తే టెన్నెసీనదిని శాంతపరచింది. వరదల ప్రమాదం తొలగించింది. ౫౦౦ మైళ్ల కాలవలను నావికాప్రయాణానికి సానుకూలపడునట్లు నిర్మించింది. దీని మూలముగా అప్పుడే నదిపైన రవాణా ౭ రెట్లు పెరిగింది.

టి. వి. ఎ. ఆనకట్టలనుండి బ్రహ్మాండమయిన విద్యుచ్ఛక్తిని తయారుచేస్తోంది. ౨౦ లక్షల కిలోవాట్లకు పైబడిన పవరుస్టేషనులను నిర్మించింది. పట్టణాలే కాకుండా గ్రామాలుకూడా విద్యుచ్ఛక్తితో వెలుగొందుతున్నాయి. పూర్వము నూటికి మూడు పొలాలకే విద్యుచ్ఛక్తిని వాడుతూ ఉంటే, యిప్పుడు నూటికి ౩౦ పొలాలకి అది అందుబడిలోకి వచ్చింది. ఆ ప్రాంతప్రజల జీవితవిధానమే మారింది. ఇండ్లలో అనేక ఎలెక్ట్రిక్ పరికరాలు వాడబడుతున్నాయి. అనేకమయిన ఖనిజ పరిశ్రమలు స్థాపించబడ్డాయి. స్థానిక మునిసిపల్ సంస్థలు, లాభాపేక్షలేని తదితర కోఆపరేటివ్ సంస్థలద్వారా విద్యుచ్ఛక్తి చౌకగా అనేకమంది ప్రజలకు అందజేయబడుతూంది.

పరిశ్రమలకు కావలసిన ముడిపదార్థాలను అభివృద్ధిపరచి నూతన పరిశ్రమవిధానములను కనిపెట్టి పరిశ్రమాభివృద్ధికి తోడ్పడి పెంపొందించింది.

వర్షపునీరు భూమిలో ఎక్కువగా ఇంకుటకును, తద్వారా భూమిపైన వడి ప్రవాహమును తగ్గించి భూమి వరదలు కొట్టుకుపోకుండా బలపరచుటకుగాను టి. వి. ఎ. అడవులను అభివృద్ధిచేసింది. ఒక కోటికి పైగా చెట్లను నాటింది. భూమిని బలపరచే లవంగము, సోయాబీన్స్ మొదలయిన పంటలను ప్రోత్సహించింది. నీటివడికి గండిపడుతూఉన్న కొండవాలుపులలో మెట్లుమెట్లుగా పొలములను తయారుచేయుడము, అనగా టెర్రాసింగును అవలంబింపజేసింది. ఈ పద్ధతిని చాలావరకు మనుసులద్వారా కూడా అభివృద్ధి చేసింది. టి. వి. ఎ. పరిశోధనలద్వారా వ్యవసాయంలో ఉత్తమమయిన మార్పులు వచ్చాయి. కొత్త ఫాస్ఫేటు ఎరువులు కనిపెట్టి, దాని ఉపయోగమును రైతులకు నిరూపించి, భూసారము తరగకుండా వివిధ పంటలను హెచ్చుగా పండించు నూతన విధానములను నేర్పి వ్యవసాయమును చాలా అభివృద్ధిలోకి తెచ్చింది.

ఎలెక్ట్రిసిటీ గ్రామాలలోకూడా చౌకగా లభించడంవల్ల రైతులకు శ్రమ, టైము, డబ్బుకూడే కలిసి వచ్చాయి. పండ్లువగైరాల్లను నిలువచెయ్యడం నేర్పింది. యంత్రాలను, కొత్తరకం వ్యవసాయపనిముట్లను కనిపెట్టింది. రైతుల ఆదాయం రెట్టింపయింది. తిండి, బట్ట సమృద్ధిగా చేకూర్చింది.

ప్రజలందరి సుఖప్రదజీవితానికీ పడికట్టి, దానికి కావలసిన అనేకప్లానులను టి. వి. ఎ. తయారుచేసింది. వాటిని అమలుజరపటానికి సలహాలతో తోడ్పడుతూంది.

టి. వి. ఎ. వివిధరాష్ట్రప్రభుత్వాలతోను, స్థానికసంస్థలతోను, సైంటిఫిక్ సంస్థలతోను కలసిమెలసి తన వ్యవసాయ, ఆరోగ్య, విద్యా కార్యకలాపాలలో ముందంజవేస్తోంది. ఈవిధంగా టి. వి. ఎ. ఆ ప్రాంతసర్వతోముఖాభివృద్ధిని కోరే అన్ని సంస్థలకూ, ప్రజలకూ బండిచక్రమునకు కీలువలె ప్రవర్తిస్తోంది.

కార్మికుల వేతనములలోను, వారి తదితరపరిస్థితులలోను టి. వి. ఎ. ఎక్కువ శ్రద్ధా, దయా చూపిస్తోంది. కార్మికులకు సంఘాలను నిర్మించుకొని, తమ హక్కులను కాపాడుకొనే అవకాశాలు కలుగజేసింది.

ఇండ్ల సౌకర్యాలు, ఆరోగ్యం, విశ్రాంతికొరకు ఏర్పాట్లు చెయ్యటానికికూడ టి. వి. ఎ. బాధ్యత వహించింది. దీనిలో పనిచేసే వేలకొలది కార్మికులకు ఇండ్లు నిర్మించింది. ఆనకట్టలవల్ల మునిగిపోయిన పల్లెలకు మారుగా కొత్తగ్రామాలను నిర్మించింది. విశ్రాంతి మందిరాలు, పార్కులు నిర్మించింది.

ఈ విధంగా ఆ ప్రాంతంయొక్క నూతన వికాసానికి కారణభూతమయి, అధోగతిలో ఉన్న ప్రాంతాలను పునర్నిర్మాణము చేయుటలో ఆదర్శకమయింది.

## తామరతంపర

కావుననే అమెరికాలో అప్పుడే టి. వి. ఎ. లాంటి సంస్థలు మరిఏడు కొత్తవి ఆలోచనలోకి వచ్చా

ము. వాటిలో యం. వి. ఎ.-అనగా ముస్కోరీ వాలీ అథారిటీ టి. వి. ఎ. కన్న పదిరెట్లు పెద్దది.

యూరోపులో డాన్యూబ్ నదికీ, దక్షిణఅమెరికాలో అమెజాన్ నదికీ, చైనాలో గాంగ్ సీటీనదికీ యీలాంటి సంస్థలనే ఏర్పాటుచేయాలనే ఆలోచనలు కూడ జరుగుతూ ఉన్నాయి. అయితే యితర దేశాలు టి. వి. ఎ.ను మక్కీకిమక్కీ అనుసరించటానికి వీలు లేదు. కాని టి. వి. ఎ. యొక్క ముఖ్యనీతి ఏమిటంటే—ఒక ప్రదేశపు ఆర్థికసంపదను సర్వతోముఖంగా పెంపొందించి, ప్రజాస్వామిక విధానంగానే పబ్లిక్ కార్పొరేషనుల ద్వారా ఆ ప్రదేశమునకు, అందలి ప్రజలకు నూతనశోభనుచేకూర్చటం సాధ్యమని.

## మనకూ అదే వరవడి కావాలి

ఇంక మన దేశమన్ననో—పరిపాలనా సౌకర్యముకొఱకు ఏర్పరచబడిన రాష్ట్రాలుగా విభజింపబడి ఉంది. బ్రహ్మాండమయిన నదులు వివిధ రాష్ట్రాల సంస్థానాలగుండా ప్రవహించుతున్నాయి. పెంపొందించుకోవాలంటే కావలసినంత సహజసంపద ఉంది. కనుక టి. వి. ఎ. పద్ధతులను మన దేశానికి అవసరమయిన మార్పులతో ఎందుకు అవలంబించకూడదు? పెద్దపెద్ద నదులన్నిటికీ ఒక్కొక్క టి. వి. ఎ. ఏల నెలకొల్పకూడదు?

---


నటీమణులవలె మీ శరీరసౌందర్యమును కాపాడుకొనుడు!
వసంతా
వసంతా చర్మరక్షణకు యెక్కువ ప్రాముఖ్యము
ఇచ్చును "అందుకనే నేను లక్సు సబ్బువాడ
తాను"...ఇది చర్మరక్షణను చాల అద్భుతముగా
సులభపరచును. అని విశదపరుస్తున్నది. ఈ ప్రఖ్యా
తివహించిన సబ్బుయొక్క చురుకైన నురుగు
తప్పక చర్మమును మచ్చలు లేకుండాచేసి మృదు
వుగాను, అందముగాను వుంచగలదు.
లక్సు టాయిలెట్ సబ్బు
LUX
LUX TOILET SOAP
LTS. 138-50-40-TL
LEVER BROTHERS (INDIA) LIMITED




## ప్రజాహిత జీవితము

### కాల ప్రాముఖ్యము

ప్రజాహిత జీవితమువల్ల అట్టి వ్యక్తుల కాలము యెల్లప్పుడు కార్య నిమగ్నమై యుండును. వేళల ప్రకారము పనులను నిర్వర్తించిననే. అతని కార్యక్రమము సాఫీగా సాగిపోవును. అందువల్ల ముఖ్యముగా అవసరమైనది నమ్మకమైన గడియారము. ఎందువల్లననగా గడియారం లేకుండ వేళప్రకారం కార్యక్రమం కొనసాగదు. వివేచనాపరులకు 'వెస్టుఎండ్' గడియారముల విలువ. తెలియును. దాని నమ్మకమే వారిదినచర్యలను సక్రమముగా సాగించును. త్వరలోనే మంచి మంచి నాణ్యముగల గడియారములు దొరుకును.



సెకండస్
న్యూ కాలిబర్ వంపు
18 క్యా. సాలిడ్ గోల్డు
ప్లెయిన్ డయలు రు. 195/-

ప్రతి "వెస్టుఎండ్" గడియారమునకు, ఇండియాకు తగిన శ్రేష్ఠమైన గడియారములను తయారుచేయుటలో మాకుగల 75 యేండ్ల ప్రఖ్యాతి అండగా నుండును.

వెస్టు ఎండ్ వాచ్ కంపెనీ, బొంబాయి అండ్ కలకత్తా.

**WEST END WATCH Co.**

**BOMBAY** **CALCUTTA**

# ప్రణయబలి

[నాటిక]

— శ్రీ పాలెపు వెంకటరత్నం —

## ప్రథమాంకము

### మొదటి రంగము

[స్థలము : ఢిల్లీలో జేబున్నీసా అంతఃపురములోని విద్యామందిరము. జేబున్నీసా ఖురాన్ వ్యాసంగము చేయుచుండును. గదిలో ఉన్న చిన్న బల్లలపై అందమైన వస్త్రములు పఱచి గులాబీ పూలగుత్తులు, వాసనలు వెదచల్లుచున్న అగరువత్తుల ధూమము, అత్తరు మొదలగు సుగంధ ద్రవ్యముల మృదుల పరిమళముతో నిండియుండును.]

జేబు— ఈ భగవంతుని మాయావిలాసము నూహింపఁ బ్రజల బుద్ధికి శక్తి లేదు. ప్రాపంచిక లీలా సమస్య విప్పఁబయత్నించినకొలఁది దుర్భేద్యమగుచునే యుండును.

ఏదీ యాచరణీయ మీ జగతిలో
నెల్లప్పు డల్లా మహా
పాదద్వంద్వము నాశ్రయించి సుఖసం
పత్తిన్విసర్జించుటా?
ప్రాదుర్భూత వసంత మాధురుల నా
స్వాదించుచుఁ సౌఖ్యను
స్వాదుత్వమ్మునఁ బారవశ్య గరిమ
ప్రాప్తి న్మదం బందుటా?

ఈ ఖురాన్ అంతయు వ్యాసంగము చేసితిని. ఎంత తఱచినను దీనిలోని చిక్కు విడకున్నది. ఎంత విద్యావ్యాసంగ మొనర్చినను సంశయాంధకారము విరియకున్నది. కానీ, గురూపదేశ మింకను బడసెదనుగాక!

(ప్రవేశము : పరిచారిక)

అమ్మా! గురువర్యులు ద్వారముకడ వేచియున్నారు.

జేబు—రమ్మను.

(పరిచారిక అభివందనములతో నిష్క్ర—).

(ప్రవేశము : గురువు. డెబ్బది సంవత్సరముల వృద్ధుఁడు. కనులలోఁ దేజఃపుంజ ముద్భవించుచుండును. గురువులను జూచి జేబు లేచి అభివందనము చేయును.)

జేబు—అదిగో, గురువర్యుల కాసనము. ఆసీనులగుదురుగాక.

గురువు—షాజాదీ! నీవు నేఁడేదో మహాలోచనాసాగరమున నిమగ్నమైయున్నట్లగపడుచున్నావు. నీ మనసునఁ బ్రవేశించి కల్లోలపఱచుచున్న ఆమహాసంశయ మేదో నేఁ దెలిసికొనఁ దగినదైన వెల్లడించెదవా?

జేబు—గురువరులకడ గోపన మొనరింపవలసినంత రహస్య మెన్నఁడును ఈ శిష్యురాలి హృదయమునఁ గలుగదు. కాని, నే పఠించిన యుద్గ్రంథముల లోపమో, నాబుద్ధిలోపమో, నా కీభగవత్సృష్టి రహస్య మేమాత్రము నర్థము కాకున్నది. నాహృదయ పారావారమున రేఁగిన మహాకల్లోలమును తమ యుపదేశ వాయువు రెచ్చఁగొట్టుచున్నదేగాని, యుపశమింపఁజేయలేకున్నది గురూజీ!

గురు—షాజాదీ! నాకడ నీవభ్యసించిన శాస్త్రజ్ఞాన మపారమైనదే కాని, నీకింకను అనుభవ పరిజ్ఞానము కావలసియున్నది. దాని మూలముననేగాని నీ హృదయస్థములైన సంశయకల్లోలములు నివారణకావు.

ఎంతటి శాస్త్రశక్తి గడి
యార్జించినవారయిన న్వివేకము చే
దాంతమహాంబుధిం దఱచి
(పట్టి మహాగుణవంతు లేని యా

శాంతపరిప్లుతం బగు న
    నంత సుకీర్తుల నందువారు ర
వ్వంతయు నేని స్వానుభవ
    మందనిచో ఫలసిద్ధి గాంతురే?

జేబు—అల్పవయస్కనై యనుభవజ్ఞాన శూన్య నగు నాకుఁ దను శాస్త్రోపదేశము కడుంగడు సంస్కృతి నొసంగినది. కాని, సద్గురూ! ఎడనెడఁ గలుగుచుండెడి సంశయ జీమూతములు మాత్రము నా మానసాకాశము నాచ్ఛాదించుచున్నవి. తమకుఁదగిన గురుదక్షిణ నొసఁగుటకు నామనస్సు ఉవ్విళ్లూరుచున్నది. పరమేశ్వరుఁడు దానిని సఫల మొనరించునుగాక!

గురువు—శాస్త్రాభ్యాసమునఁ జక్కని ఫలితము గాంచిన శిష్యులకడ దక్షిణాస్వీకారము, రాజపుత్రీ, కేవలమును లోకసంగ్రహణార్థమే. కాని, అంత ప్రధానము కాదు. వివాహవిషయకమైన నీ నిర్ణయమును తెలిసికొనుటకు నేనును, చక్రవర్తియుఁగూడఁ గుతూహల పడుచున్నారము.

జేబు—గురూజీ! తమరు సెలవిచ్చినప్రకారము నాజీవిత్యజ్జీవితమునఁ గలుగు అనుభవ పరంపరలచేఁగాని ఆ విషయ మింకను నిర్ణయింపఁదలఁచు కొనలేదు.

గురువు—మంచిది. చక్రవర్తివి క్షేమములేమి?

జేబు—పాదుషావారి శరీరమున స్వాస్థ్యము లేదు. వారిప్పుడు నాతల్లియగు సుభాన్ బీగమ్ అంతఃపురములో నున్నారు.

గురువు—రేపు వారిని దర్శించెదను. వారి యారోగ్యమునుగూర్చి వైద్యులేమందురో, అపుడే తెలిసికొందును. సరే. షాజాదీ! నేఁటికి సెలవు.

జేబు—చిత్తము, గురూ!

(గురువు నిష్క్రమించును.)

జేబు—ప్రపంచానుభవము, స్వానుభవము ఈ రెండును మిళితము కావలయును. అపుడే సంశయాంధకారమునకు సమాప్తి. నిశ్చయజ్ఞాన భానూదయము. ఈ రెంటికిని నడుమ వివాహసమస్య. అరసి పరీక్షించెదనుగాక! (నిష్క్రమి. తెర)

## రెండవ రంగము

[సుభాన్ బీగము అంతఃపురము. వ్యాధిగ్రస్తుఁడు ఔరంగజేబు శయ్యపైఁ బరుండియుండును. సుభాన్ బీగము వీవనతో విసరుచుండును. ఆసనములపై ప్రధాన మంత్రి, జేబున్నీసా, గురువు, వైద్యుఁడు ఆసీనులై యుందురు. సేవకుఁ డొకఁడు వీరికందఱకు వింజామర నైచుచుండును.]

వైద్యుఁడు—ప్రభువుల శరీరమునఁ గల వ్యాధి యంతయు నుపశమించినది. కాని, యింకను సంపూర్ణారోగ్యము కలుగవలయును. దానికి చక్రవర్తి యిచ్చవచ్చిన మంచియొకచోటి కేఁగి నీటిని, గాలిని అనుభవింపవలయును. స్థలవ్యత్యయముచేఁ బ్రభువులు సంపూర్ణ స్వాస్థ్య మనుభవింపఁగలరు.

చక్రవర్తి—వజీర్ జీ! భిషగ్వరుల యాజ్ఞప్రకారము మనము లాహోరున కేఁగి కొంతకాల మచట నివసింతము. నేఁడే తమరు గవర్నరు అకిల్ ఖానునకు మనరాక నెఱిఁగించుచు సర్వసౌకర్యములు గావింప నాయాజ్ఞనంపుఁడు. నేఁటికి నాలుగవదినమున మన లాహోరు ప్రయాణము.

వజీరు—చిత్తము, సామ్రాట్!

జేబు—పితాజీ! తమ లాహోరు ప్రయాణమున నేనుగూడ తమ్మనుగమింపఁ గోరుచున్నాను. లాహోరు మఖామన్నచో నాకుఁ బరమానందము కలుగుచున్నది.

ఔరంగ—అమ్మా! అట్లే గావింపుము. జేబూ! ఖురాన్ తెప్పించి ఎనిమిదవ యధ్యాయములోని రెండు సూక్తులు చదివి నా కానందము కలిగించెదవుగాక!

జేబు—పితాజీ! ఇంతమాత్రమునకే గ్రంథమును తెప్పింపవలయునా? ఖురాన్‌లోని ప్రతి పత్రములోని ప్రత్యక్షరమును నాకు కంఠస్థమును, హృదయస్థమును. పుస్తకము చూచి చదివిన నాసద్గురువులకీర్తికిఁ గళంకము కాదా? (ఖురాన్‌లో రెండుసూక్తులు పఠించును.)

ఔరంగ—షెహబాస్ పుత్రీ! చాల సంతసించితిని. నీ విద్యాకృషికి బహుమానముగా ఇదిగో, ఈ అయిదులక్షల దీనారములను స్వీకరింపుము.

జేబు—అనుగ్రహింపఁబడితిని పితాజీ! తమ కడ నేను స్వీకరించిన యీపారితోషికము నిప్పుడే సద్వినియోగ మొనరింతును. గురూజీ! ఈయల్పపారితోషికమును తమరు నాగురుదక్షిణగా స్వీకరింతురు గాక!

గురువు—రాజపుత్రీ! తమ పారితోషికమును నేను ఆనందకృతజ్ఞతలతో స్వీకరించుచున్నాను. కాని, ఈ లాహోరుప్రయాణములో నీవు పంథవించు విచిత్రానుభవపరిజ్ఞానముచే కలుగఁబోవు ఫలితమునకు నీకడనుండి యింకను విలువగల దక్షిణ స్వీకరించెదను. చక్రవర్తీ! సెలవు. (నిష్క్రమించును.)

చక్రవర్తి—కుమారీ! నీవు లాహోరుప్రయాణమునకుఁ దగిన ప్రయత్నములో నుండవచ్చును. నీవు మావెంటనుండుట మాకెంతయు ముదావహము.

జేబు—కృతార్థురాలను పితాజీ! నాకు సెలవు. (నిష్క్రమించును)

చక్రవర్తి—వజీర్ జీ! ప్రయాణమునకు శిబికలు, అశ్వములు, శకటములు మొదలైన వన్నియు సిద్ధపఱుప సేవకుల కాజ్ఞయిండు.

వజీరు—చిత్తము సామ్రాట్! నాకు సెలవు. (నిష్క్రమించును.)

చక్రవర్తి—సుబాన్! ప్రార్థనామందిరమునకుఁ బోదము. (సేవిక దారి చూపఁగా నిష్క్రమింతురు.)

## ద్వితీయాంకము

### మొదటి రంగము

[స్థలము: లాహోరులో గవర్నరు ఆకిల్ ఖాను భవనము. సమయము: సంధ్య. ఆకిల్ ఖాను ముప్పది మూడేండ్ల యువకుఁడు. స్ఫురద్రూపి. కవి. గాయకుఁడు. ప్రేమికుఁడు. గదిలో అద్దముబీరువాలలో పారశీకసవకవుల గ్రంథములు సువర్ణాక్షరసంకలితములై యుండును. ఆకిల్ ఖాను ఆలోచనానిమగ్నుఁడై సోఫామీఁద—]

ఆకిల్—అందనిపండ్లకై అఱ్ఱులుసాఁచుట తీఱని కోరికలకు హేతువగునేమో యని భయమగుచున్నది.

చక్కనిచుక్కయంచు నెల
జవ్వని యంచుఁ గవిత్వవిద్యలో
మిక్కలి జాణయంచు నెల
మింబలుమారు జనంబుకల్క, నే
నక్కలకంఠకంఠి నెపు
డారయువాఁడ నోయంచు నుండఁగాఁ
జిక్క మహోవకాశ; మిది
చేవిడువందగ దెవ్వధంబునన్.

ప్రాణములనైన బలిపెట్టి యీసుందరి పొందునకుఁ బ్రయత్నించెదను. ప్రణయోపాసకుల జీవితముల నీత్యవినీతులపట్ల ప్రవర్తనాస్వాతంత్ర్యము తప్పులేదు కదా?

(ప్రవేశము: సేవకుఁడు)

ప్రభూ! సకుటుంబ సపరివారుఁడైన చక్రవర్తి యాగమనము సూచింపఁబడినది.

ఆకి—సరే. నాజవనాశ్వమును సిద్ధముసేయుమనుము. నే నిపుడే చక్రవర్తి నెదుర్కొనవలయును.

సేవ—జీ సర్కార్! (నిష్క్రమించును)

ఆకిల్—ఇదె చనుదెంచె నావనరు
హేక్షణ, మామకప్రేమ వల్లికా
మృదులలతాంతగుచ్ఛ మిదె
మేలగు నొక్క మహోవకాశ మి
య్యదనున మామకీనప్రణ
యామలశక్తి మనోజ్ఞ దివ్య స
త్పదములఁగానక పెట్టెదను
ప్రాణము లేనియు సిద్ధిపొందఁగన్.

మనసా! సావధానవు కమ్ము! (నిష్క్రమి)

### రెండవ రంగము

[స్థలము: లాహోరులో జేబున్నీసా విడిది. సమయము: సాయంకాలము ౫ గంటలు. ప్రవేశము: జేబున్నీసా సితారు వాయించుచు. పరిచారిక వింజామర వీచుచుండును. చెలికత్తె ఫాతిమా సమీపమున కూరుచుండి తములము సిద్ధము చేయుచుండును.]

జేబు—గురువర్యుల వాక్యమున విశేషార్థమిమిడియున్నమాట వాస్తవము... ఈలాహోరుప్రయాణములో కలుగు విచిత్రానుభవముచేఁ జక్కని పర్యవ

సాధనము కలుగునా ? దానిచే వారికి మంచి దక్షిణ లభించునా ? ఏమో దానిలోని మహత్తరగూఢార్థము! ......ఫాతిమా !

ఫాతిమ—అమ్మా...

జేబు—ప్రతిదినమును మన విడిదియెదుటినుండి భవనముపైపై దృక్కులుసారించుచు జవనాశ్వముపై పోవుచుండు నా యువకుఁడెవరే ?

ఫాతిమా—అమ్మా ! వారు లాహోరు ప్రాంతముల చక్రవర్తి యాజ్ఞల పరిపాలించు గవర్నరు ఆకిల్ ఖాను. నేఁడే నే నాసంగతి దరియాప్తుచేసి తెలిసికొన్నాను.

జేబు—ఓహో, లాహోరు గవర్నరు ఆకిల్ ఖాను చక్కని కవియనియు, గాయకుఁడనియు విని యున్నాను. అతఁడే యితఁడా ? కాని, ఫాతిమా ! ఎందుకే యతఁ డింత యాసక్తిగాఁ బ్రతిదినమును మన విడిది ముందుగా స్వారిపోవుచుండుట ?

ఫాతి—ఏమో నమ్మా ! కావలయునన్న ఆ సంగతికూడ నే నీవేళ వాకబుచేసి తమకుఁ దెలియ పరచుకొందును.

జేబు—అవసరములేదులే, ఫాతిమా ! ప్రతి పురుషునకును ఇది యొకమాదిరి జాడ్యము. పూవును చూచినంతనే జుమ్మని ముసరికొను భ్రమరరాజులమే తా మనుకొని యీ రీతి సెగబడుచుండుట మగవారి కిది యొక విచిత్రరోగము. కాని, దీని నీతఁ డేమాత్రము వ్యక్తీకరింపఁగలిగినను "ఇది చంపకమోయీ షట్పదా!" అని తెలిపెదను.

తరుణీ నిసర్గసౌందర్యంబుఁ గనుఁగొని
తమసొత్తె యని మదిఁదలఁచువారు
కడగంటి చూపులఁ గనుఁగొని తమపైపై
ప్రసరించె నని మది భ్రమయువారు
సహజవిలాసచేష్టలు తమ్ముఁ బ్రేమించి
రే యని రిత్త యూహించువారు
పొలఁతి కేవల మాటబొమ్మగా భావించి
కొంటెచేష్టలు చేయఁ గోరువారు
నగుచు నున్మత్తపురుషాళి యబలలనుచు
స్త్రీల నవహేళనమ్మును జేయుచుండఁ
గాంచి సహియించి యుండఁగాఁ గలుగుకన్న
వేఱె యవమాన మున్నదే వెలఁదుకలకు?

సరే—ఈ ఆకిల్ ఖాను వృత్తాంతము నా జీవిత సమస్యయే యైనను సహించి పరీక్షకులోనై యీ విచిత్రానుభవముయొక్క పర్యవసాన మరసెదనుగాక ! ఫాతిమా ! స్నానాగారమునకు...

పరిచారిక—దేవీ ! ఇటు. ఇటు.

(నిష్క్రి. తెర)

## మూఁడవ రంగము

[స్థలము : లాహోరులో జేబున్నీసాభవన ప్రాంతోద్యానము. ప్రవేశము : సాలోచనగా ఆకిల్ ఖాను. విహారోచితవస్త్రములు. చేతిలో గులాబీపూల గుత్తి. సమయము : సాయంకాలము.]

ఆకిల్—అనేక పర్యాయములు లాసుందరీవదనారవింద సందర్శనాపేక్షితుఁడనై విఫలమనోరథుఁడ నైతిని. నేఁడు చక్రవర్తి వాయుసేవనార్థము పట్టణమునకు దూరమున విడిసినాఁడు. నేఁ డెట్లేని యా వన్నెలాడిని దర్శించి యామె ప్రణయమంజులాలాపములఁ దృప్తుఁడ నయ్యెదనుగాక !

నినుఁగనులారఁగాంచ రమ
ణీ! యని నేమతఁ జేధించియుం
టిని, సురసుందరీమణుల
కీవిని నవ్వులఁ బుచ్చఁజాలు నీ
కనకసమానకాంతిమయ
గాత్రమునంటి సుఖింపనెంతుఁ జ
య్యనఁ జనుదెంచి నా మనసు
హర్ష పరిప్లుతముం బొనర్పవే ?

(ప్రవేశము : సౌధగవాక్షముకడకు జేబున్నీసా, ఫాతిమా)

జేబు—ఫాతిమా, ఫాతిమా ! నీవు వచించిన యా ప్రణయోన్మత్తుఁ డితఁడే నటే ?

ఫాతి—వీరే నమ్మా, లాహోరు గవర్నరు సాహేబువారు.

జేబు—హహ్హహ్హా. కానీ, ఈ రోజున ఈతనికిఁ దగిన గుణపాఠము నేర్పెదను.

ఆకిల్—(గవాక్షమువంక దృష్టిసారించి) ఓహో, ఆమెయే కాఁబోలు! మదీయప్రణయవనీప్రసూన పారిజాతము! సెహబాస్. ఏ మా యొయ్యారి ప్రణయ విలాసభంగిమము!

తళుకు తళుక్కను తాటంకకాంతులు
చెక్కుటద్దములపైఁ జెలఁగియాడ
మిసమిస మని వెల్గు మేనికాంచనకాంతి
సౌధభిత్తికలతో సరసమాడ
దానిమ్మపూవన్నె పూనిన కౌశేయ
మతివపాదముల జీరాడుచుండ
మేలైన బుకుములు నీలకంచుక మింతి
వక్షోజముల వింత వన్నెగూర్పఁ
జెలియమూఁపునఁ గరమూని చలితలలిత
తరళహరిణాక్షులను తోట నరయుచున్న
సార్వభౌమాత్మజ ప్రసూనశరనిశాత
హేతియో యన వన్నెలయించు నపుర!

జేబు—ఫాతిమా! ఈ సుందరపురుషుని రూప మనన్యసామాన్యమైనదే. కాని, ఈతని నింకను నా ప్రణయాగ్నిలోఁ గుతకుతఁ నుడుకఁ జేయవలయును. హహ్హహ్హా. ఢిల్లీశ్వరుని తనూజ. నిరుపమానసౌందర్యవిరాజిత. మృదుమధురకవయిత్రి. జేబున్నీసా తెక తేరకు లభించు పాంచాలికయని యీ యున్మత్తయువకుని యభిప్రాయము కాఁబోలును!

ఫాతి—ఔనమ్మా! ఎన్ని జీవము లీరీతి తమ ప్రేమసాగరమునఁ బడి యుక్కిరిబిక్కిరి కాలేదు.

ఆకిల్—ఈ కవితాసుందరి నీరీతి సంబోధించెదను.

పావనోషస్సుధాకాంతి బర్వినంత
ప్రాగ్దిశాసౌధమున నార్ద్రి వసనకలిత
లలిత మృదులాంగి ప్రాభాతలలన యదిగో!
పొలుచుచున్నది సౌందర్య కలితయగుచు.

ఓ యుషస్సుందరీ! ప్రణయోజ్జ్వలాంగి!
ఓ యమృతమధుహాసినీ! ఓ యనంత
రాగిణీ! ఫుల్ల శతపత్ర రమ్యనేత్ర!
యీ విలాసార్తుని దయఁ జేలఁగదవె?

జేబు—అబ్బా. ఈ కవితాచమత్కృతి నన్నాకర్షించుచున్నది. అయిన, నీతని నింకను బరీక్షింపవలయును. (ప్రకాశముగ)

ఓ మహోన్మత్త ప్రణయ నిద్రామయాత్మ!
ఓ నిరర్థకవాంఛామయోత్సుకాత్మ!
శ్రవిమలోషస్సతీ ప్రభాప్రాభవంబు
నరసి ముదమంద నర్హుఁడవౌదువెట్లు?
వివిధ రమ్యప్రపంచకళావిభ్రమముల
కానఁ దిరుగాడు నో భ్రమరా! ప్రమత్త
బుద్ధి నెన్నఁడు నీవాసపూనఁబోకు
సొమ్ము చంపక మిది తలదిమ్ము కలుగు.
రావే ఫాతిమా! లోపలికి.

(చరాలున నిష్క్రమింతురు)

ఆకిల్—ఓహో, ఎంతరమ్యముగాఁ దిరస్కరింపఁబడితిని! భగ్నప్రణయము కార్యసిద్ధి ప్రయత్నములకుఁ బట్టుఁగొమ్మ. ఇతోధికోత్సాహముతో నీ కార్యమును సాధింపఁ బ్రయత్నింతును. విఘ్నములకు జంకి వెనుదీయువాఁడు కాఁడీ ఆకిల్ ఖాను.

(నిష్క్రమి. తెర)

## నాలుగవ రంగము

[లాహోరులో ఔరంగజేబు మందిరము. ప్రవేశము: ఔరంగజేబు, వజీరు.]

ఔరంగ—వజీరుజీ! వైద్యవర్యులు తెలిపినట్లు ఈ పదునైదు రోజులకే నా యారోగ్యము పూర్తిగా బాగుపడినది. ఇఁక రెండుమూఁడు రోజులలో మన మీ లాహోరునుండి ఢిల్లీకి పోవచ్చును. మన పరివారమున కంతకును ప్రయాణప్రయత్నము లొనరింప నాజ్ఞ యొనరింపుఁడు.

వజీరు—చిత్తము ప్రభూ! అందఱును ప్రయాణమునకు సంసిద్ధులు. కాని, సామ్రాట్! తమప్రియపుత్రిక జేబున్నీసా సాహేబామాత్రము ఇంకను లాహోరు విడుచుట కంగీకరింపరేమో యని సంశయము.

ఔరంగ—వజీర్ జీ! అభిప్రాయగర్భితమైన తమ వాక్యములోని యర్థము నేను గ్రహింపకపోలేదు. కాని, ఆమె నిరుపమాన విదుషీమణి. ఆమెకు సంబంధించిన సమస్తవిషయములకును నే నామెకు సంపూర్ణ

స్వాతంత్ర్య మిచ్చితిని. ఆమెపైఁగల నిరుపమానవాత్స ల్యమునసే సహజకవితా ద్వేషముగల నేనుసైతి మింత మాత్రమైనను కవితాకళాప్రోత్సాహము కలుగఁజేయు చుండుట !

వజీరు—చిత్తము సామ్రాట్ ! నే నామెపరి జనముచే నామెయింగితమును గుర్తెంగితిని. నా రీ లాహోరుపట్టణమున నామె పేర నొక సుందరోద్యా నము నిర్మింపఁగోరుచున్నారనియు, ఆకారణమున వారింకను లాహోరు విడువ నెంచుట లేదనియును దెలిసినది.

ఔరంగ—నేనును ఆమెయింగితము గుర్తించి తిని. కాని, ఈవిషయమున నామెస్వాతంత్ర్యమున కట్టి యభ్యంతరమును కలిగింపఁ దలఁచుకొనలేదు. వజీర్ జీ! ఈ విషయమున లాహోరు గవర్నరు అకిల్ ఖాను రాజపుత్రీపాణిగ్రహణముచే మహోన్నతినో, లేక కరాళ మృత్యుదేవీగాఢాలింగనమునో పొందఁ గలఁడు.

వజీరు—చిత్తము సామ్రాట్!

ఔరంగ—అమ్మాయి కిచ్చట నుండుటకు సమస్త సౌకర్యములు గలుగఁజేసి మిగిలిన పరివారమున కంతకును త్వరలో ఢిల్లీప్రయాణము నెటిఁగింపుఁడు.

వజీరు—చిత్తము సామ్రాట్! (నిష్క్రమి)

## తృతీయాంకము

### మొదటి రంగము

[సింధుగవర్నరు ఆదిల్‌ఖానుభవనము. ప్రవే శము ఆదిల్‌ఖాను హుక్కాపీల్చుచు. వయస్సు ౪౦ సంవత్సరములు. దుష్టత్వము సూచించు మూర్తి. సేవ కుఁడు రజాక్. వయస్సు ౩౦ సంవత్సరములు. వికట చేష్టలచే యజమానిని మెప్పించుచున్న స్వభావము.]

ఆదిల్—అరే రజాక్!

రజాక్—జీ సర్కార్!

ఆదిల్—అప్పు డెట్లుండునురా?

రజాక్—హింద్రభోగం సర్కార్. దేహా భేంద్రభోగం సర్కార్.

ఆదిల్—ఠీక్, ఈ కార్యంలో నీవు నాకు కుడిభుజముగా నుండవలయును సుమా!

రజాక్—జీ సర్కార్! తమ్ము హద్దిలో దూకి మంటే, దూకేదాన్కి హీగులాం తయార్ హుం డాడు సర్కార్ !

ఆదిల్—అచ్ఛా! అప్పుడు నీకు రెండు సుబాలు బహుమతిరా. సుబాదారు రజాక్ బీబీని ముద్దు లాడుతుంటే...

రజాక్—(సంతోషముతో) పైన పర్వర్ హల్లా హుండాదూ లేదూ సర్కార్!

ఆదిల్—సచ్ హై. రజాక్!

రజాక్—జీ సర్కార్!

ఆదిల్—అకిల్ ఖానున కాసుందరిని పొందుట కర్హత యున్నదటరా?

రజాక్—నై సర్కార్! బిల్కుల్ నై సర్కార్! తమ్మికి హోర్కి సింహాన్కి పెపులాపిల్లికి లేడా హుందీ సర్కార్!

ఆదిల్—అతడేమైన మన ప్రయత్నముల కాటంకము కలుగఁజేసిన?

రజాక్—మన మజా తెల్సీ హుండాదూ, లేదూ సర్కార్! మాదూ నిమ్నాల్లో ఖోకరా హేయించి ఘోతీలో తోసీసీ దికామ్, సర్కార్!

ఆదిల్—రజాక్! ఈ ప్రయత్నములో నువు నిగ్రహించిన?

రజాక్—ఈ రజాక్ సాహెబుకే రంగుఫేరా యిస్తుంది సర్కార్!

ఆదిల్—ఈ విషయములో నీవేమైన ఏమరు పాటుగా ప్రవర్తించిన?

రజాక్—అప్‌కా ఖయిజార్ నాదీ కుడి జోక్కలో సోరహైగా సర్కార్!

ఆదిల్—షరే! అందుకో పాత్ర. ఇప్పటికే ఆలస్యమైనది.

రజాక్—అచ్ఛా సర్కార్!

ఆదిల్—(మద్యపానము చేయును) షరే. జాగ్ర త్తగా పరికింలించు. ఖబర్‌దార్.

రజాక్—జీ సర్కార్! సలామ్.

(ఆదిల్ నిష్క్రమించును)

రజాక్—పోరి ముండాకొడుకా! ఎంత హంగామా చేసిందిరా నీకదృష్టలో. పెద్దామంచలీక్కి హెసర్...పెద్దకుండాల్కి హెసర్. నీకూ హిక్కాం మే సావు తప్పదురా బాబా! ఆ హకీల్ కాకాసా పేల్కి నీకే ఎక్కడైనా పోలిక ఉంది? కుచ ర్తా హై. ఏహై ఏక్ హోతీ. నీకూ రోజులు దగ్గిరా పడ్డాయ్. ఔరంగజేబు ఫాదుషా నీకి పంపివేస్తాడురా బాబా! నీదీకర్మం, మైక్యాకరూప్! నీతోపాటు నేనూ కూడా పచ్చేదానికి వచ్చింది ఈ ఉపద్రవం అంతాను.

(నిష్క్రమి. తెర)

## రెండవ రంగము

[స్థలము : లాహోరులో నిర్మాణములోనున్న జేబున్నీసా బా. అయిదారుగురు తాపీపనివాండ్రు ఒక జలయంత్రమును తయారు చేయుచుందురు. అక్కడక్కడ పూలకుండీలు, చిన్న చిన్న మొక్కలవరుసలు ఉండును.]

మేస్త్రీ—(పనివాండ్రతో) ఏమోయ్! పనిలోకి వచ్చిన ప్రతి మనిషీ ఒళ్లొంచి పనిచేసేవాఁడేనా? ఆలా చెయ్యనివాడి కెవల్లా ఇక్కడ కూలిపని ఇవ్వడానికి కనిపెట్టుకుని కూచోలేదు.

పనివాఁడు—ఇదిగోనయ్యా. వీళ్లంతా చక్కగా పనిచేసేవాళ్లే. ఈమనుష్యులంతా ఇదివరకు నాఆరుపు ఆజ్ఞల్లో ఉన్నవారే. ఇదిగో, ఈయనగారు మాత్రం కొంచెం కొత్త. కానీ, చక్కని పనితనం కలవాడని మాత్రం ఇదిగో, ఈయనగారు సిఫారుసుచేశాడు. చూద్దాంగా ఒకటిరెండురోజులు.

మేస్త్రీ—(ఆకొత్తపనివానితో) ఏమయ్యా! నువ్వు చక్కగా శ్రద్ధగా పనిచేసేవాఁడవేనా? లేకపోతే, చక్రవర్తిగారి డబ్బిక్కడ ఏమీ చేరగా కూచోలేదు.

కొత్తపనివాఁడు — లేదయ్యా! నాచేతిలో లోకాలను మోహపెట్టే పనితనం ఉంది. దానితో చక్రవర్తిగారి డబ్బేకాదు; చక్రవర్తిగారి ప్రాణాలతో సమానమైన వస్తువునే బహుమతిగా పుచ్చుకోఁగలను. చూస్తారుగా నాపని!

మేస్త్రీ—ఏమో? ఈవేళ జేబున్నీసాసాహెబా స్వయంగా పనిచూడ్డానికి వస్తారు. అప్పటికల్లా పనికొంచెమైనా చక్కపడకపోతే మన మాట మర్యాదా దక్కవు. మనకి మాటా, మర్యాదా దక్కదు.

పనివాఁడు—దానికే గాదయ్యా, నే నీవేళ ప్రత్యేకంగా పనిలోకొచ్చింది? ఆమె యిక్కడికి వచ్చేటప్పటికి కొంతేనా చాతుర్యం చూపి నీకు మాట దక్కించకపోతే యింక నాపనివాడితనం ఏమిటి?

మేస్త్రీ—సరే, ప్రారంభించండి పని. ఇక్కడ ఒంకీలుకట్టాలి. ఇక్కడ హంసల్ని చెక్కాలి. ఇక్కడ నాలుగు తామరకమలాలు. తెల్సిందా?

పనివాండ్రు—సరేనయ్యా, చూస్తావుగా మా పని?

(పనిచేయుచుందురు)

(ప్రవేశము: పల్లకీలో జేబున్నీసా, ఫాతిమా, వెనుక పరివారము)

జేబు—(ఒకసారి తోట కలయతిరిగి ఒక చోటికి వచ్చి) ఫాతిమా!

ఫాతి—అమ్మా.

జేబు—నీకొక వింత చూపించనా?

ఫాతి—తమ కన్న ముందే గ్రహించితి నమ్మా!

జేబు—సెహబాస్! నాకన్న చతురికవే నీవు. అదిగో. అవైపున జలయంత్రముకడ పనిచేయుచున్న వారిలో అతఁడే...ఆతఁడు.

ఫాతిమ—ఔనమ్మా. వేష మెంత మార్చినను చహరా గుర్తింపలేమనుకొన్నారు కాఁబోలు వారు.

జేబు—కాని ఫాతిమా! కడు సాహసిక యువకుఁడు సుమా యితఁడు? అయిన, ఈ విషయమున మనము కడుజాగ్రత్తగా ప్రవర్తింపవలయును. చక్రవర్తి కీ విషయమున ఏమాత్రము ఈగడ తెలిసినను మన మర్యాదలు నిలుచుట కల్ల.

ఫాతి—ఇట్టి విషయము లెన్ని మనము నిగ్రహింపలేదు సాహేబా?

జేబు—రావే, ఆవైపునకేగి అతనికి మరింత యుద్రేకము కలిగింతము.

(ఇరువురును జలకుండిక ప్రవేశింతురు.)

జేబు—ఈ శతపత్రమును, దానికై ఆశతో పరిభ్రమించు ఈ గండుతుమ్మెదను ఇక్కడ సహజసౌందర్యముతో చెక్కినవా రెవరు?

మేస్త్రీ—(వినయవినమితుఁడై) ఇదిగోనమ్మా, ఈయన. ఈ రోజున క్రొత్తగా పనిలోకి వచ్చాఁడు. సరిగ్గా తమరు వచ్చేముందు ఒకటిన్నర గంటలకాలంలో ఇంతచక్కగా తయారుచేశాఁడు. ఇంత నిపుణుఁడైన పనివాణ్ణిమాత్రం నే నెక్కడా చూడలేదు తల్లీ!

జేబు—సరే. మీ పనివాని కళానైపుణికి మే మెంతయు సంతసించితిమని చెప్పుము. కానీ, అతఁడు చిత్రించిన తుమ్మెద కడు దుడుకుదనము కలిగిన ట్లగపడుచున్నది. మితిమించిన దాని పరిభ్రమణముచే తప్త మధుప్రవాహమున తపింపఁబడవలయునేమో యని మాత్ర మాతనికి తెలుపుము.

మేస్త్రీ—ఏమో నమ్మా! తమరు సెలవిచ్చిన దానిలోని యర్థమేం నాకు తెలియలేదు. ఎందు కొచ్చిన మేస్త్రీ యితను. ఇలాంటి పనివాళ్లు పనిలోకి వస్తే నాబోటి మేస్త్రీలంతా మట్టికొట్టుకొని పోవలసిందే. ఆయనే ఏమన్నా సమాధానం చెబుతారేమోనమ్మా, మీ ఆక్షేపణకి.

ఆకిల్—(మేస్త్రీతో) అయ్యా, సాహెబా వారితో ఈ సమాధానం చెప్పండి. చూచారా? ఈ తుమ్మెదకి రెక్కలు చాలా గట్టివిగా చిత్రించాను. లోపలుండే హృదయంకూడా చాలా దృఢమైంది దీనిది. అది యిదివరకు పద్మంకోసం కుతకుతలాడి ప్రణయాగ్నితాపానికి ఫలితంగా వచ్చే తప్తమధుప్రవాహాలైనాసరే, మఱి ఏ యితర ఆపదలైనా భరించడానికి సిద్ధంగా ఉంది. అదీ నేను చిత్రించినదానిలో విశేషం—అని.

జేబు—(మేస్త్రీతో) సరే. పని పూర్తిగా అంగీకరింపఁబడినది అని తెలుపుము. ఆతఁడు కోరిన బహుమతికి ఆతఁడెంతయు నర్హుఁడని నా యభిప్రాయమనికూడ తెలుపుము. పని త్వరలో ముగింపనాజ్ఞ.

మేస్త్రీ—చిత్తము రాజపుత్రీ! (అభివందనము చేయును.)

జేబు—(ఫాతిమాతో ముందుకువచ్చి) ఆకర్షించితివి ఆకిల్! పూర్తిగా నాహృదయమును.

ఇదివఱ కెందరెందఱో మ
హీయహృదంతరవాసలబ్ధి కా
పదల ముసంగ నెంచుచుఁ ద
పం బొనరించిరిఁగాని యెన్నఁడున్
బ్రిరులని మామకీన మృదు
ప్రేమసరోరుహ పత్రపంక్తి నేఁ
డిది వికసించెనోయి మది
యేమి విచిత్రమొ కాని ప్రేమికా.

గురువాక్యార్థమునకు సార్థకత కలుగుచున్నదేమో? ఫాతిమా! జయింపఁబడితిమి రాజే.

(నిష్క్రమి. తెర)

## మూఁడవ రంగము

[స్థలము : ఢిల్లీలో ఔరంగజేబు ఆంతరంగిక మందిరము. ప్రవేశము : ఔరంగజేబు సాలోచనగా. గురువు, వైద్యుఁడు ఆసనములపై.]

ఔరంగ—ఉస్తాద్ జీ! తమ రెన్నడైన మా జేబున్నిసాకడ వివాహవిషయకప్రసంగము చేసితిరా?

గురువు—చిత్తము సామ్రాట్! ఆమె ప్రాపంచిక విషయములను అనుభవపూర్వకముగ నర్థముచేసికొని గాని యేదో నిర్ణయింపఁజాలనని సెలవిచ్చినారు.

ఔరంగ—సరే. తమదర్శనము మరల నేను త్వరలోనే చేసికొందును.

గురువు—చిత్తము సామ్రాట్. సెలవు.

(నిష్క్రమి)

ఔరంగ—వజీర్ జీ! ప్రయత్నములు సాగుచున్నవా?

వజీర్—చిత్తము సామ్రాట్. ఒకటిరెండు తరవాయిగా రావలసిన చిత్రపటము లన్నియు వచ్చినవి. అవికూడ ఈరోజున రావచ్చును. వచ్చినవెంటనే వాటిని షాజాడీ సాహెబాకు మీ ప్రధానకార్యదర్శిచే పంపించెదను.

ఔరంగ—ఆకిల్ పట మంపినాఁడా?

వజీరు—పంపినాఁడు సామ్రాట్!

ఔరంగ—ఇంకను వచ్చినవానిలో ముఖ్యమైన వేవి?

వజీరు—సింధుగవర్నరు ఆదిల్ ఖాను సామ్రాట్!

ఔరంగ—తుచ్ఛుఁడు. ద్రోహబోతు. వాఁడా నా కుమార్తె పాణికై ఆశించువాఁడు? సరే. ఈదినమె యగును వాని జీవితపరిసమాప్తి.

వజీరు—చిత్తము సామ్రాట్!

ఔరంగ—రావలసినపటము లన్నియు వచ్చిన వెంటనే అంచెగుఱ్ఱములపై లాహోరున కంపి, అమ్మాయి నిర్ణయించిన పటమును మాకడ కతిరహస్యముగాఁ గొనిరా నాజ్ఞ.

వజీరు—చిత్తము సామ్రాట్!

ఔరంగ—ఇఁక మీరు సెలవుతీసికొనవచ్చును.

వజీరు—చిత్తము. (నిష్క్రమించును)

ఔరంగ—ప్రళయము దరిసినది. ప్రభంజనము చెలరేఁగుచున్నది. హంతాకమున కీగలు ముసురుచున్నవి. ఎన్ని జీవనావలము లీమహాఝంఝలో కొట్టుకొని పోఁగలవో లెక్కలేదు. సింహరమణికై ఆశించు నక్కలకు దారుణమృత్యువు ఫలితము. సాహసించి దరిచేర ప్రయత్నించు పురుషసింహమునకు ప్రణయఫలసిద్ధియో, ప్రాణాపాయమో? కాలమే తేల్పఁగల దీవిషమ పర్యవసానమును...ఎవ రక్కడ?

సేవకుఁడు—జీ, హుజూర్!

ఔరంగ—అంతఃపురమునకు. (నిష్క్రి)

## నాలుగవ రంగము

[లాహోరులో జేబున్నీసా మందిరము. ప్రవేశము: ఫాతిమా చిత్రపటములతో. సోఫాపై జేబున్నీసా.]

ఫాతి—షాజాదీ! పాదుషావారు ఈపటములు తమకడ కంపినారు. ఈపటములలో నన్నొక యువకుని నీ వెన్నుకొని తమకడ కంపినచో వానితో నీకు వివాహము గావించెదమని.

జేబు—ఫాతిమా! నీ వెఱుఁగని వృత్తాంత ముండు నటే! అవులించిన ప్రేవులు లెక్కిడఁజాలు పాదుషాకు మనవృత్తాంత మంతయు నవగతమై, యంతఃపురమర్యాద ప్రతిష్ఠించుటకై యీ యుక్తి ప్రదర్శించినాఁడు. సరే. మన నిర్ణయ మిదివఱకే జరిగినదికదా? ఏవీ, ఆ పటములు!

ఫాతి—ఇదిగో నమ్మా!



జేబు—(పటములఁ బరికించుచు) ఇతఁ డెవరే ఫాతిమా! చక్రవర్తికోఁటలో పెంపఁబడుచుండు భల్లూకమువలె నున్నాఁడు. ఇతనిఁ జూచిన నేలొకో నా మనమున ననవసరాందోళనము కలుగుచున్నది.

ఫాతి—వారు సింధుదేశమునఁ జక్రవర్తి యాజ్ఞల పాలించు గవర్నరు ఆదిల్ ఖాను.

జేబు—సరే. ప్రథమమున నా చిత్రమును నా కనులయెదుటనుండి తొలఁగించి, మన నిశ్చితచిత్రపటమును చక్రవర్తికడకుఁ బంపుము.

ఫాతి—చిత్తము రాజపుత్రీ!

జేబు—కాని, ఫాతిమా! ఎందులకే నా హృదయ మాతని తలఁచుకొనినంతనే యింతగా ద్రవించుచుండుట. కఠినాయఃపిండమును కరఁగినదే ఫాతిమా! కర్కశ వజ్రము సైతము చూర్ణమైనదే! ఇంతకును గురువాక్యముల యర్థ మేరీతిఁ బరిణమించునో!

ఫాతి—అమ్మా! నీ వేమియు నధైర్యపడకు. సర్వమును శుభముగా పర్యవసింపఁగలదు.

జేబు—ఫాతిమా! మన నిర్ణయము ననుసరించి యాతఁడు చక్రవర్తియాజ్ఞ నంగీకరించునందువా?

ఫాతి—ప్రస్తుత పరిస్థితి ననుసరించి నీమనసిట్లు శంకించుచున్నదే కాని, నీ కొఱకంతటి ప్రేమతపస్సు చేయుచుండువా రిప్పుడు తిరస్కరించుట యెట్లు కలుగునమ్మా?

జేబు—ఏమోనే ఫాతిమా! అల్లా యెట్లనుగ్రహించిన అట్లు జరుగఁగలదు. దానికి మన మెంతమాత్రము కర్తలము కాముగదా? ఈ కార్యమున విజయ మంది, గురుపాదములకు భర్తృసహితనై నమస్కార దక్షిణ నొసంగుటయో, కార్యవైఫల్యమున గురుపాదములకు నా వైవాహికజీవితమే దక్షిణనొసఁగి యాజన్మ బ్రహ్మచారిణినై జీవించుటయో? ఈ రెంటిలో నేదియో జరుగఁగలదులే! పద లోపలికి. (నిష్క్రి)

# చతుర్థాంకము

## మొదటి రంగము

[ఆదిల్ ఖాను భవనము. ప్రవేశము: ఆదిల్ ఖాను, సేవకుఁడు రజాక్.]

ఆదిల్—నీ వసాధ్యుఁడవురా రజాక్!

రజా—పీర్లవారి కటాక్షం సల్లగా హుండాలి. సర్కార్!

ఆదిల్—ఇంత విషయము నీ వెట్లు గ్రహింపఁ గలిగితివిరా!

రజా—జేబ్ హచ్చా హీ లా స పురుషుడు హోవం హోతాను సర్కార్!

ఆదిల్—ఊఁ. పేసి?

రజా—లాహోర్ మే కోటాదగ్గిరా ముకాం చేశాను సర్కార్!

ఆదిల్—ఓరి పిడుగా! తరవాత?

రజా—సాక్కుడా ముకాం ఏసి సల్లాసల్లాగా షాజాదీకి హిసినాకల్లా ఏసీ బీబీ హుండాదీ లేదూ, సర్కార్! దాన్కి హోషక్ కలిపాను సర్కార్! (నవ్వును.)

ఆదిల్—హోరి నీ ఎత్తుకాలా! రజాక్! పెద్ద ఉపాయమే పన్నితివిరా!

రజా—హాఁ. సర్కార్! హింకా హినోక్కండి సర్కార్! సిత్రపటాలు వచ్చేసరికి దానీ విసం నేనూ హేసి సల్లగా షాజాదీకి విషనాకల్లా హేసే దాన్కి సిద్ధపడ్డాను సర్కార్!

ఆదిల్—షెబాస్! సేవకుడవన నీవే సేవకుడవురా! ఇదిగో ఈ బంగారు నాణెములమూట తీసుకో!

రజాక్—షుక్రియా, సర్కార్!

ఆదిల్—అయితే, ఈ విషయములో మనము జయింపలేకపోయినా, ఇంకొకని భాగుపడనిత్తుమటరా రజాక్!

రజా—నై సర్కార్! కభీనై సర్కార్! హింకొకణ్ణి భాగ్ పడనిస్తే మందీ గొప్ప హేమిటీ హుండీ సర్కార్!

ఆదిల్—ఠీక్ హై రజాక్! రేపే నేను లాహోరు ప్రయాణము. నీవుకూడా సిద్ధపడి ప్రయాణమగుము. నీ విసినకఱ్ఱప్యారీని మరల నొకసారి చూచుకొనవచ్చును.

రజాక్—సిత్తము సర్కార్! నేనూ లాడీ జేబ్ సద్దుకొని నాదీ బీబీకి సావల్ గట్రా ఏసి పయానాన్కి తయార్ హుంటాక్ సర్కార్!

ఆదిల్—సరే. నీవు పో.

రజాక్—(నిష్క్రి)

ఆదిల్—సరే. అకీల్! కాచుకో నా దెబ్బ. ఎంతకాలమునుండియో నా మనస్సున నివసించుచుండిన వస్తువును బలవంతముగా నూడఁ జెరికికొనఁ జూచితివి. దాచుకో! ఆ పుత్తడి బొమ్మను నీకుఁ గాకుండఁ జేయనిచో నా పేరు ఆదిల్ ఖాను కాదు. (నిష్క్రి. తెర)

## రెండవ రంగము

[లాహోరులో అకీల్ ఖాను భవనము. ప్రవేశము: అకీల్ ఖాను]

అకీల్—ప్రణయమునకును, ప్రాణమునకును పందె మొడ్డితిని. ప్రాణమే బలియగునో, ప్రణయమే సిద్ధించునో? నాభాగ్యదేవత నన్నే వరించినది. చక్రవర్తి దాని కనుమతించినాఁడు. కాని, భావిగతి యంతయు సంశయగ్రస్తమైన ట్లంతరాత్మ సూచించుచున్నది. ఏదియెట్లయినను నా ప్రణయదేవీపాదపీఠికకడ నా ప్రాణకుసుమమును సైతము బలిపెట్టఁదలఁచిన నాకేమిభయము!

పొందితినా మనోజ్ఞ వరి
పూర్ణసుధాంశుసమాస్యపాణి నా
సంపదని న్యహారకల
నా సుఖసంపదఁ జాలలాడెదన్,
బొందుట మింటిపూవయియి
పోయిన ముందటిజన్మనైన నా
సుందరగాత్రి సత్ప్రియయి
శోభితచిత్తములో వసింపెదన్.

(ప్రవేశము : సేవకుఁడు.)

సింధుగవర్నరు ఆదిల్ ఖానుసాబ్ ఆప్ కా దర్శన్ చాహతే హై సర్కార్!

అకీల్—ప్రవేశపెట్టవచ్చును.

సేవకుఁడు—జీ సర్కార్!

(ప్రవేశము : ఆదిల్ ఖాను, రజాక్)

అకీల్—స్వాగతము సింధు గవర్నరువారికి. ఇదిగో మీ ఆసనము.

ఆదిల్—సలామ్. సలామ్. క్షేమముగా నున్నారా! (కూరుచుండును)

అకీల్—మీదయవల్ల నింతవఱకును క్షేమమే.

ఆదిల్—చక్రవర్తి విశేషములేమి? రాజపుత్రీ వరనిర్ణయవృత్తాంతమేమైనఁ దమకుఁ దెలిసినదా?

ఆకిల్—ఏమైనఁ గ్రొత్తవిశేషము లుండినఁ దమవల్లఁ దెలిసికొనఁ గుతూహలపడుచున్నాను.

ఆదిల్—తమకుఁ దెలియని క్రొత్తవింత లేముండును? అయినను, నేనే తమకుఁ దెలిపెదను. రాజపుత్రి తమ చిత్రపటము నెన్నుకొన్నది. నేఁడో రేపో చక్రవర్తికడనుండి తమ కాహ్వానము లభింపఁగలదు.

ఆకిల్—సంతోషము. అట్లైన నేను ఢిల్లీ ప్రయాణమున కాయత్తపడవలయు నన్నమాట.

ఆదిల్—కాని, గవర్నరుజీ, చక్రవర్తి ప్రవృత్తి తమకుఁ దెలియనిది కాదుకదా?

ఆకిల్—తెలిసినదే! కానీ, ఈవృత్తాంతమునకును, చక్రవర్తిప్రవృత్తికిని గల సంబంధమేమో నాకు బోధపడుటలేదు.

ఆదిల్—ఈపరిస్థితిలోఁ దమకు బోధపడకుండుట ఆశ్చర్యము కాదులెండి గవర్నరుజీ! కాని, ఈవిషయములో చక్రవర్తినిశ్చయము చాల భయావహమని వినియున్నాను.

ఆకిల్—చక్రవర్తి స్వయముగా ఆహ్వానమే పంపిన నేను పోవుటలో భయమేమి, గవర్నరుజీ!

ఆదిల్—చక్రవర్తినిశ్చయమును నేను చారులచేఁ దెలిసికొన్నాను. (రజాక్‌తో) ఓరే రజాక్! మొన్న ఢిల్లీనుండి వచ్చిన చారులు చెప్పిన వృత్తాంతము గవర్నరువారికిఁ దెలుపుము.

రజాక్—హా గులామ్ము నీవ్సే సేస్తున్నాడు సర్కార్! పాదుషావారు తద్దా లడ్కీకి నిఖానేసే దానికీ తెల్సిందీలేదూ, హోరూ పేరుకొన్న పురుషుణ్ణి ఢిల్లీకి బులాకర్. ఖుక్కల్ సేత కర్పించి సంపేసే దానికీ తెల్సిహుంచా, అని బోలా సర్కార్! ఇన్న సంగతి హిదీ సర్కార్! సలామ్, సలామ్!

ఆదిల్—విన్నారా గవర్నరుజీ! బ్రతికియుండిన బలుసాకు తినవచ్చు. మీ ప్రయత్న మితరోపాయములచే సిద్ధింపఁజేసికొనవచ్చును. కావి, ప్రస్తుతము మరు ప్రయాణమాఁపుట మంచిదని తోఁచుచున్నది.

ఆకిల్—గవర్నరుజీ! నేను తమ మాటలు విశ్వసించి ప్రస్తుతము నాప్రయాణ మాఁపుచున్నాను. కానీ, కార్యసంసిద్ధియగువఱకు నా ప్రయత్నమును మాత్ర మాఁపను.

ఆదిల్—అది పంటలపని గవర్నరుజీ! అంతము చూచువఱకును యత్నకార్య మాపనగునా! మఱి నాకు సెలవు.

ఆకిల్—ఈ రోజున తమరు నా యింట నతిథులు.

ఆదిల్—క్షమాపణ. ఈ దినమున నేను తప్పక మా పట్టణమునకుఁ బోవలయును. తప్పనిసరి రాజకీయ పత్రము లెన్నియో చూడవలెను.

ఆకిల్—చిత్తము, సెలవు.

రజాక్—(సేలకువంగి) సలామ్ లైకుం సర్కార్!

(ఆదిల్ ఖాను, రజాక్ నిష్క్రి)

ఆకిల్—

మనసా! కొందలమందెదేల? సుఖ సా
 మ్రాజ్యంబు ప్రాప్తించుచో
ఘనమోదంబును బొంది మిక్కుటము లా
 కష్టంబులంగాంచు ప
ట్టున నాందోళనలో మునింగి యిటులన్
 డోలాయమానంబుగా
దనరం జూచిన నిన్ను సజ్జనులు నిం
 దల్ మోపి కోపింపరే?
భావిగతిక్తై వగచి యేమి ప్రయోజనము!

(నిష్క్రి. తెర)

## నాలుగవ రంగము

[స్థలము : ఢిల్లీలో ఔరంగజేబు మహల్
ప్రవేశము : ఔరంగజేబు, వజీరు.]

ఔరంగ—ఊఁ. ఆలీఁ డట్లుపేక్షించువాఁడు కాఁడే? నా యాజ్ఞ నాతఁడు తృణీకరించె ననుకొందునా? లేక, ఏగినంత కారణాంతరములచే రామాని ననుకొందునా? ఇది లెస్సగా నాలోచింపవలసిన విషయము. వజీర్‌జీ! లాహోరులో ఉద్యానవన నిర్మాణము పూర్తియైనదా?

వజీరు—అయినది సామ్రాట్! గవర్నరుగారా విషయములో పూర్తిగ కలుగఁజేసికొని నిర్మాణమును సర్వాంగసుందరము గావించినారఁట.

ఔరంగ—మంచిది. కాని, మన యాహ్వానముపై ఆకిల్ రాకుండుటకుఁ గారణము తమ రేమని యూహించుచున్నారు?

వజీరు—ఏదో ఘనమైన కారణ ముండినఁగాని వారు రానివారు కారు సామ్రాట్! కారణము నాకును నూహింపరాకున్నది.

ఔరంగ—కారణమేదైనను, వెంటనే యతఁడిటకు రానినేరము మాత్రె మతనిపై నున్నది. దానికిఁ గల కారణములు విచారించుట తరువాతిది.

వజీరు—జీ సామ్రాట్!

ఔరంగ—కాని, ఆకిల్ ఖానును మాత్రము నే నెన్నఁడును ద్వేషింపను. సహజముగ యౌవనోద్రేకముచేఁ గలుగు సంఘటనల కాతఁడే కాదు, ఎంతవారైన లోఁబడవలసినదే. అంతఃపుర మర్యాదలు ప్రతిష్ఠించుటకు అతని వధింపవలసివచ్చినను వధించెద. కాని, దీనికిఁ గారణభూతులైనవారికి మాత్రము సద్యోమరణదండనము విధాయకము.

(ప్రవేశము : సేవకుఁడు.)

సింధుగవర్నరు ఆదిల్ ఖానుసాబ్ దర్శనంకో మంకస్వెట్టుకుని ఘుమ్మంధగ్గిరా హుండారు హుజూర్.

ఔరంగ—వజీర్ జీ! ప్రవేశపెట్టుమనుఁడు! (మజీరముకతలఁపుతో) వచ్చితివా? ర్యారా విషఘుటికా! మృత్యుఘటికల్లో వచ్చితివిలే. ఇదిగో ఈ దెబ్బతో నీపని సరి.

(ప్రవేశము : ఆదిల్ ఖాను, రజాక్.

ఆదిల్ ఖాను వంగివంగి సలాములుచేసి నిలుచుండును. రజాక్ సలాములుచేసి గుమ్మమువద్ద నిలఁబడును.)

ఔరంగ—ఓహో, ఆదిల్ ఖాను మహాశయులు! అదిగో ఆసనము; దయచేయుఁడు. ఎక్కడనుండి తమ రాక?

ఆదిల్—కారణాంతరములచే లాహోరునకేఁగి తమ దర్శనార్థమై వచ్చితిని సామ్రాట్.

ఔరంగ—ఓహో, తమరు లాహోరునకేఁగితిరా? అచ్చటివిశేషము లేమి?

ఆదిల్—రాజపుత్రి యుద్యానము జగన్మోహనకరముగా నున్నది సామ్రాట్! గవర్నరు ఆకిల్ ఖాను వారి దర్శనము చేసివచ్చితిని.

ఔరంగ—ఆకిల్ ఖానును చూచివచ్చితిరా?

ఆదిల్—చిత్తము సామ్రాట్! నే నచటికి వెళ్లినప్పటికే వా రిచటికి తమ దర్శనార్థమై వచ్చియుందు రనుకొంటిని. కాని, నాకు వారి దర్శనము లాహోరునందే లభించినది.

ఔరంగ—ఓహో, నన్ను చూచుటకు వారిచటికి వచ్చియుందు రనుకొంటిరా? వా రేమి చెప్పిరి?

ఆదిల్—ఏమియును లేదు సామ్రాట్! కాని? వారు తమ యాహ్వానమును సరిగా మన్నించియున్నటులు కనిపించలేదు.

ఔరం—మంచిది. తరువాత?

ఆదిల్—వారు తమ యనుజ్ఞతో నిమిత్తము లేకుండనే రాజపుత్రీ పరిణయోత్సుకులైనట్లు కనిపించినారు సామ్రాట్!

ఔరంగ—ఓహో, అట్లనా? వా రేమి మనవి చేసినారు తమతో?

ఆదిల్—రజాక్! గవర్నరుగా రేమి చెప్పిరో చక్రవర్తిగారికి మనవిచేయుము.

రజాక్—హీగులామ్ సచ్ బోల్తాహై సర్కార్! పాదుషా హుకుంకీ మాకీ ఖాతర్ చేసేదీ లేదు. మాకీ షాజాడీ బహుత్ ఆమక్ హై. మాకీ ఢిల్లీకి వచ్చేదాన్కి బిల్కుల్ జరూర్ నైబోలా హుజూర్.

ఔరంగ—తమ రేమి చెప్పితిరి?

ఆదిల్—సార్వభౌముని యాజ్ఞల నుల్లంఘించుట మర్యాదకాదని చెప్పితిని సామ్రాట్!

ఔరంగ—మంచిది. కాని, తమ రిప్పుడు నన్ను చూచుటకు వచ్చినపని?

ఆదిల్—ఏమియును లేదు సామ్రాట్! ఏలినవారి దర్శనము చేసిపోవుటకు మాత్రమే వచ్చితిని.

ఔరంగ—సేవకులు?

(ప్రవేశము : ముగ్గురు కొజ్జాలు-సలామ్‌లుచేసి నిలుతురు.)

ఔరంగ—వజీర్ జీ! ఆదిల్ ఖాను సాహెబ్ వారు కష్టపడి మన కీవర్తమానము గొనివచ్చినారు. వారు తగిన బహుమతి పొందవలెను. వారిని వెంటనే ఊరు బయట తోటలో పెద్ద వేటకుక్కలచే సేవక సహితముగా......

వజీరు—జీ. సామ్రాట్!

ఆదిల్—సామ్రాట్!

ఔరంగ—మాటాడ వీలులేదు. వజీర్ జీ! పిట్టకైన తెలియకుండ ఆ తోటలోనే యీ తుచ్ఛులకు సమాధి.

వజీరు—చిత్తము సామ్రాట్!

(ఔరంగజేబు శీఘ్రగా నిష్క్రమించును. ఆదిల్ ఖాను, రజాక్ వడవడ వడఁకుదురు. కొజ్జాలు వారిని బంధింతురు. వజీరు వెంటరా కొజ్జాలు బంధితులతో నిష్క్రమింతురు.)

## పంచమాంకము

### మొదటి రంగము

[స్థలము: ఊరిబయటితోట. ప్రవేశము: ఆదిల్ ఖాను, రజాక్, ముగ్గురు కొజ్జాలు.]

ఆదిల్—రే రజాక్! ఇదియేమి ప్రారబ్ధమురా!

రజాక్—పారబ్ధం హేమిటీ సర్కార్! హనోక్కద్దూ కానీ, నీదీ హెధ్వామొగం సర్కార్! ఆకిల్ ఖాను సాహెబ్ నీ ఘోతీలోతో సేదాన్కి హోలోదించీ మీారే హోగోతీలో పడ్డారు సర్కార్!

ఆదిల్—ఓరి పీనుగా! నన్నే తిట్టుచున్నావుట్రా!

రజాక్—తిట్కపోతే హేమిటి సర్కార్! సచ్చేవాడ్కి హింకా భయం దేన్కి? హారే హల్లా! నాదీ బీబీకీ, పిల్లల్కి దారి ఏదిరా? హింకా దాన్కి చావల్, కోడిగుడ్లూ హెవరేస్తారురా అల్లా! హింటిక్కబురు హెల్లడానికి దారీ లేదురా అల్లా! నీదీ కొల్వాకొల్చి సచ్చిపోయానయ్యా ఆదిల్ సాహెబ్!

ఆదిల్—నాకు మాత్రము దారి ఏదిరా రజాక్! మానవ ప్రపంచకాని కింక మన సంగతి తెలియదు. మొన్ననే పెళ్లి చేసుకున్న మాదవభార్య మోతియా నా వియోగము భరించలేదురా. ఇంక నా హుక్కాగొట్టము, మద్యపాత్ర ఎవరాదరింతురురా రజాక్!

రజాక్—హనోక్కద్దూకాని, నీకీ పాయ్యకాలం కాకపోతే హింకా యీా ప్యారీహోసా ఏమిటీ సర్కార్! నీదీ నమ్మక్ తిని నేనూ సచ్చిపోయాను. సచ్చిపోతే మళ్లీ ఎలా బతుకుతాను సర్కార్! నీకీ ఎప్డూ ప్యారీ, దారూ దారూ, ప్యారీ! ప్యారీ, దారూకి సచ్చిపోయావు సర్కార్! సచ్చిపోయావు, నన్ను సంపీఏశావు. నీదీ మొహం చూస్తే పాపంఒస్తుంది.

ఆదిల్—రజాక్! ఓరి నీ మొగంమండ! నేను నీ యజమాని గవర్నరు ఆదిల్ ఖానుని. తెలిసినదా! నన్ను పట్టుకొని అటులు తిట్టుచున్నావేమిరా?

రజాక్—నువ్వు హుత్త హెధవ్వి. బత్కి ఉన్నంతసేపూ నాసేతా ఎధ్వాపనులూ అన్నీ సేయించి నన్ను సంపీహేశావ్. అప్డూ నువ్వు గవర్నర్. నేనూ గులాము౦డావాణ్ణి. హిప్డూ సచ్చిపోయేటప్డూ హేటాకుక్కల్ సన్లూకీ ఘుండెల్ తీసేసేటప్పుడు నువ్వూ హొక్టే, నేనూ హొక్టే. ఇంకా నీకీ కళ్లు నెత్తినించీ దిగిందీలేదూ? రారా బాబూ! ఇప్పుడు నువ్వూ హొక్టే. నేనూ హొక్టే. సచ్చిపోదాం రా.

(ఆదిల్ ఖానును ముందుకు తోసి రజాక్ నిష్క్రమి.)

### రెండవ రంగము

[స్థలము: లాహోరులో జేబున్నిసా బాగ్. సమయము: రాత్రి ౧౨ గంటలకుపైన. పూర్ణిమా చంద్రిక. ప్రవేశము: నిలువెల్ల తెల్లని మేలిముసుగు ధరించి జేబున్నిసా. వెనుకనుండి అల్లే మెల్లగా అడుగు లిడుచు ఫాతిమా. జేబున్నిసా మెమ్మదిగా తక్కుచు తారుచు ఒక లతాగృహము సమీపించును. ఫాతిమా ఆమెకడ కేఁగును.]

జేబు—ఫాతిమా!

మలయునా, నా ప్రేమ మాలతీసుమమాల
పరిమళాన్వితో మృదువాయులహరి
పలుకునా, నా ప్రేమవల్లకీ మృదు తంత్రి
కమనీయ రాగసంగతుల రవళి

విరియు నా, నా ప్రేమవిధుబింబ మింపుగా
సత్కాంతి చంద్రికా సముదయముల
తోవకు నా, నా ప్రేమ తోయజపత్రాళి
భవ్య మరందప్రవాహ గరిమ
విగతమాత్రత నందక, తెగక, గ్రహణ
బాధనందక, కుమ్మలితఁ బడయఁ బోక
చెచ్చెలీ! నేఁడె కడసారి నిశ్చయంబుఁ
బడసెదనుగాదె, సుఖదుఃఖ ప్రశ్నపంక్తి.

హాలాహలమో, అమృతమో నేఁడు నాజీవిత ఖండమునఁ బూరింపఁబడినది. నివారింపరాని యీ విషమ ప్రణయసమస్యకు నేఁడే తుదినిశ్చయము. చండశాసనుఁడైన చక్రవర్తి యేనిముసమున కానిముసమే యీవిషయముల నాకళించుచుండు ననుటలో సందేహము లేదు. కాని, ఏనిమిషమున కానిమిషమే నా మనోహరదర్శనాశ్లేషణములయందలి ప్రగాఢవాంఛ నన్ను వదలకున్నది. అత్యంతసాహసికుఁడైన నా యకిల్ మద్గత ప్రాణుఁడు. కానిమ్ము. ఏది ఎట్లు జరుగనున్నదో. అల్లాహో అక్బర్. (జాజిపువ్వుల దండలు గ్రుచ్చుచుండును)

(ప్రవేశము : మఱియొకవైపునుండి అకిల్ ఖాను విలాసవేషముతో)

రాఁగదె శారికా! ప్రణయ
రాగమరందరస ప్రవాహముల్
వాగులుగట్టఁ బాడుచు శు
భప్రదమా నద లొప్పుచుండఁగా
బాగుగ నామనోవిమల
పంజరమందు వసించి యెప్పుడున్
ధీగరిమం జెలర్పఁగను
దీయని గీతిక లల్లుచుండఁగన్.

సరిగా నిదియే సమయమున నిదేస్థలమున నా జీవితసరోవరమున ప్రేమకమలము వికసించినది. ప్రతి దినము నది నాకు మధురమరందమును, మనోజ్ఞ పరిమళము నొసంగుచు నన్నానందింపఁ జేయుచున్నది. నేఁడు నాకు నిమిత్తము లేమియు శుభప్రదములుగా లేకపోయినను, అంతమాత్రమునకు వెఱచి నా ప్రణయఫల ప్రాప్తి విసర్జించుట నాస్వభావమునకు దూరము. ఏదీ, నామధుర ప్రణయిని. నా నయనానందపూర్ణిమాకౌముది. నా హృదయరాగరంజిత పద్మరాగమణి. అదిగో, అలతాగృహమున పుష్పమాలారచనానిమగ్నయై యున్నది. (వెనుకనుండి పోయి కనులు మూయును)

జేబు—(చేతులు తొలఁగించి వెనుకకుఁ జూచి, జాజిపూలదండ మెడలో వైచి) ఇదియేమి? ప్రియా! నీగళమువక్షోభీకరవిషాహి ప్రేలుచున్నది. అమ్మయ్యో, అది తీవ్రవిషార్చులు వెలిగ్రక్కుచున్నది. ఓహో, నీవు- నీవు నిజముగా నామనోహరుఁడవా? పన్నగభూషణుఁడైన నటరాజమూర్తివా? ఏ మావిలయనృత్యము? విలయనృత్యమా, ఆనందనృత్యమా అది?

ఓనటరాజ! దివ్యకరు
ణోదధి! నాహృదయాబ్ధి వీచికా
గానముతోడు నీవిలయ
కంపిత నాట్యము నేయు టేల? నా
మానస వల్లికం దగు సు
మప్రజముల్ దిగనాడి యేలొకో
పూనితి నిష్ఠురాహితతి
భూషణజాలముగా మహేశ్వరా!
అల్లాహో అక్బర్!
వెఱ్ఱిగా చూచుచుండును.)

అకిల్—ప్రేమసఖీ! కవితా ప్రణయినీ! ఏల నీ వీనాఁ డిట్లు ప్రణయోద్రేకతతో నున్నావు? ఓ యున్మత్త ప్రణయినీ! నీహృదయములోని యభిప్రాయమును నేను చెప్పెదను జూడు.

నామెడలోన నీవునిచి
నా వొక జాజిసుమాళమాల; ప్రే
మామృతయుక్తమై పరిమ
ళాన్వితమై సితకాంతి ధామమై
నామది కింపుగూర్చినది
నాప్రియసుందరి! నేను నిప్పుడే
నీమెడఁగూర్తు బాహుయుగ
నిర్మలప్రేమ సరోజ మాలికన్.

(కౌఁగిలించుకొనఁబోవును.)

(తోటలోని చిఱుగంటలు మ్రోగును.)

జేబు—అదిగో, విలయకాలమే సమీపించినది. ఆకిల్! చిఱుగంటల సవ్వడి నీకు వినరాలేదా? అది చక్రవర్తియాగమనమును సూచించుటకై నేను చేసిన యేర్పాటు. ప్రత్యక్ష దండధరుని కోఱలలోఁ జిక్కుకొన్నాము, ఆకిల్! మన మరుపురము. ఇప్పుడేమి యుపాయము?

ఆకిల్—ఉపాయమున కేమున్నది సఖీ! నీ ప్రేమాగ్నికి నేనాహుతి. ఇపుడు బలి జరుగఁగలదు. ప్రణయబలి. సంతోషముతో స్వీకరింతును. భయమేమి? ఇది నిశ్చయమైన విషయమే కదా?

జేబు—వలదు ప్రియా! బ్రతికియుండిన మఱియొకపరి నీప్సితార్థసిద్ధి కలుగును. ఇదిగో, నిచట నొక పెద్ద కటాహమున్నది. నీ విందు ప్రవేశింపుము. నేనెట్లో చక్రవర్తిని పంపివైచెదను. మాఱాడవలదు. ఇది నాయాజ్ఞ. ప్రియా!

(ఆకిల్ కటాహములో ప్రవేశించును.

ప్రవేశము : ఔరంగజేబు, వజీరు, ఇరువురు సేవకులు. ఔరంగజేబు ఒకసారి తోటనంతయు కలయఁ దిరిగి జేబున్నిసా కడకు వచ్చును.)

జేబు—పితృదేవులకు పాదాభివందనము.

ఔరంగ—చిరంజీవ!—అమ్మా! క్షేమముగానున్నావా? అర్ధరాత్రమున నుద్యానములో పూర్ణిమా కౌముదీ విహారము కాఁబోలు?

జేబు—ఔను, పితాజీ! మనఃప్రశాంతికై నేనును, ఫాతిమాయు కొంతతడవిందు విహరింప వచ్చితిమి.

ఔరంగ—మంచిది. వెన్నెల కన్నతల్లి. మనస్సునకు శాంతినీయఁగలదు. కుమారీ! ఆకటాహములో నేమున్నదో నేఁ దెలిసికొన వచ్చునా?

జేబు—పితాజీ! ఈ యుద్యానమునందు పాలకులు ప్రతిదినమును, స్నానమునకై ఉష్ణోదకమును సిద్ధపఱుచుకొనుటకు ఉపయోగించు కటాహమది. అది యిపుడు జలప్రపూర్ణమై యున్నది.

ఔరంగ—మంచిది. అమ్మాయీ! ఢిల్లీనుండి యిచటికి వచ్చిన ప్రయాణ బడలికచే నాసేవకులందఱును మిగుల డస్సియున్నారు. వారి స్నానములకై ఆ నీటిని మఱఁగఁజేసి సిద్ధపఱుపుము. సేవకులారా! వెంటనే దానిక్రింద నగ్నిముట్టించి నారేయుటనే మీ స్నానాదికమును సిద్ధపఱుచుకొనుఁడు.

సేవకులు—జీ హుజూర్!

(కటాహముక్రింద ఇంధనములుంచి అగ్ని రగిలింతురు. అగ్ని జాజ్వల్యమానముగ మండుచుండును. జేబున్నిసా నిశ్చేష్టయై చూచుచుండును. అగ్నిచే కటాహమంతయు తపింపఁబడి ఎఱ్ఱఁబడిపోవును.)

ఔరంగ—పుత్రీ! నేను బసకుఁ బోవుదును. నీవును విహారము ముగించి గృహమున కేఁగుము. తిరిగి నీవు నన్నుదయమున చూడవచ్చును. (నిష్క్రమించును)

జేబు—(వేదనతో కటాహమునకు ప్రదక్షిణించుచు)

కమలము నాత్మఁగోరి తమ
కంబునఁ బత్రములందుఁ జిక్కి ని
ర్మమతఁ దదీయ తప్తమగు
మధ్యమునం దపియించి ప్రాణజా
లము త్యజియించినట్టి భ్రమ
రా! కడకాళ్లకు మ్రొక్కిదాసి పా
పమునకు నిష్కృతిం బలుక
వా? క్షమ నాదరణం బొనర్పవా?

ఆకిల్! నాప్రియ ఆకిల్! ఫాతిమా! ఫాతిమా! నాశరీరము వశము దప్పుచున్నది. (మూర్ఛ. ఫాతిమా ఉపచారములు చేయుచుండును. తెర)

## మూఁడవ రంగము

[ఢిల్లీలో జేబున్నిసామందిరము. ప్రవేశము : జేబున్నిసా సాధారణ నిరాడంబర వస్త్రములతో, విరాగిణివలె ఖురాన్ పఠించుచు. ప్రవేశము: గురువు.]

జేబు—నమో గురుభ్యః!

గురువు—వత్సా! చిరంజీవ! అమ్మా! విశేషములేమి?

జేబు—గురూ, సద్గురూ! స్వానుభవపూర్వకముగా నిశ్చయించుకొని తమకు నేనిప్పుడు నా వైవాహిక జీవితమును గురుదక్షిణగా సమర్పించుచున్నాను. నా ప్రియశిష్యురాలు జేబున్నిసా తమ పదసాక్షిగా,

అల్లా పాదసాక్షిగా జన్మాంతబ్రహ్మచారిణినై పరమేశ్వర పాదసేవాపరాయణ.

జరిగినదాని నంతయుఁ బ్ర
  సన్నమతిం గనుఁగొంటి వీవు, నీ
పరమప్రసన్న బోధనల
  సత్యము నేఁగనుఁగొన్నదాన; స
ద్గురు! చరియింతు నేనిఁక న
  కుంఠిత భక్తిమయాంతరంగమం
దరయుచు బ్రహ్మచర్యసమ
  య ప్రతిపాలనధైర్యబుద్ధినై.

గురువు—వత్సా! సంతోషము. నీ విదివఱకొసఁగిన స్వర్ణదీనారములు పరిమితమైన విలువగలవి. కాని, నీవిప్పు డొసఁగిన గురుదక్షిణ యమూల్యమైనది. నీచరిత లోకములోని మానినీసామాన్యమునకు గుణపాఠము. నీగురుదక్షిణ సంతోషముతో స్వీకరించి సెలవు తీసికొనుచున్నాను. చిరంజీవ! (నిష్క్రా). తెర)

# బ్రెటన్ వుడ్స్ ఒడంబడిక : భారతదేశము

●

— శ్రీ పండితారాధ్యుల నాగేశ్వరరావు —

[బ్రెటన్ వుడ్స్ ఒడంబడిక, ఆంగ్లో-అమెరికను ఆర్థిక ఒప్పందము, ముందు జరుగనున్న ప్రపంచ వ్యాపారమహాసభలు ఈమూడున్నూ దాదాపు పరస్పరాధీనములు. ప్రపంచరాజ్యాల సంఘమునకు చెంది ఆర్థిక సాంఘికసంఘం ఒకటి ఉన్నప్పటికిని, ఇంచుమించు దాని లక్ష్యములూ, బ్రెటన్ వుడ్స్ ఒడంబడిక, ప్రపంచ వాణిజ్యసభ, ఆంగ్లో-అమెరికను ఆర్థికఒప్పందముల లక్ష్యమూ ఒక్కటేఅయినా, ఆసంఘము ప్రసక్తిలేక బ్రిటన్ అమెరికాలు వేరుగా ఈ మూడు ప్రత్యేకసంస్థలనూ ఏర్పాటుచేయ నుద్యమించినవి. భారతదేశమునకు స్టర్లింగులుగాక ఇతర ద్రవ్యము ఏమీలేనందునా, భారతదేశపురూపాయి స్టర్లింగుకు ముడిపడి ఉన్నందునా, భారతదేశఆర్థిక, పారిశ్రామికాభివృద్ధి హెచ్చుగా బ్రిటన్, అమెరికాలనుండి రాగల దిగుమతులపై ఆధారపడి యున్నందున భారతీయులు తాము ప్రత్యక్షముగా వీటితో సంబంధము కల్గించుకోకపోయినా వీటివిషయమై శ్రద్ధ వహింపకుండుటకు వీలులేదు. ఆంగ్లో-అమెరికను ఆర్థికఒప్పందంవల్ల భారతదేశమునకు కలుగు లాభనష్టములు గతమాసం పరిశీలింపబడినవి. ఇప్పుడు బ్రెటన్ వుడ్స్ ఒడంబడికను అంగీకరించుటవల్ల కలుగు లాభనష్టము లీవ్యాసమున చర్చింపబడినవి. ప్రపంచవాణిజ్యసభ రాబోవుమాసములో జరుగునట్లు తెలియవచ్చినది. మూడవ వ్యాసమున ఈసభ బాగోగులు పరిశీలింపవీలగును.]

లోగడ ఆర్థికసభ్యుడు చేసిన వాగ్దానమును పాలించక, భారతప్రజాభిప్రాయమును తెలుసుకొనక బ్రెటన్ వుడ్స్ ఒడంబడికను ఆమోదించి, అంతర్జాతీయబ్యాంకు, అంతర్జాతీయద్రవ్యనిధిసభ్యత్వముల నంగీకరించినందులకు భారతశాసనసభ కేంద్రప్రభుత్వ చర్యను గర్హించుచు అభిశంసనతీర్మానము చేసింది. బ్రెటన్ వుడ్స్ ఒడంబడికను ఆమోదించి ఆ రెండు అంతర్జాతీయసంస్థల సభ్యత్వమును పొందుట భారతదేశమునకు లాభకరమా, నష్టదాయకమా ? ఇకముందు ఇందువిషయమై ప్రభుత్వం తీసుకోవలసిన చర్య ఏమిటి ? ఈ సభ్యత్వములను అంగీకరించటమా ? లేక ఈ సంస్థలనుంచి ఉపసంహరించుకోవటమా ? ఇలాంటి ప్రశ్నలన్నింటినీ తర్కించి, శాసనసభ ఒడంబడికను [illegible]ంచుటకు పూర్వము, ఒక నివేదికను తయారు చే[illegible]లందులకు తొమ్మండుగురు సభ్యులు గల ఒక ఉపసంఘాన్ని నియమిస్తూకూడా సభవారొక తీర్మానం చేశారు. ఒక్క కాంగ్రెస్ పక్షమువారుతప్ప, మరే ఇతరపక్షమువారూ బ్రెటన్ వుడ్స్ ఒడంబడికను ఆమోదించినందుకు ప్రభుత్వచర్యను గర్హించలేదు. ఈ రెండు అంతర్జాతీయసంస్థల సభ్యత్వము స్వీకరించుటవల్ల భారతదేశమునకు నష్టమేమీ లేకపోగా చాలా లాభం ఉందని ప్రభుత్వపక్షం వాదించింది. ౧౯౪౫ డిసెంబరు ౩౧ వ తేదీలోగా ఈ ఒడంబడికను ఆమోదించినందువల్ల విశేషలాభమున్నది గనుక వాగ్దానభంగమైనను ప్రభుత్వ మిట్లుచేసిందని ఆర్థికసభ్యుడు సర్ ఆర్చిబాల్డ్ రోలాండ్స్ సభ్యులకు నచ్చచెప్ప ప్రయత్నించెను. డిసెంబరు ౩౧ వ తేదీలోగా బ్రెటన్ వుడ్స్ ఒడంబడికను ఆమోదించుటవల్ల భారతదేశమునకు స్థాపకసభ్యత్వము లభించినదనీ, ఇందువలన నాలుగు లాభము లున్నవనీ రోలాండ్స్ తెలిపెను.

౧. తెలిసిన షరతులమీద భారతదేశము ఈ బ్యాంకులో చేర వీలైనది.

౨. భారతదేశమునకు పాలకవర్గములో ఖచ్చితంగా ఒక స్థానం లభించగలదు. అందుచేత బ్యాంకు ద్రవ్యనిధి విధానములను నిర్ణయించుటలో మొదటనుంచీ భారతదేశము జోక్యముపుచ్చుకొన వీలుంటుంది.

౩. దినదినాభివృద్ధి అవుతూఉన్న భారతదేశ అంతర్జాతీయ ప్రతిపత్తి, ప్రతిష్ఠ చాలా ఎక్కువవుతుంది.

౪. అమెరికా ప్రభుత్వమూ, ప్రజలూ ఈ బ్రెటన్ వుడ్స్ ఒడంబడికను హర్షించారు; శ్లాఘించారు. భారతదేశము ఒడంబడికను ఆమోదించుటవల్ల అమెరికా ఆగ్రహమునకు గురిగాకుండా తప్పించుకో గలిగింది. ముందు ముందు భారత దేశమునకు అమెరికాతో చాలా పనిఉంటుంది. ఈ విషయం భారతీయులు ముఖ్యంగా గమనించాలి.

ఈ నాలుగు ప్రయోజనములను గుర్తించి భారత ప్రభుత్వము ఒడంబడికను ఆమోదించినదట!

మొదటి ప్రయోజనముతప్ప మిగిలిన వేవీ ప్రయోజనములుగా గణింపతగ్గవి కానేకాదు. అమెరికాకు ఆగ్రహం కలుగుతుందనీ, అమెరికాతో భారతదేశమునకు ముందుముందు చాలా పనిఉంటుంది కనుక అమెరికాను మంచిచేసుకోవలసిఉన్నదనే వాదనలో పటుత్వం ఏమీ లేదు.

ప్రపంచజాతులు అన్నీ ఏకప్రపంచవాదమును అంగీకరించి, ఐక్యప్రపంచవ్యవస్థను ఆమోదించినచో దేశములన్నీ పరస్పరాధీనము లగుననుట నిర్వివాదము. భారతదేశమునకు అమెరికాతో ఎంత పనిఉంటుందో, అమెరికాపై భారతదేశము ఎంతవరకు ఆధారపడి ఉంటుందో అలాగే భారతదేశముతో అమెరికాకూ అంతే పనిఉంటుంది. భారతదేశముపై అమెరికా కూడా అంతే ఆధారపడిఉండక తప్పదు. అమెరికా వ్యాపార, పారిశ్రామిక ప్రముఖులేకాక ప్రభుత్వ సభ్యులున్నూ ఈవిషయమును గుర్తించినారు. కాని భారతసద్భావమును పొందుటకు మాత్రం ఏమీ చేయలేదు. అంతర్జాతీయసమావేశములలో భారతదేశమునకు సంబంధించిన ప్రధాన విషయములలో అవి బ్రిటనుకు అంగీకారముగా లేకున్నచో అమెరికా భారతదేశమును జారవిడచి బ్రిటనునే బలపరుస్తూవచ్చింది. ఈ బ్రెటన్ వుడ్స్ ఒడంబడికను తయారుచేయుటకు జరిగిన అంతర్జాతీయద్రవ్యసభలో బ్రిటన్ భారతదేశమునకు ఋణపడిన స్టర్లింగ్ ప్రస్తావన రాగా అమెరికాప్రతినిధి బ్రిటిష్‌వాదననే బలపరచి బ్రిటన్-భారతదేశముల బాకీ ఆ రెండుదేశములకే సంబంధించినదనీ, వీటి పరిష్కారబాధ్యతను అంతర్జాతీయబ్యాంకు, ద్రవ్యనిధి అంగీకరింపవీలుగాదనీ వాదించాడు. ఇక, బ్రిటిష్‌పారిశ్రామికులతో గావించిన సంప్రతింపులు ఫలించనందున కీలకయంత్రముల విషయమై భారతపారిశ్రామికరాయబారులు అమెరికా వెళ్లి అక్కడ ప్రయత్నించగా అక్కడి పారిశ్రామికులున్నూ అదే వైఖరిని ప్రదర్శించియున్నారు. ఇక భారతస్వాతంత్ర్యసమస్య, భారతీయుల వలసబిల్లుల విషయమై అమెరికనులు ప్రదర్శించు వైఖరికూడా హర్షింపతగ్గది గాదు. అమెరికానుండి భారతదేశమునకు యంత్రసామగ్రి కావలసియుండవచ్చు. భారతదేశపారిశ్రామికాభివృద్ధి అమెరికా యంత్రసామగ్రి సప్లయిపై చాలావరకు ఆధారపడియుండను వచ్చు. కాని అమెరికను ప్రజల జీవితప్రమాణము వృద్ధికావలెనన్నా, అమెరికాలో నిరుద్యోగుల సంఖ్య తగ్గవలెనన్నా అమెరికా భారత, చైనా దేశములతో మంచిగాఉండి ఆదేశములకు ఎగుమతులను హెచ్చుచేసుకోక తప్పదు. భారతదేశావసరము అమెరికాఅవసరముకూడా.

కనుక అమెరికాకు ఆగ్రహము కలుగకుండ గలందుల కోసమే భారతదేశము బ్రెటన్ వుడ్స్ ఒడంబడికను ఆమోదింపవలసిన అగత్యము లేదు. అసలు ఆదినుంచి అమెరికావైఖరి భారతదేశమునకు అననుకూలముగానే ఉంటున్నది. భారతదేశమునకు బ్రిటన్ బాకీపడిన స్టర్లింగ్ చెల్లింపు విషయంలో అమెరికా ఆదినుంచీ ఒకవిధమైన భారతప్రతికూలవైఖరినే అనుసరించినది. యుద్ధకాలపు బాకీల పరిష్కారబాధ్యత అంతర్జాతీయద్రవ్యనిధిపై వేయరాదని ౧౯౪౪లోనూ, అమెరికానుండి బ్రిటన్ పొందు ఋణమును బ్రిటన్ తన ఇతరబాకీల పరిష్కారమునకు వినియోగించరాదను షరతును ఆంగ్లో-అమెరికను ఆర్థికఒప్పందమున చేర్చుటలోనూ అమెరికా ప్రదర్శించిన ధోరణి భారతీయులకు ఆశాభంగమునే కలిగించినది. స్టర్లింగ్ బాకీ పరిష్కారము విషయములో బ్రెటన్ వుడ్స్ సభలో విముఖంగా ఉన్నా ౧౯౪౬లో ఆంగ్లో-అమెరికను ఆర్థికసంప్రతింపులప్పుడైనా అమెరికా కొంత అనుకూల

ముగా ప్రవర్తించవచ్చునని కొందరాశించిరి. కాని ఆనాటి వైఖరే నేటికీ అమెరికా ప్రదర్శించుచున్నది. ఇకముందు ద్రవ్యనిధి, బ్యాంకుల కార్యవర్గసమావేశములందు వేరొకవిధముగా అమెరికా ప్రవర్తించునా ?

అంతర్జాతీయ ప్రతిష్ఠ విషయములో ఆర్థిక సభ్యుని వాదము అతిపేలవముగా ఉన్నది. అస్వతంత్ర దేశ అంతర్జాతీయ ప్రతిష్ఠ ఎంత గొప్పదో ఆర్థిక సభ్యులు చెప్పనవసరము లేదు. భారత ప్రభుత్వ ప్రతినిధులకు అంతర్జాతీయ సమావేశములందు గల పలుకుబడీ, మర్యాదలు అనుక్షణము భారతీయులకు బాధను కలిగించుచునే ఉన్నవి. లక్షలాది జనము తిండిలేక మరణిస్తూఉంటే అంతర్జాతీయ సంఘములు ఆవగింజంత సహాయమైనా చేయలేదు. ప్రపంచ ఆహార సంఘమువద్దకు రాయబారము వెళ్లిన హచింగ్సుగారు రిక్తహస్తాలతో తిరిగి రావలసి వచ్చింది! భద్రతా సంఘములో అతిచిన్న దేశములకూ స్థానము లభించింది. కాని భారతదేశము మాత్రము ఆలోచనలోకే రాలేదు. ఇలాంటి ఫలితములను సాధింపగల అంతర్జాతీయ ప్రతిష్ఠ పెరిగిననూ, తరిగిననూ ప్రయోజనమొక్కటే. రష్యా, ఆస్ట్రేలియాలు బ్రెటన్ వుడ్సు ఒడంబడికను అంగీకరింపకపోవుటవల్ల ఆదేశముల ప్రతిష్ఠా, పలుకుబడీ ఏమీ తగ్గలేదు. ఈ విషయంలోనూ ఆర్థికసభ్యుని వాదము నిర్హేతుకమే.

ఇక కార్యవర్గ సభ్యత్వము. ఇది బ్రిటనుకు ఉపకరించినంతగా భారతదేశమునకు ఉపకరింపదు. మూలసభ్యత్వమును పొందుటవలన భారతదేశము కార్యవర్గ సభ్యత్వమును సంపాదింపగలిగినదనీ, రష్యా చేరనందున భారతదేశము అగ్రరాజ్య పంచకంలో చేరి ఎన్నిక డైరెక్టరుగాక నియామక డైరెక్టరు కాగలిగినదనీ ఆర్థికసభ్యుడు ప్రకటించెను. రెండవది కేవలం కాకతాళీయమే. ౧౯౪౪ జూలైలో జరిగిన ద్రవ్యమహాసభలో భారతీయ ప్రతినిధి కనీసము ద్రవ్యనిధికి భారతదేశపు కోటానైననూ హెచ్చింపవలసిందని కోరెను. కాని ఫ్రాన్సుకు ఇచ్చినంత మాత్రపు కోటానైనను భారతదేశమున కివ్వ నిరాకరించిరి. కోటా హెచ్చింపబడియున్నయెడల అప్పుడే భారతదేశము నియామక డైరెక్టరుహోదా కలిగియుండెడిది. ఇందుకు బ్రిటన్, అమెరికాలు అనుకూలంగా లేకుండెను. ఇక ఎన్నికద్వారా డైరెక్టరుపదవి లభించుట ఖాయమే అయినను అది రెండు సంవత్సరములతో అయిపోవును. ఈ రెండు సంవత్సరములలో ఈ ద్రవ్యనిధి బ్యాంకు మామూలు వ్యవహారముల విచారణ సాగించుటయందే నిమగ్నము కావలసివచ్చును. ప్రధానమగు చెలామణీ రేటు, పునర్నిర్మాణము, ఆర్థికాభివృద్ధి పథకములకు అప్పులిచ్చుట మొదలగు విషయములను నిర్ణయించునప్పుడు భారతదేశమునకు డైరెక్టరుపదవి లేకనే పోవచ్చును. రష్యా ధర్మమా అని ఇలాంటి అసహాయ స్థితి నివార్యమైనది. ఇందులకు ఆర్థిక సభ్యులు తన్నుతా నభినందించుకోవలసిన పని లేదు.

పోతే ౧౯౪౫ డిసెంబరు ౩౧ లోగా ఆమోదించుటవల్లను, భారతదేశము విదితమైన షరతులపై ద్రవ్యనిధి, బ్యాంకుల సభ్యత్వమును పొందగలుగుటవల్లను రానగు ప్రయోజనములను పరిశీలింతము.

బ్రెటన్ వుడ్సు అంతర్జాతీయద్రవ్య మహాసభకు వెళిన భారతప్రతినిధివర్గములో ఒకరైన ఎ. డి. ష్రాఫ్ గారు యుద్ధకాలపు ఋణముల పరిష్కారమునకు ఈ సంస్థలు దోహదముచేయకపోయినచో సంస్థల ఉద్దేశ్యమే నెరవేరజాలదని హెచ్చరిస్తూ భారతదేశపు స్టర్లింగ్ ఋణములలో కొంతభాగమునైనను అదిపొందగలుగునట్లు చేయవలసిందని కోరుతూ ఒక సవరణను ప్రతిపాదించిరి. వెనుకబడిఉన్న దేశముల అభివృద్ధికీ, యుద్ధతాకిడివల్ల నాశనమైపోయిన దేశముల పునర్నిర్మాణమునకూ తోడ్పడుటే అంతర్జాతీయబ్యాంకుముఖ్యోద్దేశ్యమని తెలిపి భారతదేశ మీఉద్దేశ్యము నత్యంత ప్రధానమైనదిగ భావించుచున్నదని చెప్పిరి. యుద్ధకాలములో అపారమైన త్యాగంచేసి వృద్ధిచేసుకుంటూవచ్చిన ఈ స్టర్లింగులోని కొంతభాగాన్నయినా పారిశ్రామికాభివృద్ధి, పునర్నిర్మాణకార్యాలకు ఉపయోగించుకొనే అవకాశాన్ని ఈబ్యాంకు కలుగజేయలేకపోతే అనేక ప్రమాదాలు సంఘటిల్లుననికూడా ష్రాఫ్ గారు హెచ్చరించిరి. అంతేగాక ఈవిధముగ వేరువేరు నిలవలు చేరుటకు వీలుగలిగించినచో ఈఅంతర్జాతీయద్రవ్యనిధి, బ్యాంకు

లకు ఒకవిధమగు పోటీ ఏర్పడుననికూడా ష్రాఫ్‌గారు వాదించిరి. కాని అమెరికా ప్రతినిధి ప్రతిఘటనఫలితముగా ఈసవరణ వీగిపోయింది. భారతదేశమున కీనిర్ణయము తీవ్ర ఆశాభంగము కలిగించునని అధికార ప్రతినిధి, అప్పటి ఆర్థికసభ్యులు సర్ జెర్మీ రెయిస్మన్ తెలిపెను.

ఆనాడు భారతదేశము కోరినది హిరణ్యాక్ష వరము కాదు. అమెరికా ప్రతినిధి బుజావుచేయ ప్రయత్నించినట్లు భారతప్రతినిధి సవరణ ఈసంస్థల బాధ్యతలను హెచ్చుచేయనూచేయదు. ష్రాఫ్‌గారి ప్రసంగంలోని ఈ వాక్యములు యథార్థవిషయమును వ్యక్తము చేయును:

“యుద్ధకాలమున విదేశాల ఖాతాల్లో చేసిన నిలవ మొత్తములలో కొంతభాగాన్ని విముక్తిచేయుటకు భారత ప్రతినిధివర్గము ప్రతిపాదించిన సవరణకు రెండు అభ్యంతరములను అమెరికన్ ప్రతినిధులు తెలిపిరి. ఈ నిలవల విముక్తి బాధ్యతను ద్రవ్యనిధి అంగీకరించినచో ఏలక్ష్యముకొరకీనిధి ఏర్పాటైనదో ఆలక్ష్యమును సాధించుటకు నిధికి వీలుగాకుండాపోవునని అమెరికను ప్రతినిధి వాదించెను. మేము ఈ సవరణను సూచించినది మొదలు ఇలాంటి దురభిప్రాయములకు ఆస్కారము లేకుండాచేయు సద్దేశ్యముతో మా సవరణోద్దేశ్యముల నెప్పటికప్పుడు విస్పష్టము చేయుచూ వచ్చినాము. ద్రవ్యనిధి ఏర్పడినవెంటనే ఈ వివిధ దేశముల బాకీ మొత్తము లన్నింటి విషయమై ఆలోచించవలసిన దని మేము కోరియుండలేదు.

“ముఖ్యంగా భారతదేశస్థితిని విశదపరుస్తూ లండన్‌లో భారతదేశపు ఖాతాలో జమఅయిన స్టర్లింగ్ నిలవలలో హెచ్చుమొత్తము ఆ దేశమునుండి కీలకయంత్రములను, వాడుక వస్తువులను క్రయముచేయుటకే వినియోగమవుననియు, కొద్ది మొత్తము విషయమై మాత్రమే ఈ ద్రవ్యనిధి ఆలోచింపవలసి యుండుననియు మేము ఖచ్చితముగ ప్రకటించితిమి. మనము వాస్తవికదృష్టితో సమస్యల నెదుర్కొనదలచినచో ఇప్పుడున్నూ, యుద్ధానంతరమున్నూ బ్రిటన్ స్థితిగతులను గమనించవలసి యుండుననీ, బ్రిటన్ పునర్నిర్మాణమునకు బ్రహ్మాండమైన కృషి, ఇతరదేశముల సహాయ సానుభూతి అవసరమనీకూడ మేము తెలిపితిమి. బ్రిటన్ పునర్నిర్మాణమున నిమగ్నమైయున్న కాలమున భారతదేశమునకు కీలకయంత్రములను సప్లయి చేయలేదు. ఈ స్థితిలో భారతదేశ విషయమును విశదీకరింపవలసియున్నది. అంతర్జాతీయ వ్యాపారవిస్తరణకు దోహదంచేయుట, అన్ని దేశములలోను అత్యధిక సంఖ్యాకులకు వృత్తి ఉద్యోగములు కలిగించి వాస్తవమైన ఆదాయము లభించునట్లు చేయుట అంతర్జాతీయ ద్రవ్యనిధి ముఖ్యోద్దేశ్యములై యున్నవి. ఈ రెండున్నూ చాలా ప్రధానమైన వని భారత ప్రతినిధివర్గము భావించుచున్నది. బ్రిటన్ చాలా కాలము వరకు భారతదేశమున కవసరమైన యంత్రసామగ్రిని సప్లయి చేయలేనప్పుడు బ్రిటన్ ఇచ్చుకోవలసిన బాకీలో కొంతభాగమునైనను ఇతర నాణెములలోనికి మార్చుకొనుటకు భారతదేశమున కవకాశము లభింపజేయలేకున్న అంతర్జాతీయ సహకారము, ఇతర దేశములతో కలసిమెలసి పనిచేయుట విషయములలో భారతదేశ మంత ఉత్సాహము చూపజాలదు.

“మేము కోరుతూఉన్నదల్లా మా స్టర్లింగ్ నిలవలలో కొంతభాగాన్ని బహుపక్షపరిష్కారానికి వీలుగా చేయవలసిందనే. సభవారు మా సవరణసిద్ధాంతమును అంగీకరిస్తే దానిని అమలుజరిపే విషయంలో ఒక పథకమును తయారుచేయుట అంత కష్టము గాదు. మా సవరణోద్దేశ్యములు రెండు : మా స్టర్లింగ్ నిలవలలో న్యాయమైన కొంతభాగాన్ని వివిధనాణెములలోకి మార్చుకొనుటకు వీలుకలుగుట, ద్రవ్యనిధిపై అపారమైన భారం పడకుండా చూచుట కొక సూత్రమును తయారుచేయుట.

“స్నేహితులమధ్య నిర్మొగమాటంగా, ఉన్న యథార్థాన్ని చెప్పివేయుట మంచిదనుకుంటాను. ఈ సభలోని ‘పెద్దలు’ భారతదేశం గణనీయమైన దేశముగా భావింపకపోవచ్చును. అందుకు భారతదేశరాజకీయస్థితి కారణం కావచ్చు. కాని భారతదేశమువంటి ప్రకృతిసంపదగల దేశమును - ౪౦ కోట్ల జనాభా గల దేశమును మీరు అలక్ష్యంచేస్తే ఈ ద్రవ్యనిధివృద్ధికి మా సహాయసహకారములను మీరు ఆశింపజాలరు.

"మీరు మా వాదమును అంగీకరింపకపోయినచో భారతదేశము నెలాంటి స్థితిలో ఉంచబోతున్నారో మీరు గుర్తింపవలసియున్నది. బ్యాంకులో కోట్ల డబ్బున్నా బండిఖర్చు చెల్లించేందుకు కాసులేనివాడి స్థితిమాదిరే ఉంటుంది భారతదేశస్థితికూడా. అంతర్జాతీయవ్యాపారమును వృద్ధిపరచి, ప్రపంచమంతటా ఉద్యోగములను హెచ్చించి, అందరికీ సరియైన ఆదాయము లభించునట్లు చేయుట సభవారి సంకల్పంకదా. భారతదేశంలాంటి దేశములను ఇలాంటి దరిద్రస్థితిలో ఉంచితే మీ సంకల్పం సిద్ధించగలదా? అందరూ అందరి సహకారాన్ని అర్థిస్తున్నారు. అట్టి సహకారం లభించాలంటే వాస్తవికదృష్టితో ఈ సమస్యలను పరిష్కరించాలి."

బ్రెటన్ వుడ్స్ సభ భారతసమస్యాపరిష్కారమున కేవిధముగను ఉపకరింపలేదు. డిసెంబరు ౩౧ లోపున చేరినందున ఈ స్థితి మారనూ మారలేదు. రోలాండ్స్ వాదన ఎంత నిర్హేతుకమైనదో, బ్రెటన్ వుడ్స్ ఒడంబడికవల్ల భారతదేశమునకు ఎత్తుకొను ప్రయోజనము లెంత అల్పములో విస్పష్టమగుటకు ష్రాఫ్ గారి ప్రసంగంనుంచి ఇంత దీర్ఘముగా ఉల్లేఖించుట అవసరమైనది. కార్యవర్గమున డైరెక్టరుస్థానము లభించగల దను వాదముతప్ప రోలాండ్స్ తెలిపిన ఇతర ఫలితము లేవీ సాధారణమైనవి గావని స్పష్టమైనది.

పోతే ద్రవ్యనిధి, బ్యాంకులలో చేరుటవల్ల ఏమైనా ప్రయోజన మున్నదా అంటే కొంత కల దని అంగీకరించకతప్పదు. కాని రాజకీయముగా స్వతంత్రమై, సభలలో ప్రజాప్రతినిధులే పాల్గొనగలుగువరకు భారతదేశమున కీ ప్రయోజనములు సమకూరజాలవు.

దాదాపు మూడువారములు ౧౯౪౪ జూలై ౧ నుంచి ౨౨ వరకూ నలభైనాలుగు దేశముల ప్రతినిధులు చర్చలుజరిపి ఏర్పాటుచేసిన ద్రవ్యనిధి, అంతర్జాతీయ బ్యాంకుల లక్ష్యములు స్తవనీయములే అయినా, ఆచరణలోమాత్రము అగ్రపారిశ్రామిక దేశములకు ఉపయోగపడినంతగా పారిశ్రామికంగానూ, ఆర్థికంగానూ వెనుకబడిఉన్న దేశములకు ఉపయోగపడవని ఈ రెండుసంస్థల నిబంధనలూ స్పష్టముచేయగలవు. హెచ్చు బంగారపునిలవలు, డాలరునిధి ఉన్న దేశములకే ఈ ద్రవ్యనిధిగాని, బ్యాంకుగాని ఉపయోగపడగలదు. అంతర్జాతీయద్రవ్యనిధి వివిధదేశముల కరెన్సీప్రమాణమును అదుపులో ఉంచుటకును, అంతర్జాతీయ మారకపురేట్లను నిర్ణయించుటకును ఉద్దేశింపబడినది. ఈ నిర్ణయము ఆయా దేశముల బంగారపునిలువమీదనూ, లేక బంగారపు ప్రమాణముతో ముడిపడిన డాలరు మొత్తములమీదనూ ఆధారపడియున్నది. భారతదేశమునకు గల బంగారపునిలవ బహు కొద్ది. ప్రపంచంలోని మొత్తంబంగారములో అయిదింట నాలుగు వంతులు అమెరికాలోనే ఉన్నవి. భారతదేశమున యాభైయొవ్యవంతుకు తక్కువగానే ఉన్నది. భారతప్రభుత్వ ద్రవ్యప్రమాణము బంగారము మీద గాక బ్రిటిష్‌స్టెర్లింగ్ మీద ఆధారపడి ఉన్నది. జనవరి ౧౯ వ తేదీతో అంతమయ్యే వారం రిజర్వుబ్యాంకు రిటర్న్సునుబట్టి ౧౨౪౯,౬౩,౯౯,౦౦౦ నోట్లను ప్రభుత్వము జారీచేసిఉండగా రిజర్వుబ్యాంకులో నిలవ ఉన్న బంగారం మొత్తం ౪౪,౪౧,౪౫,౦౦౦ రూపాయల విలువగలదిమాత్రమే. ఈ నోట్లకు హామీ రిజర్వు బ్యాంకులో ఉన్న ౧౧౩౫,౩౨,౯౯,౦౦౦ స్టెర్లింగ్ సెక్యూరిటీలే. ఈ మాసారంభంలో ప్రముఖఆర్థికశాస్త్రజ్ఞులు తెలిపినట్లు భారతప్రభుత్వమింకనూ ఈ స్టెర్లింగ్ నిలవల నాధారముచేసుకొనే నోట్లను జారీచేస్తూ ఉన్నది. బ్రిటనుకు ఎగుమతులనుచేస్తూ, బ్రిటన్‌తరఫున ఈ దేశములో క్రయంచేస్తూ చెల్లుబడివిషయం సందేహాస్పదమౌతున్న స్టెర్లింగ్ నిలవలను పెంచుతూ ఉన్నది. ఇందువల్ల భారతద్రవ్యప్రమాణము దెబ్బతినుననుట నిస్సందేహము. చెలామణిలోని నోట్లమొత్తమును తగ్గించి, లాభకరమగు మారకపురేటు ఏర్పాటుచేయుటకు భారతప్రభుత్వ మెట్టిప్రయత్నమూ చేయలేదు. గతమాసం అమలులోకి వచ్చిన 'డీమానిటైజేషను ఆర్డినెన్సు'వల్ల చెలామణిలో ఉన్న నోట్లమొత్తము లెక్కలోనికి రాతగ్గంతగా తగ్గిపోదు. దొంగమార్కెట్టులను అరికట్టుటకు, పన్నును ఎగవేసినవారిని పట్టుకొనుటకే ఈ ఆర్డినెన్సు చేయబడినదని అధికారులు ఎంత చెప్పినా అందుకు అన్యకారణములు కొన్ని లేకపోలేదు.

బ్రెటన్ వుడ్స్ ఒడంబడికను అనుసరించి వివిధదేశముల ద్రవ్యప్రమాణముల విలువను అంతర్జాతీయద్రవ్యనిధి నిర్ణయింపబూనుకొనినప్పుడు రూపాయివిలువ చాలా తక్కువగా నుండగలదు. రూపాయికి హామీగా ఉన్నది బంగారము గాదు. చెల్లుబడి విషయమై సందేహముగానున్న స్టర్లింగ్ సెక్యూరిటీలు. ఈ సెక్యూరిటీలు ఎంతవరకు సాల్వెంటు అన్న విషయము క్రమంగా గాని బయటపడదు. బ్రెటన్ వుడ్స్ ఒడంబడిక విషయమై అసెంబ్లీ చర్చించినప్పుడు, రూపాయిని ఇక స్టర్లింగుతో ముడివేయవలసిన అగత్యము లేదనీ, భారతదేశము తన ఇష్టప్రకారము మారకపు రేటును నిర్ణయించుకొనవచ్చుననీ, ఆర్థిక సభ్యుడు రోలాండ్స్ ప్రకటించెను. బ్రెటన్ వుడ్స్ ఒడంబడిక మూలముగా యావత్తు ప్రపంచమూ తిరిగి బంగారపు ప్రమాణమును అంగీకరించినది. ఇది వాస్తవముగాదని రోలాండ్స్ ఎంత వాదించినా ప్రయోజనము లేదు. భారతదేశముమాత్రము తన ద్రవ్యప్రమాణమును మరి కొంతకాలము స్టర్లింగు ననుసరించియే నిర్ణయించుకొనవలసివచ్చును.

ఇన్ని ఇబ్బందు లున్నందున భారతదేశము అంతర్జాతీయ ద్రవ్యనిధిలో చేరుట ఒకవిధముగా అవసరమైనది. కరెన్సీ, మారకపురేటు మొదలైన విషయములను నిర్ణయించుటలో భారతదేశమున్నూ తన అభిప్రాయములను వెల్లడించుటయేగాక, కొంతచర్య తీసుకొనుటకుగూడా వీలుండును. యుద్ధకాలమునందున్నంత ఎగుమతి వ్యాపారము ఇకమీదట ఉండకపోవచ్చును. అందువల్ల భారతదేశమునకు ఇతర నాణెములు లభ్యముకాకపోవచ్చును. ఇందువల్ల కలుగు నష్టమును కొంతవరకైనను భారతదేశము పూడ్చుకొనవచ్చును. పైగా అంతర్జాతీయ బ్యాంకునుండి సహాయము పొందవలెనన్న ఈ ద్రవ్యనిధి సభ్యత్వమును అంగీకరించక తప్పదు.

అయితే ఈ అంతర్జాతీయ బ్యాంకువల్ల కలుగు లాభము లేమిటి? ఇందుకు ఈ బ్యాంకు ఉద్దేశ్యములను పరిశీలించుట అవసరము. ఈ బ్యాంకు అయిదు ప్రధానోద్దేశ్యములతో స్థాపనైనట్లు అధికారప్రకటన తెలుపుచున్నది. వివిధ దేశముల అభివృద్ధికీ, పునర్నిర్మాణానికీ అవసరమైన అప్పును ఏర్పాటుచేయుటకు ఈ బ్యాంకు సహాయపడును. భారతదేశము ఈ బ్యాంకునుంచి పొందగల ౪౦౦ లక్షల డాలరుల అప్పు భారతదేశము సాగింపవలసిన పునర్నిర్మాణ కార్యక్రమమునకు ఏమూలకూ చాలనిమాట వాస్తవమే అయినా, ఇతరులు పెట్టుబడిపెట్టుటకు ఈ బ్యాంకు పూచీఇచ్చి అట్టి వసతులు కలిగించును. కాని భారతదేశ మీనాటికే బ్రిటిష్ పెట్టుబడి ఫలితములను అనుభవించుచున్నది. ఇక మీదట అమెరికను పెట్టుబడి ఫలితముల ననుభవింపవలసివచ్చును. కీలకయంత్రములను తయారుచేసుకోగల సంపత్తి భారతదేశమునకు లేనంతకాలమూ భారతదేశము పెద్దఎత్తున పారిశ్రామికాభివృద్ధికి బ్రిటన్, అమెరికాలపై ఆధారపడి దాదాపు వారి షరతులకు లోబడే ఒప్పందములు చేసుకోక తప్పదు. భారతదేశమునకు డాలరు మొత్తములు అధికముగా కావలసియున్నవి. ప్రస్తుతం భారతదేశము ఖాతాన దాదాపు 3000 మిలియను డాలరులు ఉన్నా ఇందులో బహు కొద్దిమొత్తమును మాత్రము భారతదేశము ఉపయోగించుకొనగలదు. కనుక అమెరికను డాలరుల సంపాదనకు బ్రెటన్ వుడ్స్ బ్యాంకుసభ్యత్వము అవసరమైనది. ఈ బ్యాంకువల్ల ప్రత్యక్షముగా పొందగలుగు లాభము నే లెక్కలోకి తీసుకుంటే భారతదేశము చేరకపోయినా ఇబ్బంది లేదు.

అయితే బ్రెటన్ వుడ్స్‌లో భారతప్రతినిధులు ఎందుకొరకైతే తీవ్రంగా ప్రయత్నము చేసినారో అవి ఫలించకనే భారతదేశము ఆ ఒడంబడికను అంగీకరించుట శోచనీయమని చెప్పకతప్పదు. కాని ష్రాఫ్ గారు భారతదేశామోద, సహకారాలు స్టర్లింగ్ బాకీ పరిష్కారముపై ఆధారపడియుండుననీ, ఇందుకు అంతర్జాతీయద్రవ్యనిధి, బ్యాంకులు ఉపయోగపడకున్నచో భారతదేశము వీటి సభ్యత్వము నంగీకరింపదనీ హెచ్చరించుచుండగ సర్ జెర్మీ రెయిస్మన్ గారు స్టర్లింగ్ బాకీ పరిష్కారము విషయమై సభానిర్ణయము భారతీయుల కాశాభంగము కలిగించినప్పటికీ భారత

దేశ మీా సంఘములనుండి ఉపసంహరించుకోదని హామీ ఇచ్చియుండిరి. అంత్యనిర్ణయము గత డిసెంబరాంతమున జరిగిననూ, ౧౯౪౫ లోనే భారతప్రభుత్వ మొక నిర్ణయమునకు వచ్చియుండెను. ఆప్రకారమే ప్రవర్తించినది. భారతదేశమున కిష్టములేకున్న ఉపసంహరించుకోవచ్చునని ఆర్థికసభ్యుడు చెప్పవచ్చును. కాని నానాజాతిసమితి విషయమై భారతశాసనసభా తీర్మానముల నీప్రభుత్వ మెంతవరకు పాలించినది?


బ్రెటన్‌వుడ్స్ ఒడంబడికను ఆమోదించినను భారతప్రభుత్వము రెండు ప్రధానవిషయములను మనస్సునందుంచుకొని వాటిని సాధించుట కికమీాదట ప్రయత్నింపవలసియున్నది. భారతదేశరాజకీయప్రతిపత్తి ఇదేవిధంగా ఉండి ప్రపంచరాజ్యాలసభలో సర్ రామస్వామిమొదలియార్ గారివలెనే ఈ ద్రవ్యనిధి, బ్యాంకులలో సర్ ఆర్చిబాల్డ్ రోలాండ్స్ వంటివారే పాల్గొనవలసివచ్చిన, స్టర్లింగ్ బాకీపరిష్కారము, సామ్రాజ్యడాలరునిధి విముక్తివిషయమై ఔదాసీన్యము ప్రకటించిన భావిభారతదేశము నేటి నిర్ణయమును గర్హించితీరును. భారతప్రతినిధి, ఎవరైననూ, స్టర్లింగ్ బాకీలో కొంతభాగమును ద్రవ్యనిధి పరిష్కారము చేయునట్లు ప్రయత్నించవలసియుండును.

అంతేగాక భారతదేశమువంటి వ్యావసాయిక దేశములు ఒక ముఖ్యవిషయమును గుర్తింపవలసియున్నది. ఈ బ్యాంకు, ద్రవ్యనిధి నిబంధనలును, లక్ష్యములును బ్రెటన్‌వుడ్స్‌సభలోనూ, ఆతరువాతనూ బ్రిటన్, అమెరికా పారిశ్రామికులు, వ్యాపారస్థులు, ప్రభుత్వప్రతినిధులు గావించిన ప్రకటనలవల్ల ఈఏర్పాటు యావత్తూ "కాపిటలిస్టు ఇకానమీ" (ధనస్వామికఆర్థికవ్యవస్థ)పై ఆధారపడియున్నట్లు విశదమగుచున్నది. అసెంబ్లీచర్చ సందర్భమున కొందరు సభ్యులు విమర్శించినట్లు పారిశ్రామిక దేశములు తమ పరిశ్రమల నింకా వృద్ధిచేసుకొనుటకే ఈసంఘములు హెచ్చుగా ఉపయోగపడగలవు. భారతదేశములాంటి వ్యావసాయిక దేశములకు, పారిశ్రామికముగా వెనుకబడిఉన్న దేశములకు ఈ సంస్థలు ఏలాంటి ప్రత్యేకరక్షణలను కలిగింపలేదు.

కనుక భారతదేశము ఈ రెండుసంస్థలకూ చెల్లింపవలసిన ౮౦౦ మిలియను డాలరులనేగాక, రానున్న అయిదారుసంవత్సరాల్లో అమెరికాలో క్రయముచేయవలసిన సామగ్రి కవసరమగు డాలరులను సంపాదించుటకు, ఇందుకు వీలుగా స్టర్లింగ్ బాకీని మార్చుకొనుటకు తగిన కట్టుదిట్టములు చేసుకొని మరీ మెలగవలసియున్నది. ఈనాడు భారతదేశము ఈసంస్థలలో చేరినదంటే అందువల్ల తక్షణం ఏదో ప్రయోజనము లున్నవనిగాదు. ఇంతకంటే చేయగల పని వేరొకటి లేదు గనుకనే.

ముందైనా తన స్టర్లింగ్ బాకీలో కొంతభాగమునైనా ఇతర నాణెములలోకి మార్చుకొనుటకు వీలు ఏర్పడునట్లు భారతదేశము తన స్థాయిని, సభ్యత్వమును ఉపయోగించుకోలేకపోయినపక్షమున ద్రవ్యనిధి, బ్యాంకులలో ఉండుట సుష్కదండుగే కావచ్చును. ఈ సమస్యలన్నీ భారతదేశ రాజకీయ భవిష్యత్తు మీదనే హెచ్చుగా ఆధారపడియున్నవి. అది సంతృప్తికరముగా పరిష్కారము కానంతవరకూ ఈ దుస్థితి తొలగదు.




Another Step Forward
BUSINESS COMPLETED IN 1945
EXCEEDS
5·50
CRORES
IN 1944
4·74 CRORES
IN 1943
2·85 CRORES
NATIONAL
INSURANCE COMPANY LIMITED
7, COUNCIL HOUSE STREET, CALCUTTA.
మదరాసు బ్రాంచి : నేషనల్ ఇన్షూరెన్సు బిల్డింగు,
862, చైనాబజారురోడ్డు, ఎస్ప్లనేడ్.
సబ్ ఆఫీసులు : బెంగుళూరు మరియు మధుర.
N.I.F-E.6

# మనకు మంచినాటకాలు వచ్చేదెప్పుడు?

= శ్రీ ఊటుకూరు సత్యనారాయణరావు =

మానవజీవితానికి అందుబాటులోవుండే ఆనంద కారణమైన కళలలో నాట్యకళ కగ్రస్థానం వుంది. ఏమంటే—నాటకం లౌకిక, అలౌకిక ప్రకృతులకు సామరస్యం కలిగించి మనుష్యస్వభావంతో చెలిమిచేసుకొనటానికి మన ప్రత్యేకీక్షులగుండా ప్రతిబింబిస్తుంది.

స్వభావవిరుద్ధమైన నాటకం ఆనందానికి దూరమవుతుంది. స్వభావానికి దగ్గరలో చేయబడిన రచన హృదయరంజకంగా వుండి రసానుభూతి కలిగిస్తుంది.

నాటకం రెండువిధాలు—కాదు మూడువిధాలైంది. శ్రవ్యనాటకం, దృశ్యనాటకం అని. మూడో విధం చిత్రనాటకం. ఈ మూడోవిధమైన నాటకం మాటలుచేరని చర్మనాటకంకింద (అంటే తోలుబొమ్మలు) బహుకాలంక్రిందటనే ప్రచారంలోకి వచ్చింది మన దేశంలో.

ఐతే—నాటకంవల్ల కలిగే ఆనందం, సహజమైన పరమార్థం దృశ్యనాటకంవల్లనే సిద్ధిస్తుంది.

కావ్యశ్రేణిలో అన్నిటికన్నా "కావ్యేషు నాటకం రమ్యం" అని నాటకానికే పూర్వం గౌరవం ఎక్కువగా వున్నట్లు తెలుస్తుంది. నాటకంలో ఆనంద సిద్ధి వుంది. లేకపోలేదు. ఎందుకంటే—సంగీత, అభినయ, కవితా, శిల్ప, చిత్రలేఖనాద్యలలితకళల సహకార సమన్వయాలతో సాక్షాత్కరించి, దృశ్యమై, హృదయవశ్యమై వర్తించే మహాభాగ్యం నాటకానికొక్కదానికే ప్రసాదితమైంది.

నాటకరచన మనము అనుకుని ఉబలాటపడేటంత సుసాధ్యమైంది కాదని నా స్వల్పానుభవాన్ని బట్టి నేను తెలుసుకున్నాను. సాహితీపరిశ్రమ విపరీతంగా మన దేశంలో ప్రచారంలోవుండే రోజుల్లో లాక్షణికులేమన్నారంటే "నాటకాంతంసాహిత్యం" అని. సర్వసాహితీపరిజ్ఞానఫలితంగాగాని నాటకం రాదు. ఇంతే కాదు. నాటకరచనావిధానాలు శాసింపబడివున్నయి. భారతీయ సాంప్రదాయం వున్నది. పాత్రల ప్రారంభనిష్క్రమణాలు - చారిత్రక చిత్రణం-అంకవిభాగం - - అంగ ప్రత్యంగసూచనలు......బీజము - బిందువు - నిర్వహణసంధి......ఏమేమో నియమాలు సృష్టించారు. ఈ పేకుబిగింపుల మధ్య నాటకం నడవాలె.

అంటే—ఇవ్వేవీ నిర్బంధాలుగా భావించాలిసిన పని లేదు. నిజమైన నాటకాన్ని నిర్వహించటానికి రచయితబుద్ధివైశద్యాన్ని- ఊహాపరంపరను కల్పనా చమత్కృతిని స్వేచ్ఛావిహారం చేసి చెడిపోకుండావుండే రాజమార్గాన్ని సృష్టించారు. ఆమార్గం ఒకే అచ్చులో పోసినట్టు నాటకాలు తయారుచేసే దిమ్మెలాటిదని భయపడవలసిన పనేం లేదు.

ఇలా శ్రమపడిన, ప్రాచీన సాంప్రదాయాలను త్రోసిపుచ్చుకున్న విద్యావేత్తలు లేదున్నారు. ఏ ఒక్క లక్షణకారుడో తన ప్రతిభావిశేషంచేత ఊహించి సాహిత్యకారులపై విధించినవి కావు లక్షణా లెప్పుడూ. లక్ష్య ప్రధానులై వ్రాసిన గ్రంథకారుల ప్రశస్తరచనారీతుల చేరియేరి ఒక లక్షణ గ్రంథాన్ని వ్రాశారువారు.

స్వతంత్ర రీతులతో మనం రచించకూడదా అనే ప్రశ్న ఒకటుంది. సాహిత్యంలో పరిపూర్ణత ఏర్పడేదాకా ఎందుకు నిరీక్షించాలి అని రెండో ప్రశ్న.

స్వతంత్రం అంటే, స్వయంగా నడుపుకునే శక్తి అని ఉంది. స్వయంగా చేసుకొనిపోవటానికి స్వాతంత్ర్యం రా కళ బాహ్యరూపమైన పదుపాయాలు నిర్ణయించుకుంటూ సమన్వయపరుచుకునే ఇతరవ్యవహారాలలాంటిది కాదు. స్వయంగా నడుపుకోవటం ఎక్కడికి? మానవమనోవీధుల్లోకి. మనోవీథులలో విహరించేట్టు చేసే తంత్రం మన ప్రత్యేకీత్యానే జరుపవలసివుంటుందిగదా. అందుకై ముఖ్యంగా బహుజన్మజన్మాంతరాలుగా జిజ్ఞాసువై అన్వేషిస్తూ వచ్చే జీవుడు తృష్ణాపీడితుడై ముందుకువచ్చి అన్యజీవనపరిభ్రాంతుడు కాక లౌకికవ్యామోహఅవసరాల నధిగమిస్తూ, కృశించి చిత్రిస్తేనేకాని తృప్తిలేని దశలోకి వచ్చి పెనుగులాడుతాడు ఒక వ్యక్తి. వాడే నాటక కవి. వాడు స్వతంత్రిస్తాడు— సాహసిస్తాడు—లోక నిందాతిరస్కారాలకు లెక్కచేయడు—లక్షణ పరిజ్ఞాతల కొలమానాలను తెలియకుండానే అతిక్రమిస్తాడు కూడా.

కాని ఆ అతిక్రమించటంలో ఒక అతిలోక సృష్టి తైటికివస్తుంది. అతీతమైన నూతనత్వం చిందులు తొక్కుతుంది. ఆకర్షకమైన వెలుగుతో అది మను

మ్యులను సమ్మోహితులను చేస్తుంది — ఆ ప్రతిభా విష్కరణశక్తి వేగాన్ని ఎవ్వరూ అడ్డుకోలేరు. అలాంటి మహత్తరమైన శక్తిని లోకమూ హర్షిస్తుంది. లక్షణాలు నిర్బంధపూర్వకంగా కాకుండా నిరతిశయంగా, అందులోని అమూల్యనూతనసందేశాన్ని ఒరపురాళ్లలో ఒకటిగా నిర్ణయించి తన లక్షణముక్తాహారంలో చేర్చుకుని భాషాభూషణంగా తీర్చుకుంటుంది. అంతమాత్రపునే లక్షణగ్రంథాలు—అడ్డుకట్టలు కావు.

రెండో ప్రశ్న—సాహిత్యపరిపూర్ణత కావలెను గదా అనేది వుంది. కావాలె. ఏకొలదిగానో చేసిన పరిశ్రమ చాలదా అంటే—చాలదు. అసలు ఎప్పుడూ భావం సూక్ష్మమై, సున్నితమై వుంటుంది. భాష ఎంత పరిపుష్టమైనదైనా స్థూలమైనది. భావపు మన్నికను ప్రాపుగా వుండటమే కష్టం. అట్టిస్థితిలో తదాశ్రయంకూడా కరువైతే రచనాకారుడు వ్యక్తం చేసే దెట్లాగా?

తన సుందరదృశ్యాన్ని ప్రజాహృదయవీథులలో నాట్యంచేయించే దెట్లా?

సంపూర్ణాన్వేషకుడు కానివాడే సామాన్య సాహిత్యంతో సంతృప్తిపడతాడు. సంకుచితమైన రచనతో, సర్వాంగ సుందరమైనదని చెప్పలేని రచనతో సాగించాలసిన స్థితి ఏర్పడుతుంది.

ఈ విషయం ప్రజామోదం పొందలేనప్పుడు తెలుస్తుంది. ఉత్తమరచనకు పాతకొత్తలు లేవు; నాగరకతా భేదాలు లేవు.

మనుష్య జీవితాలకు ఆశ్వాసమిస్తున్నంత కాలం అది సరికొత్తసరుకే—నవీనులు వ్రాసినా, నవ్యరచనలైనా. నవనవలాడే నవలాముగ్ధమోహన వీక్షణాలతో నాటకం నిత్యప్రభాభాసమానం కాకపోతే అది పాతసరుకే,—రోతబ్రతుకే దానిది.

## నాటకంలో కవిత్వానికి స్థానమెంతవరకు?

కవితాప్రధానమైతే కావ్యమౌతుంది. కాని కవిత్వం లేకపోతే కమ్మదనం రాదు.

నాటకంలో ఘటనాసన్నివేశాలు ప్రధానం. సన్నివేశాలు ఒకదానితో ఒకటి ప్రతిఘాతం పొందుతై. ప్రతిఘాతాన ఒరపిడిలో ఒక దివ్యానుభూతి ఉదయిస్తుంది. ఆ అనుభూతివల్ల నాటకముఖోద్దేశం రసాత్మకమై, ప్రేక్షకుని అనుభూతిలో మినుకు మినుకుమంటూన్న రసమయజ్యోతిని ప్రజ్వలింపజేస్తుంది. ఆ వేడి ప్రత్యంగము, నరనరము ఉడికించి మేదోవీథులను మెరపులవలె ప్రాకి, క్షణకాలం పారవశ్యమో, ఆనందమో...అదేదో తెలియరాని ఒక సుస్వప్నచిత్రాన్ని ముద్రవేసిపోతుంది.

ఈ స్థితి ప్రేక్షకునికి అందజేసే రచన దే నాటకం. తా ననుభవించి గానంచేయటం కావ్యం. కవిత్వం లేనిదే నాటకం సిద్ధింపదు. ఘటనాప్రాధాన్యత కూర్చకపోతే కావ్యమౌతుంది.

కాళిదాస, భవభూతులులాంటి కవులు నాటక రచన చేశామని శాకుంతలం, ఉత్తరరామచరిత్రా భారతదేశంముందు పెడితే—శాకుంతలం ఒక్కటి నిలిచింది. ఉత్తరరామచరిత్ర నాటకంగా ప్రారంభమై, కావ్యంలోకి కాలుజారింది.

అది దోషం కాదు. ఇరువురిలో రెండవవారు అసమర్థులు కారు. ఇరువురూ మహాకవులే. ఇరువురూ రసావేశపరవశులే. ఇరువురూ సాహితీప్రతిభాధురంధరులే.

భవభూతి రామచరితదృశ్యాలకు ముగ్ధుడైనాడు. కదలిపోయినాడు. ఆ కరుణరసచరిత్ర అంతా కన్నీరులై పారింది. కన్నీటిధారలతో—గద్గదకంఠంతో గానం చేశాడు. కావ్యమైంది తీరా ముగించినతరువాత చూస్తే. అప్పటికీ దాన్ని నాటక శ్రేణిలో సమాదరిస్తున్నారు రసజ్ఞులు. ఐతే అది శ్రవ్యనాటకం.

కాని కాళిదాసు గడుసువాడు. కదలిపోయిన ఘట్టాల్లో ఘంటాన్ని బిగబట్టాడు. కౌతుకులుకులతో నృత్యభంగిమాలతో, కవిత్వపుకదముతో నడిచిపోయినాడు. ఘటనాచక్రాన్ని కదుపుతూ, కుదుపుతూ, తాను పాత్రపాత్రలో దూరి సంభాషణలు సాగించాడు. ప్రేక్షకుల మధ్యలో వీక్షణపరంపరను పరిగెత్తించాడు.

నాటకం నడుస్తూంటుంది. ప్రేక్షకులు ఆనంద వివశు లౌతూంటారు. అదంతా ఒక స్వప్నం—అంతా జరుగుతున్నట్లే! అక్కడ ఏమీ లేదు......

ఆ భారత సామ్రాట్టు ఏడీ? మహా రాజ్ఞీత్వ పథానికి తీసుకొనిపోయిన ఆ వనకన్య ఏదీ?—తన పేరుతో భారతదేశానికి చిరస్మరణీయుడైన భరతుడు—ఆ వీరకిశోరం ఎక్కడ వున్నాడు?—అది నాటకం. ఎక్కడ కనిపిస్తారు ఆ దివ్యమూర్తులు, ఆ తేజస్వరూపాలు! మళ్లీ ఒక్కసారి మనోనేత్రం విప్పితే తప్ప. కారణమేమంటే, ఆ కాళిదాసు ఎవ్వరికీ దాసుడు కాడు. అందుకే అట్లతటి నాటకం పుట్టింది...నేడు దేశానికి దాస్యం; సంఘాలకు దాస్యం; భాషకు దాస్యం; భావాలకు దాస్యం...ఈ దాస్యశృంఖలాలు పగులగొట్టబడిననాడు మళ్లీ మనకు మంచినాటకాలు వస్తయి.

# కలగూరగంప

## రాజరాజు శాసనములోని రగడ

(పై శీర్షికతో ఇదే పంచికలో మొట్టమొదట ప్రకటింపబడిన శ్రీ కోరాడ రామకృష్ణయ్యగారి వ్యాసమునందు పేర్కొనబడిన 'రగడ' ఇక్కడ యథాతథముగా నీబడినది.)

కోరుమెల్లి శాసనము సర్వలోకాశ్రయ విష్ణువర్ధన మహారాజాధిరాజను రాజనరేంద్రుడు చంద్రగ్రహణకాలమందు భారద్వాజ గోత్రుడగు చీడమార్యునకు 'కోరుమెల్లి' నామగ్రామ మగ్రహారముగా జేసి దానముచేసిన విషయమును తెలుపుచున్నది. ప్రతిగ్రహీతయగు చీడమార్యుని వైదికసంపత్తినిగూర్చి ముందు రెండు శార్దూలవిక్రీడిత వృత్తములలో వర్ణించి, యింకను అతని గుణవిశేషవర్ణనమునకై యీక్రింది 'రగడ' రచియింపబడి యున్నది:

"తస్మై సమస్తజనతావిశేష(గుణా)య
తస్మై సుతర్పితమహీదేవదేవగణాయ
విప్రాన్వయాబ్ధిశశభృత్ ప్రతిచంద్రాయ
విద్వజ్జనాంగీకృతవిశ్రుతానందాయ
జన్మప్రభృతిగీతవేదార్థతత్త్వాయ
సన్మనోవసతివాస్తవ్యాత్మసత్త్వాయ
లంభితపరతత్త్వపరిలాలితచరిత్రాయ
శుంభితమతిశ్వసితజీవభృతపుత్రాయ
సిద్ధనిజవాధకృతిసేవితమునీశాయ
శుద్ధమతిదూషితసమస్తజనదోషాయ
సంతతారాధితనిజస్వామి(సత్)పాదాయ
చింతితమనస్థసుఖదాధూత(సు)పాదాయ
హోమధూమవినిర్గతామితకలంకాయ
ధీమత్ప్రగీతరుచిరసవ్యనామాంకాయ
సకలమునిగణనుతాపస్తంబసూత్రాయ
తత్ర(?)(సుకవి)సంగీతభారద్వాజగోత్రాయ
సత్తరంతుకృతయూపస్తంభశోభాయ
సప్తాశ్వరూపసదృశాత్మతనులాభాయ
నిత్యజనతోచితసుసత్వగుణయుక్తాయ
సత్యభిలషితకార్యనివృత్తిశక్తాయ
పరమపురుషార్థసంపాదనపటిష్ఠాయ
పరమేశ్వరస్మరణపాలనవరిష్ఠాయ
సకలార్థశాస్త్రపరినిశ్చితవినోదాయ—
సుకుమారతాధిక సరోజనిభపాదాయ
ధారాకరేణాగ్రహారీకృతఃకోరు
మెల్లి నామగ్రామమింమూపరాగే
దత్తోమయాచంద్రతారంహితిష్ఠేత్
తస్యావధివ్యక్తికేపోచ్యలేద్య."

---

## కీ. శే. ఆవటపల్లి నారాయణరావుగారు

బర్మాఆంధ్రుల పాలిటి ఆప్తబంధువు-ప్రముఖ పత్రికా రచయిత్రి - రచయిత అయిన శ్రీ ఆవటపల్లి నారాయణరావుగారు మొన్న డిసెంబరు 30 వ తారీఖునాడు గుడివాడలో పక్షవాతవ్యాధికి ఆహుతియై పరమపదించినారు.

వీరు తొలిజీవితమునందు దేశోపకారి, కృష్ణాపత్రి కలకు సంపాదకులుగాను, ఆంధ్రపత్రికకు సహాయ సంపాదకులుగాను, ఆంధ్రజాతీయ కళాశాలలో ఆచార్యులుగాను కొన్నాళ్లపాటు మాతృదేశములోనే గడపి, పిదప బర్మాఆంధ్రుల సేవకై అక్కడికి పని కట్టుకొనివెళ్లి, అక్కడి కార్మికుల కష్టనిష్ఠురములలో ఇనుమిక్కిలిగా ఆదుకొని, వారికి ఆప్తబంధువై పోయి



నారు; బర్మాఆంధ్రులహృదయములలో శాశ్వతపీఠము నార్జించుకొన్నారు; యుద్ధకారణముగా ఈ మధ్యనే స్వదేశమునకు వచ్చి స్వజనముమధ్య కాలము వెళ్ల బుచ్చుచుండినారు. ఇంతలోనే ఈ అవాంతరము!

సాహిత్యములోకూడ వీరికి అపరిమితమయిన అభిమానము.

౬౭ ఏండ్ల ముదివయస్సులో చనిపోయిన వీరి మరణము అకాలమనలేముగాని ఇంకను కొన్నాళ్లు బ్రతకవలసినవ్యక్తి.

బ్రతుకంతయు బ్రహ్మచర్యముతో గడపిన నైష్ఠికుడు.

వీరి ఆత్మకు శాంతి లభించుగాక!

## డాక్టరు ఏ. యస్. రావుగారు

యం. ఏ., యం. యస్‌సి., డి. యస్‌సి.
బిరుదాంకితులై, మద్రాసు విశ్వకళాపరిషత్పరంలో



భూగర్భశాస్త్ర పరిశోధనలు నడుపుతున్న ఈ యువకుడు అదేశాస్త్రంలో మరికొన్ని విషయాలు పరిశీలించడానికై ఇటీవలనే ఇంగ్లాండు, అమెరికాలకు తరలివెళ్లినాడు.





# విమర్శనము

## నవోదయ

క్రొత్త తెలుగు సచిత్ర వారపత్రిక. రాయల్ సైజు. సంపాదకుడు: నీలంరాజు వెంకటశేషయ్యగారు. కార్యస్థానము : ౧౧, తంబుచెట్టివీధి, మద్రాసు. సంవత్సర చందా ౧౦ రూ. విడిసంచిక ౪ అణాలు.

శ్రీ కొంపెల్ల రామమూర్తి, శ్రీ వేపా రామేశం వంటి సుప్రసిద్ధ రచయితల సహకారముతో మొన్న జనవరి ౨౦-వ తేదీనాడు ప్రారంభమైన ఈ పత్రికకు మా శుభాశీస్సులు. తాను సంకల్పించుకొన్న ఆంధ్రాభ్యుదయలక్ష్యమును ఇది క్రమక్రమశః అందుకొని 'ఆంధ్రావళి మోదముంబొరయ' వెలుగొనేర్చితీరునను టకు ఇప్పటికి వచ్చిన మూడుసంచికలును తగిన ఊత మిచ్చుచున్నవి.

---

## పెంకిపిల్ల - జన్మదిన సంచిక

సంపాదకుడు: పి. రాఘవరావుగారు, ౪౨, అరుండేల్‌వీధి, మైలాపూరు, మద్రాసు. వెల రూ. ౧-౮-౦.

ఆరుసంవత్సరాలు పూర్తిచేసుకొని ఏడోయేట ప్రవేశించిన శుభసమయమును పురస్కరించుకొని వెలువడిన ఈ ప్రత్యేకసంచిక యథోచితమైన ముస్తాబుతో అలంకరింపబడి యున్నది.

---

## New Model Exercises in English Composition & Comprehension.

రచయిత: టి. దొరసామిపిళ్లెగారు, బి. ఏ., యల్. టి. ప్రకాశకులు: టి. వి. చెల్లప్పశాస్త్రి అండుసన్సు, ౨ ఫిలిప్సువీధి, బ్రాడ్వే, మదరాసు. వెల ౧ రూపాయి.

ఇది విద్యాశాఖవారి పాఠ్య ప్రణాళికలను, మాదిరి ప్రశ్నపత్రములను మనసునందుంచుకొని క్రమపద్ధతిని కూర్పబడియున్నది. యస్. యస్. యల్. సి. విద్యార్థులకు ఇది బహుధా ఉపయోగించును. ప్రశ్నోత్తర రచనకును, వ్యాసరచనకును మాత్రమేకాక, లేఖా రచనకుగూడ ఇది మిక్కిలి తోడ్పడును.

---

# గ్రంథ స్వీకారము

---

## త్రికోణమితి

(గణిత తంత్రము)

గ్రంథకర్త: కిళాంబి రంగాచార్యులుగారు, ప్రధాన గణితశాస్త్రోపాధ్యాయులు, మహారాజావారి కాలేజి, విజయనగరము. ప్రకాశకులు: ఆంధ్రవిశ్వకళాపరిషత్తు, గుంటూరు. వెల ౪ రూపాయలు.

---

## పరివర్తన

నవల. రచయిత: త్రిపురనేని గోపీచందుగారు. ప్రకాశకులు: సుందరరాం అండుసన్సు, తెనాలి. వెల ౧ రూపాయి.

---

## వీరవిహారము

చరిత్రాత్మకమైన చిన్న కావ్యము. కవి: శిష్ట్లా లక్ష్మీకాంతశాస్త్రిగారు, అష్టావధాని, ప్రధానాంధ్ర పండితుడు, యస్. కె. పి. వి. వి. హైస్కూలు, బెజవాడ. వెల ౧౨ అణాలు.

---

Printed and Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press, No. 7, Thambu Chetty St., G. T., Madras. Editor—S. Sambhu Prasad.